

ఈనాడు



విజయవాడ 14-12-2025 ఆదివారం సిటీ సంపుటి 52 . సంచిక 124

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 8-00 పేజీలు 18+28 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



Anniversary & Festive
BIG SALE
SPOT GIFTS and more...
CMR SHOPPING MALL
The joy of life
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | ఒడిశా | కర్ణాటక
1+1 OFFERS* COMBO OFFERS* AND MANY MORE
₹999* పై బడిన కొనుగోలుపై స్పాట్ గిఫ్ట్స్
*Colours shown may not match the actual colours, features mentioned and accessories shown may vary by model and also may not be a part of the standard equipment.
*Conditions Apply.
PATTU SAREES
SANKRATHI BUY 2 ₹1599*
VAISHALI BUY 2 ₹1899*
KANJEEVARAM BUY 2 ₹2999*
VARAHI BUY 2 ₹3499*
MAHADEVA BUY 2 ₹3799*
KAUSHALYA BUY 2 ₹4999*
WOMENS WEAR
PALAZZO BUY 2 ₹299*
KURTHA BUY 3 ₹299*
LEGGING BUY 4 ₹399*
NIGHTIES BUY 2 ₹499*
T-SHIRT BUY 2 ₹499*
FANCY KURTHA BUY 2 ₹499*
WESTREN DRESS BUY 3 ₹999*
JEANS BUY 3 ₹999*
CO-ORD SET BUY 3 ₹149*
KIDS WEAR
BOYS CARGO BUY 2 ₹899*
BUY 2 ₹999*
GIRLS SKIRTS BUY 2 ₹599*
GIRLS T-SHIRT BUY 4 ₹799*
BOYS
T-SHIRTS BUY 4 ₹799*
T-SHIRTS BUY 2 ₹599*
SHIRTS BUY 2 ₹499*
SHIRTS BUY 2 ₹699*
JEANS BUY 2 ₹899*
JEANS BUY 2 ₹999*
GIRLS
FANCY TOPS BUY 4 ₹599*
COTTON FROCKS BUY 3 ₹599*
SKIRTS BUY 2 ₹599*
COTTON FROCKS BUY 3 ₹699*
PALAZZO BUY 4 ₹799*
WESTERN TOPS BUY 3 ₹899*
HANDLOOM SAREES
HL GHANJI BUY 2 ₹699*
SOMANUR BUY 2 ₹799*
YELLAMPALLI BUY 2 ₹999*
VENKATAGIRI BUY 2 ₹999*
KANCHI COTTON BUY 2 ₹1699*
UPPADA BUY 2 ₹2999*
HI FANCY SAREE
ROYAL QUEEN BUY 2 ₹3299*
SPACE SILK BUY 2 ₹3499*
KHATAN SILK BUY 2 ₹3699*
HASTHAKALA SILK BUY 2 ₹3899*
JAHNAVI SILK BUY 2 ₹4299*
CHINAN SILK BUY 2 ₹4599*
WORM SILK BUY 2 4799*
GAGRAS BUY 2 ₹1499*
CHUDIDHAR BUY 2 ₹1299*
DRESS MATERIAL BUY 2 ₹1099*
CHUDIDHAR BUY 2 ₹1499*
DRESS MATERIAL BUY 2 ₹899*
CHUDIDHAR BUY 2 ₹1699*
DRESS MATERIAL BUY 2 ₹999*
MENS WEAR
T- SHIRTS BUY 2 ₹499
SHIRTS BUY 3 ₹999
SHIRTS BUY 2 ₹1299
COTTON TROUSHERS BUY 2 ₹1299
DENIMS BUY 2 ₹1299
DENIMS BUY 4 ₹999
CARGOS BUY 2 ₹1499
FORMAL TROUSHERS BUY 2 ₹1499
Levi's
BUY 4 @ 50% OFF
BUY 2 @ 40% OFF
BUY 1 @ 30% OFF
KILLER INDIAN TERRAIN
BUY 4 @ 50% OFF
BUY 2 @ 40% OFF
BUY 1 @ 30% OFF
spykar
BUY 4 @ 50% OFF
BUY 2 @ 40% OFF
BUY 1 @ 30% OFF
mufti
BUY 4 @ 50% OFF
BUY 2 @ 40% OFF
BUY 1 @ 25% OFF
LINEN CLUB parx Cavallo
BUY 3 @ 40% OFF
BUY 2 @ 30% OFF
BUY 1 @ 20% OFF
THINC
BUY 3 @ 40% OFF
BUY 2 @ GET 1
BUY 1 @ 30% OFF
CRIMSOUNE CLUB
BUY 3 @ 30% OFF
BUY 2 @ 20% OFF
BUY 1 @ 10% OFF
JACK & JONES
BUY 4 @ 50% OFF
BUY 2/3 @ 40% OFF
BB LIGHT HOUSE CLOUD 9
ONLY BUY 3 @ ₹1599*
U.S. POLO ASSN. ARROW BLACKBERRYS FLYING MACHINE
BUY 2 @ 30% OFF
BUY 1 @ 20% OFF
Heniis ITALIAN COUTUR
BUY 2 GET 1
BUY 1 @ 20% OFF
RARE RABBIT Flat 30% OFF
Celebrity Flat 15% OFF
TWILLS OXEMBERG COOL COLORS
SHOP FOR ₹2999 GET A BACK PACK @ ₹199
TWILLS OXEMBERG COOL COLORS OTTO
ONLY BUY 3 @ ₹1599*
ఎం.జి.రోడ్, విజయవాడ 91333 87124
బస్టాండ్ ఎదురుగా, మచిలీపట్నం 7799971833
నెహ్రూ చౌక్ సెంటర్, గుడివాడ 7799971839

ఈనాడు

విజయవాడ 14-12-2025 ఆదివారం సిటీ సంపుటి 52 . సంచిక 124
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 8-00 పేజీలు 18+28 www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru


రేవంత్‌రెడ్డి వైపు బాల్‌ను కిక్ చేస్తున్న మెస్సి

కిక్ ఇచ్చావు మెస్సి

దిగ్గజ ఆటగాడి మాయతో దద్దరిల్లిన ఉప్పల్ స్టేడియం

ఫుట్‌బాల్ స్టార్‌తో కలిసి ఆడిన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో అపర్ణ మెస్సి బృందంపై సింగరేణి ఆర్ఆర్ జట్టు విజయం

ఈనాడు - హైదరాబాద్

సిక్సర్లు.. బౌండరీలతో హోరెత్తించే ఉప్పల్ స్టేడియంలో గోల్స్ వర్షం కురిసింది. ఎప్పుడూ క్రికెట్ బంతులు వెళ్లే స్టాండ్స్‌లోకి ఫుట్‌బాల్‌లు దూసుకెళ్లాయి. సచిన్, ధోని, కోహ్లి, రోహిత్ వంటి స్టార్ క్రికెటర్లు కనిపించిన డ్రెస్సింగ్ రూమ్‌లో ఫుట్‌బాల్ దిగ్గజాలు దర్శనమిచ్చారు. ప్రపంచ స్టార్ ఫుట్‌బాలర్, దిగ్గజ ఆటగాడు లియోనెల్ మెస్సి 'ద గోట్ ఇండియా టూర్' ఇందుకు కారణం. మెస్సి, రోడ్రిగో డి పాల్, లూయిస్ సువారెజ్‌ల రాకతో ఉప్పల్ క్రికెట్ స్టేడియం ఫుట్‌బాల్ జోష్‌లో మునిగిపోయింది. ఫుట్‌బాల్ దిగ్గజాలతో పాటు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆటతో సంబరం అంబరాన్ని తాకింది. శనివారం ఉదయం కోల్‌కతాలో మెస్సి ఈవెంట్ గందరగోళంగా మారిన అనంతరం హైదరాబాద్‌లో కార్యక్రమం విజయవంతం కావడం నిర్వాహకులకు ఊరట కలిగించింది. (మిగతా 15లో)

కోల్‌కతాలో అభిమానుల విధ్వంసం 15లో

మరిన్ని వివరాలు ఛాంపియన్‌లో

మీ ప్రేమకు కృతజ్ఞతలు

హలో ఎవ్రీవన్... ఈ రోజు మీరు చూపించిన ప్రేమ, మద్దతుకు కృతజ్ఞతలు. ఇక్కడికి రాకముందు, గత ప్రపంచకప్‌తో సహా అన్ని సమయాల్లో మీరు ఎంతో ప్రేమ, అభిమానం చూపించారు. మీ అందరికీ ధన్యవాదాలు. ఈ రోజు మీతో ఉండటాన్ని ఎంతో గౌరవంగా, అదృష్టంగా భావిస్తున్నా.
- లియోనెల్ మెస్సి


చిన్నారులకు శిక్షణ ఇస్తున్న మెస్సి


రేవంత్, రాహుల్.. మధ్యలో మెస్సి

బహుమతి ప్రదానోత్సవంలో ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. వేదికపై రాహుల్ గాంధీని ఆహ్వానించగా.. ఆయన మైదానంలోకి వచ్చారు. రాహుల్, రేవంత్ మధ్యలో మెస్సి నిల్చొని ఫొటోలకు పోజులిచ్చారు. రేవంత్ పక్కన రోడ్రిగో, సువారెజ్ నిలబడ్డారు. అనంతరం సింగరేణి జట్టుకు విన్నర్, అపర్ణ మెస్సి జట్టుకు రన్నరప్ ట్రోఫీలను మెస్సి అందించాడు. తన సంతకాలతో ఉన్న రెండు అర్జెంటీనా జెర్సీలను రాహుల్ గాంధీకి బహూకరించాడు. మెస్సికి రేవంత్ జ్ఞాపిక అందజేశారు. మెస్సి.. మెస్సి.. మెస్సి అంటూ రేవంత్ గట్టిగా కేరింతలు కొట్టారు. 8.52 గంటలకు మెస్సి మైదానాన్ని వీడాడు.

కేంద్ర సమాచార కమిషనర్‌గా

సుధారాణి రేలంగి

ప్రధాన కమిషనర్‌గా రాజ్‌కుమార్ గోయల్

మొత్తం 9 మంది నియామకం


రాజ్‌కుమార్


సుధారాణి

ఈనాడు, దిల్లీ: కేంద్ర సమాచార కమిషనర్‌గా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సుధారాణి రేలంగి నియమితులయ్యారు. ప్రస్తుతం పెట్రోలియం, సహజవాయువుల రెగ్యులేటరీ బోర్డు సభ్యురాలిగా ఉన్న ఆమెను సమాచార కమిషనర్‌గా నియమిస్తూ ప్రధానమంత్రి ఆధ్వర్యంలోని నియామక కమిటీ సిఫార్సు చేసింది. ఇండియన్ లీగల్ సర్వీస్ అధికారి అయిన ఈమెకు లా ఎన్‌ఫోర్స్‌మెంట్, లెజిస్లేటివ్ డ్రాఫ్టింగ్, ప్రాసిక్యూషన్, ఇంటర్నేషనల్ కోఆపరేషన్ విభాగంలో 35 ఏళ్ల (మిగతా 2లో)

పీపీపీ విధానమే మేలు!

వైద్య కళాశాలల నిర్వహణపై కేంద్రానికి పార్లమెంటు స్థాయీసంఘం సిఫార్సులు

- భాగస్వామ్యానికి ముందుకొచ్చే సంస్థలకు పన్ను రాయితీలు
- అర్హులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు
- వైద్యవిద్యలో సీట్ల పెంపు తప్పనిసరి

ఈనాడు - దిల్లీ

దేశంలో వైద్య విద్య వ్యయం భారీగా పెరిగిపోయిన నేపథ్యంలో వైద్య కళాశాలలు, ఆసుపత్రులను పీపీపీ విధానంలో నిర్వహించే అంశం గురించి ఆలోచించాలని పార్లమెంటరీ స్థాయీ సంఘం సిఫార్సు చేసింది. వైద్యకళాశాలలు, ఆసుపత్రిని పీపీపీ విధానంలో నిర్వహించి, ఇందుకోసం ముందుకొచ్చే కంపెనీలు/సంస్థలకు పన్ను ప్రయోజనాలు కల్పించాలని సూచించింది. పీపీపీ విధానానికి ఎదురయ్యే అడ్డంకులను తొలగించడానికి సమగ్ర నిబంధనలు రూపొందించి, ప్రైవేట్ మెడికల్ కాలేజీలు జిల్లా ఆసుపత్రులతో కలిసి పనిచేసే విధానాన్ని సమర్థంగా అమలు చేయాలని పేర్కొంది. దేశంలో వైద్య విద్య నాణ్యత గురించి సమాజ్‌వాదీ పార్టీ నేత, రాజ్యసభ సభ్యుడు రామ్ గోపాల్‌యాదవ్ నేతృత్వంలోని వైద్యం, కుటుంబ సంక్షేమ వ్యవహారాల స్థాయీ సంఘం ఈ నెల 12న పార్లమెంటుకు సమర్పించిన నివేదికలో ఈ మేరకు పేర్కొంది. ఈ స్థాయీ సంఘం గత ఏడాది ఫిబ్రవరి 9న సమర్పించిన నివేదికలో వైద్యవిద్యను అందరికీ అందుబాటులోకి తేవడానికి పీపీపీ, ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ఎలా ప్రోత్సహించాలో కేంద్రానికి కొన్ని సిఫార్సులు చేసింది. వాటిపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలతో కూడిన నివేదికను ఇప్పుడు పార్లమెంటుకు సమర్పించింది. పీపీపీ విధానాన్ని (మిగతా 2లో)



గత ఏడాది నివేదికలోని కీలకాంశాలు

■ వైద్యవిద్య ఫీజుల్లో రాష్ట్రాల మధ్య చాలా తేడా ఉంటోంది. వైద్య విద్య ఖర్చు రూ.60 లక్షల నుంచి రూ.కోటి, అంతకు మించి ఉంది. విద్యార్థులపై ఆర్థిక ఒత్తిడిని తగ్గించేందుకు కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ, రాష్ట్రాలతో కలిసి అర్హులైన విద్యార్థులకు అవసరమైన స్కాలర్‌షిప్‌లు అందించాలి.

■ ప్రైవేట్ మెడికల్ కాలేజీలు జిల్లా ఆసుపత్రులతో కలిసి పనిచేసేలా చూడాలి. దీనివల్ల ఎంబీబీఎస్ విద్యార్థులకు అవసరమైనంత క్లినికల్ మెటీరియల్‌ను అందించడమే కాకుండా ప్రైవేట్ మెడికల్ కాలేజీల ఏర్పాటు, నిర్వహణ ఖర్చును తగ్గిస్తుంది. వైద్య విద్య వ్యయాన్ని హేతుబద్ధీకరిస్తుంది.

■ ప్రైవేట్ కళాశాలల్లో వైద్య విద్య ఖర్చును తగ్గించడానికి వాటిలో ఏర్పాటు చేసే స్కిల్ ల్యాబ్స్‌కు అవసరమైన ఎక్విప్‌మెంట్, యంత్రాలను సబ్సిడీ ధరల్లో అందించాలి.

■ ఆర్థికంగా బలహీనంగా ఉన్న విద్యార్థులకు ట్యూషన్ ఫీజు కట్టుకొనేందుకు స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్‌ను ఏర్పాటు చేయాలి. ఈ స్కాలర్‌షిప్పులకు నిధులను ప్రభుత్వ, ప్రైవేట్ రంగం అందించే చందాల ద్వారా సమకూర్చాలి. తద్వారా వైద్య విద్యను అన్ని వర్గాలకూ అందుబాటులోకి తేవాలి.

వచ్చేస్తోంది... శ్రీవారి ఏఐ సేవక్

భక్తులకు 'ఏఐ చాట్‌బాట్' సేవలు

15 రోజుల్లో అందుబాటులోకి

13 భాషల్లో సమాచారం.. క్షణాల్లో సమాధానం



ఈనాడు డిజిటల్, తిరుపతి: వారణాసి నుంచి తిరుమల శ్రీవారి దర్శనానికి రావాలనుకున్న ఓ భక్తుడికి సేవా టికెట్లపై సందేహం వచ్చింది. కాల్ సెంటర్‌కు ఫోన్‌చేస్తే లైన్ బిజీ. పోనీ మెయిల్ పెడదామంటే సమాధానం అనుకున్న సమయానికి వస్తుందో లేదో తెలియదు. ఇంగ్లిష్, హిందీ అంతంత మాత్రమే వచ్చు.. తన మాతృభాషలో సమాచారం దొరకదు. ఇది తిరుమల వచ్చే చాలామంది భక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బంది..

ఇలాంటి నిరీక్షణకు, భాషాపరమైన ఇబ్బందులకు చెక్‌పెడుతూ.. కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామివారి దర్శనానికి వచ్చే కోట్ల మంది భక్తులకు మెరుగైన సేవలందించే దిశగా తితిదే మరో ముందడుగు వేసింది. ఇప్పటికే ఏఐ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ సేవలు అందుబాటులో ఉండగా.. భక్తుల సందేహాలను (మిగతా 2లో)



తిరుమల ఆలయం.. విద్యుత్తు వెలుగుల వైభవం 2లో

పాఠశాలల్లో ప్రమాణాల మెరుగుకు అథారిటీ

- సెకండరీ పరీక్షల బోర్డుకు అధికారాలు
- బడుల్లో నిరంతర పర్యవేక్షణ, తనిఖీలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నాణ్యతా ప్రమాణాల మెరుగుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పాఠశాలల్లో భద్రత, మౌలిక సదుపాయాల కల్పన, తరగతుల వారీగా ఉపాధ్యాయుల సంఖ్య, ఆర్థిక వనరుల వినియోగం, ఎడ్మినిస్ట్రేషన్ వంటి ప్రాథమిక ప్రమాణాలను పరిశీలించేందుకు 'రాష్ట్ర పాఠశాల ప్రమాణాల నిర్ధారణ అథారిటీ' (ఎస్ఎస్ఎస్ఏ)ని ఏర్పాటు చేసింది. సెకండరీ పరీక్షల బోర్డుకు ఈ అధికారాలు కల్పించింది. ఇంటర్మీడియట్ బోర్డుకు ఉన్న అధికారాలు ఇప్పుడు ఈ బోర్డుకు దఖలు పడతాయి. ఇప్పటివరకు పదో తరగతి పరీక్షల నిర్వహణ, ఫలితాల ప్రకటనకే పరిమితమైన ఈ బోర్డు ఇకపై పాఠశాలలకు అనుమతులు, నాణ్యతా ప్రమాణాలను సైతం పరిశీలిస్తుంది. (మిగతా 2లో)



3 రకాలుగా వర్గీకరణ

నిర్దేశిత ప్రమాణాల ఆధారంగా బడులను మూడు రకాలుగా వర్గీకరిస్తారు. వీటిలో సంప్రదాయ పరీక్షలకు మించి సమగ్ర, నిరంతర మూల్యాంకన విధానాన్ని అమలు చేసేందుకు ఎస్ఎస్ఎస్ఏ సిఫార్సు చేస్తుంది.

■ మెరుగుదల అవసరం ఉన్న బడులు 'అభిలాష'

■ సంతృప్తికరమైన పనితీరు ఉంటే 'ప్రగతి'

■ అత్యుత్తమ పనితీరు కనబరిచిన పాఠశాలలు 'జాగృతి'గా వర్గీకరిస్తారు.


సీనరేజ్ గుత్తేదార్ల దాటవేత కథలు

అక్టోబరుకు మాత్రమే అడ్వాన్స్ చెల్లింపు

నవంబరు, డిసెంబరు నెలలవి జమచేయకుండా జాప్యం

పలుకారణాలు చెబుతూ సొమ్ము తగ్గించాలంటూ లేఖలు

ఐదు ఉమ్మడి జిల్లాల టెండరు పొందిన రెండు సంస్థలు



ఈనాడు, అమరావతి: గనుల శాఖ అధికారులు జిల్లాల్లో సీనరేజ్ వసూళ్లు పక్కాగా చేయలేకపోతున్నారని, గుత్తేదార్లకు ఆ బాధ్యత అప్పగిస్తే క్రమం తప్పకుండా ప్రతి నెలా ఖజానాకు సొమ్ము వస్తుందని ప్రభుత్వం భావించింది. కానీ.. టెండర్లు దక్కించుకున్న గుత్తేదార్లు మాత్రం తెలివితేటలు చూపిస్తున్నారు. అనేక కథలు చెబుతూ ఏ నెలకు ఆ నెల అడ్వాన్స్ డబ్బులు జమచేయకుండా దాటవేత ధోరణి అవలంబిస్తున్నారు. ఫలితంగా ప్రతి నెలా రూ.103 కోట్ల మేర రావాల్సిన సీనరేజ్ సొమ్ము కోసం ప్రభుత్వం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది.


■ ఉమ్మడి విశాఖపట్నం, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు జిల్లాల్లో మైనింగ్ లీజుదారుల నుంచి సీనరేజ్ వసూళ్లు చేసేందుకు టెండర్లు పిలిచి గుత్తేదార్లను ఎంపిక చేశారు.

■ నెలకు ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు రూ.18 కోట్లు, కృష్ణాకు రూ.9.8 కోట్లు, ప్రకాశంకు రూ.47 కోట్లు, నెల్లూరుకు రూ.14.22 కోట్ల చొప్పున చెల్లిస్తామంటూ ఏఎంఆర్ ఇండియా లిమిటెడ్ సంస్థ టెండరు దక్కించుకుంది.

■ ఉమ్మడి కర్నూలు జిల్లాలో నెలకు రూ.14 కోట్లు చెల్లించేలా కోట్‌చేసి (మిగతా 2లో)

శనగ పేరుకుపోతోంది!

- శీతల గిడ్డంగుల్లో వందల లారీల నిల్వలు
- మద్దతు కంటే క్వింటాలుకు రూ.800 తక్కువగా ధర
- రెండు మూడు నెలల్లో మళ్లీ కొత్త పంట రాక


ప్రకాశం జిల్లా గిద్దలూరులో శనగ పంట

ఈనాడు, అమరావతి: శనగ రైతులు పంటకు మద్దతు ధర లేక విలవిల్లాడుతున్నారు. గతేడాది పండించిన పంటే శీతల గోదాముల్లో మగ్గుతోంది. కొందరు రైతులైతే రెండు, మూడేళ్ల పంట నిల్వ చేసుకుని ధర కోసం ఎదురు చూస్తున్నారు. మార్కెట్‌లో మాత్రం ధర పెరగలేదు. మరోవైపు రెండు, మూడు నెలల్లో కొత్త పంట చేతికి రాబోతోంది. ఉన్న నిల్వలు అమ్ముదామంటే క్వింటాలు ఎర్రశనగ రూ.5,100, కాబూలీ రకం రూ.5,400 మాత్రమే ఉంది. అయినా కొనేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. ఈ ఏడాది ప్రకటించిన మద్దతు ధర (క్వింటాలు రూ.5,875) కంటే ఇది రూ.800 తక్కువ. దీంతో శనగ అధికంగా సాగు చేసే ఉమ్మడి ప్రకాశం, కర్నూలు, వైఎస్సార్ కడప, అనంతపురం జిల్లాల రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈ జిల్లాల్లోని శీతల గోదాముల్లో వేల లారీల శనగ నిల్వలున్నాయి. అయినా ముస్ముందు ధర పెరుగుతుందన్న ఆశతో మళ్లీ కొత్త పంట వేస్తూనే ఉన్నారు. గతేడాది రాష్ట్రవ్యాప్తంగా 7.17 లక్షల ఎకరాల్లో శనగ సాగైంది. ఎకరాకు సగటున 4.25 క్వింటాళ్ల ఉత్పాదకత చొప్పున.. 3.05 లక్షల టన్నుల (మిగతా 2లో)

ఇదీ సంగతి!



ఏమైందో ఏమో! ఇక్కడికొచ్చిన దగ్గర్నించీ ఏమీ కనిపించట్లేదు డాక్టర్.. భయంగా ఉంది!



ఉడికిస్తున్నారా? వేయిస్తున్నారా?

ఏ వంట.. ఒంటికి మంచిదంట!

ఉప్పూకారం దట్టించి...
భగభగలాడే నూనెలో వేసేసి...
కణకణమండే నిప్పులపై కాల్చేసి...
తయారుచేసిన ఆహారం తింటున్నారా...
అయితే ముప్పులో కాలేసినట్టే..!
ఆహారాన్ని ఆరోగ్యకరమైన శైలిలో
రకరకాలుగా చేసుకుని తినొచ్చు...
అన్నీ మితంగా ఉండే ఈ పద్ధతులతో
మేలు జరుగుతుందంటున్నారు
సీనియర్ న్యూట్రిషనిస్టు డాక్టర్ లతాశశి.



ఉడకబెట్టడం

- ఇది సాధారణ వంట పద్ధతి. సురక్షితం కూడా.
- తెలుగు రాష్ట్రాల్లో దాదాపు కూరగాయలు, గుడ్లు, పప్పులు ఉడకబెట్టడం మామూలే.
- ఈ పద్ధతిలో పప్పులు, బియ్యం, కూరగాయలు.. ఇలా ఏది వండినా నూనె వినియోగం తక్కువ. కొన్నిసార్లు శూన్యం కూడా.
- ఈ ప్రక్రియలో పోషకాలు 90% వరకు నిల్వ ఉంటాయి. సులభంగా జీర్ణమవుతాయి.
- ఐసీఎంఆర్ నివేదికల ప్రకారం ఉడకబెట్టిన ఆహారాలు.. జీర్ణశక్తి మెరుగుపర్చటంతో పాటు.. గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి.

ఒక్క మాట: ఎక్కువమంది ఉడకబెట్టిన తర్వాత నీళ్లను పారబోస్తారు. దీనివల్ల పోషకాలు వెళ్లిపోతాయి. ఎంత నీరు అవసరమో.. అంతే నీటితో ఉడకబెట్టుకోవడం మేలు.

ఆవిరి వంట (స్టీమింగ్)



- ఆధునిక భారతీయ వంటగదుల్లో దీనికి చాలా ప్రాధాన్యముంది.
- ఇడ్లీ, ధోక్లా వంటి సంప్రదాయ వంటకాలతో పాటు.. బ్రకోలీ, క్యారెట్, ఫిష్ వంటి పదార్థాలనూ ఆవిరిపై వండుతున్నారు.
- ఈ పద్ధతి వల్ల పోషకాల నష్టం అత్యల్పం.
- మధుమేహులకు చాలా మేలు.
- నూనె వాడకుండా వండొచ్చు.

ఒక్క మాట: ఈ పద్ధతితో విటమిన్ సి, కె... మినరల్స్ అత్యధికంగా నిల్వ ఉంటాయి.

ప్రెషర్ కుకింగ్



- భారతీయ కుటుంబాల్లో ఇది ఆరోగ్యకరమైన వంట విధానం.
- తక్కువ ఇంధనం ఖర్చవుతుంది. ఎక్కువ పోషకాలు అందుతాయి.
- తక్కువ సమయంలో వంట పూర్తవుతుంది.

ఒక్క మాట: చాలా ఎక్కువగా ఉడకబెడితే పోషకాల నష్టం కూడా అదే స్థాయిలో ఉంటుంది.

ఒకే వంటశైలి వద్దు

గ్రిల్లింగ్ అండ్ రోస్టింగ్, ఎయిర్ ఫ్రైయర్ వంటి విధానాల వల్ల నూనె వాడకం తద్వారా కొవ్వు మోతాదు తగ్గుతుంది కానీ.. ఈ విధానాల్లో ఆహారాన్ని వారంలో ఎన్నిసార్లు? ఎంత మోతాదులో తింటున్నారనేది చాలా ముఖ్యం. తరచూ.. ఎక్కువ మోతాదులో ఈ విధానాల్లో వంట చేసుకొని తినడం అంత శ్రేయస్కరం కాదు. ఉదాహరణకు బెండకాయ వేపుడును సాధారణ పద్ధతిలో బాగా నూనెలో వేయించకుండా.. ఎయిర్ ఫ్రైయర్ విధానంలో చేయడం వల్ల కచ్చితంగా నూనె వాడకం తగ్గుతుంది. అప్పడాలను నూనెలో వేయించకుండా రోస్ట్ చేసి తినొచ్చు. కానీ వీటిల్లో ఉండే ఉప్పు మోతాదు తగ్గదు కదా? అందుకని ఎలా వండినా తక్కువ మోతాదులో తినడమే శ్రేయస్కరం.

- మరిన్ని వివరాలు 2లో

హెచ్‌1బీ వీసా
ఫీజు పెంపు చట్ట విరుద్ధం

● అమెరికాలో 19 రాష్ట్రాల దావా

న్యూయార్క్, వాషింగ్టన్: హెచ్‌1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చట్ట విరుద్ధమని పేర్కొంటూ 19 రాష్ట్రాలు కోర్టును ఆశ్రయించాయి. దీనివల్ల కీలకమైన టెక్నాలజీ, విద్య, ఆరోగ్య రంగాల్లో ఉద్యోగుల కొరత ఏర్పడనుందని పేర్కొన్నాయి. న్యూయార్క్ అటార్నీ జనరల్ లీటీషియా జేమ్స్‌తోపాటు మరో 18 మంది అటార్నీ జనరళ్లు శుక్రవారం మసాచుసెట్స్ డిస్ట్రిక్ట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎటువంటి చట్టబద్ధమైన అధికారం లేకుండా హెచ్‌1బీ వీసా ఫీజును భారీగా ట్రంప్ ప్రభుత్వం పెంచిందని అందులో పేర్కొన్నారు. 'హెచ్‌1బీ వీసా ఫీజు పెంపువల్ల ఆరోగ్య, విద్య, టెక్నాలజీ రంగాల్లో విదేశీ కార్మికులపై ఆధారపడే ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలు తీవ్ర ఇబ్బందులు పడతాయి. ఈ వీసా నిపుణులైన వైద్యులు, నర్సులు, టీచర్లు, ఇతర కార్మికులను అనుమతిస్తుంది. ప్రభుత్వ చట్ట విరుద్ధ ప్రయత్నం.. న్యూయార్క్‌లోని ప్రజలకు ఆరోగ్య సేవల్లో, పిల్లలకు విద్యా సేవల్లో ఆటంకం కల్పించడంతోపాటు ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తుంది. వలసదారులను లక్ష్యంగా చేసుకున్న ఈ క్రూరమైన చట్టంపై పోరాడుతునే ఉంటాం' అని జేమ్స్ తెలిపారు.

చట్టాలకు వ్యతిరేకం

'ట్రంప్ తీసుకున్న చట్ట విరుద్ధ నిర్ణయం.. అడ్మినిస్ట్రేటివ్ ప్రొసీజర్స్ చట్టం, ఇమ్మిగ్రేషన్ అండ్ నేషనాలిటీ చట్టాలకు వ్యతిరేకం. కాంగ్రెస్ ఆమోదం లేకుండా.. రూల్ మేకింగ్ ప్రాసెస్‌ను పాటించకుండానే బలవంతంగా రుద్దారు. కార్మికుల కొరతవల్ల గ్రామీణ, వెనుకబడిన కమ్యూనిటీల్లో సేవలకు తీవ్ర అంతరాయం కలగనుంది' అని పిటిషన్‌లో రాష్ట్రాలు పేర్కొన్నాయి.

● పిటిషన్ వేసిన రాష్ట్రాల్లో న్యూయార్క్‌తోపాటు ఆరిజోనా, కాలిఫోర్నియా, కొలరాడో, కనెక్టికట్, డెలావేర్, హవాయ్, ఇల్లినోయీ, మేరీలాండ్, మసాచుసెట్స్, మిషిగన్, మిన్నెసోటా, నార్త్ కరోలినా, న్యూజెర్సీ, ఒరెగాన్, రోడ్ ఐలాండ్స్, వెర్మాంట్, వాషింగ్టన్, విస్కాన్సిన్ ఉన్నాయి.

● న్యూయార్క్ ఆరోగ్య రంగంలో మూడో వంతు మంది వలసదారులే ఉన్నారు. విశ్వవిద్యాలయాలు, ఆసుపత్రులు భారీగా హెచ్‌1బీపై ఆధారపడుతున్నాయి. ● న్యూయార్క్‌లో ఇప్పటికే నర్సుల కొరత తీవ్రంగా ఉంది. 2030 నాటికి 40,000 మంది నర్సుల కొరత ఏర్పడనుంది. ● అమెరికన్ మెడికల్ అసోసియేషన్ అంచనా ప్రకారం.. 2036 కల్లా అమెరికాలో 86,000 మంది ఫిజిషియన్ల కొరత ఏర్పడనుంది.

ఉడికిస్తున్నారా? వేయిస్తున్నారా?

తక్కువ నూనెతో తాలింపు



● ఇది కూడా భారతీయుల ప్రత్యేక వంట.
● అల్లం, వెల్లుల్లి, జీలకర్ర, ఆవాలు, కరివేపాకు వాడే ఈ తాలింపు పద్ధతి భారతీయులకు ప్రత్యేకం.
● ఇలా వండడం వల్ల రుచి పెరుగుతుంది.
● తక్కువ నూనెతో చేయవచ్చు.

ఒక్క మాట: ఇలా చేస్తే ఆరోగ్యకరమైన ఫైటోకెమికల్స్ సొంతమవుతాయి.

గ్రిల్లింగ్ అండ్ రోస్టింగ్



● నగరాల్లో ఈ ట్రెండ్ పెరుగుతోంది. గ్రిల్ చేయడం ఇప్పుడు చాలా మంది ఇష్టపడుతున్నారు.
● చికెన్, ఫిష్, పనీర్, కూరగాయలను తక్కువ కొవ్వుతో రుచికరంగా తినే పద్ధతి.
● అధిక కొవ్వు కరిగి బయటకి వస్తుంది.
● రుచితో పాటు తేలికైన ఆహారం తీసుకోవచ్చు.

ఒక్క మాట: ఈ విధానంలో రోజూ వండే ఆహారం మితంగానే తినడం మేలు. అలాగే బొగ్గు మీద గ్రిల్ చేస్తే కార్సినోజెన్స్ వచ్చే అవకాశం ఉంది.


షాలో ఫ్రై



● తక్కువ నూనెతో వేగించే పద్ధతి ఇది.
● కట్‌లెట్లు, ఫిష్, బ్రెడ్ టోస్ట్ వంటి వాటికోసం ఈ విధానాన్ని వాడొచ్చు.
● నూనెను తక్కువగా వినియోగించడం వల్ల ఆరోగ్యానికి మేలు.
● చాలా తొందరగా వంట పూర్తవుతుంది.
● ఆలివ్, రైస్ బ్రాన్ ఆయిల్ వంటి నూనెలతో షాలో ఫ్రై చేస్తే ఆరోగ్యానికి మంచిది.

ఒక్క మాట: ఈ విధానాన్ని కూడా తరచూ వినియోగించొద్దు.

బేకింగ్



● నాన్‌ఫ్రైడ్ స్నాక్స్‌కు ప్రత్యామ్నాయం ఇది.
● కేక్, కుకీస్ మాత్రమే కాదు.. ఇప్పుడు బేక్డ్ సమోసా, బేక్డ్ కట్లెట్, బేక్డ్ పనీర్ టిక్కా వంటి ఆరోగ్యకరమైన వంటలు కూడా ప్రాచుర్యంలో ఉన్నాయి.
● నూనె లేకుండా లేదా చాలా తక్కువ నూనెతో వంట పూర్తవుతుంది.
● ప్రాసెస్డ్ ఫుడ్ కంటే ఆరోగ్యకరం.
● 'న్యూట్రిషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా' ప్రకారం.. బేకింగ్‌లో ఫ్యాట్ ఇన్‌టేక్ 40శాతం వరకు తగ్గుతుంది.
● ఎంత తక్కువ సమయంలో.. ఎంత తక్కువ ఉష్ణోగ్రత వద్ద వండుకున్నామనేది చాలా ముఖ్యం.

ఒక్క మాట: బేక్డ్ సమోసా వంటి వాటిల్లో ఉప్పు, కొవ్వు మోతాదుపై దృష్టిపెట్టాలి.

ఎయిర్ ఫ్రైయింగ్

● ఫ్రైడ్ ఫుడ్‌ను ఆరోగ్యకరంగా మార్చిన విధానమిది. డీప్ ఫ్రై కాకుండా ఇలా వండుకుంటే ప్రయోజనం ఎక్కువగా ఉంటుంది.



● ఎయిర్ ఫ్రయర్ల వినియోగం గత 5 ఏళ్లలో 60% పెరిగిందని ఒక అధ్యయనం చెబుతోంది.
● నూనె వాడకం 80-90% తగ్గిపోతుంది.
● ఈ పద్ధతిలో పిల్లలకు స్నాక్స్ తేలికగా చేసెయొచ్చు.
● డయాబెటిస్/ బీపీ ఉన్న వారికి మెరుగైన ప్రత్యామ్నాయం.

ఒక్క మాట: ఎయిర్ ఫ్రైయింగ్ ఫుడ్ తినే వాళ్లు కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. దీనివల్ల నూనె తగ్గింపు ప్రయోజనం కలుగుతుంది కానీ.. ఎక్కువ ఉష్ణోగ్రత వద్ద ఆహారాన్ని తయారు చేయడం వల్ల హానికారకాలు ఉత్పత్తయ్యే ముప్పుంటుంది. అందువల్ల పదే పదే ఇదే విధానంలో తినొద్దు.

ఫర్మెంటేషన్



● దీన్ని పులియబెట్టడం, ఉప్పు పెట్టడమని మనవాళ్లు పిలుస్తుంటారు.
● పెరుగుతో చేసిన చద్దన్నం ఇందులో చాలా ముఖ్యమైంది.
● దోసె, ఇడ్లీ పిండి, పెరుగు, పచ్చళ్లలో ఫర్మెంటేషన్ ప్రధాన పాత్ర పోషిస్తుంది.
● ఈ విధానం వల్ల ప్రోబయోటిక్ లాభాలు కలుగుతాయి.
● అప్పుడప్పుడూ ఈ విధానంలోనూ తినాలి.

ఒక్క మాట: దీనివల్ల జీర్ణశక్తి మెరుగవుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. పోషకాల శోషణ అధికమవుతుంది.

- ఈనాడు, హైదరాబాద్



శ్రీవారి ఆలయం.. విద్యుత్తు వెలుగుల వైభవం

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి ఆలయ మహాద్వారం వద్ద ఉన్న గోపురంపై విద్యుత్తు వెలుగులు పడేలా దీపాలు ఏర్పాటు చేశారు. నీలం, నారింజ, ఎరుపు, పచ్చ రంగుల్లోని వెలుగులు రాత్రి వేళల్లో ఆలయ గోపురంపై పడటంతో సరికొత్త శోభను సంతరించుకుంది. శనివారం నుంచి అందుబాటులోకి వచ్చిన ఈ అదనపు ఆకర్షణ ఇకపై నిత్యం అందుబాటులో ఉంటుందని తెలిసింది.

వచ్చేస్తోంది... శ్రీవారి ఏఐ సేవక్

(మొదటి పేజీ తరువాయి)

తక్షణం నివృత్తి చేసేందుకు, డిజిటల్ సేవలను మరింత చేరువ చేసేందుకు ఏఐ ఆధారిత 'చాట్‌బాట్'ను మరో 15 రోజుల్లో అందుబాటులోకి తీసుకురానుంది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ సహకారం, అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) క్లౌడ్ వేదికగా ఈ ప్రాజెక్టు అందుబాటులోకి రానుంది.

మానవ ప్రమేయం లేకుండా..

ప్రస్తుతం తితిదే కాల్ సెంటర్లు, ఈమెయిళ్లు, సామాజిక మాధ్యమాల ద్వారా భక్తులు పెద్దఎత్తున వినతులు, ప్రశ్నల రూపంలో సంప్రదిస్తున్నారు. దర్శన టికెట్లు, వసతి, రవాణా, రిఫండ్ల వంటి అంశాలపై భక్తులు అడుగుతున్న సందేహాలకు సమాధానం ఇవ్వడంలో మానవ వనరుల పరిమితులతో జాప్యం జరుగుతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు 24 గంటలూ నిరంతరాయంగా పనిచేసే ఏఐ చాట్‌బాట్‌ను ప్రవేశపెట్టనున్నారు.

ఏటా రూ.50 లక్షల వ్యయం

క్లౌడ్ సేవల కోసం నెలకు సుమారు రూ.4 లక్షల చొప్పున, ఏడాదికి పన్నులు మినహాయించి దాదాపు రూ.50 లక్షల వరకు ఖర్చవుతుందని అంచనా. వినియోగాన్ని బట్టి ఆన్‌లైన్ ద్వారా ఎప్పటికప్పుడు చెల్లింపులు జరిపేలా తితిదే బోర్డు నిర్ణయం తీసుకుంది.

సేవలు ఇలా

● ఇది ఒకేసారి వేల సంఖ్యలో భక్తులతో సంభాషించగలదు.
● దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం 13 భారతీయ భాషల్లో సేవలందించనుంది.
● దర్శన టికెట్ల బుకింగ్ ప్రక్రియలో మార్గనిర్దేశం చేయడంతో పాటు రియల్ టైమ్ సమాచారం అందిస్తుంది.
● టైప్ చేయడమే కాకుండా.. 'స్పీచ్ టు టెక్స్ట్', 'టెక్స్ట్ టు స్పీచ్' వంటి ఆధునిక ఫీచర్లు ఉండనున్నాయి.

నెల్లూరు మేయర్ స్రవంతి రాజీనామా

● ఇక అవిశ్వాస తీర్మానం లేనట్లే



మాట్లాడుతున్న స్రవంతి

నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే: నెల్లూరు మేయర్ పొట్లూరి స్రవంతి తన పదవికి రాజీనామా చేశారు. ఈ నెల 18న అవిశ్వాస తీర్మాన సమావేశం జరగనున్న నేపథ్యంలో రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో 54మంది కార్పొరేటర్లు ఉండగా.. అందరూ వైకాపావారే. వారిలో ఒకరు ఇప్పటికే రాజీనామా చేశారు. మేయర్ కాకుండా.. మిగిలిన 52 మందిలో 42 మంది సార్వత్రిక ఎన్నికల తర్వాత తెదేపాలో చేరారు. శనివారం రాత్రి ఆమె మేయర్ ఛాంబర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆదివారం కలెక్టర్‌ను కలిసి రాజీనామా పత్రం అందించనున్నట్లు తెలిపారు. 'గిరిజన బిడ్డను ఎదుర్కొనే శక్తి లేక కుట్రలు చేశారు. నాకు మద్దతిస్తున్న కార్పొరేటర్లను భయపెట్టడం, కేసులు పెట్టడం బాధాకరం. మహిళా కార్పొరేటర్లు అని కూడా చూడకుండా ఇళ్లకు వెళ్లి ఇబ్బంది పెట్టారు. మేయర్ పదవి ఇచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి, కష్టకాలంలో అండగా ఉన్న గిరిజన నాయకులకు రుణపడి ఉంటాను. మేయర్ పదవికే రాజీనామా చేశాను. ప్రజలకు చేరువగా ఉంటాను' అని చెప్పారు.

కోటంరెడ్డి, నారాయణలపై విమర్శలు: మంత్రి నారాయణ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిపై ఆమె ఆరోపణలు చేశారు. ఐదుగురు కార్పొరేటర్లు వైకాపాలో చేరితే.. వారిని బెదిరిస్తున్నారన్నారు. దీనికి నారాయణ మద్దతు తెలుపుతున్నారని మేయర్ భర్త జయవర్ధన్ విమర్శించారు.

సీనరేజ్ గుత్తేదార్ల దాటవేత కథలు

(మొదటి పేజీ తరువాయి)

సుధాకర్ ఇన్‌ఫ్రా సంస్థ బిడ్ దక్కించుకుంది.

● ఇందులో ప్రకాశం మినహా మిగిలిన నాలుగు జిల్లాల్లో అక్టోబరు 8 నుంచి గుత్తేదారు సంస్థలు సీనరేజ్ వసూళ్లు ఆరంభించాయి. ప్రకాశం జిల్లాలో అక్టోబరు 24 నుంచి మొదలుపెట్టాయి.
● ఆ తేదీకి ముందే ఒక నెల అడ్వాన్స్ మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించాయి.
● ఆ తర్వాత నవంబరు నుంచి అడ్వాన్స్ చెల్లించడం మానేశాయి. డిసెంబరు వచ్చినా.. అదే పరిస్థితి.
● ప్రభుత్వ పనులకు వినియోగించే రోడ్ మెటల్, గ్రావెల్, మట్టికి ముందుగా సీనరేజ్ ఫీజు తీసుకోకుండా ఉచిత పాస్‌లు జారీ చేస్తారు. ఈ పనులకు బిల్లులు చెల్లించే సమయంలో ప్రభుత్వం సంబంధిత శాఖల ద్వారా సీనరేజ్ మొత్తాన్ని మినహాయిస్తుంది.
● ఇలా ఉచిత పాస్‌లు జారీ చేసిన పర్మిట్ల మొత్తం ఎంతో లెక్కించి, అది మినహా మిగిలిన మొత్తాన్ని గుత్తేదారు సంస్థలు తప్పకుండా ప్రతి నెలా జమచేయాలి.

వర్షాలు పడ్డాయట..

● ఇటీవల ఉమ్మడి ప్రకాశం జిల్లాలో గ్రానైట్ కటింగ్, పాలిషింగ్ యూనిట్ల యజమానులు.. సీనరేజ్ గుత్తేదార్ల తీరుపై నిరసన తెలిపారు. అదనంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటూ పేర్కొన్నారు. చివరకు సర్దుబాటు చేసుకున్నారు.
● ఉమ్మడి కర్నూలు జిల్లాలోని బేతంచెర్ల, బనగానపల్లెలో నాపరాయి పరిశ్రమల యజమానులూ కొద్ది రోజులు నిరసనలు తెలిపారు.
● ఈ నిరసనలను గుత్తేదారు సంస్థలు ప్రభుత్వానికి సాకుగా చూపిస్తున్నాయి. అలాగే మధ్యలో భారీ వర్షాలు కురిసాయని, పర్మిట్లు ఎక్కువ జారీ చేయలేక పోయామంటూ పేర్కొంటున్నాయి.
● దాంతో నవంబరు, డిసెంబరు నెలలకు చెల్లించాల్సిన మొత్తంలో కొంత తగ్గించాలంటూ ప్రభుత్వానికి లేఖలు రాశాయి.
● ఉమ్మడి ప్రకాశం, కర్నూలు జిల్లాలో కొద్ది రోజులు నిరసనలు జరగ్గా, మిగిలిన ఉమ్మడి విశాఖపట్నం, కృష్ణా, నెల్లూరు జిల్లాల్లో ఎటువంటి ఆటంకాల్లేవు. అయినా సరే ఆ జిల్లాల్లో కూడా నవంబరు, డిసెంబరు నెలల అడ్వాన్స్ మొత్తాన్ని చెల్లించకుండా ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నాయి.

నగదు రూపంలో 'అదనం'

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని చీమకుర్తి, మార్టూరు, బల్లికురవ వంటి ప్రాంతాల్లో వందల సంఖ్యలో ఉన్న గ్రానైట్ కటింగ్ పాలిషింగ్ యూనిట్ల యాజమాన్యాలు.. అక్కడి సీనరేజ్ గుత్తేదారు ఏఎంఆర్ తీరుపై కొద్దిరోజులు నిరసన గళం వినిపించాయి. ఒక్కో కట్టర్‌కు ప్రభుత్వానికి చెల్లించాల్సిన నెలకు రూ.35 వేలతోపాటు అదనంగా మరో రూ.35 వేలు అడుగుతున్నారంటూ పేర్కొన్నాయి. చివరకు చర్చలతో రాజీకి వచ్చాయి. ఒక కట్టర్‌కు 22 క్యూబిక్ మీటర్ల ముడిరాయికే అనుమతి ఉంటుంది. అదనంగా 3 క్యూబిక్ మీటర్లు వినియోగిస్తే రూ.10 వేలు, 6 క్యూబిక్ మీటర్లయితే రూ.20 వేలు, 9 క్యూబిక్ మీటర్లు అయితే రూ.30 వేలు, 13 క్యూబిక్ మీటర్లకు రూ.40 వేల చొప్పున అదనంగా చెల్లించేలా మాట్లాడుకుని ఒప్పందం చేసుకున్నాయి. ఈ అదనపు మొత్తాన్ని గుత్తేదారు సంస్థ ఆన్‌లైన్‌లో స్వీకరించకుండా నగదు రూపంలో తీసుకుంటోంది. గతనెల కొంతమేరకు ఆన్‌లైన్ చెల్లింపులు స్వీకరించినా, ఈ నెల నుంచి మాత్రం అదనపు మొత్తాన్ని నగదు రూపంలో మాత్రమే ఇవ్వాలని గుత్తేదారు సంస్థ ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నట్లు కొందరు గ్రానైట్ యూనిట్ల యజమానులు తెలిపారు. అంటే ఈ అదనపు మొత్తమంతా రూ.కోట్లలో ప్రభుత్వ లెక్కలో చూపకుండా గుత్తేదారు సంస్థ వెనకేసుకోనుందనే ఆరోపణలు వస్తున్నాయి.

కేంద్ర సమాచార కమిషనర్‌గా సుధారాణి రేలంగి

(మొదటి పేజీ తరువాయి)

సుదీర్ఘ అనుభవం ఉంది. ఇదివరకు సీబీఐలో ప్రాసిక్యూషన్ డైరెక్టర్‌గా, కేంద్ర న్యాయశాఖలో జాయింట్ సెక్రెటరీగా పనిచేశారు. ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్‌లో జడ్జ్ అటార్నీ జనరల్‌గానూ సేవలందించారు. ఈమె స్వస్థలం ఏలూరు. పాఠశాల విద్య నుంచి డిగ్రీ వరకు ఏలూరులోని సెయింట్ థెరిసా విద్యాలయంలో చదివారు. సీఆర్‌ఆర్ కళాశాలలో లా డిగ్రీ పూర్తిచేశారు. లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ అండ్ ఫైనాన్స్ నుంచి ఇంటర్నేషనల్ బిజినెస్ లాలో ఎల్ఎల్ఎం చేశారు. 2003 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశారు. ఆ తర్వాత ఇండియన్ లీగల్ సర్వీస్‌కు ఎంపికయ్యారు. తెలుగువారైన ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ 2013 నవంబరు నుంచి 2018 నవంబరు వరకు కేంద్ర సమాచార కమిషనర్‌గా సేవలందించారు. ఆ తర్వాత ఇప్పుడు సుధారాణి రేలంగి నియమితులయ్యారు.

ప్రధాన కమిషనర్‌గా మాజీ న్యాయశాఖ కార్యదర్శి రాజ్‌కుమార్ గోయల్

కేంద్ర సమాచార కమిషన్ ప్రధాన కమిషనర్‌గా న్యాయశాఖ మాజీ కార్యదర్శి రాజ్‌కుమార్ గోయల్ నియమితులయ్యారు. అలాగే రైల్వే బోర్డు మాజీ ఛైర్మన్ జయవర్మ సిన్హా, కేంద్ర సామాజిక న్యాయం, సాధికార శాఖ మాజీ కార్యదర్శి సురేంద్రసింగ్ మీనా, మాజీ ఐఎఫ్ఎస్ అధికారి కుశ్వంత్‌సింగ్ సేథి, మాజీ ఐపీఎస్ అధికారి స్వాగత్‌దాస్, మాజీ ఐఏఎస్ అధికారి సంజీవ్‌కుమార్ జిందల్, సీనియర్ పాత్రికేయుడు పీఆర్ రమేష్, అశుతోష్ చతుర్వేదిలు కమిషనర్లుగా నియమితులయ్యారు. ఇప్పటికే కమిషనర్లుగా సేవలందిస్తున్న ఆనంది రామలింగం, వినోద్‌కుమార్ తివారీతో కలిపి ఈ 9 మంది నియామకంతో కమిషన్‌లో మొత్తం 11 మంది కమిషనర్లను పూర్తిగా నియమించినట్లయింది. ఇందులో ముగ్గురు మహిళలకు చోటు దక్కింది. రాజ్‌కుమార్ గోయల్ సోమవారం ఉదయం 11 గంటలకు ప్రధాన కమిషనర్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాష్ట్రపతి ద్రౌపదీముర్ము సమక్షంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఇటీవల ప్రధాన కమిషనర్‌గా పదవీ విరమణ చేసిన హీరాలాల్ సమరియా తెలంగాణ కేడర్ ఐఏఎస్ అధికారిగా పనిచేశారు.

రైతుల భూముల్ని నిషేధిత జాబితాలో చేర్చిన జగన్‌రెడ్డి

● మంత్రి అనగాని సత్యప్రసాద్

ఈనాడు, అమరావతి: భూ రికార్డుల్ని తారుమారు చేసి వేల ఎకరాల రైతుల భూముల్ని గత వైకాపా ప్రభుత్వంలో ఆ పార్టీ నేతలు కబ్జా చేశారని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ధ్వజమెత్తారు. కొన్ని భూముల్ని 22ఏ జాబితాలో చేర్చి లావాదేవీల్ని అడ్డుకున్నారని మండిపడ్డారు. రైతు తన భూమిని విక్రయించలేని, అభివృద్ధి చేసుకోలేని దుస్థితి తెచ్చారని శనివారం ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. "రెవెన్యూ సంస్కరణల పేరుతో జే గ్యాంగ్ ప్రజల భూముల్ని దోచుకుంది. పాసు పుస్తకాల్లో రైతుల పేర్లు మార్చి..వైకాపా వాళ్ల పేర్లు ఎక్కించారు. రాజముద్రను తొలగించి జగన్ ఫొటోలు ముద్రించడానికే రూ.750 కోట్ల ప్రజాధనాన్ని వృథా చేశారు" అని సత్యప్రసాద్ దుయ్యబట్టారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి కూటమి ప్రభుత్వం ప్రజల భూములకు రక్షణ కల్పించిందని స్పష్టం చేశారు.

పీపీపీ విధానమే మేలు!

(మొదటి పేజీ తరువాయి)

ప్రోత్సహించాలన్న సిఫార్సును తాజా నివేదికలోనూ పునరుద్ఘాటించింది. ప్రైవేట్ వైద్య కళాశాలల్లో 50% సీట్ల ఫీజులను ప్రభుత్వం నిర్ధారించి, మిగిలిన 50% సీట్ల ఫీజులను ఆయా రాష్ట్రాల ఫీజ్ రెగ్యులేటరీ కమిటీలతో సంప్రదించి నిర్ణయించాలన్న ప్రభుత్వ ప్రతిపాదనను స్వాగతిస్తున్నట్లు పేర్కొంది.

ఒక్కో కళాశాలలో 250 సీట్ల వరకు పెంచాలి

స్థాయీ సంఘం తాజా నివేదికలో మరికొన్ని సిఫార్సులు చేసింది.

● కొత్త వైద్య కళాశాల ఏర్పాటు చేసేటప్పుడు ఏటా 50/ 100/ 150 ఎంబీబీఎస్ సీట్లకు మాత్రమే అనుమతిస్తున్నారు. కాలేజీ కొత్తదా, పాతదా అన్న తేడా లేకుండా అక్కడున్న మౌలిక వసతులు, బోధనా సిబ్బందిని పరిగణనలోకి తీసుకొని దశలవారీగా గరిష్ఠంగా 250 సీట్ల వరకు పెంచుకొనేందుకు అవకాశం ఇవ్వాలి.
● వైద్య సౌకర్యాలు పెద్దగా లేని జిల్లాల్లో కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుకు ప్రాధాన్యమివ్వాలి.
● దేశంలో వైద్యవిద్య సీట్లు సరిపడా లేకపోవడంతో చాలా మంది విదేశాలకు వెళ్తున్నారు. అక్కడ ఉత్తీర్ణులై వచ్చిన తర్వాత మనదేశంలో లైసెన్సింగ్ పరీక్ష పాసై, శాశ్వత రిజిస్ట్రేషన్ పొందడానికి అవస్థలు పడుతున్నారు. ఎఫ్ఎంజీ రెగ్యులేషన్స్-2021ని ఒక సంధానకర్తగా ఉపయోగించి వీరి రిజిస్ట్రేషన్, ఇంటర్న్‌షిప్ విధానాలను క్రమబద్ధీకరించాలి. మన వైద్యవ్యవస్థ నాణ్యత దెబ్బతినకుండా వీరి సేవలను ఉపయోగించుకోవాలి.
● మన విద్యార్థులు వైద్య విద్య కోసం విదేశాలకు వెళ్లకుండా నిరోధించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. యూజీ-ఎంఎస్ఆర్ గైడ్‌లైన్స్- 2023 ప్రకారం ప్రతి 10 లక్షల మంది జనాభాకు సగటున 100 ఎంబీబీఎస్ సీట్లు ఉండాలి. ఇప్పుడున్న సీట్లకు మరో 40 వేలు జోడిస్తేనే ఆ నిష్పత్తి అందుకోగలం. ఈ లక్ష్యాన్ని చేరుకొనే విధంగా ప్రభుత్వం వైద్యవిద్యను విస్తరించాలి.
● కేంద్ర ప్రభుత్వం వచ్చే ఐదేళ్లలో 75 వేల ఎంబీబీఎస్ సీట్లను జత చేస్తామని ప్రకటించింది. ఒకసారి ఇది అమలైతే వైద్యవిద్య కోసం భారతీయ విద్యార్థులెవ్వరూ బయటకు వెళ్లాల్సిన అవసరం ఉండకపోవచ్చు.
● వైద్య విద్యలో బోధనా సిబ్బంది కొరతను పరిష్కరించాలి. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో పనిచేసే బోధనా సిబ్బందికి ప్రోత్సాహకాలు ఇవ్వాలి. తాత్కాలిక, కాంట్రాక్ట్ నియామకాలను పక్కనపెట్టి మంచి వేతనాలు, ఉద్యోగ భద్రత, కెరీర్ గ్రోత్‌ను కల్పిస్తే నాణ్యమైన డాక్టర్లు వస్తారు.
● బోధన వైపు వచ్చే వైద్యులకు నివాసపరంగా మద్దతు ఇవ్వడంతోపాటు, వారి పిల్లల చదువుకూ చేయూతనివ్వాలి.
● మారుమూల ప్రాంతాలకు బోధనా సిబ్బందిని ఆకర్షించేందుకు గ్రామీణ సేవల అలవెన్స్ విధానాన్ని ప్రవేశపెట్టాలి. బోధన, పరిశోధన, క్లినికల్ వర్క్‌ల్లో వారు చూపే ప్రతిభ ఆధారంగా ప్రమోషన్లు ఇవ్వడానికి రోడ్‌మ్యాప్ ఉండాలి.

శనగ పేరుకుపోతోంది!

(మొదటి పేజీ తరువాయి)

ఉత్పత్తి వచ్చిందని అంచనా. ఈ ఏడాది ఇప్పటికే 5.53 లక్షల ఎకరాల్లో సాగైంది. కొత్త పంట వచ్చే లోగా ప్రభుత్వం నిల్వ శనగల్ని కొనుగోలు చేయిస్తే రైతులకు ఊరట లభిస్తుంది.

దిగుమతుల దెబ్బకు రైతు కుదేలు: దిగుమతుల కారణంగా మన పంటకు ధర తగ్గింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో 16లక్షల క్వింటాళ్ల శనగలు విదేశాల నుంచి దిగుమతి అయ్యాయి. ఇప్పటికీ దిగుమతులు కొనసాగుతున్నాయి.

ఎకరాకు రూ.45 వేల ఖర్చు: పొగాకు, పత్తి, ఇతర పంటలకు ధరలు లేని పరిస్థితుల్లో కొన్నేళ్లుగా రైతులు ప్రత్యామ్నాయ పంటగా శనగ సాగు చేస్తున్నారు. రబీలో ప్రధాన పంట శనగే. శనగ పెట్టుబడి కూడా భారీగా పెరిగింది. గతంలో ఎకరాకు రూ.25 వేలు అయితే ఘనం. నాలుగైదేళ్లుగా రూ.45 వేల వరకు అవుతోంది.

గిట్టుబాటు ధర కోసం ఎదురుచూపులు

రాష్ట్రంలో ఎర్రశనగ (జేజీ11), కాబూలీ (కాక్-2) రకాల సాగు అధికం. పెరిగిన పెట్టుబడి ప్రకారం ఎకరాకు కనీసం 10 క్వింటాళ్ల దిగుబడి లభించి.. క్వింటాలుకు రూ.6వేల పైన ధర ఉంటేనే రైతుకు గిట్టుబాటు అవుతుంది. అయితే రెండు, మూడేళ్లుగా సగటున రూ.5,600 మాత్రమే ఉంది. దీంతో రైతులు పంటను శీతల గోదాముల్లో నిల్వ చేశారు. ఇది మరింత తగ్గి క్వింటాలుకు రూ.5,100 అయింది.. గతేడాది కాక్-2 రకం శనగ క్వింటాలుకు రూ.10వేలు ఉంది. ఇప్పుడదీ రూ.5,400 మాత్రమే ఉంది. ఉత్తరాది రాష్ట్రాల నుంచి డిమాండు లేకపోవడమూ ఇందుకు కారణం.

అరకులోయలో 3.3 డిగ్రీల ఉష్ణోగ్రత

చింతపల్లి, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. అరకులోయలో శనివారం ఉదయం 3.3 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైనట్లు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. డుంబ్రిగుడ-4.1, ముంచంగిపుట్టు-4.4, జి.మాడుగుల-4.8, చింతపల్లి-5.5, పాడేరు-6.2, హుకుంపేట-6.7, పెదబయలు-7.6 డిగ్రీలు నమోదయ్యాయని పేర్కొన్నారు.

అమరావతిలో వాజ్‌పేయీ స్మృతి వనం

● పాతూరి నాగభూషణం

తుళ్లూరు, న్యూస్‌టుడే: అమరావతిలో మాజీ ప్రధాని వాజ్‌పేయీ స్మృతి వనం, ఆయన విగ్రహంతోపాటు భాజపా రాష్ట్ర కార్యాలయం నిర్మించడానికి సన్నాహాలు జరుగుతున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర ప్రోగ్రామ్స్, ప్రొటోకాల్స్ ఇన్‌ఛార్జి పాతూరి నాగభూషణం తెలిపారు. వెంకటపాలెం గ్రామ సమీపంలో సీడ్ యాక్సెస్ రహదారికి కూతవేటు దూరంలో ఉన్న సుమారు 2.5 ఎకరాల భూమిని శనివారం ఆయన ఆ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు, పొగాకు బోర్డు ఛైర్మన్ యశ్వంత్, స్వరూపారాణిలతో కలిసి పరిశీలించారు. త్వరలో నిర్మాణాలకు భూమి పూజ నిర్వహించనున్నట్లు నాగభూషణం తెలిపారు.

పాఠశాలల్లో ప్రమాణాల మెరుగుకు అథారిటీ

(మొదటి పేజీ తరువాయి)

ఎస్ఎస్ఎస్ఏ సూచించిన ప్రమాణాలను అన్ని విద్యా సంస్థలూ తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. ఇది స్వతంత్ర నియంత్రణ సంస్థగా పనిచేస్తుంది. విద్యా సంస్థలు స్వీయ నియంత్రణ పాటించేలా చూడడంతో పాటు వాటికి అక్రెడిటేషన్‌నూ మంజూరు చేస్తుంది. రాష్ట్రంలోని పాఠశాలల్లో ప్రమాణాలను మెరుగుపర్చడమే లక్ష్యంగా ఎస్ఎస్ఎస్ఏ పనిచేస్తుంది. ఇప్పటివరకు ఎలాంటి సదుపాయాలూ లేకుండా.. అర్హత లేని ఉపాధ్యాయులతో బోధన సాగిస్తున్న విద్యా సంస్థలు.. ఇకపై ప్రమాణాలకు అనుగుణంగా మారాల్సి ఉంటుంది. లేదంటే వాటి అనుబంధ గుర్తింపు జారీపై ప్రభావం పడుతుంది.

ఐదు అంశాల ఆధారంగా ఫ్రేమ్‌వర్క్: విద్యా వ్యవస్థలో కీలకమైన ఐదు ప్రధాన అంశాల ఆధారంగా ఫ్రేమ్‌వర్క్‌ను ఎస్ఎస్ఎస్ఏ రూపొందిస్తుంది. పరిపాలన, మూల్యాంకనం, పాఠ్యాంశాలు-పెడగాజీ, మౌలిక వసతులు, సమగ్రత (ఇన్‌క్లూజివ్‌నెస్)ను పరిశీలిస్తుంది.

● గుర్తింపు పొందిన పాఠశాలలను నిరంతరం పర్యవేక్షిస్తుంది.
● క్రమం తప్పకుండా తనిఖీలు, మదింపు, సమీక్షలు నిర్వహిస్తుంది.
● నిర్ధారిత ప్రమాణాలు పాటిస్తున్నట్లు పాఠశాలలు ఆధారాలు సమర్పించాలి. లోపాలుంటే వాటిని సరిదిద్దేందుకు చర్యలు తీసుకుంటుంది.
● పాఠశాలలు స్వీయ మూల్యాంకనం చేసుకునేందుకు ప్రోత్సాహం అందిస్తుంది.
● విద్యా సంస్థలు ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయో లేదో నిర్ధారిస్తుంది.

ప్రమాణాల వృద్ధి ఇలా..

● ఎస్‌సీఈఆర్టీ, ఇతర భాగస్వామ్య సంస్థలతో కలిసి పాఠశాలల పనితీరు మెరుగుపరిచేందుకు ప్రపంచస్థాయి, ఆధారిత ప్రమాణాలను రూపొందిస్తుంది. ● గుర్తింపు స్థితి, నియంత్రణ సమాచారాన్ని పోర్టల్ ద్వారా అందరికీ అందుబాటులో ఉంచుతుంది. ● విద్యార్థుల పనితీరు, ఉపాధ్యాయుల వివరాలు, మౌలిక వసతుల నిర్వహణ వంటి అంశాలకు సంబంధించిన సమగ్ర సమాచారంతో దస్త్రాలు నిర్వహిస్తుంది.
● విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది ఇచ్చే ఫిర్యాదులను పరిష్కరించే కేంద్రంగా పనిచేస్తుంది.

గ్రహం అనుగ్రహం

14-12-2025 ఆదివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు, మార్గశిర మాసం, బహుళపక్షం
దశమి: రా.8-34 తదుపరి ఏకాదశి; **హస్త:** ఉ.10-59 తదుపరి చిత్త
వర్జ్యం: రా.7-37 నుంచి 9-21 వరకు; **అమృత ఘడియలు:** తె.5-59 నుంచి
దుర్ముహూర్తం: సా.3-56 నుంచి 4-40 వరకు; **రాహుకాలం:** సా.4-30 నుంచి 6-00 వరకు; **సూర్యోదయం:** ఉ.6.25; **సూర్యాస్తమయం:** సా.5.24

చలి-పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
హైదరాబాద్	11.0	29.8
అనంతపురం	15.0	31.2
కర్నూలు	15.1	31.6
విజయనగరం	16.0	27.0
విశాఖపట్నం	16.2	30.0
కడప	17.0	28.0
విజయవాడ	17.0	30.2
రాజమహేంద్రవరం	17.0	33.5
నరసాపురం	17.8	31.5
గుంటూరు	18.0	29.0
శ్రీకాకుళం	18.0	29.0
సూర్యాపేట	18.0	30.0
నెల్లూరు	19.6	30.0
ఒంగోలు	19.8	30.7
తాడేపల్లిగూడెం	24.0	30.0

ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసే ఉద్దేశం లేదు

జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు

లావేరు, న్యూస్‌టుడే: ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసే ఉద్దేశం తనకు లేదని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కె.నాగబాబు స్పష్టం చేశారు. శ్రీకాకుళం జిల్లా లావేరులో శనివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, క్రియాశీలక సభ్యులు, వాలంటీర్లు, కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 'ప్రత్యక్ష రాజకీయాల్లో ఉండాలనుకుంటే 2024 ఎన్నికల్లోనే పోటీ చేసి ఉండేవాడిని. ప్రస్తుతం రాష్ట్రంలో జనసేన బలోపేతమే లక్ష్యంగా పని చేస్తున్నాం. మన్యం జిల్లాలోని గిరిజన గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి గత వైకాపా ప్రభుత్వం రూ.90 కోట్లు విడుదల చేస్తే, కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గ్రామాల అభివృద్ధి, రహదారుల నిర్మాణానికి రూ.వెయ్యి కోట్లు విడుదల చేశారు' అని పేర్కొన్నారు.

పుస్తక మహోత్సవానికి వేళాయె

విజయవాడలో జనవరి 2 నుంచి 12 వరకు నిర్వహణ


బుక్ ఫెస్టివల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న లక్ష్మయ్య, టి.మనోహర్‌నాయుడు

ఈనాడు, అమరావతి: విజయవాడలో గత మూడున్నర దశాబ్దాలకు పైగా నిర్విరామంగా ఏటా జనవరిలో ఏర్పాటు చేస్తున్న పుస్తక మహోత్సవానికి వేళయింది. 35 ఏళ్లుగా దిగ్విజయంగా నిర్వహించి.. ఈ ఏడాది 36వ ప్రదర్శనకు విజయవాడ పుస్తక మహోత్సవం సంఘం (వీబీఎఫ్) ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈసారి కూడా గత ఏడాది మాదిరిగానే పుస్తక మహోత్సవాన్ని ఏర్పాటు చేస్తున్నారు. జనవరి 2 నుంచి 12 వరకు 11 రోజులు ఈ ఏడాది పుస్తకాల పండగ సందడి చేయబోతోంది. 36వ ప్రదర్శనకు సంబంధించిన గోడపత్రికను వీబీఎఫ్ అధ్యక్షుడు టి.మనోహర్‌నాయుడు ఆధ్వర్యంలో విజయవాడలోని వీబీఎఫ్ సొసైటీ ఆవరణలో శనివారం ఆవిష్కరించారు. వీబీఎఫ్ ఉపాధ్యక్షుడు జె.ప్రసాద్, కార్యదర్శి కె.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. జనవరి 2న సాయంత్రం పుస్తక ప్రదర్శన ప్రారంభిస్తారు.

19 నుంచి హైదరాబాద్ బుక్ ఫెయిర్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: రచయితలు, కవులు, సాహితీ ప్రియులు కలుసుకునే ప్రధాన వేదిక హైదరాబాద్ బుక్ ఫెయిర్ అని కవి, హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ అధ్యక్షుడు యాకూబ్ తెలిపారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ... సాహితీప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న 38వ హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను ఎన్టీఆర్ స్టేడియంలో ఈ నెల 19 నుంచి 29 వరకు నిర్వహిస్తున్నామని వివరించారు.

అభివృద్ధి, సంక్షేమంలో రాజీ పడొద్దు

- పోలవరం ఎమ్మెల్యే బాలరాజుతో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్
- జనసేన ఎమ్మెల్యేలతో భేటీల్లో తొలి సమావేశం


పోలవరం నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

ఈనాడు, అమరావతి: 'ప్రజలు అందించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ వారికి అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించడంలో ఏ దశలోనూ రాజీ పడకూడదు. గెలిచిన ప్రతి ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమం విషయంలో ప్రజలకు సంతృప్తి కలిగించేలా పని చేయాలి' అని ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గాల్లో అభివృద్ధితో పాటు పార్టీ కార్యక్రమాల నిర్వహణపై సమీక్షించాలని పవన్‌కల్యాణ్ నిర్ణయించారు. దీనిలో భాగంగా జనసేన ఎమ్మెల్యేలు ప్రతి ఒక్కరితో ఆయన విడివిడిగా (వన్ టూ వన్) భేటీ కానున్నారు. శనివారం పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుతో తొలి సమావేశం నిర్వహించారు. ఏడాదిన్నర కాలంలో పోలవరం నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై ఆయన సమీక్షించారు. పెండింగ్ పనుల గురించి తెలుసుకున్నారు. నియోజకవర్గానికి దక్కిన నామినేటెడ్ పోస్టుల అంశాన్ని ఉప ముఖ్యమంత్రి చర్చించారు.

ఎమ్మెల్యేలే సమస్యల్ని గుర్తించి, పరిష్కరించాలి

'అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం నిర్దేశిత లక్ష్యంతో ముందుకు వెళ్తోంది. ఎమ్మెల్యేలూ ఆ దిశగా వెళ్లాలి. ఐఎస్ జగన్నాథపురం పర్యటనకు వచ్చినప్పుడు తిమ్మనకుంట- గవరవరం రోడ్డు లేక రెండు దశాబ్దాలుగా ఇబ్బంది పడుతున్న అంశాన్ని ఒక మహిళ నా దృష్టికి తీసుకువచ్చారు. అలాంటి సమస్యలను ఎమ్మెల్యేగా గుర్తించి పరిష్కరించేలా పని చేయాలి' అని పవన్‌కల్యాణ్ ఎమ్మెల్యేతో అన్నారు. కూటమి ధర్మాన్ని అనుసరిస్తూనే జనసేన పార్టీ కార్యక్రమాలు నియోజకవర్గంలో విస్తృతం చేయాలని చెప్పారు. పోలవరం నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ప్రతిపాదనలను ఎమ్మెల్యే బాలరాజు ఉప ముఖ్యమంత్రికి అందించారు. సమావేశంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పార్టీ అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు పాల్గొన్నారు.

అంధ మహిళా క్రికెటర్లకు గృహోపకరణాలు

- 24 గంటల్లోనే చేరవేయించిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్


పవన్‌కల్యాణ్ పంపిన సామగ్రితో కరుణకుమారి కుటుంబసభ్యులు

ఈనాడు, అమరావతి, పాడేరు, న్యూస్‌టుడే: అంధుల మహిళా ప్రపంచ క్రికెట్ కప్ గెలిచిన జట్టు సభ్యులు దీపిక, కరుణకుమారి ఇళ్లకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గృహోపకరణాలు పంపించారు. ఆ క్రికెట్ జట్టుతో శుక్రవారం ఆయన భేటీ అయిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఆ కుటుంబాల ఆర్థిక స్థితిగతులు ఆయన దృష్టికి వచ్చాయి. దీంతో మన రాష్ట్రానికి చెందిన ఇద్దరు మహిళా క్రికెటర్లకు తక్షణమే గృహోపకరణాలు పంపాలని ఆయన నిర్ణయించారు. ఇందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేశారు. పార్టీ నాయకుల ద్వారా వీటిని అక్కడికి చేరవేయించారు. శ్రీ సత్యసాయి జిల్లా తంబలహట్టి తండాలో దీపిక కుటుంబానికి, అల్లూరి సీతారామరాజు జిల్లా వంట్లమామిడిలో కరుణ కుమారి కుటుంబానికి వంట సామాగ్రి, టీవీ, టేబుల్ ఫ్యాను, మిక్సర్ గ్రైండర్, కుర్చీలు, చాపలు, స్టీల్ ప్లేట్లు, ప్రెషర్ కుక్కర్లు, ఎల్ఈడీ బల్బులు, ఇస్త్రీ పెట్టె, పాత్రలు, దుప్పట్లు, దిండులు, కుటుంబం మొత్తానికి కొత్త వస్త్రాలు పంపించారు. శనివారం సాయంత్రానికి వాళ్ల ఇళ్లకు ఇవి చేరుకున్నాయి. హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ టి.సి.వరుణ్, జనసేన నాయకుడు పొదిలి బాబూరావు తదితరులు తంబలహట్టి తండాకు వెళ్లి ఈ వస్తు సామాగ్రిని దీపిక కుటుంబానికి అందించారు. మరో వైపు రాష్ట్ర జానపద కళలు, సృజనాత్మక అకాడమీ ఛైర్మన్ వంపూరు గంగులయ్య, జనసేన నాయకుడు వన్నెంరెడ్డి సతీష్‌రెడ్డి తదితరులు కరుణ కుమారి ఇంటికి వెళ్లి వస్తువులను అందజేశారు. ఇద్దరు తెలుగు క్రికెటర్లకు క్రీడా కారుల కోటా కింద కొత్త గృహాలు నిర్మించి ఇచ్చేలా ఏర్పాట్లు చేయాలని పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. కొత్త ఇళ్లు నిర్మించిన తర్వాత వాటికి తగిన విధంగా ఇతర అవసరమైన గృహోపకరణాలు సమకూర్చాలని నిర్ణయించారు.

నాగార్జునసాగర్ ఏపీఆర్‌జేసీ స్వర్ణోత్సవాలు ప్రారంభం

- తరలివచ్చిన పూర్వ విద్యార్థులు


స్వర్ణోత్సవ వేడుకలు ప్రారంభిస్తున్న మల్లికార్జున. వేదికపై మహేందర్‌రెడ్డి, సైదారెడ్డి తదితరులు

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: పల్నాడు జిల్లా నాగార్జునసాగర్‌లోని ఏపీఆర్‌జేసీ స్వర్ణోత్సవ వేడుకలు శనివారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలకు విశ్రాంత ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఇక్కడి పూర్వ విద్యార్థులైన తెలంగాణ మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి, ఐజీ రమేష్‌రెడ్డి, విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి రాజశేఖర్‌తో పాటు పలువురు వైద్యులు, ఇంజినీర్లు, ఎన్నారైలూ తరలివచ్చారు. ఈ సందర్భంగా 118 మంది విశ్రాంత, పూర్వ ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులను సన్మానించారు. రాత్రి క్యాంప్‌ఫైర్ నిర్వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పేద విద్యార్థుల కోసం నాగార్జునసాగర్‌లో ఏపీఆర్‌జేసీ కళాశాలను 1975లో స్థాపించారు. నాటి నుంచి నిష్ణాతులైన అధ్యాపకుల పర్యవేక్షణలో ఇక్కడ వేల మంది విద్యార్థులు విద్యనభ్యసించి, ఉన్నతస్థాయికి ఎదిగారు. ఇక్కడ చదివిన ఎందరో దేశవిదేశాల్లో ఉన్నత స్థాయిలలో స్థిరపడ్డారు. పలువురు ప్రముఖ డాక్టర్లు, ఇంజినీర్లు, వ్యాపారవేత్తలుగా కొనసాగుతూ కళాశాల కీర్తిని ఇనుమడింపజేస్తున్నారు. పూర్వ విద్యార్థులు తరగతి గదులు, కళాశాల ప్రాంగణాన్ని కలియతిరిగారు. ఇక్కడ విలువలతో కూడిన విద్యను అభ్యసించామని గుర్తు చేసుకున్నారు. పూర్వ, కళాశాల విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. సాగర్ పరివార్ అధ్యక్షుడు మల్లికార్జున, ఛైర్మన్ సైదారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ఎస్.సరోజిని, విశ్రాంత ప్రిన్సిపాళ్లు జి.రంగాచార్యులు, చందు ఆంజనేయులు, జగన్నాథరావు, నాగభూషణశర్మ, లింగారెడ్డి, విజయరాఘవాచార్యులు, టీఎన్ఆర్, భాస్కరరావు, రామలింగారెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నా ఉన్నతికి కారణం ఉపాధ్యాయులే

విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్


డాన్‌బాస్కో పాఠశాల స్వర్ణోత్సవ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న మంత్రి నారా లోకేశ్

తాడేపల్లి, న్యూస్‌టుడే: 'నా ఉన్నతికి నా ఉపాధ్యాయులే కారణం. ఏ స్థాయికి వెళ్లినా విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలలు, గురువును మర్చిపోకూడదు' అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. మంగళగిరి- తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎర్రబాలెం వద్ద ఉన్న డాన్‌బాస్కో తెలుగు మీడియం ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవానికి శనివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్వర్ణోత్సవ శిలాఫలకాన్ని, ఆధునికీకరించిన సైన్స్ ప్రయోగశాలను ఆయన ప్రారంభించారు. పాఠశాల వ్యవస్థాపకుడు రెవ.ఫాదర్ థామస్ చిన్నప్ప విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి లోకేశ్ మాట్లాడుతూ.. 'చదువుకునే సమయంలో ఎక్కువ సమయం ఉపాధ్యాయులతోనే గడుపుతాం. ఈ రోజు నేను ఈ స్థాయికి వచ్చానంటే ఉపాధ్యాయిని మంజులా మేడం, నారాయణ, రాజారెడ్డి మాస్టార్లు కారణం. ఏ స్థాయికి వెళ్లినా చదువుకున్న పాఠశాల అభివృద్ధికి సాయం అందించాలి. జీవితంలో విలువలతో కూడిన నిర్ణయాలను తీసుకోవాలి. అన్ని సమస్యలనూ ఒక వ్యక్తి లేదా ఓ వ్యవస్థ తీర్చలేవు. అందరూ కలిసి పనిచేసినప్పుడే ఆశించిన మార్పు వస్తుంది. డాన్‌బాస్కో పాఠశాలను దేశంలోనే అద్భుత పాఠశాలగా తీర్చిదిద్దుతాం. తెలుగు రాష్ట్రాల్లో 35 డాన్‌బాస్కో పాఠశాలలు విద్యతో పాటు విలువలను అందిస్తున్నాయి. ఎయిడెడ్ వ్యవస్థ రద్దయి మూడేళ్లవుతోంది, తమను ఆదుకోవాలని గతంలో ఆ విద్యాసంస్థల ప్రతినిధులు కోరారు. విద్యా శాఖ మంత్రిగా అండగా నిలుస్తాను' అని పేర్కొన్నారు. సెకండరీ ఎడ్యుకేషన్ ఎగ్జామినేషన్ కమిషనర్ శ్రీనివాసులరెడ్డి, విజయవాడ బిషప్ జోసఫ్ రాజారావు, ఫాదర్ సంతియాగు థామస్, మంగళగిరి డాన్‌బాస్కో ప్రతినిధి రెక్టర్ ఫాదర్ చిన్నప్ప, పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్ధయ్య, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణికి పురస్కారం.. భర్తగా గర్వపడే క్షణం: లోకేశ్

ఈనాడు, అమరావతి: బిజినెస్ టుడే.... 'మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్ ఇన్ బిజినెస్' పురస్కారాన్ని నారా బ్రాహ్మణి అందుకోవడంపై ఎక్స్ వేదికగా మంత్రి నారా లోకేశ్ స్పందించారు. "భర్తగా గర్వపడే క్షణం. భవిష్యత్తు గురించి దూరదృష్టి, ఆలోచన, మాటలకంటే చేతల్లో చూపడం ఆమెలోని గొప్ప నాయకత్వ లక్షణాలు" అని లోకేశ్ పేర్కొన్నారు.

కోడిపిల్లకు 4 కాళ్లు



అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలంలోని సంతారి పంచాయతీ పెదబూరుగుపట్టులోని కిల్లో అప్పారావు ఇంట్లో పొదిగేసిన నాటుకోడి గుడ్లలో శనివారం నాలుగు పిల్లలు జన్మించాయి. ఇందులో ఓ కోడి పిల్లకు నాలుగు కాళ్లు ఉండటంతో గ్రామస్థులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. ప్రస్తుతం ఆ కోడి పిల్ల ఆరోగ్యంగానే ఉన్నట్లు యజమాని తెలిపారు. జన్యుపరమైన లోపాలతో ఇలా జన్మిస్తుంటాయని పాడేరు పశుసంవర్ధక శాఖ అధికారులు తెలిపారు. - పాడేరు, న్యూస్‌టుడే

'కూటమి ప్రభుత్వంపై వైకాపా విమర్శలు సిగ్గుచేటు'

ఈనాడు, అమరావతి: ఐటీ కంపెనీల పేర్లు కూడా పలకలేని వైకాపా వాళ్లు.. కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటని శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ ధ్వజమెత్తారు. విశాఖలో ఒక్కరోజే తొమ్మిది ఐటీ కంపెనీలకు శంకుస్థాపనలు చేయడం రాష్ట్ర చరిత్రలో సువర్ణాధ్యాయమన్నారు. 20 లక్షల ఉద్యోగాల కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు.



మీ చుట్టూ ఎలాంటివారున్నారు?

మనం తీసుకొనే నిర్ణయాలే మన జీవితాన్ని నిర్దేశిస్తాయి. కాబట్టి మన భవిష్యత్తు మెరుగ్గా ఉండాలంటే ఉత్తమ నిర్ణయాలు తీసుకోవాలి. అది సాధ్యం కావాలంటే, మన చుట్టూ ముఖస్తుతి కోసం పొగిడేవారు కాకుండా- మన ఎదుగుదలను కోరుకుంటూ మనలోని లోపాల గురించి నిజాయతీగా అభిప్రాయాలు చెప్పేవారే ఉండేలా జాగ్రత్తపడాలి.

- రాశీ ఉమాపతి, కంటెంట్ స్ట్రాటజిస్ట్

అనుభవజ్ఞులకు ఏఐ ప్రత్యామ్నాయం కాలేదు

- యువతలో ఓర్పు కనిపించడం లేదు..
- ఏయూ పూర్వ విద్యార్థుల సమావేశంలో ఎంపీ సుధామూర్తి


ఏయూ మొదటి వీసీ సీఆర్‌రెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎంపీ సుధామూర్తి. చిత్రంలో జీఎంఆర్, గంటా శ్రీనివాసరావు, బి.సత్యనారాయణ, వైవీ అనురాధ, బీవీఎన్ రావు, డా.ఎస్‌కేఈ అప్పారావు, ఆచార్య బి.మోహనవెంకట్రామ్, వీసీ రాజశేఖర్, కేవీవీ రావు, పి.కింగ్

ఈనాడు, విశాఖపట్నం: యువత లక్ష్య సాధనలో ఓర్పుగా వ్యవహరించినప్పుడే విజయావకాశాలు మెరుగవుతాయని ఇన్ఫోసిస్ ఫౌండేషన్, మూర్తి ట్రస్ట్ ఛైర్‌పర్సన్, ఎంపీ సుధామూర్తి పేర్కొన్నారు. జెన్-జీల్లో ఆ ఓర్పు కనిపించడం లేదని, దాన్ని తప్పనిసరిగా అలవరచుకోవాలని సూచించారు. జెన్-జీ, ఆల్ఫాలు ఉపయోగిస్తున్న ఏఐ అనుభవజ్ఞులకు ఎప్పటికీ ప్రత్యామ్నాయం కాలేదన్నారు. అది వారి జీవితంలో ఒక సహాయకారిగానే ఉపయోగపడుతుంది గానీ అదే జీవితం కాదని హితబోధ చేశారు. శనివారం విశాఖలో ఏయూ పూర్వ విద్యార్థుల సంఘ సమావేశానికి సుధా మూర్తి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 'జీవితం చాలా భిన్నంగా ఉంటుంది. మొదటి ర్యాంకు రాలేదని, ఎక్కువ వేతనం వచ్చే ఉద్యోగానికి ఎంపికవలేదని నిరుత్సాహపడకూడదు. దాన్ని ఎదుర్కోవడమే అసలైన జీవితం. అందుకు అవసరమైన మానసిక స్థైర్యాన్ని యువత పెంపొందించుకోవాలి. జయాపజయాలు రెండూ ఉన్నప్పుడే జీవితానికి సార్థకత. ఎప్పుడూ విజయాలు సాధిస్తే అది మనలో అహంకారాన్ని పెంచుతుంది. అపజయాలు ఒక వ్యక్తిని అనుభవజ్ఞుడిగా తీర్చిదిద్దుతాయి. చేసిన తప్పులను మళ్లీమళ్లీ చేయకుండా వాటిని గుణపాఠంగా తీసుకోవాలి. ప్రతి ఒక్కరూ మాతృభాషను గౌరవించాలి. అది మన సంస్కృతిని ప్రతిబింబిస్తుంది. నేను మీ అందరి ముందు ఇలా నిలబడి మాట్లాడడానికి మా ఆచార్యులు, విద్యాసంస్థే కారణం' అని పేర్కొన్నారు. ఏయూ వందేళ్ల ప్రయాణం సాధారణ విషయం కాదని, దీనివెనుక ఎంతో మంది విద్యావేత్తల కృషి ఉందని సుధామూర్తి అన్నారు.

సమయం కేటాయిద్దాం

పూర్వ విద్యార్థుల సంఘ వ్యవస్థాపక ఛైర్మన్, పారిశ్రామికవేత్త గ్రంధి మల్లికార్జునరావు (జీఎంఆర్) మాట్లాడుతూ 'పూర్వ విద్యార్థులు కనీసం ఒక్క విద్యార్థికైనా మార్గదర్శకం వహించాలి. మన అనుభవంతో అంకురాలకు ప్రోత్సాహం అందించాలి. చిన్నపాటి సాయం పెద్ద ఆవిష్కరణలకు అండగా నిలుస్తుంది' అని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఏయూ వీసీ జీపీ రాజశేఖర్, రిజిస్ట్రార్ రాంబాబు, రెక్టార్ పులిపాటి కింగ్, పూర్వవిద్యార్థుల సంఘ ఛైర్మన్ కేవీవీ రావు, ఉపాధ్యక్షులు కుమార్‌రాజా, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఈసీ సభ్యులు బీవీఎన్‌రావు, డా.ఎస్‌కేఈ అప్పారావు, ఆచార్య బి.మోహనవెంకట్రామ్, వైవీ అనురాధ, మాజీ వీసీలు సత్యనారాయణ, జీఎస్ఎన్‌రాజు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో వృద్ధురాలి సజీవ దహనం

విజయనగరం జిల్లాలో 12 పూరిళ్లు దగ్ధం


పూర్తిగా దగ్ధమై మొండి గోడలతో కనిపిస్తున్న ఇళ్లు

తెర్లాం, న్యూస్‌టుడే: విజయనగరం జిల్లా తెర్లాం మండలంలో అగ్నిప్రమాదంలో 12 పూరిళ్లు దగ్ధమవగా, ఓ వృద్ధురాలు సజీవ దహనమైంది. కె.సీతారాంపురానికి చెందిన వృద్ధురాలు కోష్టి పాపమ్మ(80) కోడలు లక్ష్మితో కలిసి పూరింట్లో ఉంటోంది. చలిగా ఉండడంతో శుక్రవారం రాత్రి మంచం కింద కుంపటి పెట్టుకుని పడుకున్నారు. నిద్రలోకి జారుకున్నాక.. అర్ధరాత్రి సమయంలో ఆమె చీరకు నిప్పురవ్వలు అంటుకుని మంటలు చెలరేగాయి. కేకలు వేసేలోపే ఇల్లు మొత్తం వ్యాపించాయి. పక్కనున్న మరో 11 పూరిళ్లకు మంటలు వ్యాపించి కాలిపోయాయి. అంతా ఒక్కసారిగా బయటకు పరుగులు తీశారు. కోడలు బయటకు తీసుకొచ్చేసరికే తీవ్రగాయాలు కావడంతో వృద్ధురాలు పాపమ్మ చనిపోయింది. ఆర్డీవో రామ్మోహన్‌రావు, తహసీల్దార్, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలాన్ని సందర్శించారు. రూ.6లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేశామని, ప్రభుత్వం నుంచి పరిహారం వచ్చేలా చూస్తామని తెలిపారు.

బాలుడిపై వీధికుక్కల దాడి.. తెగిపడిన చెవి

శ్రీసత్యసాయి జిల్లా కదిరిలో ఘటన


కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన యాసిన్

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణంలోని నిజాంవలి కాలనీలో ఐదేళ్ల బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. అంజాద్‌వలి, షహిస్తా దంపతుల కుమారుడు యాసిన్ శనివారం సాయంత్రం ఇంటి వద్ద ఆడుకుంటున్న సమయంలో కుక్కలు గుంపుగా వెంటపడి కరిచాయి. వాటి దాడిలో బాలుడి చెవి కొంతభాగం తెగి కిందపడిపోయింది. కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. బాలుడిని కదిరిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. కుక్కల దాడి ఘటనలు తరచూ జరుగుతున్నాయని, వాటిని నియంత్రించాలని అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఆప్తులే అసురులై..

- బీమా సొమ్ము కోసం ఘాతుకం
- కుమారుడితో కలిసి మామను హత్యచేసిన అల్లుడు


మృతుడు నారాయణమూర్తి


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రావణి. చిత్రంలో నిందితులు

అనకాపల్లి పట్టణం, కశింకోట, న్యూస్‌టుడే: బీమాసొమ్ము కోసం పిల్లనిచ్చిన మామను అల్లుడే తన కుమారుడితో కలిసి హత్యచేశాడు. అనకాపల్లి జిల్లాలో జరిగిన ఈ దారుణ ఘటన వివరాలను అనకాపల్లి డీఎస్పీ శ్రావణి శనివారం వెల్లడించారు. కశింకోట మండలం కొత్తపల్లికి చెందిన కుర్రు నారాయణమూర్తి (54) సిమెంట్ కర్మాగారంలో పనిచేస్తున్నారు. ఈ నెల 8న ఆయన రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారంటూ మనవడు జ్యోతిప్రసాద్ 108 వాహనంలో ఎన్టీఆర్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. అక్కడినుంచి కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ 9న మృతిచెందారు. తన భర్త రోడ్డుప్రమాదంలో మృతిచెందినట్లు భార్య సూర్యలక్ష్మి కశింకోట పోలీసులకు ఫిర్యాదుచేశారు. అయితే శరీరంపై గాయాలు ఉండటంతో పోలీసులకు అనుమానం వచ్చింది. సీఐ అల్లు స్వామినాయుడు సమగ్ర విచారణ చేపట్టడంతో విస్తుపోయే విషయాలు చూశాయి. నారాయణమూర్తి అల్లుడు సుంకరి అన్నవరం (42) తాపీమేస్త్రీ. అప్పులపాలవ్వడంతో.. మామను చంపి బీమా సొమ్ముతో అప్పులు తీర్చి మిగిలిన డబ్బులు వెనకేసుకోవచ్చని భావించాడు. నారాయణమూర్తి పేరుమీద ఆరు నెలలుగా వివిధ బీమా కంపెనీల్లో పాలసీలు తీసుకున్నాడు. ఈ నెల 8న ఆయన విధులు ముగించుకుని రాత్రి 10 గంటలకు ఇంటికి బయలుదేరారు. అదే సమయంలో తాము వస్తున్నట్లు అన్నవరం, జ్యోతిప్రసాద్ (19) ఫోన్‌చేశారు. వారిద్దరితో కలిసి నారాయణమూర్తి స్వగ్రామానికి బయలుదేరారు. దారిలో వాళ్లతోపాటు అన్నవరం వద్ద పనిచేస్తున్న అగ్రహారపు నానాజీ ఇనుపరాడ్‌తో నారాయణమూర్తిని తీవ్రంగా కొట్టారు. ఇంతలో గ్రామస్థుల అలికిడి రావడంతో మనవడు జ్యోతిప్రసాద్ 108కి ఫోన్ చేసి ఆసుపత్రికి తీసుకెళ్లాడు. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో గాయపడ్డారని చెప్పాడు. పోలీసుల విచారణలో హత్యగా నిర్ధారణ అయ్యింది. నారాయణమూర్తి చనిపోతే బీమా మొత్తం రూ.1.08 కోట్లదాకా వస్తుందని అచ్యుతాపురం మండలానికి చెందిన ఎల్ఐసీ ఏజెంట్ భీముని నానాజీ చెప్పడంతోనే తండ్రీకొడుకులు కలిసి ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. వీరితోపాటు ఈ నేరానికి సహకరించిన అగ్రహారపు నానాజీ, ఎల్ఐసీ ఏజెంట్ నానాజీలను అరెస్ట్ చేశారు.

'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' అంటూ మోసం

- అధిక వడ్డీ ఆశ చూపించి బోర్డు తిప్పేసిన సంస్థ
- రెండు రాష్ట్రాల్లో రూ.30 కోట్ల వరకు వసూలు
- డిపాజిటర్ల ఒత్తిడితో సంస్థ నిర్వాహకుడి ఆత్మహత్య.. అజ్ఞాతంలోకి ఆయన భార్య


నిర్వాహకులు దుర్గాప్రసాద్, శివాని

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - విజయవాడ నేరవార్తలు, విస్సన్నపేట: ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట కేంద్రంగా పెట్టుబడుల పేరుతో భారీగా వసూలు చేసి బోర్డు తిప్పేసింది లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ అనే సంస్థ. దుర్గాప్రసాద్, శివాని దంపతులు ఏపీ, తెలంగాణలోని పలు జిల్లాల్లో రూ.కోట్లలో భార్యభర్తలు వసూలు చేశారు. వాటిని ఇతర మార్గాల్లోకి మళ్లించి, బిచాణా ఎత్తేశారు. డిపాజిటర్ల ఒత్తిళ్లు పెరగడంతో నెలన్నర కిందట దుర్గాప్రసాద్ ఆత్మహత్య చేసుకున్నాడు. తమకు డబ్బులు చెల్లించాలంటూ బాధితులు నిలదీస్తుండటంతో శివాని 20 రోజులుగా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. దుర్గాప్రసాద్ ఎండీగా, అతని భార్య శివాని సీఈవోగా విస్సన్నపేటలో 2023 మార్చిలో 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' పేరుతో సంస్థను ఏర్పాటు చేశారు. ఒకేసారి పెట్టుబడులు పెడితే ప్రతి నెలా కొంత మొత్తం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. రూ.5 వేలు మొదలు రూ.లక్ష వరకు అంటూ 11 రకాల స్కీమ్‌లు ప్రవేశపెట్టారు. పెట్టిన పెట్టుబడిలో 10 శాతం ప్రతి నెలా చెల్లిస్తామని హామీ ఇచ్చారు. దీంతో 2వేల మంది మొత్తంగా రూ.30 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టినట్లు తెలిసింది. ఉమ్మడి కృష్ణా, ఉభయగోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు తెలంగాణలో ఖమ్మం, చుట్టుపక్కల వారు పెట్టుబడులు పెట్టారు. నిర్వాహకులు వసూలు చేసిన డిపాజిట్లతో కొంత చెల్లింపులు చేశారు. మిగిలిన మొత్తంతో పెద్ద ఎత్తున బంగారంతోపాటు బంధువుల పేరిట భూములు, ఆస్తులు కొన్నట్లు సమాచారం. ఆర్థిక వ్యవహారాలను శివానీయే చూసేవారని, డబ్బును పక్కదారి పట్టించడంలో ఈమె కీలకపాత్ర పోషించారని డిపాజిటర్లు ఆరోపిస్తున్నారు. చెల్లించాల్సిన బకాయిలు పెరిగిపోవడంతో డబ్బు రొటేషన్ చేయలేక దుర్గాప్రసాద్ ఒత్తిడికి గురయ్యాడు. సొమ్ము దుర్వినియోగమైనది వాస్తవమేనని, రెండు నెలల్లో సర్దుబాటు చేస్తానని బాధితులకు హామీ ఇచ్చాడు. తాను డబ్బులు సర్దుబాటు చేయలేకపోతున్నానంటూ అక్టోబరు 27న డిపాజిటర్లకు వాట్సప్‌లో సందేశం పెట్టి, పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

ఈనాడు

కళ్లు చెబుతున్నాయి...

'ఆమెను ఎన్నిసార్లు చూసినా, నా చూపు ఆమె అందమైన కళ్లమీదే నిలిచిపోతోంది. ఇంతవరకూ ఆమెను పూర్తిగా చూడనేలేదు' అనేది హాలుడి గాథా సప్తశతిలోని ఓ ముగ్ధ భావన. మధురమైన మందహాసం, సువిశాల నేత్రాలే మోహానికి విశేష ఆకర్షణలు. కళ్లు నిజానికి మనసుకు వాకిళ్లు. ప్రేమ, ఆప్యాయత, దయ... వంటి రసార్ద్ర సాత్త్విక భావాలే కాదు; కోపం, అసూయ, ద్వేషం... వంటి పదునైన రజోగుణ భావాలకు సైతం ఆశ్రయం ఇచ్చే పక్షిగూళ్లు- కళ్లు! అందుకే 'మధుర దరస్మిత నయన చకోరీ' వంటి సొగసైన విశేషణాలను చేర్చి, కవులు చేసిన వర్ణనలు- కోకొల్లలు. మగవారి కళ్లకు సంబంధించి- అరవింద దళాయతాక్షుడు, పద్మనయనుడు వంటివి కూడా లేకపోలేదు గాని, వాస్తవానికి ఆడవారి కళ్లే- అందాలకు లోగిళ్లు. విశాలనేత్రాలకు, తెల్లని కనుపాపలకు తోడుగా- నల్లని కాటుక జోడయిందా- చెప్పేదేముంది! మార్మికమైన, మదన కార్ముకమైన(విల్లు) సోయగాలను వాటికి జతపడిపోతాయి. 'సోగ కనుల రెప్పల్లో తుమ్మెదలు, తూనీగలు' వచ్చి చేరిపోతాయి. ఆ స్థితిలో కళ్లకళ్లు కలిశాయంటే- ఒళ్లు ముళ్లవుతాయి. అంతేకాదు, 'ప్రియునిపై వేలుకం చెందిన కాంతల' కళ్లు ఆ వేడికి చెమరిస్తే పదునైన కొడవళ్లవుతాయి.

నాయుడు బావ కళ్లలో చిలిపిదనాన్ని చూసి సిగ్గుతో రెప్పలు వాల్చింది ఎంకి. ఆమె 'కొత్తైతే సోలు కనకాలి నేలాలు' అనుకున్నాడు నాయుడు. సీతమ్మ నేత్రాలు అతిశీతలమైనవని చెప్పడానికి 'కలికి కన్నులు శ్రుతి పారగముల'... చెప్పుడదాకా విస్తరించాడు సోమశేఖరుడు. 'ఆమెవి కళ్ల కావు- మన్మథుడి ఆయుధాగారాలు' అని హెచ్చరించాడు నాగరఖండ కవి అయ్యంకి. దమయంతి చూపులు రత్నాల మెరుపులన్నాడు శృంగార నైషధంలో శ్రీనాథుడు. ఇంకా లేడి కళ్లతో, చేపలతో, పద్మాలతో పోల్చి మురిసిపోయారు కవులు! సత్యభామ కళ్లలోని ఎర్రని మెరుపు కృష్ణుడికి ఒకలా, నరకుడికి మరొకలా తోచిందని చెప్పిన పోతన చాతుర్యం సరేసరి! మొత్తానికి వయ్యారి కళ్లను- అద్భుత కవితా సంపుటాలుగా తేల్చారు అందరూ కలిసి! అలాగే 'కలవారి కోడలు కలికి కామాక్షి'ని చూడాలని అన్నగారొస్తే- 'కాళ్లకు నీళ్లిచ్చి కన్నీరు నింపిన' వైనాన్ని వర్ణించి- బాధొచ్చినా, ఆనందమొచ్చినా చెమర్చే తత్వాన్ని నేత్రాలకు ఆపాదించారు. కళ్లను మించిన కవితావస్తువు లోకంలో లేదనిపించారు. నయన తేజమే పంచాక్షరిలోని 'నకారం' అన్నంత లోతుగా ఆలోచించారు. కళ్లకు ధన్యత కూర్చారు.

నాలుగు కళ్లు రెండయినంత సహజంగానూ- రెండు నాలుగవడం కాలమహిమ! 'పాపరమూ వికృతి- వార్ధక్య పంజరమున' అనే స్థితి వచ్చినప్పుడు 'దశసరి అద్దాలు తగిలించినను గాని కరుణించనంటుంది కంటిచూపు!' ఆ క్రమాన్ని చెబుతూ 'తొలుదొల్త దూరాన కలదాన్ని ఇదియని' గుర్తించలేకపోవడంతో మొదలవుతుందన్నాడు నయనోల్లాస కావ్యంలో దేవులపల్లి కవి. లేదా 'కంటికి అడ్డుబూరు నిల్పి కయంత్రము' చేతివేళ్ల సంఖ్య తెలియకపోవడం జరుగుతుందట. అలాంటి రకరకాల నేత్రరోగాలకు చికిత్స ఏమిటో శ్రీకాళహస్తి మహాత్మ్యంలో ధూర్జటి చెప్పాడు. 'తెల్లదిన్నైన పువ్వు తెచ్చి త్రిదసమిడి' శివుడి కంటికి తిన్నడు చేసిన సపర్యలను వివరించాడు. కళ్లకు వచ్చే జబ్బుల గురించే కాదు- మనిషి దేహానికి రాబోయే రోగాలను సైతం తెలుసుకోగల విధానాన్ని సింగపూర్ పరిశోధకులు కనిపెట్టారు. 'ఓక్యులోమిక్స్'గా పిలుస్తున్న ఆ ప్రక్రియలో కంటి 'రెటీనా స్కానింగ్' ద్వారా మనిషికి రాబోయే గుండె, కిడ్నీ వ్యాధులు డయాబెటిస్, అల్జీమర్స్ గురించి ఓ అంచనాకు రాగలమంటున్నారు. అంటే మనసు, దేహం... రెండింటి లోగుట్టూ ఇకపై కంటిదీపమే రట్టు చేస్తుందన్నమాట!



మితంగా వాడితే లాభాలు అపరిమితం

పెట్రోల్, డీజిల్, గ్యాస్, విద్యుత్ వంటి ఇంధనాలు లేకపోతే నేడు జనజీవితాలు ఎక్కడికక్కడ స్తంభించిపోతాయి. జనాభాతో పాటే పెరుగుతున్న వాణిజ్య, పారిశ్రామిక కార్యకలాపాల వల్ల ఇంధన వినియోగం అంతకంతకు ఎక్కువవుతోంది. పర్యవసానంగా కాలుష్యం ఆందోళనకర స్థాయికి చేరుతోంది. నేటి జాతీయ ఇంధన పొదుపు దినోత్సవం సందర్భంగానైనా శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించేందుకు ప్రజలు ప్రభుత్వాలు గట్టి పూనిక వహించాలి.

దేశంలో రకరకాల ఇంధనాల వినియోగంతో పాటే కాలుష్యమూ విపరీతమవుతోంది. ఇళ్లతో పాటు వ్యవసాయ, వ్యాపార, పారిశ్రామిక, రవాణా రంగాల్లో వివిధ ఇంధనాల వినియోగం అంతకంతకు పెరుగుతోంది. దేశవ్యాప్తంగా సుమారు రెండున్నర కోట్ల వ్యవసాయ మోటార్లు ఉన్నాయని, మొత్తం విద్యుత్ వినియోగంలో 'సేద్య రంగం వాటా 18శాతమని కేంద్ర విద్యుత్ ప్రాధికార సంస్థ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. సకాలంలో వర్షాలు కురవకపోవడం, ఏడాదిలో రెండు మూడు పంటలు పండించడం, ఉచిత విద్యుత్ వంటి కారణాల వల్ల ఏటా అయిదున్నర లక్షల వ్యవసాయ మోటార్లు కొత్తగా వచ్చి చేరుతున్నాయని అంచనా. రైతులకు అన్నిరకాల ప్రోత్సాహకాలనూ ఇవ్వాల్సిందే. కానీ, వారికి సరైన అవగాహన లేకపోవడంవల్ల తక్కువ ధరకు లభ్యమయ్యే నాసిరకం మోటార్లను వినియోగిస్తున్నారు. దాంతో కరెంటు భారీగా వృథా అవుతోంది. దీన్ని అరికట్టేందుకు కేంద్రం 'అగ్రికల్చర్ డిమాండ్ సైడ్ మేనేజ్‌మెంట్' పథకం తీసుకొచ్చింది. నాసిరకం మోటార్ల స్థానంలో బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ(బీఈఈ) సూచించిన అత్యంత సమర్థంగా పనిచేసే అయిదు నక్షత్రాల మోటార్లతో పాటు రాపిడి లేని ఫుట్‌వాల్, తగిన కెపాసిటర్లను అమర్చుకోవడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. దీనివల్ల 25-37శాతం విద్యుత్ ఆదా అవుతుంది. ఇలా కొత్త మోటార్లను సమకూర్చి, వాటికి సౌర విద్యుత్తును అందించడంలో మహారాష్ట్ర, కేరళ అగ్రస్థానాన్ని ఆక్రమించాయి. కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఒడిశా, అస్సాంలు ఆ దిశగా ముందుకెళ్తున్నట్లు బీఈఈ వెల్లడించింది. బిందు, తుంపర సేద్య విధానాలను అనుసరిస్తే నీటితో పాటు విద్యుత్తూ ఆదా అవుతుంది.



ఇంటి నుంచే మొదలు కావాలి...

దేశంలో మొత్తం ఇంధనంలో 30శాతం నివాసాలు, వ్యాపార సముదాయాల్లోనే వినియోగమవుతోందని అంచనా. కేంద్రం 2017లోనే ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్‌ను తీసుకొచ్చింది. విద్యుత్ ఉపకరణాల సామర్థ్యాన్ని సులభంగా గుర్తించేందుకు బీఈఈ ఒకటి నుంచి అయిదు నక్షత్రాల స్టార్ రేటింగ్ ఇస్తోంది. వంద కిలోవాట్లు దాటి విద్యుత్ వినియోగం ఉండే, రెండు వేల చదరపు అడుగులు, ఆపై విస్తీర్ణంలో నిర్మించే వాణిజ్య భవనాల్లో తప్పనిసరిగా ఇంధన వినియోగ నిబంధనలను పాటించాలని బీఈఈ నిర్దేశిస్తోంది. ఆ ప్రకారం, గాలీ వెలుతురు లోనికి వచ్చేలా భవనాలను నిర్మించాలి. ఇళ్లలో ఎక్కువ నక్షత్రాలు ఉండే ఉపకరణాలను వినియోగించడం, సోలార్ వాటర్ హీటర్లను వాడటం, అవసరం లేనప్పుడు లైట్లు, ఫ్యాన్లు, ఏసీలు, టీవీలను ఆపేయడం వల్ల 35శాతం వరకు విద్యుత్తును ఆదా చేసుకోవచ్చు. ఇళ్ల పైకప్పులపై సౌర విద్యుత్తును ఉత్పత్తి చేసుకుంటే కరెంటు ఖర్చే ఉండదు. ఇక దేశంలో మూడోవంతు వాయు కాలుష్యానికి రవాణా రంగమే కారణమవుతోంది. వాహన కాలుష్యాన్ని కట్టడి చేసేందుకు కేంద్రం కొత్తగా తయారయ్యే వాహనాలన్నీ తప్పనిసరిగా 'బీఎస్-6' ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని ఆదేశించింది. మరోవైపు ఇథనాల్, బయోడీజిల్, సీఎన్‌జీ వాడకాన్నీ ప్రోత్సహిస్తోంది. విద్యుత్ వాహనాల విక్రయాలను పెంచేందుకూ చర్యలు తీసుకుంటున్నా- వీటి ధరలను ఇంకా తగ్గించడం, రహదారుల వెంబడి ఛార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం వంటి చర్యలు చాలా అవసరం. పరిశ్రమల్లో పాత యంత్రాలను తొలగించి- వాటి స్థానంలో అత్యాధునిక సాంకేతికతలను, తక్కువ ఇంధనంతో మెరుగ్గా పనిచేసే బీఈఈ స్టార్ రేటింగ్ కలిగిన మెషినరీని అమర్చుకోవాలి. తద్వారా 10-25శాతం ఇంధనం ఆదా అవుతుంది.

పొదుపు మంత్రం పాటిస్తే...

సిమెంటు, ఎరువులు, రసాయనాలు, అల్యూమినియం, పేపర్, దుస్తుల తయారీ పరిశ్రమలు, రైల్వేలు వంటివి పెద్దయెత్తున ఇంధనాలను వినియోగిస్తాయి. కేంద్రం 2001లో ఇంధన పొదుపు చట్టం తీసుకురావడం ద్వారా ఆయా సంస్థలకు వినియోగ పరిమితులను నిర్దేశించింది. విద్యుత్ పంపిణీ సంస్థలు హైవోల్టేజ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్, ట్రాన్స్‌ఫార్మర్ రేటింగ్, స్మార్ట్ మీటర్ల వంటి వాటి వినియోగం ద్వారా విద్యుత్ సరఫరా, పంపిణీ నష్టాలను తగ్గించుకోవాలని సూచించింది. వినియోగం దగ్గరే సౌర విద్యుత్తును ఉత్పత్తి చేస్తే, సరఫరా నష్టాలు గణనీయంగా తగ్గుతాయి. ఆ ఉద్దేశంతోనే కేంద్రం పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన, ప్రధానమంత్రి కుసుమ్ పథకాలను తీసుకొచ్చింది. బీఈఈ సర్వే ప్రకారం- గరిష్ఠంగా ఇంధన పొదుపును సాధించిన మొదటి మూడు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉండటం హర్షణీయం. దేశమంతటా స్వచ్ఛ ఇంధనాలైన సౌర, పవన, జలవిద్యుత్ వినియోగాన్ని పెంచుతూ శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించడం, అన్నిరకాల ఇంధనాలనూ పొదుపుగా వినియోగించడం అవశ్యం. వీటికి తోడు నూతన సాంకేతికతలను అందిపుచ్చుకుని, అత్యంత నాణ్యమైన విద్యుత్ ఉపకరణాల వినియోగాన్ని పెంచాలి. నాసిరకం విద్యుత్ ఉపకరణాలను తయారీ దగ్గరే అడ్డుకోవాలి. ఇంధన పొదుపు ప్రాధాన్యం, పొదుపును ఒక పౌరహక్కుగా రూపొందించి విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి. ప్రజలు, వ్యాపారాలు, వాణిజ్యవేత్తలు, పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వాలు కలిసికట్టుగా కృషి చేయాలి. అన్నిరకాల ఇంధనాల వినియోగాన్ని 25శాతం మేర తగ్గించుకోగలిగితే అదే జరిగితే, లక్షల కోట్ల రూపాయలు ఆదా అవుతాయి. హానికరమైన కర్బన ఉద్గారాలూ గణనీయంగా తగ్గుతాయి. ప్రజారోగ్యాన్ని మెరుగుపరిచే ఈ బాధ్యత మనందరిదీ!



ఐనుగుర్తి శ్రీనివాసాచారి
విద్యుత్, ఇంధన రంగ నిపుణులు

ఇవాళ్టిని... ఆనాడే ఊహించారు!


'ఇరవయ్యొకటో శతాబ్దంలో నిరక్షరాస్యులంటే చదవడం రాయడం రానివారు కాదు, నేర్చుకున్నది వదిలేసి కొత్తగా ఎప్పటికప్పుడు మళ్లీ నేర్చుకోవడం తెలియనివారు'

'నీకంటూ ఒక వ్యూహం లేకపోతే మరొకరి వ్యూహంలో నువ్వు భాగమైపోతావు'

'జీవితానికి మార్పు అవసరం కాదు, జీవితమంటేనే మార్పు'

'భవిష్యత్తు ఎప్పుడూ శరవేగంగా వచ్చేస్తుంది, కానీ సరైన పద్ధతిలో రాదు'

నినాదాల్లా ఫేమస్ అయిపోయిన ఈ వాక్యాలన్నీ ఎప్పుడో యాభై ఏళ్ల క్రితం వచ్చిన ఒక పుస్తకంలోనివి. అల్విన్ టాఫ్లర్, భార్య హీదీ టాఫ్లర్‌తో కలిసి రాసిన 'ఫ్యూచర్ షాక్' ఇప్పటి మన సమాజానికి సరిగ్గా సరిపోతుంది. ఊపిరి పీల్చుకునే అవకాశం ఇవ్వకుండా కొద్ది సమయంలోనే జీవితంలో పెద్ద పెద్ద మార్పులు చోటుచేసుకున్నప్పుడు తట్టుకోలేక మనుషులు నిశ్చేష్టులవుతారు. దాన్నే టాఫ్లర్ 'ఫ్యూచర్ షాక్'గా అభివర్ణించారు. ఒకప్పటిలా మనిషి జీవితంలో కొత్తదనాన్ని ఆస్వాదించడం లేదు. అందుకు కారణం మార్పు గురించి ఆలోచించడం, దాన్ని అనుభూతి చెందడం, దానికనుగుణంగా తనను తాను మలచుకోవడం... వీటన్నిటికీ ఇప్పుడు సమయం లేదు. కన్ను మూసి తెరిచేలోగా కొత్త సమాచారం, సాంకేతికత, ఉత్పత్తులు... మనల్ని ముంచెత్తున్నాయి. ఆ వేగానికి తట్టుకోలేని మనుషులు దేనిమీదా దృష్టి పెట్టలేక బేజారవుతున్నారు; ఒత్తిడి, ఆందోళనలకు లోనవుతున్నారు. నిజానికి టాఫ్లర్ ఈ పుస్తకం రాసేటప్పటికి ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాలు, ఈ-కామర్స్... ఇవేవీ లేవు. అయినా ఈ రచయితల జంట ఇరవయ్యొకటో శతాబ్దాన్ని ఊహించి అక్షరాల్లో కళ్లకు కట్టింది. వారి అంచనాలన్నీ నిజమై కాలానికన్నా ఎంతో ముందున్న ఆలోచనాపరులుగా వాళ్లకి పేరు తెచ్చాయి.




సాంకేతికత వల్ల లాభాలున్నాయన్నది నిజమే, ఎంతో అభివృద్ధి చెందవచ్చు, సౌకర్యాలు పొందవచ్చు కాకపోతే ఆ వేగాన్ని మనిషి మెదడు అందుకోలేకపోతుంది. అకస్మాత్తుగా ఉద్యోగం పోతే, జీవిత భాగస్వామి దూరమైతే... మనసెంత ఇబ్బంది పడుతుందో ఈ సాంకేతిక మార్పుల వల్ల కూడా అంతలా బాధ పడుతుందంటారు టాఫ్లర్. క్లుప్తంగా చెప్పాలంటే ఈ పుస్తకం సాంకేతికతనూ, మార్పునూ స్వాగతిస్తుంది. మార్పు లేకపోతే జీవితం విసుగ్గా ఉంటుంది. అయితే విపరీతమైన మార్పు భయపెడుతుంది. దాని ప్రభావం అనుబంధాలు, విలువలమీద పడి అన్నీ అశాశ్వతమన్న భావం కలుగుతుంది. చాలా సామాజిక సమస్యలకు ఫ్యూచర్ షాక్ తాలూకు లక్షణాలే కారణమనే ఈ పుస్తకం వాటిని తట్టుకుని నిలబడటమెలాగో కూడా చెబుతుంది.

ఇండస్ట్రియల్ సొసైటీ నుంచి సూపర్ ఇండస్ట్రియల్ సొసైటీగా సమాజం మారిపోతోందంటారు టాఫ్లర్. ఈ పుస్తకానికి సీక్వెల్‌గా రాసిన 'ద థర్డ్ వేవ్, పవర్‌షిఫ్ట్'లలో దాన్ని ఇన్ఫర్మేషన్ ఓవర్‌లోడ్‌గా పేర్కొన్నారాయన. ఈ మూడు పుస్తకాలూ 'టాఫ్లర్ ట్రైలజీ'గా పేరొందాయి. వాడిపారేసే వస్తువులు వెల్లువెత్తడం, అతి తక్కువ సమయంలో ప్రతిదీ అవుట్‌డేటెడ్ అయిపోవడం, దేన్నయినా సొంతం చేసుకోవడం కన్నా అద్దెకు తీసుకుని పని కానిచ్చేయడం, మరింత మెరుగైన జీవితాన్ని ఆశిస్తూ వలస పోవడం, తరచూ ఉద్యోగాలు మారడం, కొత్త కొత్త వృత్తులు పుట్టుకురావడం, మనిషికి ఒకప్పుడు స్థిరత్వాన్ని ఇచ్చిన కుటుంబం, వృత్తి, జాతీయత లాంటివి బలహీనమవడం... ఇప్పుడు మనం చూస్తున్నవన్నీ టాఫ్లర్ అప్పుడే ఊహించారు. అందుకే పబ్లిష్ అయిన కొద్దివారాల్లోనే బెస్ట్ సెల్లర్ అయ్యి పలు భాషల్లోకి అనువాదమైంది ఫ్యూచర్ షాక్.

– మిహిర

యోగా కూడా సంగీతం లాంటిదే. శరీర లయ, మనసులోని మాధుర్యం, ఆత్మ సమన్వయం... అన్నీ కలిసి జీవితంలో సింఫనీ సృష్టిస్తాయి. యోగా మనం చూసే దృష్టికోణాన్ని మాత్రమే మార్చదు, మనిషిని మొత్తంగా మారుస్తుంది.

– బి.కె.ఎస్.అయ్యంగార్



సత్యమేవ జయతే

కొందరికి అపారమైన ఆకర్షణ శక్తి ఉంటుంది. జనాన్ని ఉర్రూతలూగించే వాక్పటిమ ఉంటుంది. వివిధ అంశాల మీద లోతైన అవగాహన కూడా ఉంటుంది. ఎన్ని మంచి లక్షణాలున్నా కించిత్ అసురగుణం తోడైతే పాలగిన్నెలో విషపు చుక్క విదిలించినట్టే! అలాంటి వ్యక్తి వ్యవస్థను మింగేస్తాడు. రావణుడు ఆ కోవకు చెందినవాడే! వాల్మీకి మహర్షి దశకంఠుడి రూపవర్ణన చేస్తూ 'అతడు మృత్యువులా ఉంటాడు, అతని సమక్షంలో వీచేందుకు వాయువు కూడా భయపడుతుంది, అతన్ని చూడగానే సముద్రం సైతం నిశ్చలమవుతుంది' అంటాడు. అదీ అసుర బలం!

అలాంటివారు ఎంత వెలుగు వెలిగినా స్వయంకృతాల కారణంగానే పతనమవుతారు. సీతాపహరణం అటువంటి ఘట్టమే! రావణుడు బ్రహ్మవంశంలో పుట్టినా, బ్రహ్మాండాన్ని జయించినా చివరికి మానవమాత్రుడైన రాముడి చేతిలో మరణించాడు. రాముడిపై విజయం సాధించేందుకు రావణుడు పలురకాల మాయలు చేశాడు, ఎన్నో కుట్రలు పన్నాడు. ఓటమిని తప్పించుకోవడానికి విశ్వప్రయత్నం చేశాడు. అయినా మట్టికరవక తప్పలేదు.



అంతర్యామి

రాముడెప్పుడూ తాను పరమాత్మనని ప్రకటించుకోలేదు, పదహారణాల మనిషిననే చెప్పుకొన్నాడు. నిజానికి నిలువెత్తు ధర్మం రామచంద్రుడు. విలువల బాటసారి. ఎన్ని కష్టాలెదురైనా నమ్మిన సిద్ధాంతాన్ని వదిలిపెట్టలేదు. దశకంఠుడి ప్రతి కుతంత్రాన్నీ సమర్థంగా తిప్పికొట్టాడు. అంతిమంగా రామతత్వమే నిలబడింది.

నేటి సామాజిక ప్రభావశీలురు వివిధ రంగాలలో తమ ప్రతిభను ప్రదర్శిస్తూ, ప్రచార మాధ్యమాలలో తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంటున్నారు. వీరిలో కొందరు నవీకరణ, అందం, ఆహారం, సాంకేతికత వంటి రంగాలలో నోటికొచ్చింది చెబుతూ జనాన్ని ఆకట్టుకుంటున్నారు. వాళ్ల వీడియోలను చూసేవారు ఒకటి గుర్తుపెట్టుకోవాలి... కనిపించేదీ, వినిపించేదీ ఏదీ నిజం కాదు. మనం తొందరపడి స్వల్పకాలిక ప్రయోజనాలను ఆశించకూడదు, తాత్కాలిక ఆనందాలను కోరుకోకూడదు. ఏ విషయమైనా ముందుచూపుతో వ్యవహరిస్తూ జాగరూకత పాటించాలి.

అనైతిక ప్రచారాలు, అబద్ధపు రూపాలు రామాయణ కాలంలోనూ ఉన్నాయి. మారీచుడు కామరూప విద్యతో బంగారు జింకలా మారతాడు. నేలకూలుతూ 'హే సీతా, తమ్ముడూ లక్ష్మణా' అంటూ రాముడి గొంతును అనుకరిస్తాడు. రావణుడు సీతమ్మ ముందు రాముడి కృత్రిమ శిరస్సును పెట్టి బెదరగొట్టడానికి ప్రయత్నిస్తాడు. ఇంద్రజిత్తు నేటి సైబర్ మాయలను తలపించే అదృశ్యదాడులలో సిద్ధహస్తుడు. అయినా చివరికి అబద్ధం బద్దలైంది, అసత్యం అంతమైంది. ఏ యుగంలో అయినా సత్యానిదే అంతిమ విజయం. అవినీతి, అధికార దుర్వినియోగం, ప్రకృతి వనరుల దోపిడీ లాంటివన్నీ రావణాంశ సంభూతుల లక్షణాలు. వాటిని ఎదిరించడానికి మనం రాముడి అడుగుజాడలలో నడవాలి. ఉత్తమ పౌరులు ఎప్పుడూ ప్రశ్నించాల్సిన సమయంలో ప్రశ్నించాలి. అప్పుడు రాముడే మన చేయి పట్టుకుని గెలిపిస్తాడు!


రామాయణానికి ఒక గొప్ప ప్రత్యేకత కూడా ఉంది. ఈ మహాకావ్యం ఎలా గెలవాలో చెబుతుంది, ఎలా గెలవకూడదో కూడా హెచ్చరిస్తుంది. అది యుద్ధంలో కావచ్చు, జీవితంలో కావచ్చు!

– కె.వి.సుమలత

ప్రజాభద్రతను మింగేస్తున్న అవినీతి అనకొండ!

తలచుకుంటేనే కంపరమెత్తిపోయే పనులు చేసినవారిని మీకు మానం అభిమానం మంచీ మర్యాదా కాస్తయినా లేవా అని కడిగిపారేస్తుంటాం. నిజానికి, తప్పుచేసి దొరికిపోయిన వారిని కొద్దిగా అయినా అపరాధభావం కమ్మేస్తుంది. పదిమందిలో పరువు పోగొట్టుకున్నాక మరోసారి అలాంటి తప్పుడు పని చేయడానికి మనసు జంకుతుంది. కానీ, నిద్ర లేచింది మొదలు డబ్బే సర్వస్వంగా బతుకుతూ అడ్డగోలుగా లంచాల గడ్డికరిచే కొందరు అధికారులకు అలాంటి మొహమాటాలు ఏమీ ఉండవు. ఏపీ గిరిజన శాఖ మాజీ ఇంజినీర్ ఇన్ చీఫ్ సబ్బవరపు శ్రీనివాస్ దీనికి మేలిమి ఉదాహరణ. అవినీతి అనకొండకు మారురూపమైన జగన్ జమానాలో అర్హత లేకపోయినా అడ్డదారిలో యమ దర్జాగా ఉన్నత స్థానాన్ని అలంకరించిన ఆయన అక్రమ సంపాదనలో చెలరేగిపోయారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టి గతంలో ఒకసారి ఏసీబీ సోదాల్లో దొరికిపోయారు. బిల్లుల మంజూరుకు డబ్బు డిమాండ్ చేస్తూ ఆ తరవాత మరో రెండుసార్లు ఆ శాఖ వలకు చిక్కారు. తాజాగా మరోసారి ఏసీబీ తనిఖీల్లో ఆయన అక్రమాస్తుల బాగోతం బయటపడింది. మొదటిసారి తన లంచాల మేతల లోగుట్టు రట్టు అయినప్పుడే మనసు మార్చుకోవడానికి ఆయనేమైనా మామూలు మనిషా! నిర్లజ్జగా చెయ్యి చాచడం... ఇళ్లూ స్థలాలూ డబ్బూ నగలూ పోగేసుకుని మురిసిపోవడం తమ జన్మహక్కుగా భావించే అధికారగణంలో ఆయనొకరు. అందుకే 'పని కావాలంటే పైకం చేతిలో పడాల్సిందే' అని పదే పదే జంకు గొంకు లేకుండా డిమాండ్ చేశారు. ఇలాంటి వారు ఎక్కడికక్కడ పోగుపడబట్టే నిజమైన దేశాభివృద్ధి నేతిబీర చందమవుతోంది!

ఇండియాలో మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది ఏదైనా ఉందీ అంటే అది అవినీతేనని అందరూ మొత్తుకుంటున్నారు. జాతి మూలుగను పీలుస్తున్న ఆ రాకాసి అంతం చూస్తామని ప్రభుత్వాలూ అప్పుడప్పుడూ పళ్లు నూరుతుంటాయి. కానీ, ఒరుగుతున్నదేంటి? అక్రమార్జన అన్నది దేశంలో నిత్యసత్యంగా మారిపోయింది. చిన్నప్పటి నుంచి నేర్చుకున్న సుభాషితాలు, నీతి వచనాలు అధికారుల డబ్బు ఆరాటం కింద పడి నిస్సహాయంగా నలిగిపోతున్నాయి. తెలంగాణకు జీవనాడి లాంటి కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని పాడియావుగా మార్చుకుని కోట్ల రూపాయలు వెనకేసుకున్న ముగ్గురు ఇంజినీర్ల ఆస్తులను ఇటీవల విజిలెన్స్ కమిషన్ ఎటాచ్ చేసింది. బహిరంగ మార్కెట్లో వారి ఆస్తుల విలువ దాదాపు మూడు వందల కోట్ల రూపాయల వరకు ఉంటుందంటేనే ఆ మహానుభావులు ఎంతలా అక్రమ వసూళ్లకు తెగబడ్డారో అర్థమవుతుంది. ఒక్కపూట సరైన పోషకాహారం తినే దిక్కులేక దేశంలో ఎంతోమంది అభాగ్యులు అల్లాడిపోతున్నారు. అలాంటిది విల్లాలు, వాణిజ్య స్థలాలు, వ్యవసాయ భూములు, ఫాంహౌస్‌లతో రాజవైభోగం వెలగబెడుతున్న అవినీతి బకాసురులు మన ప్రజాస్వామ్యాన్నే అపహాస్యం పాల్జేస్తున్నారు. ఉన్నతోద్యోగం, మంచి జీతం, సమాజంలో పేరు ప్రతిష్ఠలున్నా.. డబ్బే లోకమన్నట్లు పైస్థాయి అధికారగణంలో కొందరు అక్రమాలకు ఎగబడటం వల్లే నాసిరకం



ప్రాజెక్టులు, రోడ్లు, బ్రిడ్జిలు పుట్టుకొచ్చి ప్రజా భద్రతతో చెలగాటం ఆడుతున్నాయి. బిహార్, గుజరాత్‌లలో వంతెనలు వరసగా కూలిపోవడానికి నాయకులు, అధికారులు కలిసి సాగించిన అవినీతి యజ్ఞమే కారణమన్న కథనాలు వెలువడ్డాయి. అసలు, అన్ని రకాల భ్రష్టాచారాలకు తల్లివేరుగా రాజకీయ అవినీతి వర్ధిల్లుతుండటం వల్లే విలువైన జాతి వనరులు కొందరి భోషాణాల్లోకి చేరిపోతున్నాయి. దాంతో పేదరికం, అసమానతల విషపు కోరలు పదునెక్కిపోతున్నాయి.

వందల కోట్ల లంచాలు మేసిన కేసులో మాజీ మంత్రి టాంగ్ రెన్ జియాన్‌కు చైనా ఇటీవల మరణశిక్ష విధించింది. ఆయన ఆర్జించిన అక్రమ సొత్తును స్వాధీనం చేసుకుని దేశ ఖజానాకు అప్పగించాలని ఆజ్ఞాపించింది. తీవ్ర అవినీతి ఆరోపణల్లో చిక్కుకున్నందుకు సైన్యంలో రెండో అత్యున్నత స్థాయి జనరల్ సహా మరో ఎనిమిది మందిని కొద్ది రోజుల కిందట నిర్దాక్షిణ్యంగా విధుల నుంచి చైనా తొలగించింది.

అలా తప్పుదారి పట్టిన అధికారులు, నాయకులపై బీజింగ్ ఉక్కుపాదం మోపుతోంది. మరి ఇండియాలోనో! లంచావతారులను పేరుకు పట్టుకుంటున్నారుగానీ, అంతిమంగా వారిమీద ఈగ కాదు కదా.. దాని నీడ కూడా వాలడం లేదు! ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ పరిశీలన ప్రకారం గడిచిన అయిదున్నరేళ్లలో తెలంగాణలో 621 ఏసీబీ కేసులు నమోదయ్యాయి. వాటిలో 519 విచారణకు నోచుకోకుండా పడిఉన్నాయి. ఏపీలోనూ దాదాపుగా ఇదే దుస్థితి నెలకొంది. రాజస్థాన్‌లో 403 అక్రమార్జన కేసులు విచారణకు సంబంధించి ప్రభుత్వ అనుమతి కోసం 2022 నుంచి ఎదురు చూస్తున్నాయి. మహారాష్ట్రలోనూ అదే కారణంతో ఇరవై శాతం కేసులు ఏడేళ్లుగా దుమ్ముపట్టుకుపోయాయి. అవినీతిపరులపై ప్రభుత్వాలు ఇంతటి అవ్యాజ ప్రేమ చూపిస్తున్నాయంటేనే అర్థం కావట్లేదా... నేతలూ, అధికారుల అనైతిక బంధం ఎంతగా పెనవేసుకుపోయిందో! ఇక నిరుడు సెప్టెంబర్ నాటికి సీబీఐ దర్యాప్తు చేసిన దాదాపు ఏడు వేల అవినీతి కేసులు కోర్టుల్లో పెండింగ్‌లో పడిఉన్నాయి. వాటిలో 361 కేసులైతే 20 ఏళ్ల నుంచి దేకుతూనే ఉన్నాయి. ఇలా ఏపీ ఒక పట్టాన తేలకపోబట్టే 'ఏడాపెడా ఏం చేసినా అడిగేదెవడ్రా మాయిష్టం' అన్నట్లుగా శ్రీనివాస్‌లాంటి అధికారులు చెలరేగిపోతున్నారు. లంచాల సొమ్మును గూగుల్‌పే, ఫోన్‌పే చేయించుకునేంతగా రాటుదేలిపోయారు. ఇంతలా అవినీతి సంతతికి కొమ్ములు మొలుచుకొస్తుంటే దేశం ఇక బాగుపడేదెన్నడు?

అవినీతి రక్కసుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలంటే ప్రజల్లో ప్రశ్నించే తత్వం పెరగాలి. అందుకోసం రోడ్లు, వంతెనలు, భవనాలు, డ్యాములతో సహా ప్రజాధనంతో చేపట్టే ప్రతి అభివృద్ధి పని వివరాలను బహిరంగపరచాలి. ఆయా పనులు చేసిన గుత్తేదారు ఎవరు? పర్యవేక్షించి, నాణ్యతను పరిశీలించి ఆమోదముద్ర వేసిన అధికారి పేరు తదితర వివరాలను బోర్డులపై రాసి ఆ రోడ్లూ వంతెనలూ ప్రాజెక్టుల దగ్గర ప్రదర్శించాలి. ప్రాజెక్టు అంచనా వ్యయం, చివరికి ఖర్చుచేసిన సొమ్ము వంటివాటినీ అందులో పేర్కొనాలి. పనులు నాసిరకంగా జరిగితే ఆ బోర్డుల్లో సమాచారం ఆధారంగా ప్రజలు తమను నిలదీస్తారన్న భయం కనీసం అయిదు శాతం అధికారుల్లో కలిగినా సమాజంలో ఎంతో మార్పొస్తుంది. దున్నపోతు మీద వాన కురిసినట్లు అలాంటి బోర్డులు ఎన్ని పెట్టినా ఎలాంటి చలనం లేనివారి నుంచి ఈ దేశాన్ని ఎవరు కాపాడతారన్నది ఏలినవారే చెప్పాలి!

– వేణుబాబు మన్నం

కొబ్బరికాయలో నీరెక్కడిది?

కొబ్బరికాయలు కొబ్బరి చెట్టు నుంచి వస్తాయన్న సంగతి అందరికీ తెలిసిందే కద నేస్తాలూ! మరి, కొబ్బరికాయలోకి నీరెక్కడి నుంచి వస్తుంది? మీరెప్పుడైనా బోండాం తాగితే స్ట్రా వేసుకొంటారు కదా! కొబ్బరి చెట్టుకు కూడా స్ట్రాలు ఉంటాయి. కింద భాగంలో వేర్ల రూపంలో ఉంటాయవి. ఆ వేర్లే చెట్టుకు స్ట్రాల్లా పనిచేస్తాయి. అవి నేలలో నుంచి నీటిని, మినరల్స్‌ను పీలుస్తాయి. ఆ నీరు చెట్టు పైభాగందాకా సన్నని ట్యూబుల వంటి వాటి గుండా ప్రయాణిస్తుంది. మన శరీరంలో రక్తనాళాల ద్వారా రక్తప్రసరణ జరిగినట్లుగానే అనుకోండి. ఆ నీరు చెట్టుకు ప్రత్యేక డ్రింక్‌లా, ఆహారంలా పనిచేస్తూ కాయలు పెద్దగా, బలంగా ఎదగడానికి సాయం చేస్తుంది. ఈ ప్రక్రియ చెట్టు తన బుజ్జి పండుకు జ్యూస్ తాగించినట్లుగా జరుగుతుంది. ఆకుపచ్చగా, మృదువుగా ఉండే కొబ్బరికాయలోకి నీరు ప్రవేశిస్తుంది. ఎండోస్పెర్మ్‌గా పిలిచే ఈ ద్రవపదార్థమే కొబ్బరి కాయకు ఆహారం అన్నమాట. కాయ ఎదిగినకొద్దీ నీటిలోని కొంతభాగం తెల్లని కండరం ముక్కలా తయారవుతుంది. మిగతాదంతా ద్రవపదార్థంగానే ఉండిపోతుంది. దాన్నే మనం కొబ్బరి నీళ్లుగా పిలుస్తాం.



కాయ చుట్టూ పీచు ఉండటంతో అంతెత్తు నుంచి పడినా లోపలి భాగానికి దెబ్బతగలదు. మీరెప్పుడైనా కొబ్బరిపై బాగా గమనిస్తే మూడు కళ్లుంటాయి. అవి పూర్తిగా ఎదగని బడ్స్. కాయని నేలలో పీచుతో సహా పాతితే, కొత్త మొక్క ఆ మూడింటిలో ఒక కంటి నుంచే మొలకెత్తుతుంది. కొబ్బరి చెట్టు 30 మీటర్ల ఎత్తుదాకా పెరుగుతుంది. ఈకల్లా ఉండే ఆకులు 6 మీటర్ల దాకా పొడవుంటాయి. పూర్తిగా ఎదిగిన చెట్టుకు ఎప్పుడూ కొన్ని కాయలైనా కాస్తూనే ఉంటాయి. సముద్ర తీర ప్రాంతాల్లోనే కొబ్బరి చెట్లు ఎక్కువగా పెరగడానికి కారణం ఏమిటంటే, వాటి వేర్లకు అక్కడ తేమ బాగా దొరుకుతుంది. కొబ్బరి పీచును ఉప్పు నీరు దెబ్బతీయలేదు. అందుకనే, కాయ సముద్రంలో పడినా, సుదూర తీరం దిశగా ప్రయాణిస్తుంది.

– శ్రీజన్

హాయ్! బుజ్జీ!!


పదాలేవి?

ఇక్కడ కొన్ని పదాలు అసంపూర్తిగా ఉన్నాయి. మొదటి పదం చివరి అక్షరాలతోనే రెండోది ప్రారంభమవుతోంది. ఓసారి ప్రయత్నించండి.

1. GO☐☐TEND
2. PA☐☐☐ER
3. BRU☐☐OP
4. KNI☐☐NCE
5. PHO☐☐PAL

జవాబు: 1.GOAT, ATTEND 2.PAINT, INTER 3.BRUSH, SHOP 4.KNIFE, FENCE 5.PHONE, NEPAL

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
ఆదివారం డిసెంబరు 14, 2025



నదీహారతి.. చూసే భాగ్యమేది!

దుర్గాఘాట్‌లో రోజూ సాయంత్రం 6గంటలకు ఇచ్చే కృష్ణవేణి నదీ హారతులు చూసే భాగ్యం భక్తులకు లేకుండా పోయింది. దీక్షల విరమణ సందర్భంగా వేలాదిగా తరలివస్తున్న భవానీలకు నదీ హారతులు చూసేందుకు లేకుండా దుర్గాఘాట్‌లో బారికేడ్లు ఏర్పాటు చేయడంతో వారికి నిరాశే మిగిలింది.
–ఈనాడు, అమరావతి





దుర్గమ్మే రక్ష

విజయవాడ ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణ కొనసాగుతోంది. శనివారం దీక్షాధారులు హోమగుండంలో పూజాద్రవ్యాలు వేసి మొక్కు చెల్లించుకున్నారు. దీంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. - ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే



చీరకట్టు.. అదిరేట్టు..

సిద్ధార్థ మహిళా కళాశాలలో 'పెట్2కే25' కార్యక్రమం శనివారం ఉత్సాహంగా సాగింది. విద్యార్థినులు నిర్వహించిన పలు పోటీల్లో సంప్రదాయ వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. తోటి విద్యార్థినులు కేరింతలు కొట్టారు.
- విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

బందరు నగ.. ధగధగ

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

బంగారం ధరలు భగభగమంటున్న తరుణంలో సామాన్య, మధ్య తరగతి ప్రజలు పసిడికి ప్రత్యామ్నాయంగా పేరుపొందిన బందరు నగలవైపు ఆసక్తి చూపుతున్నారు. ఇక్కడ నుంచి కోల్‌కతా, రాజ్‌కోట్, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, ముంబయి తదితర ప్రాంతాలకు పెద్దఎత్తున కొరియర్లు వెళ్తున్నాయి. వన్ గ్రామ్ గోల్డ్, ఇమిటేషన్ జ్యువెలరీకి బందరు పెట్టింది పేరు. డిమాండ్ పెరగడంతో వందల సంఖ్యలో పరిశ్రమలు వెలిశాయి. మరింత అభివృద్ధి చేసేందుకు 2014 నుంచి పోతేపల్లి జ్యువెలరీ పార్కులో తయారీ ప్రారంభించారు. రూ.20 ముక్కుపుడక నుంచి రూ.2వేల నెక్లెస్ వరకు ఇక్కడ లభిస్తాయి.



జ్యువెలరీకి రాళ్లు అద్దుతున్న మహిళలు

50వేల మందికి ఉపాధి

దేశ వ్యాప్తంగా గిల్టు నగలు పరిచయం చేసింది మచిలీపట్నం వ్యాపారులే. మహిళలు ధరించే ముక్కుపుడక నుంచి వడ్డాణం, కాలి పట్టీల వరకూ అన్నిరకాల ఇమిటేషన్ జ్యువెలరీని తయారు చేస్తారు. గతంలో ఇత్తడి, రాగి, ఇతర లోహాలతో నగలు తయారు చేసేవారు. ప్రస్తుతం కెమికల్ ప్లేటింగ్‌తో చేస్తున్నారు. జ్యువెలరీ పార్కు, చిలకలపూడి, చుట్టుపక్కల గ్రామాల్లో సుమారు 400 పరిశ్రమలు ఉన్నాయి. ప్రత్యక్షంగా పరోక్షంగా 50వేల మంది ఉపాధి పొందుతున్నారు. ఏడాదికి రూ.120-150కోట్ల టర్నోవర్ సాధిస్తున్నారు.

దేవుడి నగలకు ప్రత్యేకం

దేవుడి ఆభరణాలకూ ప్రత్యేకంగా 20 పరిశ్రమలు ఉన్నాయి. మలేసియా, సింగపూర్, శ్రీలంక, అమెరికా తదితర దేశాల్లో వీటికి ప్రత్యేక డిమాండ్ ఉంది. ✪ పెళ్లి కూతురు కిట్‌లో పట్టీలు, వడ్డాణం, నెక్లెస్, తాళిబొట్టు, కమ్మలు, జుంకీలు, పాపిడిబిళ్ల ఇలా 15 రకాలు.. రూ.6వేల-22వేల ధరలో లభిస్తాయి. ✪ ఫొటో షూట్‌లకు ఈ మెరుపు కనువిందు కావడంతో సినిమాలు, నాటకాలు ఇతర ప్రదర్శనలకు ప్రత్యేకంగా చేయించుకుంటారు.



పెళ్లికుమార్తె నగల సెట్టు

120 ఏళ్ల చరిత్ర...

-జితేంద్ర, ఇమిటేషన్ జ్యువెలరీ అసోసియేషన్ కార్యదర్శి

ఈ నగలకు 120ఏళ్ల చరిత్ర ఉంది. సారిపల్లి సాంబయ్య చిలకలపూడిలో ఇద్దరితో కట్టు నగల పరిశ్రమ స్థాపించారు. ఈ ఏడాది స్కిల్ హబ్ ద్వారా 600 మందికి శిక్షణ ఇచ్చి 350 మందికి ఉపాధి కల్పించాం. రూ.8వేల నుంచి 30వేల వరకు వేతనాలు ఉన్నాయి.

వద్దన్నా వదలరు.. కట్టించినా కదలరు!

కేదారేశ్వరపేటలోనే బడా వ్యాపారుల తిష్ఠ ★ నిరుపయోగంగా నున్న పండ్ల మార్కెట్

ఈనాడు, అమరావతి

విజయవాడలోనే అత్యంత రద్దీగా ఉండే కేదారేశ్వరపేట పండ్ల మార్కెట్ ఇది. ఐదెకరాల్లోని ఈ మార్కెట్ ఓ పది మంది బడా వ్యాపారుల చేతుల్లో ఉంది. దీనిని ఇక్కడి నుంచి తరలించకపోతే నగరంపై తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ పెరుగుతుందని 1998లోనే గుర్తించారు. అప్పట్లోనే నగర శివారులోని నున్నలో 23 ఎకరాల్లో విశాలమైన పండ్ల మార్కెట్ సిద్ధం చేశారు. కేదారేశ్వరపేట మార్కెట్‌లోని వ్యాపారులందరికీ అక్కడ దుకాణాలు కేటాయించారు. అప్పటికి రెండున్నర దశాబ్దాలు దాటుతున్నా నున్నకు మార్కెట్ మాత్రం తరలించలేదు. ప్రైవేటు దుకాణాలపై వచ్చే అద్దెలు పోతాయనేదే అసలు కారణం. వ్యాపారులు నష్టపోయినా పర్వాలేదు కానీ బడాబాబులకే తమ వత్తాసు అంటూ అధికార యంత్రాంగం కిమ్మనడం లేదు.



కేదారేశ్వరపేటలోని ప్రధాన రహదారిని ఆక్రమించేసి అడ్డంగా బండ్లు నిలబెట్టేశారిలా..

రహదారులను ఆక్రమించేసి..

మార్కెట్‌కు ఆనుకుని ఉండే ప్రధాన రహదారి, ఫుట్‌పాత్‌లు వేటినీ వదలకుండా వాహనాలు, పండ్ల విక్రయాల బండ్లు పెట్టేస్తున్నారు. ఈ రోడ్డు మీదుగానే సింగ్‌నగర్, రైల్వేస్టేషన్ సహా అనేక ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. అనేక విద్యాసంస్థలు, కళాశాలలు ఇదే ప్రధాన రహదారి. కీలకమైన వేళల్లో ఈ రహదారి మొత్తం పండ్లు తీసుకొచ్చే భారీ కంటైనర్లు, డీసీఎం, మినీవ్యాన్లు, ఆటోలతో నిండిపోతోంది. ఇటుగా సాధారణ పౌరులు రాకపోకలు సాగించడం గగనమే.

అధికారులు, నేతలకు పట్టదు

నున్నలో రెండున్నర దశాబ్దాల కిందట కేదారేశ్వరపేట మార్కెట్ కంటే ఐదురెట్లు పెద్దగా.. సువిశాల ప్రాంగణాన్ని సిద్ధం చేశారు. ఐందులో సామాన్య వ్యాపారుల దుకాణాలున్నాయి. జాతీయ రహదారిని ఆనుకుని ఉండడంతో కంటైనర్లు సహా ఏ వాహనం నగరంలోకి రావాల్సిన పనిలేదు. ప్రస్తుత మార్కెట్‌కు ఐదారు కి.మీ. దూరంలోనే నున్న ఉంది. విశాలమైన రహదారులు, పార్కింగ్, సకల సౌకర్యాలు ఉన్నాయక్కడ. కానీ ఖాళీగా పడి ఉంటోంది.

అందరితో ముడిపడటమే..

కేదారేశ్వరపేట నుంచి నున్నలోని తమ సొంత దుకాణాలకు వెళ్లిపోవడానికి 90శాతం మంది వ్యాపారులు సిద్ధంగా ఉన్నారు. వ్యాపారులందరినీ ఒకేసారి తరలిస్తే వెళ్లిపోతామని చెబుతున్నారు. లేదంటే కొద్దిమంది ఇక్కడే ఉండిపోయినా నాలుగున్నర దశాబ్దాలుగా ఇక్కడ అలవాటుపడిన కొనుగోలుదారులు.. నున్నకు రావడానికి ఆసక్తి చూపించరు. ఈ విషయంలో అనేక సమస్య ఇప్పటికి చాలాసార్లు తరలించాలని, నగరపాలక సంస్థ అధికారులు, గతంలోని కలెక్టర్లు ప్రయత్నం చేసిన ప్రతిసారీ మరికొంత సమయం కావాలంటూ.. సదరు బడాబాబులు మోకాలడ్డడం, ఇదే గత కొన్నేళ్లగా జరుగుతోంది.

రేపటి పీజీఆర్ఎస్ కార్యక్రమం రద్దు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని ఇంద్రకీలాద్రి వద్ద భవానీ దీక్షల విరమణ నేపథ్యంలో ఈ నెల 15వ తేదీ సోమవారం విజయవాడ కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను రద్దు చేసినట్టు ఇన్‌ఛార్జి కలెక్టర్, జేసీ ఎస్. ఇలక్కియా తెలిపారు. ఈనెల 11వ తేదీ ఆరంభమైన భవానీ దీక్షల విరమణ కార్యక్రమం.. 15వ తేదీ వరకు ఉంటుంది. ఈ కార్యక్రమ విధుల్లో జిల్లా అధికారులు నిమగ్నమై ఉండడంతో అర్జీల స్వీకరణను రద్దు చేసినట్టు పేర్కొన్నారు. ప్రజలు గమనించాలని శనివారం ఆమె ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

సమాజహితం.. సౌకర్యవంతం..!

ఇంజినీరింగ్ విద్యార్థుల చక్కని ఆవిష్కరణలు

చిట్టినగర్, న్యూస్‌టుడే

సాంకేతిక విప్లవం నేపథ్యంలో యువత నూతన ఆవిష్కరణల దిశగా సాగేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. క్వాంటమ్ కంప్యూటర్‌పై ప్రాక్టికల్ అనుభవం, ఏఐ ఆధారిత ప్రాజెక్టుల రూపకల్పనకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారు. అందుకు అనుగుణంగా పొట్టి శ్రీరాములు చలువాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాలలో 36 గంటల పాటు నిర్వహించిన హ్యాకథాన్‌లో విద్యార్థులు ఆవిష్కరించిన పలు ప్రాజెక్టులు దేశ అభ్యున్నతికి, సమాజ హితానికి దోహదపడే విధంగా ఉన్నాయి. వాటి గురించి తెలుసుకుందాం..



ట్రాఫిక్ అండ్ రోడ్డు సేఫ్టీ సర్వేలెన్స్ సిస్టమ్ (డ్రోన్)

ట్రాఫిక్ జామ్‌తో గంటల తరబడి సమయం వృథా కాకుండా ఉండేందుకు కేబీఎన్ కళాశాలలో బీసీఏ ఫైనలియర్ చదువుతున్న దీపక్ చంద్, హిమతేజ, గౌతమ్‌కుమార్ ఏఐ పవర్డ్ ఇంటెలిజెంట్ ట్రాఫిక్ అండ్ రోడ్డు సేఫ్టీ సర్వేలెన్స్ సిస్టమ్(డ్రోన్)ను రూపొందించారు. ట్రాఫిక్‌ను ఇది రియల్ టైమ్‌లో మానిటరింగ్ చేస్తుంది. 30 కిలోమీటర్ల దూరం వరకు ఈ డ్రోన్ ద్వారా మానిటరింగ్ చేయవచ్చు. అకస్మాత్తుగా జరిగే ప్రమాదాలను పైభాగం నుంచి గుర్తిస్తుంది. అంబులెన్స్, అత్యవసర వాహనాలకు మార్గం క్లియర్ చేసేలా ముందుగానే చెక్ చేస్తుంది. ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్‌కు ఏరియల్ డేటా ఇస్తుంది. శిరస్త్రాణం ధరించకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే గుర్తించి చలానా కూడా అందిస్తుంది.

ఆటోమేటిక్ కుకింగ్ సిస్టమ్



ఉరుకుల పరుగుల జీవితంలో మహిళలకు వంట పెద్ద సమస్యగా మారింది. దీనికోసం తాడేపల్లిగూడెం ప్రాంతానికి చెందిన శ్రీవాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థినులు భవ్య, భార్గవి, సఫియా ఆటోమేటిక్ కుకింగ్ సిస్టమ్ ప్రాజెక్టు తయారు చేశారు. వివిధ బౌల్స్ ఏర్పాటు చేసి దానిలో కూరలకు కావాల్సిన వస్తువులు సిద్ధం చేసి ఒకదాని తర్వాత ఒకటి వంట పాత్రలో వేస్తే కూరలు సిద్ధం చేస్తుంది.



యాక్సిడెంట్స్ జరిగినప్పుడు ట్రాఫిక్ ఆగిపోతుంది. పొగ మంచు వేళ దగ్గరకు వచ్చేవరకు వాహనాలు కనిపించవు. హైదరాబాద్‌కు చెందిన మల్లారెడ్డి విశ్వవిద్యాలయం, బీవీరాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన రోహిత్, మనీష్, రామ్‌చరణ్ 'రక్షక్ నేత్ర' అనే ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ప్రమాద స్థలం నుంచి 10 కి.మీ. దూరంలోని వాహనాలకు ఇక్కడి పరిస్థితి తెలియజేస్తుంది. పొగ మంచులో కనిపించకపోతే అలారం మోగిస్తూ సిగ్నల్స్ ఇస్తుంది. సమీప టోల్‌ప్లాజాకు సమాచారం ఇస్తుంది.

విద్యా వనం.. చరిత ఘనం..

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

జాతీయోద్యమ స్ఫూర్తితో స్వదేశీ విద్యకు పెద్ద పీటవేస్తూ.. వృత్తి విద్యకు తగిన ప్రోత్సాహం ఇవ్వాలన్న ఆశయంతో 1910లో జాతీయ విద్యా పరిషత్తు ఆధ్వర్యంలో మచిలీపట్నం ఆంధ్ర జాతీయ కళాశాలను ఏర్పాటు చేశారు. దీని అభివృద్ధికి వ్యవస్థాపకులుగా కోపల్లె హనుమంతరావు, భోగరాజు పట్టాభిసీతారామయ్య, ముట్నూరి కృష్ణారావు విశేష కృషి చేశారు. ఇక్కడ చరిత్ర వివరించడంతో పాటు వ్యవసాయం, శిల్పశాస్త్రం, చేతి విద్యలు, సంగీతం, నృత్యం, మగ్గం, చేనేత, చిత్రలేఖనం, వడ్రంగి తదితర వృత్తి, పారిశ్రామిక శిక్షణ ఇచ్చేవారు. కళాశాలలో తయారైన యంత్రాలు దేశంలోని వివిధ కర్మాగారాలకు సైతం అందించేవారు. 1927లో ఐదేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ (బీఎఫ్ఏ)కోర్సు అందుబాటులోకి తెచ్చారు. దేశంలో పుణె, మచిలీపట్నంలోనే ఈ కోర్సు ఉండేది.



దీంతో ఇతర రాష్ట్రాల విద్యార్థులు బందరు వచ్చి చదువుకునేవారు. మహాత్మాగాంధీ, అనిబిసెంట్, బిపిన్‌చంద్రపాల్, సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి వారు కళాశాలను సందర్శించి నిర్వహణను మెచ్చుకున్నారు. 1949లో అప్పటి పాలకవర్గం ఆంధ్రా విశ్వవిద్యాలయానికి అనుబంధ కళాశాలగా మార్చారు. 1951 తరువాత ఐటీఐ, టీఈడీ కోర్సులను అందుబాటులోకి తెచ్చారు. జాతీయపతాక రూపశిల్పి పింగళి వెంకయ్య ఇక్కడ అధ్యాపకుడిగా పనిచేశారు. అడివి బాపిరాజు, గుర్రం మల్లయ్య, ప్రమోద్‌కుమార్ ఛటర్జీ లాంటి ప్రముఖ చిత్రకారులకు విద్య నేర్పింది మన ఆంధ్ర జాతీయ కళాశాలే.

లక్ష్యం..

ప్రమాద రహిత నగరం

'శిరస్త్రాణం పెట్టుకోండి... క్షేమంగా ఇంటికి వెళ్లండి'. 'సీటు బెల్టు ధరించండి... ప్రమాదాల నుంచి కాపాడుకోండి'. మీ భద్రత, మీ కుటుంబ క్షేమమే మాకు ముఖ్యమంటున్నారు.. విజయవాడ ట్రాఫిక్ పోలీసులు. ట్రాఫిక్ నిబంధనలపై ఫ్లెక్సీలతో వినూత్నంగా ప్రచారం చేస్తున్నారు. ట్రాఫిక్ డీసీపీగా షిరీన్‌బేగం బాధ్యతలు స్వీకరించిన తర్వాత రహదారి భద్రతా నిబంధనలపై ప్రచారాన్ని విస్తృతం చేశారు. శిరస్త్రాణం ధరించిన ద్విచక్రవాహన చోదకులకు, సీటు బెల్టు పెట్టుకున్న కారు డ్రైవర్లకు పుష్పాలు, బెలూన్లు అందించి అభినందనలు తెలియజేస్తున్నారు.

ట్రాఫిక్ పోలీసుల ప్రచారపర్వం

ఉల్లంఘనదారులపై ఉక్కుపాదం: ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. సిగ్నల్ జంప్, శిరస్త్రాణం లేకపోవటం, ట్రిపుల్ రైడింగ్‌పై కేసులు నమోదు చేస్తున్నారు. మద్యం తాగి వాహనం నడిపితే జరిమానాలు విధిస్తున్నారు. తీవ్రత ఉంటే జైలుకు పంపిస్తున్నారు. వెరసి ప్రమాద రహిత విజయవాడే లక్ష్యంగా ట్రాఫిక్ పోలీసులు ప్రయత్నిస్తున్నారు. – విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే



శిరస్త్రాణం ధరించాలని 4వ పట్టణ ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఆకర్షణీయ నినాదాలతో..

తాజాగా ముఖ్యమైన కూడళ్లలో నాలుగో ట్రాఫిక్ సీఐ రామారావు నేతృత్వంలో ఆకర్షించేలా, ఆలోచింపజేసే నినాదాలతో ఫ్లెక్సీలు ప్రదర్శిస్తున్నారు. 'హెల్మెట్ మస్ట్... డ్రైవ్ నెస్ట్', 'వేర్ హెల్మెట్... డ్రైవ్ సేఫ్లీ', 'యువర్ సేఫ్టీ... హయ్యర్ ప్రయారిటీ' వంటి నినాదాలు రాసి అందరికీ కనిపించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలను పాటించాలని కోరుతూ కరపత్రాలు పంచుతున్నారు. చోదకులను ఆపి అవగాహన కలిగిస్తున్నారు.

తగ్గిన ప్రమాదాలు

ట్రాఫిక్ పోలీసుల వినూత్న చర్యలతో రోడ్డు ప్రమాద, మరణాల సంఖ్య గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది తక్కువగా నమోదయ్యాయి.

	ప్రమాదాలు	మరణాలు
2024	388	413
2025	318	326

79,503 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో 10,514 మంది రైతుల నుంచి 79,503.200 మెట్రిక్ టన్నుల ఖరీఫ్ ధాన్యాన్ని కొనుగోలు చేశామని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ సతీష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 24 గంటల్లోపే రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.160.62 కోట్లు జమ చేసినట్టు పేర్కొన్నారు. 1,50,000 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా, ఇందుకు 18.75 లక్షల గోనె సంచులు అవసరం. రైతుల అవసరాల దృష్ట్యా 25.24 లక్షల గోనె సంచులను అందుబాటులో ఉంచినట్టు వివరించారు. జిల్లాలో 148 రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయగా, 139 కేంద్రాల్లో కార్యకలాపాలు జరుగుతున్నట్టు తెలిపారు.



పథకం ప్రకారమే వసూళ్లు.. ఆనక దారి మళ్లింపు


విస్సన్నపేట స్టేషన్‌లో కేసు నమోదు

ఈనాడు, అమరావతి

సంకల్పసిద్ధి, యుపిక్స్, అద్విక కుంభకోణాలు మరువక ముందే.. జిల్లాలో లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ సంస్థ మోసం వెలుగుచూసింది. రూ.10వేలతో సభ్యత్వం తీసుకుంటే నెలకు రూ.1,000 చొప్పున 10నెలలు చెల్లిస్తాం. రూ.లక్షకు నెలకు రూ.10వేలు ఇస్తామని ఆశ పెట్టారు. అరచేతిలో వైకుంఠం చూపారు. ఆనక బిచాణా ఎత్తేశారు. విస్సన్నపేట కేంద్రంగా ఏర్పాటు చేసిన 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' సంస్థ కార్యకలాపాలను దుర్గాప్రసాద్, శివానీ దంపతులు శాఖోపశాఖలుగా విస్తరించారు. 2023-24లో రూ.1.50కోట్ల వరకు డిపాజిట్లు రాగా.. 2024-25లో ఏకంగా రూ.25కోట్లు పైగా వసూలు చేశారు. దుర్గాప్రసాద్ స్వస్థలం కృష్ణా జిల్లా మచిలీపట్నం. అతని సతీమణి శివానీది రెడ్డిగూడెం మండలం మద్దెలపర్వ. వీరు ముందస్తు ప్రణాళిక మేరకే.. మాయమాటలు చెప్పి రూ.కోట్లలో వసూలు చేసి బోర్డు తిప్పేశారు. దాదాపు రెండు కిలోల వరకు బంగారం కొనుగోలు చేసినట్లు భావిస్తున్నారు. శివానీ.. తన బంధువుల పేర్లతో స్థిర, చరాస్తులు కొనుగోలు చేసినట్లు అనుమానిస్తున్నారు. పులువురు బాధితులు పెద్ద సంఖ్యలో విజయవాడ వచ్చారు. పోలీసు కమిషనర్‌ను కలిసేందుకు ప్రయత్నించారు. గత ఐదు నెలలుగా సంస్థ కార్యాలయం చుట్టూ బాధితులు తిరుగుతున్నారు. ఆయన భవానీ దీక్షల విరమణ బందోబస్తు పర్యవేక్షణలో ఉండడంతో వారు వెనుదిరిగి వెళ్లారు. ఈ వ్యవహారంపై బాధితుల ఫిర్యాదు మేరకు విస్సన్నపేట స్టేషన్‌లో పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది. 5 నెలల క్రితమే పోలీసులు దుర్గాప్రసాద్‌ను మైలవరం పిలిపించి వివరాలు ఆరా తీశారు. ఇక నుంచి కొత్తగా డిపాజిట్లు తీసుకోవద్దని, బాకీలున్న వారికి చెల్లింపులు చేయమని హెచ్చరించి పంపారు.

నమ్మించేందుకు భవానీపురంలో సరకుల మార్ట్.. విస్సన్నపేటలో ఒత్తిడి పెరగడంతో అక్కడ మూసేవి విజయవాడ నగరంలోని భవానీపురానికి మారారు. అక్కడ ఎల్‌బీఎఫ్ మార్ట్ పేరుతో ప్రారంభించారు. ఇందులో సభ్యత్వం తీసుకుంటే సరకులు కొనుగోలు చేయొచ్చని.. ఇందులో 50శాతం క్యాష్‌బ్యాక్ రూపంలో డబ్బులు వెనక్కి వస్తుందని వీరు ఆశచూపించారు. భవానీపురం, చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ చాలా మంది ఇందులో పెట్టుబడులు పెట్టారు. ఇక్కడ దాదాపు రూ.3కోట్లు వరకు వసూలు చేసినట్లు భావిస్తున్నారు. అక్కడ కూడా చెల్లింపులు చేయలేక అక్టోబరులో బిచాణా ఎత్తేశారు.

ట్రస్టు పేరుతో జమ.. ఆపై స్వాహా: తమ వద్ద చాలా ఆలోచనలు ఉన్నాయని, 200 ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తామని చుట్టుపక్కల ప్రాంతాల వారిని నమ్మించారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించి, రైతుల నుంచి వాటిని కొనుగోలు చేసి మార్ట్‌లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. పెట్టుబడిదారులను నమ్మించేందుకు ఎల్‌బీఎఫ్ చిట్స్, ఎల్‌బీఎఫ్ న్యూస్, ఎల్‌బీఎఫ్ ట్రస్టు, ఇలా పలు పేర్లతో విభాగాలు ప్రారంభించారు. పెట్టుబడి పెట్టిన వారిలోనే కొందరిని ఎంపిక చేసి జిల్లా బ్రాంచి మేనేజర్లుగా నియమించారు. వారు చేసిన వ్యాపారంలో కొంత కమీషన్ ఇచ్చారు. ఒక్కో బ్రాంచి మేనేజరు రూ.10లక్షల నుంచి రూ.25లక్షల వరకు వ్యాపారం చేశారు.



శివానీ

అజ్ఞాతంలో శివానీ: దుర్గాప్రసాద్ పెదకర్మ అయిన తర్వాత శివానీ.. రెడ్డిగూడెం మండలం మద్దెలపర్వలో తన పుట్టింటికి వెళ్లింది. బాధితులు అక్కడకు వెళ్లి నిలదీయడం ప్రారంభించారు. ఆస్తులు అమ్మి చెల్లిస్తానని ఆమె చెబుతూ వచ్చింది. గత నెల 22 నుంచి ఆమె అజ్ఞాతంలోకి వెళ్లిపోయింది. శనివారం రాత్రి బాధితులు మద్దెలపర్వలోని ఆమె తల్లిదండ్రుల ఇంటికి వెళ్లి నిలదీశారు. ఇంట్లో అంతా వెతికించారు. బంగారం కొనుగోళ్లకు సంబంధించి రశీదులు, బంగారు నగలు, జీవిత బీమా బాండ్లు పెద్ద సంఖ్యలో దొరికాయి. తన కుమార్తె ఎక్కడికి వెళ్లిందో తెలీదని, కనిపించడం లేదని ఆమె తల్లిదండ్రులు బాధితులకు చెప్పారు.

రాజధానిలో భూమి లేని పేదలకు పింఛన్లు

తుళ్లూరు, న్యూస్‌టుడే: ప్రజా రాజధాని అమరావతిలో భూమి లేని పేదల్లో అర్హులైన వారికి పింఛన్లు అందించటానికి సీఆర్డీఏ సన్నద్ధమవుతోంది. 2014-2019 మధ్య తెదేపా ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్లలో కొన్నింటిని ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం రద్దు చేసింది. 2015-2025 మధ్య 4,929 మంది వివిధ కారణాలతో ఆగిపోయాయి. ప్రభుత్వ పథకాల మార్గదర్శకాల ప్రకారం వీరిలో 4,370 మందికి పింఛన్లు రద్దు చేయగా, మిగతా 559 మందిని హోల్డ్‌లో పెట్టారు. అర్హులైన వారు తగిన ధ్రువీకరణపత్రాలలో సమీప సీఆర్డీఏ కార్యాలయాల్లో అర్జీలు సమర్పించాల్సిందిగా కార్యాలయ వర్గాలు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నాయి.





అందుబాటులో సీసీఐ స్లాట్ బుకింగ్‌లు

నందిగామ, న్యూస్‌టుడే: సీసీఐకి పత్తి విక్రయించుకునేలా రైతులు కిసాన్ కపాస్ యాప్‌లో స్లాట్‌లు ఓపెన్ చేసి ఉంచినట్లు నందిగామ మార్కెట్ యార్డు కార్యదర్శి వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం 'ఈనాడు'లో వచ్చిన కథనానికి మార్కెటింగ్ శాఖ అధికారులు స్పందించారు. జనవరి 9వ తేదీ వరకు పత్తి కొనుగోలు స్లాట్‌లు అందుబాటులో ఉంటాయని చెప్పారు. నందిగామ మార్కెట్ యార్డులోని నందిగామ, చందర్లపాడు మండలాల రైతులు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. అర్హత ఉన్న రైతులు వినియోగించుకోవాలని కోరారు.

మద్యం మత్తులో తొక్కించేశాడు..

మైలవరం, న్యూస్‌టుడే: మద్యం మత్తులో ట్రాక్టర్ నడిపిన ఓ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా పదుల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి. అదే పార్కింగ్ స్థలం కావడంతో ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం



ఘటనా స్థలంలో చెల్లాచెదురైన ద్విచక్ర వాహనాలు

తప్పింది. నేరకరించి, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పొందుగల నుంచి ధాన్యం బస్తాలతో వస్తున్న ట్రాక్టర్ స్థానిక ఇంజినీరింగ్ కళాశాల ఎదుట ప్రయాణికుల కోసం నిలిపిన బస్సును వెనుక నుంచి ఢీకొట్టింది. అదే ఊపులో కుడివైపు వెళ్లి, డివైడర్‌ను దాటి ఆ పక్కనే పార్కింగ్‌లో ఉన్న ద్విచక్ర వాహనాలను ఢీకొంది. డివైడర్‌పై ఎక్కడంతో ఇంజిన్ ఆగిపోయింది. ఒక్కసారిగా కళాశాల భద్రతా సిబ్బంది, సమీపంలోని వ్యక్తులు పరుగున వచ్చారు. అయితే పొందుగల నుంచి ధాన్యం తీసుకొస్తున్న డ్రైవర్ నాగేశ్వరరావు మార్గమధ్యంలో మద్యం తాగి వాహనం నడపడంతోనే ప్రమాదం జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనలో పది ద్విచక్ర వాహనాలు దెబ్బతినగా, ఒక బస్సు వెనుక భాగం స్వల్పంగా దెబ్బతిన్నట్లు ఎస్.సుధాకర్ తెలిపారు. పోలీసులు ట్రాక్టర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

విజయవాడ వన్ టౌన్, న్యూస్‌టుడే: వైద్య సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి ఎం.సుహాసిని సూచించారు. శనివారం దుర్గగుడి ఆలయ పరిసరాల్లో భవానీ భక్తుల కోసం ఏర్పాటైన వైద్య శిబిరాలను ఆమె సందర్శించారు. పలు చోట్ల సిబ్బంది ఉండకపోవడాన్ని గమనించి ఫీల్డ్‌లో ఉన్న సిబ్బందిని విధులకు రప్పించారు. అనంతరం పాతబస్తీలోని పీహెచ్‌సీలను సందర్శించి వ్యాధి నిరోధక టీకాలను పరిశీలించారు.



వైద్య శిబిరంలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎంహెచ్‌వో సుహాసిని

ఈనాడు క్రికెట్‌కు వేళాయె..

యువ ప్లేయర్లకు అవకాశం ● ఈఎస్‌ఎల్ దరఖాస్తులకు రేపు ఆఖరి తేదీ

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీ త్వరలో ప్రారంభమవనుంది. ఆసక్తిగలవారు సోమవారం లోపు దరఖాస్తు చేసుకోవాలి.

ఈనాడు - హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్టు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

వయసు నిబంధన

● బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వారు). ● సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వారు). ● అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు, గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2009 మధ్య జన్మించిన వారే అర్హులు)

రిజిస్ట్రేషన్ కోసం

☛ రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.

☛ మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులు పంపాల్సిన చిరునామా

ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్, ఈనాడు ఆఫీసు, గూడవల్లి విలేజ్, విజయవాడ రూరల్ మండలం, ఎన్టీఆర్ జిల్లా-521104

వివరాలకు: 9121170928, 91549 91113

(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌కు బైక్

టోర్నీలో అసాధారణ ప్రదర్శన చేసే ఆటగాళ్లకు బైక్ బహుమతిగా లభించనుంది. సీనియర్ విభాగంలో, జూనియర్ విభాగంలో 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచే ఆటగాళ్లకు బైక్‌ను అందజేయనున్నారు.

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షులు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షులు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షులు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక): ఆర్టీసీలో స్త్రీ శక్తి పథకం వల్ల డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్ సిబ్బందిపై పని ఒత్తిడి పెరిగిందని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. స్త్రీ శక్తి పథకం- ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై బాలోత్సవ భవన్‌లో శనివారం రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆర్టీసీ 4వేల కొత్త డీజిల్ బస్సుల కొనుగోలు, 11వేల మంది సిబ్బంది నియామకం, రానున్న రాష్ట్ర బడ్జెట్‌లో పథకానికి నిధుల కేటాయింపు, సిబ్బందిపై అసాంఘిక శక్తుల దాడులను అరికట్టి.. రాజకీయ జోక్యం లేకుండా నాన్ బెయిలబుల్ కేసుల నమోదు, బస్సులన్నింటికీ హైడ్రాలిక్ డోర్లను ఏర్పాటు తదితర సమస్యలపై తీర్మానం చేశారు. తెలంగాణ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వి.ఎస్. రావు, సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎస్.కె. జిలాని, ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్రహ్మణ్యం, ధనలక్ష్మి, వివిధ జిల్లాల మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం, వేదికపై సంఘం నాయకులు

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213, చికెన్ స్కిన్‌లెస్ - 243.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 139, 148, 159 చికెన్ విత్ స్కిన్ - 264 చికెన్ స్కిన్‌లెస్ - 274.

ఆలయాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలి

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: దేవాలయాలను అధికారులు, ప్రజాప్రతినిధులు పరిరక్షించి, వాటిని పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని త్రిదండి చినజీయర్‌స్వామి కోరారు. జగ్గయ్యపేట మండలంలోని కృష్ణానది తీరాన వేంచేసిన శ్రీజ్వాలా నరసింహస్వామి దేవస్థానానికి వెళ్లే ఘాట్ రోడ్డు, అర్చిని చినజీయర్‌స్వామి శనివారం ప్రారంభించారు. తొలుత ఆయనకు ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, ఆలయ ఈవో కానూరి సురేష్‌బాబు, అధికారులు స్వాగతం పలికారు. ఆయన తొలుత శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామిని, తర్వాత కొండపైకి వెళ్లి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మొక్కలు నాటారు. 2026 స్వామివారి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం చినజీయర్‌స్వామి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. భక్తుల కోసం ఘాట్ రోడ్డును ఏర్పాటు చేసిన ఉప్పలపాటి శ్రీహరి, మిత్ర బృందానికి, దీనికి సహకరించిన అధికారులు, కేసీపీ యాజమాన్యం, గ్రామస్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. భక్తుల కోసం ఇలాంటి కార్యక్రమం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. పావన కృష్ణానది తీరంలో వేదాద్రి దేవాలయం ఎంతో సుందరంగా ఉందన్నారు. దేవాలయాల్లో బ్రహ్మోత్సవాలతో పాటు అధ్యయన ఉత్సవాలు కూడా ఘనంగా నిర్వహించాలని సూచించారు. దాత ఉప్పలపాటి శ్రీహరి మాట్లాడుతూ భక్తుల కోసం ఘాట్ రోడ్డును చినజీయర్‌స్వామి అనుగ్రహంతోనే.. తాను, మిత్ర బృందం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఏసీపీ తిలక్, సీఐ వెంకటేశ్వర్లు, కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ ఆంజనేయులు, ఆలయ అర్చకులు, హిందూ బంధువులు తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న చినజీయర్‌స్వామి తదితరులు

అదిరే.. అదిరే..

అలరించిన నృత్యాలు

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: సిద్ధార్థ మహిళా కళాశాలలో ఫెట్2కే25 కార్యక్రమం శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థినులు వివిధ ఆహార పదార్థాలు, చీరలు, ఇతర సామగ్రిని వివిధ స్టాల్స్‌లో ఏర్పాటు చేశారు. వీటివల్ల వ్యాపారం చేయడంపై తమకు అవగాహన కలుగుతుందని విద్యార్థినులు తెలిపారు. వెల్‌బేబీ షో, మిస్ ఫెట్, మిస్ సిద్ధార్థ పోటీల్లో పలువురు పోటాపోటీగా ప్రదర్శనలిచ్చి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ ఉపాధ్యక్షుడు, కళాశాల కన్వీనర్ సీహెచ్ కృష్ణారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపల్ వీవీఎస్ కుమార్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.పద్మజ, ఫెట్ కన్వీనర్ వి.సంధ్యాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. మిస్ ఫెట్2కే25గా బి.సౌమ్య, మిస్ సిద్ధార్థగా ఎం.సంకీర్తన విజేతలుగా నిలిచారు.



మిస్ ఫెట్-2025గా నిలిచిన సౌమ్యకు బహుమతి అందజేస్తున్న సిద్ధార్థ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కుమార్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పద్మజ



కెవ్వు కేక.. విద్యార్థినుల సంబరం...



వేదికపై హొయలొలికిస్తున్న యువతులు

ప్రేమ విఫలమై యువకుడి బలవన్మరణం

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : ప్రేమ విఫలమై ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన ఇది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... తిరువూరు మండలం గానుగపాడు గ్రామానికి చెందిన రచ్చ వేణు(22) అదే గ్రామంలో వేరే సామాజిక వర్గానికి చెందిన యువతి ప్రేమించుకున్నారు. వీరి ప్రేమను పెద్దలు అంగీకరించక పోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన అతను పది రోజుల కిందట పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు గమనించి విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అక్కడ నుంచి రెండు రోజుల కిందట ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా వైద్యం పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంట కాలువలో పడి రైతు దుర్మరణం



రమేశ్ (పాతచిత్రం)

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట నుంచి బలుసుపాడు వెళ్లే మార్గంలో పంట కాలువలో పడి ఓ రైతు మృతి చెందారు. చిల్లకల్లు పోలీసుల కథనం ప్రకారం.. అన్నవరం గ్రామానికి చెందిన కాకర్ల రమేశ్ (40) రెండు ఎకరాల పొలం కౌలుకు చేస్తున్నారు. శుక్రవారం రాత్రి 11 గంటలకు పొలానికి వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు పంట కాలువలో పడి మృతి చెందారు. శనివారం ఉదయం స్థానికులు కాలువలో మృతదేహాన్ని గుర్తించి సమాచారం అందించడంతో పోలీసులు పరిశీలించి రమేశ్‌గా నిర్ధారించారు. మృతదేహం బయటకి తీసి పోస్టుమార్టం నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య లక్ష్మి వ్యవసాయ కూలి పనులు చేస్తుంటారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇంటికి పెద్దదిక్కు కోల్పోవడంతో ఆ కుటుంబం అనాథలా మిగిలింది. కష్టపడి వ్యవసాయం, ఇతర పనులు చేస్తూ.. కుటుంబానికి ఏ లోటూ రాకుండా చూసుకుంటున్న రమేశ్ మృతితో భార్య, పిల్లలు కన్నీటి పర్యంతమవుతున్నారు.

వ్యవసాయ రంగంలో మార్పులు అందిపుచ్చుకోవాలి

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పుల కోసం తీసుకొచ్చిన విధానాలను ఔత్సాహికులు అందిపుచ్చుకోవాలని ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి అన్నారు. విజయవాడ లబ్బీపేటలోని ఎస్ఎస్ కన్వెన్షన్‌లో ఏపీ ఛాంబర్స్ బిజినెస్ ఎక్స్‌పోలో భాగంగా శనివారం 'ఆహారశుద్ధి రంగం- వ్యవసాయంలో నూతన ఆవిష్కరణలు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చిరంజీవి చౌదరి మాట్లాడుతూ వ్యవసాయ ఆధారిత అంకుర సంస్థలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఆహారశుద్ధి విధానం 4.0 ద్వారా 2029 నాటికి రూ.30 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలనేది లక్ష్యమని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. అరటి, మిరప, మామిడి, చిరుధాన్యాలు, ఆక్వా వంటి ఉత్పత్తుల కోసం ప్రత్యేక క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నారని వివరించారు. ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈవో గెద్దం శేఖర్‌బాబు సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో ఏపీ ఛాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు, తెనాలి డబుల్ హార్స్ గ్రూప్ ఛైర్మన్ మోహన్ శ్యామ్‌ప్రసాద్, అపెడా ఏజీఎం ఆర్.పి.నాయుడు, ఏపీ టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం గౌరవాధ్యక్షుడు ముత్తవరపు మురళీకృష్ణ, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వెలగపూడి సాంబశివరావు, దీపక్ నెక్స్‌జెన్ ఛైర్మన్ ఏవీ సుబ్రహ్మణ్యంలు ప్రసంగించారు. ఆహారశుద్ధి రంగంలో వివిధ రకాల కొత్త ఉత్పత్తులతో పాటు స్టార్టప్‌లను అతిథులు ఆవిష్కరించారు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న శేఖర్‌బాబు, చిరంజీవి చౌదరి, మురళీకృష్ణ, మోహన్ శ్యామ్‌ప్రసాద్ తదితరులు

ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఆంధ్రా లయోలా కళాశాల ఇండోర్ స్టేడియంలో రెండు రోజులు జరిగే 9వ ఎలైట్ పురుషుల రాష్ట్ర స్థాయి బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌ను శనివారం ఏసీపీ(సెంట్రల్) కె. దామోదరరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు చక్కని క్రీడాస్ఫూర్తితో తలపడాలన్నారు. నగరంలో ఇటువంటి పోటీలు మరిన్ని నిర్వహించాలన్నారు. ఎన్టీఆర్ జిల్లా బాక్సింగ్ సంఘం కార్యదర్శి వైవీఎస్ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి 140 మంది క్రీడాకారులు హాజరవడం సంతోషంగా ఉందన్నారు. ఎంపికైన బాక్సర్లు ఈ నెల 30 నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నోయిడాలో జరిగే జాతీయ సీనియర్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. అనంతరం ముఖ్యఅతిథి దామోదరరావు పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. రాష్ట్ర బాక్సింగ్ సంఘం అధ్యక్షుడు, ద్రోణాచార్య అవార్డీ ఐ. వెంకటేశ్వరరావు, కార్యదర్శి పి.మధుసూదనరావు, పలు జిల్లా సంఘాల ప్రతినిధులు, శిక్షకులు పాల్గొన్నారు.



పోటీలు ప్రారంభిస్తున్న ఏసీపీ దామోదరరావు. చిత్రంలో వెంకటేశ్వరరావు, ఉమామహేశ్వరరావు తదితరులు

రద్దీ ప్రదేశాల్లో చరవాణుల చోరీలు

TVS మోటార్స్ ఆటో AP & TG వాక్‌ఇన్ ఇంటర్వ్యూ సేల్స్ & సర్వీస్‌లో వివిధ రోల్స్‌కు ఫ్రెషర్స్ & ఎక్స్‌పీరియన్స్ కలిగిన వారికి వాక్‌ఇన్ ఇంటర్వ్యూ మీ సమీప TVS ఆటో షోరూమ్‌లో జరుగుచున్నవి సంప్రదించండి: 7418699978 (AP), 7418477742 (TG)

రామకృష్ణ బిల్డర్స్, Hyd, Vja [illegible] © 94918 21122, 94916 51122.

రామకృష్ణ గ్రూప్ VJA, HYD [illegible] © 95736 91122

విశ్వశాంతి యూనివర్సల్ [illegible] 9676901122, 94916 51122

గాయత్రి ఒట్టోబ్ [illegible] కావలెను. భో+వ+మంచిజీతం. © 8247500792, 9281452845

రామకృష్ణ గ్రూప్ VJA ఇండ్లలో వృద్ధులు, పేషెంట్ల సేవకు, ఇంటి/ వంట బేబీకేర్‌కు వర్కర్లు కావలెను. భో+వ+మంచిజీతం. © 95420 47788,82475 00792.

గాయత్రి గ్రూప్ (AP No:1) HYD, VJA, న్యూఢిల్లీకు టెలీకాలర్స్, కస్టమర్‌కేర్ అన్నిరకాల ఆఫీస్ స్టాఫ్ కావలెను. భో+వ+జీ. ఇంటర్వ్యూ VJA. © 99490 21122.

హైదరాబాద్‌లో ఇంట్లోఉండి ఇంటి పనులు చేయుటకు మహిళ కావలెను. పెన్షన్ లేని వాళ్లకి మొదటి ప్రాధాన్యత. © 96031 36789.

గూడవల్లిలోని ప్రముఖ LCV సర్వీస్ సెంటర్ నందు పనిచేయటానికి మెకానిక్స్ & హెల్పర్స్ కావలెను. Q:- డిప్లమా/ ఐటిఐ అనుభవం వారికి ప్రాధాన్యత.77997 70069

ప్రముఖ లిఫ్ట్/ ఎలివేటర్ కంపెనీలో పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను Q: డిగ్రీ కమ్యునికేషన్ స్కిల్స్ & మార్కెటింగ్ అనుభవం తప్పనిసరి. మంచి వాక్చాతుర్యం/ చురుకుదనం గల యువకులు కావలెను. జీతం+ ఇన్సెంటివ్స్+ఎకామిడేషన్ కూడా కలదు. © 90305 54778.

విజయగౌతమ ల్యాండ్ ప్రోపర్టీస్ (రియల్ ఎస్టేట్) గాంధీనగర్ ఆఫీసు నందు రిసెప్షనిస్ట్‌గా పనిచేయుటకు ఇంటర్ చదివిన లేడీ కావలెను. © 98492 21955.

దివ్య ఇమేజింగ్ సెంటర్ పటమట నందు పనిచేయుటకు రిసెప్షనిస్ట్‌లు మేనేజర్, టైపిస్ట్ (మెడికల్ ట్రాన్స్‌స్క్రిప్ట్) X-RAY, CTMRI టెక్నీషియన్స్ కావలెను. © 9849150699, 6309102019

M.R. Estates నందు మార్కెటింగ్ మేనేజర్స్ (M/F) కావలెను. జీతం 14వేలు. వయస్సు 30 సం||లలోపు వారికి ప్రాధాన్యత. విజయవాడ. 9290095959, 9398165619.

రిటైర్డ్ టీచర్లు/లెక్చరర్లు PRO లుగా మా GR IAS Academy లో admissions చేయించేందుకు కావలెను జీ+TA+DA+inc. © 9346777568.

100% ఆర్థికంగా స్థిరపడే అద్భుత అవకాశం మమ్మల్ని ధనవంతులుగా తీర్చిదిద్దుతాం Age 25 టు 65 సం|| M/F P/F సంప్ర: 98853 03838.

లేడీ కంప్యూటర్ టీచర్ కావలెను. ఆడవినెక్కలంలోని సుదీక్షణ్ ఫౌండేషన్ వారి ఉచిత కంప్యూటర్ సెంటర్‌లో MS Office, DTP, Tally కోర్సెస్ బోధించుటకు, జీతం 15000 Cont: 96424 86811.

సంప్రదాయ ఇంటివంటలు చేయుటకు స్త్రీ/పు అనుభవంగలవారు విశాఖపట్నం & హైదరాబాద్ మెగా కిచెన్‌లో పనిచేయుటకు వంటవారు కావలెను. సంప్ర|| 9963118899, 9000166777.

విజయవాడలో ఉన్న గోడౌన్‌లో పనిచేయడానికి కంప్యూటర్ ఆపరేటర్ మరియు పికర్ & ప్యాకర్ కావలెను. మీ దరఖాస్తును mohanvja@gmail.comకు పంపండి లేదా 9393474744 సంప్రదించండి.

అమరావతిలో అన్ని ఏరియాల్లో పనిచేయుటకు డెలివరీ అసోసియేట్స్ కా|| అ: టెన్త్, ఇంటర్, డిగ్రీ జీ: 15 to 20K. భోజనం, వసతి ఫ్రీ. Cont: 89775 17381, 70957 17381.

హైదరాబాద్ మేడ్చల్‌లో ప్రముఖ అంతర్జాతీయ ఆన్‌లైన్ డెలివరీ కంపెనీ గోడౌన్‌లోకి 10th చదివిన యువతీ, యువకులు కావలెను కటింగ్‌పోను 15,000 జీతం + 2000 రూమ్ రెంట్. © 91338 22723 / 99898 06121

సిమెంట్ & ఇంటర్‌నెట్ కేబుల్ ఆఫీసు నందు అకౌంటెంట్, టెలీకాలర్స్, టాటా ఏసి డ్రైవర్స్, స్ప్లైసర్స్ & హెల్పర్స్ కావలెను. © 93936 66788.

విజయవాడలో ఆటోమొబైల్ ఫైనాన్స్ కంపెనీలో ఫైనాన్స్ కలెక్షన్ చేయుటకు టూ వీలర్ డ్రైవింగ్ లైసెన్స్ గల మేల్ కలెక్షన్ ఎగ్జిక్యూటివ్ కావలెను. © 92478 64544.

కావలెను [illegible] 9347675004, 9985544445 Email: [illegible]

Golden Opportunity, VRS/RTD, హౌస్‌వైఫ్, ఫోలెన్స్ అవుతున్నారా, రోజూ 3గం|| పనిచేస్తూ నెలకు 50వేలు& మేనేజర్ హోదా కోసం 9963213247

వాసవి గ్రూప్ (AP No:1) HYD VJA న్యూఢిల్లీకు టెలీకాలర్స్, కస్టమర్‌కేర్, అన్నిరకాల ఆఫీస్ స్టాఫ్ కావలెను. భో+వ+మంచి జీతం. © 96764 91122.

ప్రముఖ అపార్ట్‌మెంట్ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి పాలిటెక్నిక్ చదివిన 30 సం||లోపువారు సైట్ సూపర్‌వైజర్‌గా కావలెను. జీతం: 20,000/- © 98662 22966.

ఎలక్ట్రీషియన్స్ మరియు హెల్పర్స్ కావలెను. వయస్సు: 18-30 సం||లోపు. హౌస్ వైరింగ్‌లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత. సంప్ర|| © 93921 33234.

విజయవాడలోని ప్రముఖ కన్‌స్ట్రక్షన్ సైట్‌లో పనిచేయుటకు సివిల్ సూపర్‌వైజర్స్ కావలెను. మంచి జీతము, ఎకామిడేషన్ ఇవ్వబడును. సంప్ర © 99592 65200.

VJA వన్‌టౌన్ పంజా సెంటర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో పనిచేయుటకు క్లీనింగ్‌లో అనుభవం గల లేడీస్/ జెంట్స్ కావలెను. 97044 33644, 9000297598

పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్, విజయవాడ, జ్యూస్‌షాపు మరియు పాప్‌కార్న్ షాపులో పనిచేయుటకు లేడీ వర్కర్స్ కావలెను. జీ: 10K. 7780262007.

స్వగృహఫుడ్స్‌లో పనిచేయుటకు సేల్స్‌బాయస్, సేల్స్‌గరల్స్ కావలెను. Age 20 to 30 సం||లోపు, అర్హత 10th మంచిజీతం పార్ట్/ఫుల్‌టైం. © 8142545000.VJA

EXP నర్సులు/ ఆయాలు/ వార్డ్‌బాయ్స్ కావలెను. జీతం Rs.20,000/- నుండి Rs.25,000/- వరకు ఇవ్వబడును. Hyd లో. © 9966568882, 9963489661.

CCTV కెమెరాలు ఫిట్టింగ్ కాన్ఫిగరేషన్ ఇన్‌స్టలేషన్ ట్రైనింగ్ కోర్సు 15రో. కోర్సు తరువాత ప్లేస్‌మెంట్, టెక్నికల్ స్టాఫ్ కావలెను. 94942 33533.

HYD యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్. వర్కర్ జీ 20k. ఫ్రీ వసతి, ఫుడ్. © 81215 41212.

గుడివాడలో ప్రముఖ విద్యాసంస్థలో పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ టీం లీడర్స్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్, రిసెప్షనిస్ట్స్ కావలెను. సు|సెల్: 63057 89434.

రియల్ ఎస్టేట్ రంగంలో అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న ప్రముఖ కంపెనీలో పనిచేయడానికి లేడీ టెలీకాలర్స్ మరియు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం & కమీషన్లు అదనం PH: 96188 36996, 98482 94645.

అలంకార్ థియేటర్ దగ్గర [illegible] © 93911 11702.

కొత్తగా ప్రారంభించే [illegible] కావలెను. © 79815 23914

ప్రముఖ సెక్యూరిటీ సంస్థ నందు పనిచేయుటకు ఫీల్డ్ ఆఫీసర్, సెక్యూరిటీ ఆఫీసర్, సెక్యూరిటీ సూపర్‌వైజర్, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. © 95023 56655.

గుజరాత్ బరోడా సిటీలో [illegible] ఫోన్: 070691 01665

ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను
BCN DIGITAL
కేబుల్ టీవి మరియు ఇంటర్నెట్ [illegible]
ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ మరియు Mobile&TVలో NELEN APP DOWNLOAD చేయుటకు
ఆంధ్రప్రదేశ్ & తెలంగాణాలో [illegible]
ఫీల్డ్ మార్కెటింగ్ [illegible]
యూత్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను
Cable, Internet, APP, IPTV
Mail:jobs@bcndigitaltv.com
94 93 93 26 99

సర్వేఆఫీస్ నందు [illegible] © 94415 06869.

KBS ఆగ్రో ఇండియా ప్రైవేట్ LTDలో పనిచేయుటకు టెలీకాలర్స్ (F), రిసెప్షనిస్ట్ (F) సేల్స్ & మార్కెటింగ్ (M/F) [illegible] VJA. © 94926 13636.

ప్రముఖ [illegible] 8096556789

విజయవాడలోని ప్రముఖ సంస్థలో పనిచేయుటకు టైపిస్ట్ మరియు బిల్లింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. © 83328 33236

MARKETING/ SALES

Rapido is hiring for Managers, Experience: 4 years. Role: Plan BTL Marketing, optimise operations, implement strategies. Location-Vijaywada and Visakhapatnam. share resume to: ankita.das@rapido.bike.

Wanted Sales Persons Looking for Graduates for Adhesive Sales in Vijayawada & Visakhapatnam. Two Wheeler must. Interested Candidates can send their Biodata Email: bgowri@hotmail.com (or) © 9246531933.

Wanted Digital Marketing Exec. min 2 Yrs exp. Able to manage all tasks independently Handsome Salary Vij: +917036191599

FACULTY/ TEACHERS

Wanted Social teacher. Qua: BA/ MA with B.Ed. Fluency in English is must. Kakatiya High School, Miryalaguda. © 99480 32259, 98491 83913, 99084 24733.

ACCOUNTING

అకౌంటెంట్ కావలెను. Male Only. ప్రముఖ సంస్థలో పనిచేయుటకు Tally, Data Entryలో అనుభవంగల అకౌంటెంట్ కావలెను. 9390341499

BOOK YOUR COLOUR CLASSIFIED
₹1200/-
(5 Lines)
BLACK & WHITE CLASSIFIED
₹1025/-
(5 Lines)
PH: 98496 97616
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

కాల్వలకు 5,114 క్యూసెక్కుల సాగునీరు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టాలోని పంట కాల్వలకు శనివారం 5,114 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేశారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువకు 2,816, కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు 2,212, గుంటూరు ఛానల్‌కు 86 క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువ నుంచి రైవస్ కాల్వకు 1,705, ఏలూరు 708, కేఈబీ (దివిసీమ) 302, బందరు కాల్వకు 101 క్యూసెక్కుల మేర ఇస్తున్నారు.

రామోజీ ఫిల్మ్‌సిటీ వేదిక.. శీతాకాల వేడుక

● ఈ నెల 18 నుంచి నెల రోజుల సందడి



18th DEC '25 - 18th JAN '26



● 'వింటర్ ఫెస్ట్'కు సర్వం సిద్ధం

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: శీతాకాల వేడుకలతో పర్యాటకులను అలరించేందుకు ప్రఖ్యాత రామోజీ ఫిల్మ్‌సిటీ ముస్తాబైంది. ఈనెల 18వ తేదీ నుంచి నెల రోజుల పాటు కొనసాగే 'వింటర్ ఫెస్ట్'కు సర్వంసిద్ధమైంది. జనవరి 18 వరకు జరిగే ఈ ఫెస్ట్‌లో సందర్శకులను మంత్రముగ్ధులను చేసే సినీ మ్యూజిక్‌తో పాటు సెలవు రోజుల్లో ఆబాలగోపాలాన్ని ఆకట్టుకొనే కార్నివాల్ పరేడ్, మనసుకు హత్తుకొనేలా మ్యూజికల్ గ్లో గార్డెన్, మాయాలోక్‌తో పాటు మరెన్నో అలరించే అంశాలు ఉండనున్నాయి.

ప్రత్యేక ఆకర్షణగా స్టూడియో టూర్.. వేడుకల్లో భాగంగా ఫిల్మ్‌సిటీ సందర్శన సమయం రాత్రి 9 గంటల వరకు పొడిగించారు. ప్రకాశవంతమైన వాతావరణంలో ఫిల్మ్‌సిటీ అందాలను వీక్షించే అవకాశం కల్పించారు. సకుటుంబ సమేతంగా, బంధుమిత్రులతో ఫెస్ట్‌ను ఆస్వాదించేందుకు వచ్చే పర్యాటకులకు అద్వితీయ సినిమా సెట్ల సందర్శనతో సాగే స్టూడియో టూర్ ఆకట్టుకుంటుంది. లైవ్ షోలు, వైల్డ్ వెస్ట్ స్టంట్స్, ఉత్తేజకరమైన రైడ్స్, సాహసాల వేదిక సాహస్, బర్డ్ పార్కు సందర్శనతో ఇదో మధుర జ్ఞాపకంగా మలుచుకోవచ్చు.

న్యూ ఇయర్ పార్టీ...
డిసెంబరు 31న నూతన సంవత్సరంలోకి అడుగిడే క్షణాలను సరికొత్త ఉత్సాహంతో గడిపేందుకు రామోజీ కార్నివైబ్ 2026 ఉంటుంది. వార్ ఆఫ్ డీజేలు, లైవ్ బ్యాండ్, ప్రత్యేక ప్రదర్శనలతో దీనిని ఏర్పాటు చేస్తున్నారు. అతిపెద్ద ఓపెన్ ఎయిర్ డ్యాన్స్ ఫ్లోర్‌లో 2026 కౌంట్ డౌన్ ఉత్కంఠభరిత క్షణాలను ఆస్వాదించేందుకు అవకాశం ఉంటుంది. అపరిమిత ఆహారం, పానీయాలతో వీనులవిందైన సంగీత ప్రదర్శనలతో సాగే ఈ వేడుకలో సందర్శకులు పాలుపంచుకోవచ్చు.

అబ్బురపరిచే కార్నివాల్
అద్భుత శకటాలతో అబ్బురపరిచే కార్నివాల్ పరేడ్‌లో కళాకారుల నృత్య ప్రదర్శనలు, వివిధ వేషధారణలతో చిన్నా పెద్దా అందరూ సరికొత్త అనుభూతిని పొందే అవకాశం ఉంటుంది. మిరుమిట్లు గొలిపే ఫిల్మ్‌సిటీ అందాల మధ్య ఆనందతీరాలను చవిచూడవచ్చు. మ్యూజికల్ గ్లో గార్డెన్ సరికొత్త లోకాన్ని కళ్ల ముందుకు తెస్తుంది. ఐకానిక్ సినిమా సెట్ల మాయాజాలాన్ని మాయాలోక్ సందర్శనతో వీక్షించవచ్చు. సెట్ల డిజైన్, కళాత్మక నైపుణ్యంతో తెరవెనుక జరిగే కృషి కళ్ల ముందు సాక్షాత్కరిస్తుంది.

ప్రత్యేక ప్యాకేజీలు, సౌకర్యాలు
వింటర్ ఫెస్ట్, న్యూ ఇయర్ వేడుకలకు వివిధ ప్రత్యేక ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. కాల్ ఆన్ డ్రైవర్, బేబీ కేర్ కోసం క్రెష్ సౌకర్యాలను పర్యాటకులు వినియోగించుకోవచ్చు.

మరిన్ని వివరాలకు:
www.ramojifilmcity.com
లాగిన్ అవ్వండి.
కాల్ సెంటర్ నంబర్: 7659876598

వేగా జ్యువెలర్స్‌లో ప్రత్యేక ఆఫర్లు

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: రానున్న పండగల సందర్భంగా విజయవాడ ఎంజీ రోడ్డులోని నందమూరి మార్గంలో వేగా జ్యువెలర్స్‌లో ప్రత్యేక ఆఫర్లు ఇస్తున్నారు. వీటికి సంబంధించిన బ్రోచర్‌ను 'మిరాయ్' సినిమా హీరోయిన్ రితికా నాయక్ శనివారం షోరూమ్‌లో ఆవిష్కరించారు. అన్ని అంతస్తుల్లో తిరుగుతూ ఆభరణాలను పరిశీలించి సందడి చేశారు. ఆమె మాట్లాడుతూ సరికొత్త సంప్రదాయ ఆభరణాలను అందిస్తూ వేగా జ్యువెలర్స్ వినియోగదారుల ఆదరణ, నమ్మకాన్ని పొందుతోందన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రజలకు రానున్న ధనుర్మాసం, క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి లాంటి పర్వదినాలను మరింత వైభవంగా జరుపుకొనేందుకు ఈ నెల 15 నుంచి ప్రత్యేక ఆఫర్లు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. బంగారు ఆభరణాల తరుగుపై 50 శాతం తగ్గింపు, పోల్కి ఆభరణాలపై తయారీ, తరుగు ఛార్జీలు ఉండవని వెల్లడించారు. ఈ ఆఫర్లు విజయవాడ, కాకినాడ, ఏలూరు, హైదరాబాద్ షోరూమ్‌లో ఉన్నాయని రితికా నాయక్ తెలిపారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న హీరోయిన్ రితికా నాయక్

లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : కార్మికవర్గానికి నష్టం కలిగించే లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మికవర్గం ఐక్యంగా ఆందోళనలు చేపట్టాలని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వి. గోపాల్ గౌడ సూచించారు. సీఐటీయూ అఖిల భారత మహాసభల సందర్భంగా ఎంబీ విజ్ఞాన కేంద్రంలో శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. వందేళ్ల క్రితం కార్మికవర్గం పోరాడి 29 కార్మిక చట్టాలను సాధించుకుందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుగుణంగా లేబర్‌కోడ్‌లు తెచ్చిందన్నారు. కార్మికులు సంఘాలు పెట్టుకోవడం, సమ్మె చేసే హక్కులు లేకుండా చేయడం వల్ల భవిష్యత్తులో భద్రత ఉండదన్నారు. జాతీయ కనీస వేతనం రోజుకు రూ.178లు ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. పెరుగుతున్న ధరలు కార్మికులను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలిపారు. కొత్త హక్కులను కల్పించకపోగా ఉన్నవి కాలరాస్తున్నారని విమర్శించారు. వీటిపై చట్టసభల్లో చర్చలు జరగడం లేదని పేర్కొన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రజల ప్రతినిధులుగా కాకుండా.. పార్టీల ప్రతినిధులుగా మారారని విమర్శించారు. రాజ్యాంగం, సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులకు భిన్నంగా తెచ్చిన లేబర్‌కోడ్‌లు.. కేవలం యాజమాన్యాల కోసమేనన్నారు. కార్మికవర్గం వల్లే ఉత్పాదకత పెరిగి దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ.. లేబర్‌కోడ్‌ల రద్దు కోసం దేశవ్యాప్తంగా కార్మికసంఘాలు పోరాడుతున్నాయని చెప్పారు. ఫిబ్రవరిలో సమ్మెకు పిలుపునిచ్చాయని తెలిపారు. డిసెంబరు 31 నుంచి విశాఖపట్నంలో నిర్వహించే సీఐటీయూ ఆలిండియా మహాసభలను కార్మికులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎంబీవీకే కార్యదర్శి పి.మురళీకృష్ణ మాట్లాడుతూ.. కార్మికుల వల్లే సమాజం అభివృద్ధి చెందిందన్నారు. ప్రభుత్వాలు కార్పొరేట్ల కోసం పని చేస్తున్నాయని దుయ్యబట్టారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, ముజఫర్ అహ్మద్, ఎన్.సి.హెచ్. శ్రీనివాస్, దయా రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జస్టిస్ గోపాల్ గౌడ. పక్కన నాగేశ్వరరావు, శ్రీనివాస్

సంప్రదాయ కళల ప్రోత్సాహానికి ప్రభుత్వం కృషి


బహుమతులు గెలుపొందిన వారితో అతిథులు, నిర్వాహకులు

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : ఆంధ్ర నాట్య సంప్రదాయాన్ని పరిరక్షించి, ప్రోత్సహించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఏపీ సృజనాత్మక, సంస్కృతిక సమితి ఛైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి అన్నారు. శనివారం గవర్నర్‌పేటలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఆంధ్ర రాష్ట్ర క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్, స్వరనర్తన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆంధ్రనాట్యం 3వ వార్షికోత్సవం పురస్కరించుకుని 'ఆంధ్ర నాట్య సంగమం' నృత్య పోటీలు నిర్వహించారు. తేజస్వినితోపాటు అభినవ సత్యభామ గురు డా.కళాకృష్ణ, పద్మ మోహన్ దెందులూరి పాల్గొని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు ప్రసంగించారు. ఆంధ్ర నాట్యానికి ఉన్న విశిష్టతను తెలియజేశారు. దివంగత గురు పద్మశ్రీ డా.నటరాజ రామకృష్ణ అందించిన సేవలను కొనియాడారు. సంప్రదాయ వారసత్వమైన ఈ నృత్య రూపకాన్ని భవిష్యత్తు తరాలకు సజీవంగా అందించాలని పేర్కొన్నారు. ఆ దిశగా గురువులు, తల్లిదండ్రులు మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ సంస్థల విద్యార్థులు పాల్గొని తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. అతిథులు విజేతలకు బహుమతులు అందజేశారు. స్వరనర్తన డైరెక్టర్లు స్రవంతి, సునీల గొల్లపూడి, శ్రీపేరిణి పవన్ కుమార్, కల్పన, శ్రీధర్మ, సంధ్యా, మహతి, శ్రీనర్తన, నిఖిత తదితరులు పర్యవేక్షించారు.


కళాకారిణుల నృత్య ప్రదర్శన

విజేతలు వీరే..

జూనియర్స్ విభాగంలో : రామకృష్ణ నృత్య కళా క్షేత్రం బృందం ప్రథమ, గీర్వాణి నృత్య నికేతనం బృందం, ప్రసాద్ నృత్య నికేతన్ ద్వితీయ, నటరాజ ఆర్ట్స్ రామకృష్ణ ఆర్ట్స్ అకాడమీ, తరంగిణి నృత్యాలయం తృతీయ, నటరాజ నృత్యాలయం కన్సోలేషన్.

సీనియర్స్ విభాగంలో : రామకృష్ణ నృత్య కళాక్షేత్రం బృందం ప్రథమ, శివ సాయి నృత్య కళాక్షేత్రం బృందం ద్వితీయ, నటరాజ ఆర్ట్స్ రామకృష్ణ ఆర్ట్స్ అకాడమీ బృందం తృతీయ, కళా ప్రియ నృత్య కళాక్షేత్రం బృందం కన్సోలేషన్ బహుమతులు గెలుచుకున్నారు.

సత్వర పరిష్కారం.. ఇరుపక్షాలదీ విజయం



ప్రారంభ సభలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి గోపీ

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకుంటే ఇరుపక్షాలు విజయం సాధించినట్లేనని జిల్లా జడ్జి జి.గోపీ అన్నారు. మచిలీపట్నం జిల్లా కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి మాట్లాడుతూ రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా ఇరువర్గాల మధ్య శాంతియుత వాతావరణం నెలకొంటుందన్నారు. అంతేకాకుండా విలువైన డబ్బు, సమయం ఆదా అవుతాయన్నారు.

న్యాయమూర్తులు గాజుల వెంకటేశ్వర్లు, బాబూనాయక్ సుజాత, శాశ్వత లోక్‌అదాలత్ ఛైర్మన్ ఒ.వెంకటనాగేశ్వరరావు, న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు దివి పోతురాజు, పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసులు, వివిధ సంస్థల అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకున్న వారికి అవార్డు పత్రాలు అందజేశారు.

ఉమ్మడి కృష్ణా జిల్లాలో 43,824 కేసుల పరిష్కారం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ కోర్టుల్లో 49 బెంచిలు ఏర్పాటు చేసి 43,824 కేసులు పరిష్కరించినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కేవీఆర్ కృష్ణయ్య తెలిపారు. 38,525 క్రిమినల్, 331 సివిల్, 1,313 చెక్‌బౌన్స్ కేసులు పరిష్కరించినట్లు పేర్కొన్నారు. 142 మోటారు వాహన ప్రమాద కేసులు పరిష్కరించి రూ.9.85 కోట్లు పరిహారంగా అందించినట్లు వివరించారు. వీటితో పాటు 3,513 ప్రీలిటికేషన్ కేసులు పరిష్కరించినట్లు వెల్లడించారు.

ఇరుముడి సమర్పణకు పోటెత్తిన భవానీలు

జగన్మాత నామస్మరణతో మార్మోగిన గిరిప్రదక్షిణ మార్గం


తరలి వస్తున్న దీక్షాధారులు


వేకువ జామున ఫుట్ బ్రిడ్జిపై ఇలా..

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: భవానీ దీక్షల విరమణ మూడో రోజు శనివారం పెద్ద సంఖ్యలో దీక్షాధారులు తరలి రావడంతో ఇంద్రకీలాద్రి పరిసరాలు అరుణవర్ణంగా మారాయి. గిరిప్రదక్షిణ మార్గం భవానీల నామస్మరణతో మార్మోగింది. రాత్రికి లక్షకు పైగా భవానీలు అమ్మవారిని దర్శించుకున్నారని దేవస్థానం అధికారులు తెలిపారు. భవానీల రద్దీని దృష్టిలో పెట్టుకొని అన్నప్రసాద తయారీ కేంద్రంలో అన్నప్రసాదానికి బదులు సాంబారు అన్నం, పొంగలి, దద్దోజనం పంపిణీ చేశారు. అన్నప్రసాద తయారీ కేంద్రంతోపాటు ఎలివేటెడ్ క్యూలైను కాంప్లెక్సులో కూడా దీక్షాధారులకు అల్పాహారం అందించారు. శనివారం రాత్రి భవానీల తాకిడి పెరగడంతో గిరిప్రదక్షిణ మార్గంలో స్వచ్ఛంద సంస్థలు అల్పాహారం, పాలు, పండ్లు పంచారు. ఈ రద్దీ ఆదివారం రాత్రి వరకు కొనసాగుతుందని అధికారులు అంచనా వేసి చర్యలు తీసుకుంటున్నారు.

☛ వేకువ జామునే చిన్నారులతో కలిసి భవానీ దీక్షాధారులు జగన్మాత నామస్మరణతో గిరిప్రదక్షిణ చేశారు. భక్తులకు కోరినంత లడ్డు ప్రసాదం అందజేసినట్లు అధికారులు తెలిపారు. కేశఖండన శాల, ఘాట్ల వద్ద క్షేత్రస్థాయిలో ఈవో శీనానాయక్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

విరమణల ఏర్పాట్లలో రాజీలేదు

ఇన్‌ఛార్జి కలెక్టర్ ఇలక్కియా


గురుభవానీలతో మాట్లాడుతున్న ఇలక్కియా

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: భవానీ దీక్షా విరమణలకు భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన, ఏర్పాట్లపై రాజీపడలేదని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఇలక్కియా తెలిపారు. శనివారం దుర్గగుడి ఆలయ పరిసరాలలో ఆమె పర్యటించారు. ఆలయానికి విచ్చేసిన ఆమె క్యూలైన్‌లోని భవానీలతో మాట్లాడారు. ఇరుముడులు స్వీకరణ, హోమగుండం కార్యక్రమాలను వీక్షించారు. అనంతరం ఐసీడీఎస్ అధికారులు వేస్తున్న చైల్డ్ ట్యాగ్‌లు పరిశీలించారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా ఆలయ పరిసరాలు, గిరిప్రదక్షిణ మార్గాలను నగర సీపీ రాజశేఖరబాబుతో కలిసి పర్యవేక్షించారు. భవానీ దీక్షల విరమణల కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో కావూరి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజు ఆదాయం రూ.62.09 లక్షలు

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: భవానీ దీక్షల విరమణ వేడుకల్లో మూడో రోజు రాత్రి 09 గంటలలోపు అమ్మవారిని 94 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా మొత్తం రూ.62,09,425 సమకూరింది.

★ రూ.15 లడ్డూలు: రూ.26,355 ★ రూ.100 లడ్డూలు: రూ.57,49,400 ★ శ్రీచక్రార్చన లడ్డూలు: రూ.1100 ★ కేశఖండన శాల ద్వారా: రూ.4,32,520 ★ ఇతర సేవల ద్వారా రూ.50 వచ్చాయని.. 36,512 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారని ఆలయ అధికారులు వెల్లడించారు.

రాబోయే రెండ్రోజులు అప్రమత్తంగా ఉండాలి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: రానున్న రెండు రోజులు భవానీ దీక్షాధారుల రద్దీని నియంత్రించేందుకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీపీ రాజశేఖరబాబు సూచించారు. ఇన్‌ఛార్జి కలెక్టర్ ఇలక్కియాతో కలిసి సీపీ రాజశేఖరబాబు పరిస్థితిని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి శనివారం సీసీ కెమెరాల్లో పరిశీలించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సమన్వయ బృందాలు భక్తులకు ఎదురవుతున్న సమస్యలను గుర్తించి అధికారులకు తెలియజేయాలని సూచించారు. క్రౌడ్ మేనేజ్‌మెంట్ శాంతి భద్రతల పరిరక్షణ, క్యూలైన్లు, ప్రసాదాల కౌంటర్లు ప్రతి విషయంలోను సీసీ కెమెరాలు, ఏఐ కెమెరాలను వినియోగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీసీపీ షిరీన్ బేగం, ఆర్డీవో కావూరి చైతన్య తదితరులు పాల్గొన్నారు.


కమాండ్ కంట్రోల్ రూమ్‌లో చర్చిస్తున్న సీపీ రాజశేఖరబాబు, డీసీపీ షిరీన్‌బేగం

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు



◆ భారత వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య (ఫిక్కీ) నూతన అధ్యక్షుడిగా 2025–26 సంవత్సరానికి ఇటీవల ఎవరు ఎన్నికయ్యారు? (దేశంలోని అత్యంత ప్రముఖ వ్యాపార సంఘాల్లో ఒకటైన ఎఫ్ఐసీసీఐను 1927లో స్థాపించారు.)

జ: అనంత్ గోయెంకా (ఆర్‌పీజీ గ్రూప్ వైస్ ఛైర్‌పర్సన్)

◆ ప్రపంచ ఆహార దినోత్సవాన్ని ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? ('సస్టెయినబుల్ ఫుడ్ సిస్టమ్స్ ఫర్ ఏ హెల్తీ ప్లానెట్' అనే థీమ్‌తో ఈ ఏడాది దినోత్సవాన్ని నిర్వహించారు.)

జ: అక్టోబరు 16

◆ భారతదేశం అంతటా ఎన్ని మెగా వాట్ల సౌర ప్రాజెక్టులను అభివృద్ధి చేయడానికి రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) ఇటీవల ఎస్ఈసీఐ (సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)తో ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.)

జ: 300 మెగావాట్లు

◆ విశాఖపట్నంలో ప్రపంచ స్థాయి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి రాబోయే ఐదేళ్లలో ఎంత మొత్తం పెట్టుబడి గూగుల్ పెట్టనుంది?

జ: రూ.15 బిలియన్ డాలర్లు

◆ దేశంలోని పురాతన నౌకా నిర్మాణ సంస్థల్లో ఒకటైన హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్)కు భారత ప్రభుత్వం ఇటీవల ఏ హోదాను ప్రదానం చేసింది?

జ: మినీరత్న

మరింత సమాచారం

దరఖాస్తు చేశారా?

☛ ఎయిమ్స్ డియోఘర్‌లో జూనియర్ రెసిడెంట్లు
చివరి తేదీ: 18.12.2025

☛ హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్‌లో జూనియర్ మేనేజర్ ఖాళీలు (64)
చివరి తేదీ: 17.12.2025

చివరి సుల్తాను వంశాలు

మహమ్మద్ బిన్ తుగ్లక్ పాలనాకాలంలో ఏర్పడిన ఆర్థిక సంక్షోభ పరిణామాల పట్ల తర్వాత వచ్చిన సుల్తానులు సమర్థంగా వ్యవహరించలేకపోయారు. ఫలితంగా సుల్తాను రాజ్యం బలహీనపడింది. తైమూర్ దండయాత్ర (1398) కారణంగా రాజ్యం వదిలి పారిపోయిన తుగ్లక్ వంశీయుడైన నసీరుద్దీన్ మహమ్మద్ తర్వాత కొంత కాలానికి తిరిగి దిల్లీ చేరి సింహాసనాన్ని అధిష్ఠించినప్పటికీ, అప్పటికే రాజ్య ప్రతిష్ఠ దిగజారిపోయింది. గత ప్రాభవాన్ని నసీరుద్దీన్ తిరిగి పునరుద్ధరించలేకపోయాడు. క్రీ.శ.1413లో ఆయన మరణించడంతో దిల్లీ సర్దారులు దౌలత్ ఖాన్‌ను సింహాసనంపై కూర్చోబెట్టారు. తర్వాత పరిణామాల్లో తైమూరు ప్రతినిధి, ముల్తాన్ పాలకుడైన ఖిజర్ ఖాన్ సయ్యద్ 1414లో దౌలత్ ఖాన్‌ను ఓడించడంతో దిల్లీ సింహాసనంపై సయ్యద్ వంశ పాలన ప్రారంభమైంది.

సయ్యద్ వంశం

క్రీ.శ.1414 నుంచి 1451 వరకు సయ్యద్ వంశం దిల్లీ సుల్తాన్ రాజ్యాన్ని పరిపాలించింది. ఈ వంశంలో ప్రధానంగా నలుగురు పాలకులు ఉన్నారు.



ఖిజర్ ఖాన్ (1414–21): ఇతడు స్వతంత్ర పాలకుడిగా వ్యవహరించలేదు. తైమూర్‌కు ప్రతినిధినని ప్రకటించుకున్నాడు. ఇతడి పరిపాలనా కాలమంతా తిరుగుబాట్లను అణచడంలోనే సరిపోయింది. అధికారం దిల్లీకి మాత్రమే పరిమితమైంది.

ముబారక్ షా (1421–34): ఇతడు ఖిజర్ ఖాన్ కుమారుడు,, అసమర్థుడు. పాలనాకాలంలో అంతర్వేది, భటిండా, బయానా, మేవాడ్‌లో తిరుగుబాట్లు జరిగాయి. దీపాల్‌పూర్, లాహోర్ ప్రాంతాల్లో కొక్కొరులు అనే దొంగలు విజృంభించగా వారిని అణచలేకపోయాడు. 1434లో 'సర్వార్ ఉల్ ముల్క్' అనే వజీరు ముబారక్ షాను వధించి సింహాసనాన్ని అధిష్ఠించాడు. సయ్యద్ వంశం గురించి తారిఖ్ ముబారక్ షాహీ గ్రంథంలో యాహ్యా బిన్ సర్ హింద్ వివరించాడు.

మహమ్మద్ షా (1434–45): ముబారక్ షా హత్య తర్వాత 'సర్వార్ ఉల్ ముల్క్' మహమ్మద్ షాను దిల్లీ సింహాసనంపై నామమాత్రంగా కూర్చోబెట్టాడు. అతడే సర్వాధికారిగా వ్యవహరించాడు. దేశంలో శాంతిభద్రతలు లోపించి గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

అల్లావుద్దీన్ ఆలం షా (1445–51): మహ్మద్ షా మరణానంతరం అతడి కుమారుడైన అల్లావుద్దీన్ ఆలం షా దిల్లీ సుల్తాను అయ్యాడు. ఇతడూ అసమర్థుడే. ఇతడి కొలువులోని సర్దారు హమీద్ ఖాన్ కుట్ర పన్ని లాహోర్ గవర్నర్ అయిన బహలాల్ లోడీని దిల్లీపై దండెత్తి రావాలంటూ ఆహ్వానం పంపాడు. 1451లో బహలాల్ లోడీ దిల్లీపై దాడి చేసి హమీద్ ఖాన్‌ను బంధించగా, అది విని ఆలం షా బదౌన్‌కు పారిపోయాడు. అంతటితో సయ్యద్ వంశ పాలన ముగిసింది.





మహాశక్తిమంతమైన తుగ్లక్ వంశం పాలనపై పట్టు కోల్పోతున్న నాటి నుంచే దిల్లీ సుల్తానుల సామ్రాజ్య పతనం ప్రారంభమైంది. మహమ్మద్ బిన్ తుగ్లక్ తీసుకున్న అసంబద్ధ నిర్ణయాల భారం, ఫిరోజ్‌షా తుగ్లక్ తర్వాత వచ్చిన బలహీన వారసుల అంతర్గత కుమ్ములాటలు, దిల్లీ సామ్రాజ్యాన్ని చిన్నాభిన్నం చేశాయి. అదే సమయంలో తైమూర్ ఆక్రమణ దిల్లీ సింహాసనం ప్రతిష్ఠను నేలమట్టం చేసింది. ఈ అనూహ్య పరిణామాల అనంతరం నెలకొన్న రాజకీయ శూన్యతను పూరిస్తూ మొదలైన సయ్యద్ వంశ నామమాత్ర పాలన దిల్లీ చుట్టుపక్కల ప్రాంతాలకే పరిమితమై, సుల్తానుల వైభవాన్ని క్షీణింపజేసింది. అనంతరం పాలన చేపట్టిన లోడీలు పూర్వ ప్రాభవాన్ని తీసుకురావడానికి ప్రయత్నించినప్పటికీ ప్రాంతీయ తిరుగుబాట్లు, కలహాలతో సతమతం కావడంతో బాబర్ రూపంలో కొత్త శక్తికి దారులు ఏర్పడ్డాయి. ఈ పరిణామ క్రమాన్ని పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. సయ్యద్, లోడీ వంశాల పాలనా వైఫల్యాలు, పాలకుల తప్పులు మొగల్ సామ్రాజ్య ఆవిర్భావానికి మార్గాన్ని సుగమం చేసిన తీరును అర్థం చేసుకోవాలి.

పట్టు కోల్పోయి.. పతనానికి చేరి!

లోడీ వంశం (1451-1526)



బహలాల్ లోడీ (1451–89): బహలాల్ సమర్థుడు అయినప్పటికీ నిరంతర యుద్ధాల్లో నిమగ్నమవడంతో చక్కటి పాలనా యంత్రాంగాన్ని ఏర్పాటు చేయలేకపోయాడు. ఇతడు దయార్ద్ర హృదయుడు, సారస్వతాభిమాని. సమర్థ న్యాయవ్యవస్థను ఏర్పరచి, ప్రజలకు సత్వర న్యాయం అందించడానికి కృషి చేశాడు. అప్పటికే క్షీణించిన సుల్తానత్ ప్రతిష్ఠను కొంతవరకు పునరుద్ధరించాడు.

సికందర్ షా (1489–1517): బహలాల్ లోడీ మరణానంతరం అతడి కుమారుడు నిజాంఖాన్ 'సికందర్ షా' అనే బిరుదుతో దిల్లీ సింహాసనాన్ని అధిష్ఠించాడు. ఇతడికి పాలనాదక్షత లేనప్పటికీ, రాజ్య విస్తరణకాంక్ష ఉంది. సామ్రాజ్య విస్తరణ కోసం కొన్ని దండయాత్రలు చేసి ఆగ్రా పట్టణాన్ని నిర్మించాడు. దిల్లీ కొలువులో ప్రాబల్యం వహించి, సుల్తాను అధికారాలకు సవాలుగా ఉన్న సర్దారులను అణచివేసి సుస్థిర పాలన అందించాడు. సమర్థ గూఢచారి వ్యవస్థ ఏర్పరిచి రాజోద్యోగుల మీద, కుట్రదారులైన సర్దారుల మీద పటిష్ఠ నిఘా ఏర్పరిచాడు. ఆహార వస్తువులు, వర్తక వ్యాపారాలపై ఉన్న అనేక అనవసరమైన చిల్లర పన్నులు రద్దు చేసి ఆహారోత్పత్తికి, వ్యాపారాభివృద్ధికి తోడ్పాటు ఇచ్చాడు. రైతులకు రుణాలు మంజూరు చేసి వ్యవసాయాభివృద్ధికి కృషి చేశాడు. నూతన రహదారులు నిర్మించాడు. సికందర్ పారశీక భాషలో గొప్ప పండితుడు. అనేకమంది పండితులను పోషించాడు. సంస్కృత భాషలోని వైద్య గ్రంథాలను పారశీకంలోకి తర్జుమా చేయించాడు. అయితే సికందర్ పరమత ద్వేషి. హిందువుల పట్ల క్రూరంగా వ్యవహరించాడు, జిజియా పన్ను చెల్లించాలని ఆదేశించాడు.



జనరల్ స్టడీస్
భారతదేశ చరిత్ర

ఇబ్రహీం లోడీ (1517–26): ఇతడు సికందర్ లోడీ కుమారుడు. సర్దారులను తన అదుపాజ్ఞల్లో ఉంచడానికి కఠిన నిబంధనలు విధించాడు. సర్దారులు కూడా సామాన్య పౌరుల మాదిరి తన ఎదుట చేతులు కట్టుకుని నిలబడాలని, తనతో శిరస్సు వంచి మాట్లాడాలని ఆజ్ఞాపించి అవమానించాడు. చిన్న నేరాలకు కూడా కఠిన శిక్షలు విధించాడు. ప్రజల పట్ల కూడా క్రూర ప్రవర్తనతో, దురహంకారంతో రాజ్యపాలన చేసి అన్నివర్గాల ప్రజలను దూరం చేసుకున్నాడు. ఇతడి చర్యలు సహించలేని సర్దారులు తిరుగుబాటు చేసి అల్లకల్లోల పరిస్థితులు సృష్టించారు. ఇబ్రహీం లోడీ చర్యలు నానాటికీ మితిమీరడంతో అతడి బంధువైన ఆలంఖాన్ లోడీ కుట్ర పన్నాడు. కాబూల్ పాలకుడైన బాబర్‌ను భారతదేశంపై దండెత్తి రావాల్సిందిగా ఆహ్వానించాడు. బాబర్ 1526లో భారతదేశంపై దాడి చేశాడు. ఇబ్రహీం లోడీని మొదటి పానిపట్టు యుద్ధంలో చంపి దిల్లీ, ఆగ్రాలను స్వాధీనం చేసుకుని మొగల్ సామ్రాజ్యాన్ని స్థాపించాడు. ఇబ్రహీం లోడీ మరణంతో లోడీ వంశంతో పాటు దిల్లీ సుల్తానత్ యుగం అంతమైంది.

సుల్తానత్ పతనానికి కారణాలు

సుల్తానుల రాజ్యం 1526 నాటికి పలు కారణాలతో పతనమైంది. అ) మహమ్మద్ బిన్ తుగ్లక్ రాజధానిని దౌలతాబాద్‌కు మార్చడం, రాగి నాణేల ముద్రణ, ఖోరసాన్, ఖారజాల్ దండయాత్రలు తదితర చర్యలతో ఖజానా ఖాళీ అయింది. దాంతో తిరుగుబాట్లు జరిగి విజయనగరం, బహమనీ లాంటి స్వతంత్ర రాజ్యాలు ఏర్పాటయ్యాయి. ఆ) ఫిరోజ్ షా తుగ్లక్ బానిసత్వ విధానం, జాగీర్దారీ పద్ధతి, సైన్యంలో వారసత్వం, హిందువులపై అమానుష వైఖరి మరింత పతనానికి దోహదం చేశాయి. ఇ) దిల్లీ సుల్తానుల్లో ఎక్కువ మంది పరమత ద్వేషాన్ని ప్రదర్శించి హిందూ సమాజానికి శత్రువులయ్యారు. ఈ) తరచూ వారసత్వ యుద్ధాలు చేయడంతో రాజ్యంలో అల్లకల్లోల పరిస్థితులు ఏర్పడి రాజ్యపతనానికి దారితీసింది. ఉ) సర్దారులు కీచులాడుకోవడం, ముఠాలుగా ఏర్పడడం, కుట్రలు పన్నడంతో ఐక్యత కొరవడి, పాలనావ్యవస్థ కుంటుపడింది. ఊ) మహమ్మద్ తుగ్లక్ లోపభూయిష్ఠ సంస్కరణలతో సైనిక వ్యవస్థ బలహీనపడింది. సయ్యద్, లోడీ వంశస్థులు సైనికంగా బలహీనమయ్యారు. రాజ్యవిచ్ఛిన్నాన్ని, దండయాత్రలను నిలువరించలేకపోయారు.



రచయిత:
వి.వి.ఎస్.రామావతారం

JUNIOR INTER Mathematics
Sets

Final Exams-2026
IMPORTANT Q & A

1 Mark

1. List of elements of the set {x : x is an integer, $x^3 \le 50$}
   1) {2, 3, 4} 2) {1, 3, 4} 3) {1, 2, 3} 4) {1, 2, 4}

A: 3

2. Set builder form of {1, 2, 3, 4} is
   1) {x : x is a positive integer, $x^2 < 30$}
   2) {x : x is a positive integer, $x^2 + 1 < 20$}
   3) {x : x is a positive integer, $x^2 - 1 < 15$}
   4) {x : x is a positive integer, $2x + 1 < 20$}

A: 2

3. A = {1, 2, 3, 4, 5}, B = {4, 5, 6, 7, 8} then $(A - B) \cup (B - A)$.
   1) {1, 2, 3, 4, 5, 6, 7, 8}
   2) {1, 2, 3, 6, 7, 8}
   3) {1, 2, 4, 5, 6}
   4) { 2, 4, 6, 8}

A: 2

4. If A = {1, 2, 3, 4}, B = {2, 3, 4}, C = {3, 4, 5, 6} then $A \cap (B \cup C)$.
   1) {2, 3, 4} 2) {1, 2, 3, 4}
   3) {3, 4, 5, 6} 4) {1, 6}

A: 1

5. Which of the following is false?
   1) $(A')' = A$ 2) $A \cup A' = \phi$
   3) $(A \cup B)' = A' \cap B'$ 4) $\phi' = U$ (U is universal set)

A: 2

6. If u = {1, 2, 3, 4, 5} and A = (2, 3}, then $\phi' \cap A$ = ...
   1) ϕ 2) U 3) A 4) {1, 4, 5}

A: 3

7. Which of the following is not a subset of (a, b, c, d}?
   1) ϕ 2) {a, b} 3) {d, e} 4) {b, d}

A: 3

8. Write the solution set of the equation $x^2 + x - 2 = 0$ in roster form.

A: The given equation can be written as
$(x - 1)(x + 2) = 0 \Rightarrow x = 1, -2$
roster form = {1, –2}

9. Write the set A = {1, 4, 9, 25, ...} in set–builder form.

A: A = {x : x is the square of a natural number}
$A = \{x : x = n^2$, when $n \in N\}$

For more IMP Q & A



Writer: U.Prasanna Kumar

కూడంకుళం నుంచే అధిక అణువిద్యుత్తు!

అణు సాంకేతికతలో అద్భుతమైన ఆవిష్కరణ అణురియాక్టరు. విద్యుత్తు తయారీ, పరిశ్రమలతో పాటు వైద్య రంగంలో వినియోగించే ఐసోటోపుల ఉత్పత్తి, వివిధ పదార్థాలపై పరిశోధనలు తదితర అనేక ప్రయోజనాలను సమకూర్చే ఈ పరికరం అభివృద్ధి ఆధునిక టెక్నాలజీలో గొప్ప విజయం. అణురియాక్టర్లు పనిచేసే విధానం, వాటిలోని వివిధ రకాలు, ఉపయోగాల గురించి అభ్యర్థులు పోటీ పరీక్షల కోణంలో చదువుకోవాలి. దేశంలో పలు ప్రాంతాల్లో ఏర్పాటైన అణురియాక్టర్లు, వాటి సామర్థ్యం, వినియోగిస్తున్న ఉద్దేశం, వాడుతున్న ఇంధనాలు, ఇతర పదార్థాలతో పాటు అణువిద్యుత్తు ఉత్పత్తి పెంచడానికి జరుగుతున్న ప్రయత్నాలపై కూడా అవగాహన కలిగి ఉండాలి.



జనరల్ స్టడీస్ - సైన్స్ అండ్ టెక్నాలజీ

అణురియాక్టరు సాంకేతికత


1. అణురియాక్టరు గురించి కిందివాటిలో సరైనవి?



ఎ) అణు రియాక్టరు కేంద్రక విచ్ఛిత్తి అనే సూత్రంపై పనిచేస్తుంది.
బి) పరమాణు బాంబు, అణురియాక్టరు ఒకే సూత్రంపై పనిచేస్తాయి.
సి) శృంఖల చర్య అణురియాక్టరులో నియంత్రిత స్థితిలో ఉంటుంది.
డి) అణు రియాక్టరులో రేడియో ఐసోటోపుల ఉత్పత్తి సాధ్యమవుతుంది.
1) ఎ, బి, సి, డి 2) బి, సి, డి
3) ఎ, డి 4) సి, డి

2. కిందివాటిలో సరైన వాక్యాలు కానివి?
ఎ) అణురియాక్టరులో కేంద్రక సంలీనం నియంత్రిత స్థితిలో ఉంటుంది.
బి) అణురియాక్టరులో రేడియం, బొగ్గును ఇంధనంగా వాడతారు.
సి) కేంద్రక సంలీన ప్రక్రియలో వెలువడిన శక్తిని విద్యుత్తుగా మారుస్తున్నారు.
డి) అణురియాక్టరును ఉపయోగించి అణువిద్యుత్తును ఉత్పత్తి చేయవచ్చు.
1) బి, సి, డి 2) ఎ, బి, సి
3) సి, డి 4) ఎ, బి

3. భారతదేశంలో కింది ఏ రకమైన రియాక్టర్లు ప్రస్తుతం అణువిద్యుత్తు ఉత్పత్తి చేస్తున్నాయి?



బాయిలింగ్ వాటర్ రియాక్టర్

ఎ) బాయిలింగ్ వాటర్ రియాక్టర్లు
బి) ప్రెషరైజ్డ్ హెవీవాటర్ రియాక్టర్లు
సి) ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్లు
డి) అడ్వాన్స్‌డ్ హెవీ వాటర్ రియాక్టర్లు
1) బి, సి 2) సి, డి 3) ఎ, బి 4) ఎ, డి

4. న్యూక్లియర్ రియాక్టరులో వినియోగించే పదార్థాల ఉపయోగాల గురించి కింది వాక్యాల్లో సరైనవి?
ఎ) యురేనియం, ప్లుటోనియం ఇంధనాలుగా ఉపయోగపడతాయి.
బి) మితకారులు న్యూట్రాన్‌ల వేగాన్ని తగ్గిస్తాయి.
సి) బెరీలియం, గ్రాఫైట్, భారజలం మితకారులుగా పనిచేస్తాయి.
1) ఎ, బి 2) ఎ, బి, సి
3) ఎ, సి 4) బి, సి

5. న్యూక్లియర్ రియాక్టరు గురించి కిందివాటిని సరైన క్రమంలో అమర్చండి.

ఎ) అణుఇంధనాలు	1) బెరీలియం, గ్రాఫైట్
బి) మితకారులు	2) యురేనియం, ప్లుటోనియం
సి) నియంత్రణ కడ్డీలు	3) ద్రవ సోడియం, భారజలం
డి) రియాక్టరును చల్లబరిచేవి	4) బోరాన్, కాడ్మియం

1) ఎ-2, బి-1, సి-4, డి-3 2) ఎ-4, బి-3, సి-2, డి-1
3) ఎ-2, బి-4, సి-3, డి-1 4) ఎ-2, బి-3, సి-4, డి-1

6. పరిశోధనా రియాక్టరు అయిన అప్సర గురించి కింది వాక్యాల్లో సరైనవి.



ఎ) ఇది స్విమ్మింగ్‌పూల్ రకం రియాక్టరు.
బి) యునైటెడ్ కింగ్‌డమ్ సహకారంతో నిర్మించారు.
సి) ఎక్కువ ఎన్‌రిచ్డ్ యురేనియాన్ని ఇంధనంగా వాడుకుంటుంది.
డి) దీని విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం 1 మెగావాట్.
1) ఎ, బి, సి, డి 2) సి, డి
3) ఎ, డి 4) బి, సి

7. పరిశోధనా రియాక్టర్లకు సంబంధించిన కిందివాటిని సరైన క్రమంలో అమర్చండి.

ఎ) అప్సర-యూ	1) కెనడా-ఇండియన్ రియాక్టరు
బి) సిరస్	2) 2018లో ప్రారంభించారు
సి) పూర్ణిమా-1	3) యూ - 233 ఇంధనం
డి) పూర్ణిమా-2	4) ప్లుటోనియం ఆక్సైడ్ ఇంధనం
ఇ) జర్లీనా	5) సహజ యురేనియం ఇంధనం

1) ఎ-4, బి-3, సి-2, డి-1, ఇ-5
2) ఎ-2, బి-1, సి-3, డి-4, ఇ-5
3) ఎ-2, బి-1, సి-4, డి-3, ఇ-5
4) ఎ-1, బి-4, సి-3, డి-2, ఇ-5

8. భారతదేశంలోని అణువిద్యుత్తు రియాక్టర్ల గురించి కింది వాక్యాల్లో సరైనవి?
ఎ) న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సంస్థ వీటిని నిర్మించి నిర్వహిస్తుంది.
బి) భారతదేశ మొదటి న్యూక్లియర్ రియాక్టరు తారాపుర్ అటామిక్ పవర్ స్టేషన్ - 1.
సి) తారాపుర్ ఆటామిక్ పవర్ స్టేషన్ యూనిట్ - 1ను అమెరికా సహకారంతో నిర్మించారు.
డి) భారత మొదటి, రెండో అణువిద్యుత్తు రియాక్టర్లు అయిన టీఏపీఎస్ - 1, 2లు బాయిలింగ్ వాటర్ రియాక్టర్లు.
1) బి, సి, డి 2) ఎ, బి, సి, డి
3) సి, డి 4) ఎ, డి

9. అణువిద్యుత్తు రియాక్టర్లు, అవి ఉన్న ప్రదేశాలను సరైన క్రమంలో అమర్చండి.


ఎ) తారాపుర్ అటామిక్ పవర్ స్టేషన్	1) మహారాష్ట్ర
బి) రాజస్థాన్ అటామిక్ పవర్ స్టేషన్	2) కల్పకం
సి) మద్రాస్ అటామిక్ పవర్ స్టేషన్	3) కోటా
డి) కైగా జనరేటింగ్ స్టేషన్	4) ఉత్తర్‌ప్రదేశ్
ఇ) నరోరా అటామిక్ పవర్ స్టేషన్	5) కర్ణాటక

1) ఎ-5, బి-3, సి-2, డి-1, ఇ-4
2) ఎ-1, బి-2, సి-4, డి-3, ఇ-5
3) ఎ-1, బి-3, సి-2, డి-5, ఇ-4
4) ఎ-3, బి-2, సి-4, డి-1, ఇ-5

10. రాజస్థాన్ అటామిక్ పవర్ స్టేషన్ గురించి కింది వాక్యాల్లో సరైనవి?
ఎ) దీన్ని రాజస్థాన్‌లోని కోటాలో నిర్మించారు.
బి) దీనిలోని మొదటి యూనిట్‌ను కెనడా సహకారంతో నిర్మించారు.
సి) మార్చి-2025లో యూనిట్-7ను ప్రారంభించారు.
డి) యూనిట్-7 సామర్థ్యం 700 మెగావాట్లు.
1) ఎ, బి, సి, డి 2) బి, సి, డి
3) ఎ, డి 4) సి, డి

11. కింది వాక్యాల్లో సరైన వాటిని గుర్తించండి.
ఎ) కైగా జనరేటింగ్ స్టేషన్-1 యూనిట్ 895 రోజులు నిరంతరాయంగా పనిచేసి రికార్డు సృష్టించింది.
బి) రాజస్థాన్‌లో అటామిక్ పవర్‌స్టేషన్‌లో 7 యూనిట్లు ఉన్నాయి.
సి) భారత్‌లో ఎక్కువగా ప్రెషరైజ్డ్ హెవీవాటర్ రియాక్టర్లు విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్నాయి.
1) ఎ, బి 2) బి, సి 3) ఎ, సి 4) ఎ, బి, సి

12. కింది వాక్యాలను పరిశీలించి సరైన సమాధానాన్ని ఎన్నుకోండి.



ఎ) కూడంకుళం అణు విద్యుత్తు కేంద్రాన్ని రష్యా సహకారంతో నిర్మించారు.
బి) ఈ కేంద్రమే భారతదేశంలో అత్యధికంగా అణు విద్యుత్తును ఉత్పత్తి చేస్తోంది.
1) ఎ సరైంది, బి సరికాదు
2) బి సరైంది, ఎ సరికాదు
3) ఎ, బి సరైనవి 4) ఎ, బి సరికావు

13. కిందివాటిలో వివిధ అణురియాక్టర్లలో నేరుగా ఇంధనంగా వాడే వాటిని గుర్తించండి.
ఎ) యురేనియం-235 బి) యురేనియం-238
సి) థోరియం-232 డి) యురేనియం-233
ఇ) ప్లుటోనియం-239
1) ఎ, డి, ఇ 2) బి, సి, డి
3) ఎ, బి, సి 4) ఎ, డి, సి

14. ఫాస్ట్ బ్రీడర్ రియాక్టరుకు సంబంధించిన కిందివాటిలో సరికాని వాక్యాలను గుర్తించండి.
ఎ) దీనిలో యురేనియం - 238ను ఇంధనంగా ఉపయోగిస్తారు.
బి) ఇది తాను ఉపయోగించుకొన్న ఇంధనం కంటే ఎక్కువ ఇంధనాన్ని తయారు చేస్తుంది.
సి) దీనిలో న్యూట్రాన్ల వేగం సాధారణ రియాక్టరుతో పోలిస్తే తక్కువగా ఉంటుంది.
1) ఎ, బి, సి 2) ఎ, సి 3) సి 4) బి

15. అణురియాక్టర్లు ఉపయోగించుకునే ఇంధనాల పరంగా కిందివాటిలో సరైన జతలను ఎన్నుకోండి.
ఎ) బాయిలింగ్ వాటర్ రియాక్టర్లు-యురేనియం 235
బి) ప్రెషరైజ్డ్ హెవీ వాటర్ రియాక్టర్లు-యురేనియం 235
సి) ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్లు - ప్లుటోనియం 239
డి) అడ్వాన్స్‌డ్ హెవీ వాటర్ రియాక్టర్లు - యురేనియం 233
1) ఎ, బి 2) బి, సి 3) ఎ, బి, సి, డి 4) ఎ, డి

16. కింది వాక్యాలను పరిశీలించి సరైనవాటిని ఎన్నుకోండి.
ఎ) భారతదేశంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న 25 రియాక్టర్లు 8,780 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్నాయి.
బి) అత్యధికంగా అణువిద్యుత్తు ఉత్పత్తి చేస్తున్న రియాక్టరు (1000 మెగావాట్లు) కూడంకుళంలో ఉంది.
సి) భారతదేశంలో ఉత్పత్తి అవుతున్న అణువిద్యుత్తు మొత్తం విద్యుత్తు ఉత్పత్తిలో 3% ఉంటుంది.
1) బి, సి 2) ఎ, బి 3) బి 4) ఎ, బి, సి

17. కిందివాటిలో సరికాని వాక్యాలను గుర్తించండి.
ఎ) అణువిద్యుత్తు రియాక్టర్లలో 6% యురేనియం 235ను ఇంధనంగా వాడతారు.
బి) అణుబాంబు తయారీకి 5% యురేనియం 238 అవసరం.
సి) థోరియం - 232 సహజంగా లభిస్తుంది.
1) ఎ, బి 2) బి 3) సి 4) ఎ

18. నూతనంగా నిర్మిస్తున్న అణువిద్యుత్తు రియాక్టర్లకు సంబంధించి కిందివాటిలో సరైన వాక్యాలు?
ఎ) మహారాష్ట్రలోని జైతాపుర్ దగ్గర ఎరేవా అనే ఫ్రెంచ్ సంస్థ 6 రియాక్టర్లు నిర్మించాలని భావిస్తోంది.
బి) తమిళనాడులోని కూడంకుళంలో 3, 4 యూనిట్లు నిర్మాణంలో ఉన్నాయి.
సి) హరియాణాలోని గోరఖ్‌పుర్‌లో ఒక్కొక్కటి 700 మెగావాట్ల విద్యుత్తు సామర్థ్యం ఉన్నవి నిర్మాణంలో ఉన్నాయి.
1) ఎ, సి 2) బి, సి 3) ఎ, బి, సి 4) ఎ

19. కిందివాటిలో సరికాని జతలను గుర్తించండి.



ఎ) ధ్రువ - పరిశోధనా రియాక్టరు.
బి) ఫాస్ట్ బ్రీడర్ రియాక్టరును నిర్మిస్తున్నది- న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్.
సి) భారజలం - ఇంధనంగా ఉపయోగపడుతుంది.
డి) బెరీలియం - ఇంధనంగా ఉపయోగపడుతుంది.
1) బి, సి, డి 2) సి, డి 3) ఎ, బి 4) బి, సి

20. అడ్వాన్స్‌డ్ హెవీవాటర్ రియాక్టర్ల గురించి కిందివాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
ఎ) వీటిని బ్రీడర్, థోరియం ఆధారిత రియాక్టర్లు అంటారు.
బి) వీటిలో యురేనియం - 233ను ఇంధనంగా వాడుతున్నారు.
సి) ఇవి భారతదేశ 3వ దశ అణువిద్యుత్తు ఉత్పత్తికి సంబంధించినవి.
1) ఎ 2) బి
3) సి 4) ఎ, బి, సి

సమాధానాలు

1-1, 2-2, 3-3, 4-2, 5-1, 6-1, 7-3, 8-2, 9-3, 10-1, 11-4, 12-3, 13-1, 14-2, 15-3, 16-4, 17-2, 18-3, 19-1, 20-4.

వసుంధర

vasundhara@eenadu.in


సోనాలీ

ఆమె సోషల్‌మీడియాలో పెట్టిన పోస్టులకు... సెలెబ్రిటీలూ కామెంట్లు పెడుతుంటారు. ప్రముఖ బ్రాండ్లు... తమ ఉత్పత్తుల ప్రచారం కోసమూ మహిళ వెంటపడుతుంటాయి. అలాగని తను ఏ సినిమా తారో, క్రీడాకారిణో, రాజకీయ నాయకురాలో కాదు... ఓ సాధారణ మహిళ. అయినా సోనాలీకి ఇంత పాపులారిటీ ఎలా వచ్చిందంటారా?

అదే కట్టు అదే బొట్టు... మేకప్‌తో కనికట్టు!

ఓ సాదాసీదా చీర, నున్నగా దువ్విన తల, ముక్కుపుడక, చేతులకు నిండుగా గాజులతో సగటు గృహిణిలా కనిపిస్తుంది సోనాలీ. ముగ్గురు పిల్లల తల్లి కూడా. అయితే ఆమె సోషల్‌మీడియా సంచలనం. హాలీవుడ్, బాలీవుడ్ అన్న తేడా ఏం లేదు... తారల లుక్‌ని తన మేకప్‌తో రీక్రియేట్ చేసి లక్షల మంది అభిమానుల్ని సంపాదించుకున్నారు. అలాగని తను ఏ పేరున్న మేకప్ అకాడమీలోనూ శిక్షణ తీసుకోలేదు. సోనాలీ పుట్టి పెరిగింది ముంబయిలో. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఫీజు కట్టలేక ఏడోతరగతితోనే చదువాపేశారు. కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండాలని ఉపాధికోసం మెహందీ వేయడం నేర్చుకున్నారు. తర్వాత జుహూ బీచ్‌లో మెహందీ ఆర్టిస్ట్‌గా కెరియర్ ఆరంభించారామె. ఆ క్రమంలోనే టూరిస్టులతో మాట్లాడుతూ ఇంగ్లిష్‌ని ఒంటపట్టించుకున్నారట. ఆడపిల్ల గుండెల మీద భారమంటూ సోనాలీకి పద్దెనిమిదేళ్లు రాగానే పెళ్లి చేశారు. తర్వాత భర్తతో కలిసి కొల్హాపుర్‌లో స్థిరపడ్డారామె. ముంబయిలో ఉన్నప్పుడు మెహందీ వేయడం గురించి తను పెద్దగా విమర్శలు ఎదుర్కోలేదు. కానీ, ఇక్కడ సోనాలీ వృత్తిని ఇరుగుపొరుగు ఆక్షేపించడం మొదలుపెట్టారు. ఆ మెహందీతో ఏం సాధించగలవని అవమానించేవారు. అవకాశాలు దొరక్కపోవడంతో... పార్లర్ వాళ్లతో టైఅప్ అవుదామనుకున్నారు. అక్కడ తన ఆహార్యాన్ని చిన్నబుచ్చడంతో ముందుకు వెళ్లలేకపోయారు. దాంతో



మేకప్‌పై దృష్టిపెట్టాలనుకున్నారు. అందులో మెలకువలు తెలుసుకోవాలని చిన్నప్పటి నుంచీ సోనాలీకి కోరిక. కానీ శిక్షణకు రూ. పదివేలు ఖర్చవుతుందనడంతో ఆ ఆలోచన విరమించుకున్నారు. ఆ విషయాన్ని భర్తకు చెబితే శిక్షణ తీసుకోవడం బదులుగా... ఆన్‌లైన్‌లో చూసి నేర్చుకోమని ఫోన్ కొనిచ్చారు.


ప్రకటనల అవకాశాలు...

దాంతో సోనాలీ కలలకు రెక్కలు వచ్చినట్లయ్యింది. ఎన్నో మెలకువలు తెలుసుకున్నారు. మేకప్ చేస్తూ ఆదాయం



పొందడమే కాదు... సామాజిక మాధ్యమాల వేదికగా సెలెబ్రిటీ ఇన్స్‌పిరేషన్ మేకప్‌ని ప్రయత్నించడం మొదలుపెట్టారు. దీనికి మంచి ఆదరణ లభించింది. కరీనాకపూర్, జాన్వీకపూర్, అదితీరావ్ హైదరీ వంటి బాలీవుడ్ నటీమణులనే కాదు.. హాలీవుడ్‌కి చెందిన పాప్ సింగర్స్, తారల్నీ అనుకరించింది. ముఖ్యంగా అనంత్ అంబానీ, రాధికా మర్చంట్‌ల ప్రీవెడ్డింగ్ వేడుకల్లో పాల్గొన్న పాప్ సింగర్ రిహన్నా లుక్‌ని, పరిపూర్ణంగా రీక్రియేట్ చేయడంతో సోనాలీ పేరు ఒక్కసారిగా మారుమోగిపోయింది.

కనుబొమల ఆకృతి నుంచి చక్కటి కాంటూరింగ్ వరకూ... మేకప్ మెలకువలను వివరిస్తున్న విధానానికీ, ఆమె ఆంగ్ల భాషకూ సోషల్‌మీడియా ఫిదా అయిపోయింది. ఓ సాధారణ గృహిణికి ఇదంతా ఎలా సాధ్యమైందంటూ... ఈ వీడియో నెట్టింట ప్రశంసలు అందుకోవడమే కాదు... 1.27 కోట్లకు పైగా వీక్షణలు పొందింది. ఇది ఎన్నో ప్రకటనల అవకాశాలతోపాటు సోనాలీకి మేకప్ వైరల్‌గర్ల్ అన్న పేరునీ తెచ్చిపెట్టింది. అంతేనా, ఆమె ఇన్‌స్టా, యూట్యూబ్ ఖాతాలకు లక్షల్లో ఫాలోవర్లూ వచ్చారు. 'లక్ష్యంపై ముందు మనకి స్పష్టత ఉండాలి. దాన్ని చేరుకునే దారిలో ముళ్లూ, పూలూ రెండూ ఉంటాయి. నేను ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నా. అవమానాలూ భరించా. నేనేం చేస్తున్నానో నాకు తెలుసు కాబట్టి వాటిని మనసుకు తీసుకోలేదు. ఎదగాలనుకునే ఆడపిల్లలు ఎవరైనా ఈ సూత్రాన్ని తప్పక గుర్తుంచుకోవాలి' అని చెబుతోంది సోనాలీ.



చలికి దుప్పటి ముసుగే తీయాలనిపించదు. ఇక పొగమంచులో బయటకి వెళ్లి వ్యాయామాలు ఏం చేస్తాం. కానీ, శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకోవాలన్నా, బరువుని నియంత్రణలో ఉంచుకోవాలన్నా వ్యాయామం మానకూడదు. అదెందుకు అవసరమో... ఇంట్లోనే ఏ పరికరాల సాయమూ లేకుండా చేయగలిగే కసరత్తులు ఏంటో తెలుసుకుందామా?

శరీరానికి చురుకు పుట్టించడానికి...

వ్యాయామం ఎందుకు ముఖ్యం...

ఈ కాలంలో మెటబాలిజం నెమ్మదిస్తుంది. దీంతో త్వరగా బరువు పెరుగుతాం. విటమిన్ డి లోపం వల్ల ఎముకలూ బలహీనమవుతాయి. మానసిక, ఒత్తిడి, డిప్రెషన్ వంటివి ఈ కాలంలో పెరిగే అవకాశం ఎక్కువని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. వీటన్నింటికీ మించి ఈ కాలంలో చలిని తట్టుకోవాలన్నా, వ్యాధినిరోధకశక్తి పెరగాలన్నా కచ్చితంగా వ్యాయామం చేయాలి.

సులువుగా చేసేద్దాం...

- మొదట ఐదు నిమిషాలు వార్మప్ చేయండి. ఉన్న స్థానంలోనే మార్చింగ్ చేయడం, చేతులు పైకి కిందకి ఊపడం, మెడ, భుజాలు, చేతులు తిప్పడం వంటివి అన్నమాట.
- అదయ్యాక 15 స్క్వాట్స్ మూడు సెట్ల చొప్పున చేయండి. పిరుదులు, తొడలు బలపడతాయి.
- ఇరవై నుంచి ముప్పై సెకన్లు ఉండేలా ప్లాంక్‌లు వేయండి. ఈ కసరత్తు వల్ల పొట్ట కండరాలు బలోపేతం అవుతాయి. పొత్తి కడుపు సులువుగా తగ్గుతుంది. శరీరం చురుగ్గా మారుతుంది.
- ఒక్కో కాలుకి 12 చొప్పున లాంజెస్ చేయండి. కాళ్లు, తొడలు, పిరుదుల దగ్గర ఉన్న కొవ్వు కరుగుతుంది. శరీరం సౌకర్యంగా మారుతుంది.

భారత సైనిక అకాడమీ తొలి అధికారిణి...!



దేహ్రాదూన్‌లోని 93 సంవత్సరాల భారత సైనిక అకాడమీ చరిత్ర(ఐఎంఏ)లో తొలిసారి ఓ మహిళా అధికారిణి శిక్షణను పూర్తి చేసుకుని భారతసైన్యంలోకి అడుగు పెట్టారు. మహారాష్ట్రకు చెందిన సయీ ఎస్. జాదవ్ ప్రస్తుత బ్యాచ్‌లో ఏకైక మహిళా ఆఫీసర్ క్యాడెట్‌గా ఈ ఘనత సాధించారు. సయీ జాదవ్.. తండ్రి మిలిటరీలో పనిచేయడంతో దేశంలోని వివిధ ప్రాంతాల్లో చదువుకున్నారామె. గ్రాడ్యుయేషన్ అయ్యాక ఎస్ఎస్‌బీ ద్వారా ఎంపికై ఇండియన్ మిలిటరీ అకాడమీలో చేరారు. ఇక్కడ ఆరునెలల కఠినమైన సైనిక శిక్షణను పూర్తి చేసుకుని చరిత్ర సృష్టించారు. ఇప్పుడు ఆమెను జెంటిల్‌మన్ క్యాడెట్స్ అని కాకుండా ఆఫీసర్ క్యాడెట్స్ అని పిలవనున్నారు. వీరి కుటుంబం నుంచి భారత సైన్యంలో అడుగు పెట్టిన నాలుగోతరం అధికారి సయీ. ఆమె ముత్తాత బ్రిటిష్ సైన్యంలో సేవలందించగా, తాత, తండ్రి భారత సైన్యంలో అధికారులుగా పనిచేస్తున్నారు. 'గతంలోనూ సైన్యంలో అధికారిణులు ఉన్నారు. కానీ, మా అమ్మాయి ఇండియన్ మిలిటరీ అకాడమీ నుంచి పట్టభద్రురాలై టెరిటోరియల్ ఆర్మీ ఆఫీసర్‌గా చేరడం గర్వంగా ఉంది' అంటారు తండ్రి సందీప్ జాదవ్.

- ఈటీవీ భారత్

పుట్టుకతోనే వైకల్యం. చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోయారు. ఇవి చాలవన్నట్లు కట్టుకున్నవాడు దూరమయ్యాడు. ఇద్దరు పిల్లల బాధ్యత, ఆర్థిక కష్టాలు భయపెడుతున్నా ఆమె ధైర్యం కోల్పోలేదు. తనని తాను నిరూపించుకుంటూ అంతర్జాతీయ వేదికపై సత్తా చాటారు మిట్టపల్లి అర్చన.

కష్టాల్ని విసిరేసి... పతకాల్ని పట్టేసి!


అర్చన

అర్చనది రాజన్న సిరిసిల్ల జిల్లాలోని చంద్రంపేట. ఆమెకు 88 శాతం వైకల్యం. చిన్నప్పుడే అమ్మానాన్నల్ని కోల్పోయి... కష్టాలెన్నో చూశారు. అయినా పట్టుదలగా చదివి, సోషియాలజీ, తెలుగుల్లో పీజీలు చేశారు. కానీ కొలువే కష్టమైంది. తనా ప్రయత్నాల్లో ఉండగా... జీవితాంతం తోడుంటానంటే నమ్మి పెళ్లి చేసుకున్నారు. కానీ ఇద్దరు పిల్లలు పుట్టాక భర్త మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయాడు. దీంతో పిల్లల బాధ్యత ఆమెపై పడింది. వాళ్ల కోసం జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో పొరుగు సేవల కింద స్వీపరుగా చేరారు అర్చన. దాంతోపాటు ఇంటివద్ద దుస్తులు కుట్టిస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. అర్చనకి చిన్నప్పట్నుంచీ ఆటలంటే ఇష్టం. తనకు ఆడటానికి అనుకూలంగా ఉన్న షాట్‌పుట్, త్రో బాల్ ఆడేవారు. ఈ ఏడాది మార్చిలో దిల్లీలో నిర్వహించిన ఖేలో ఇండియా షాట్‌పుట్ పోటీల్లో తెలంగాణ తరఫున పాల్గొన్నారామె. అర్చన ప్రతిభను చూసిన నిర్వాహకులు త్రోబాల్‌లో గ్రూప్ గేమ్‌కి కెప్టెన్‌గా ఎంపిక చేశారు. సెప్టెంబరులో చెన్నైలో జరిగిన త్రోబాల్ పోటీల్లోనూ సత్తా చాటడంతో జాతీయ జట్టులో చోటు సంపాదించడమేకాదు, కెప్టెన్‌గానూ ఎంపికయ్యారు అర్చన. తాజాగా శ్రీలంకలో అంతర్జాతీయ దివ్యాంగుల క్రీడా పోటీలు నిర్వహించారు. దానిలో పాల్గొన్న ఆమె స్వర్ణ పతకాన్ని సాధించారు. 'ఆర్థిక కష్టాల కారణంగా పోటీలకు వెళ్లడమూ కష్టమైంది. నా పరిస్థితి తెలిసి క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ సాయం చేశారు. వాళ్లు నాపై ఉంచిన నమ్మకాన్ని నిజం చేస్తూ బంగారు పతకం సాధించడం ఆనందంగా ఉంది. ఇంతటితో తృప్తి చెందను. ఇంకా ఎంతో సాధించాలని ఉంది. ప్రభుత్వం సాయమందిస్తే దేశానికి మరిన్ని పతకాలు తీసుకొస్తాను' అంటున్నారు అర్చన.

- శ్రీనివాస్ నలిగేటి, రాజన్న సిరిసిల్ల జిల్లా

పేదింటి... 'బంగారం'

విజయం సాధించాలంటే సవాళ్లను తట్టుకోవాలి. ఈ విషయం రాణి కుమారికి బాగా తెలుసు. అందుకే వాటిని దీటుగా ఎదుర్కొంటూ వచ్చింది. వెక్కిరించిన వారి చేతే 'మా ఊరి బంగారం' అనిపించుకుంటోంది. ఇంతకీ ఈమెవరంటే...


రాణి

బిహార్‌లోని హుసైనాబాద్ అనే చిన్న ఊరు రాణిది. నాన్న లేబర్ పనులు చేస్తారు. అమ్మ గృహిణి. తమ కూతురి జీవితం తమలా కాకూడదని రాణి తల్లిదండ్రుల ఆశ. అందుకే ఆమెని చదివించారు. పదో తరగతి వరకూ ఊళ్లోనే చదివింది. తరవాత ఊరు దాటక తప్పని పరిస్థితి. అయినా రోజూ 35 కి.మీ. ప్రయాణించి చదువుకునేది రాణి. అప్పుడే ఆటలు ఆమెను ఆకర్షించాయి. రగ్బీ, ఫుట్‌బాల్ ఆడటం మొదలుపెట్టింది. జిల్లా, రాష్ట్ర స్థాయుల్లో పతకాలూ సాధించింది. నేషనల్స్‌కి సన్నద్ధమయ్యేటప్పుడు ఆమెకు కోచ్ పంకజ్ కుమార్ జ్యోతిష్ పరిచయం అయ్యారు. ఆయన రాణిని 'డ్రాగన్ బోట్ స్పోర్ట్స్'ని ప్రయత్నించమన్నారు. సమస్యల్లా ఆ శిక్షణ కేంద్రం తనకి దగ్గర్లో లేదు. ఇందుకోసం మోతిహారీకి వెళ్లాలి. అప్పటికే తన చదువుకోసం అమ్మానాన్నలు అప్పులు చేశారు. అమ్మాయిని పెద్ద చదువులు చదివించడానికే ఆలోచించే ఊరు వాళ్లది. పెళ్లి కాని అమ్మాయిని వేరే ఊరు పంపిస్తున్నారంటూ నానా మాటలు అన్నారు చుట్టుపక్కల వాళ్లు. అయినా కూతురు కలలను నిజం చేయడానికే నిశ్చయించుకున్నారు రాణి తల్లిదండ్రులు. అలా 2023లో శిక్షణ ప్రారంభించిందామె. 'డ్రాగన్ బోట్... వాటర్ స్పోర్ట్. డ్రాగన్‌లా ఉండే ఓ పడవని నిర్ణీత కాలంలో నడపాలి. ఒకరు, బృందంగా పోటీలుంటాయి' అనే రాణి ఇప్పటి వరకూ ఎన్నో పతకాలను గెలుచుకుంది. తాజాగా నేషనల్ డ్రాగన్ పోటీలో బిహార్ బృందం 7 బంగారు పతకాలను గెలవగా వాటిలో నాలుగు రాణివే. మొత్తంగా ఈ పోటీల్లో 8 పతకాలను గెలుచుకుందీమె. 'పతకాలు గెలవడం మొదలుపెట్టాక మా ఊరివాళ్ల ఆలోచనలో మార్పు వచ్చింది. అయితే మోతిహారిలో శిక్షణ కేంద్ర మూసేయడంతో ప్రస్తుతం ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరఖ్‌పుర్‌లో సాధన చేస్తున్నా. నెలకు రూ.పదివేల వరకూ ఖర్చవుతోంది' అంటోన్న రాణి... బిహార్ క్రీడామంత్రి శ్రేయసి సింగ్ మెప్పు పొందింది. త్వరలోనే తన ప్రాంతంలో స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేయిస్తానన్న మాటనీ అందుకుంది. అయితే కుటుంబాన్ని ఆదుకోవాలన్నది రాణి ప్రయత్నం. అందుకే ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రయత్నిస్తోంది. బిహార్ పోలీసు శాఖలో పనిచేయాలన్నది తన కల. ఇందుకోసం ప్రభుత్వానికీ దరఖాస్తు చేసుకుంది. 'నాకోసం అమ్మానాన్నలు ఎన్నో అప్పులు చేశారు. వాళ్లకి అండగా నిలవాలన్నది నా ప్రయత్నం. అందుకే ప్రభుత్వాన్ని ఆర్థిక సాయం కోరుతున్నా. మన దగ్గర టాలెంట్ ఉంది. ఆర్థిక వెనకబాటే వాళ్లని ఆపుతోంది. ఆ తోడ్పాటు అందిస్తే మట్టిలోని మాణిక్యాలు బయటికి వస్తాయి' అంటోన్న రాణి కల అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడటం. ఇప్పుడు ఆ దిశగానే కృషి చేస్తోన్న ఆమెకు ఆల్ ద బెస్ట్ చెబుదామా?

> మహిళల సహజమైన నాయకత్వ లక్షణాలను గుర్తించి చాలా కార్పొరేట్ సంస్థలు వాళ్లను ఆ దిశగా ప్రోత్సహిస్తున్నాయి. అయితే, సంస్థలతోపాటు మహిళల చొరవ దీన్లో కీలకం. ఇది చాలా సుదీర్ఘమైన ప్రయాణమని వాళ్లు గ్రహించాలి. ఈ ప్రయాణంలో కొన్ని త్యాగాలు తప్పవు. అందుకు సిద్ధపడితే అనుకున్న లక్ష్యాన్ని కచ్చితంగా చేరుకోగలరు.
> - ఉమా రత్నం కృష్ణన్, ఎండీ, ఆప్టమ్ ఇండియా



సంక్రాంతి ముగ్గులకు ఆహ్వానం...





రంగవల్లిక

ధనుర్మాసం మొదలవగానే... మగువలు సంక్రాంతి సంబరాలకు శ్రీకారం చుడతారు. వీధులన్నీ ముగ్గులతో నింపేస్తారు. నక్షత్రాల్నే చుక్కలుగా పేర్చి... వాటి మధ్య నుంచి సన్నటి గీతల్ని ఒడుపుగా తిప్పేస్తూ రంగవల్లికల్ని వేసేస్తారు. నేలనే కాన్వాస్‌గా మలచుకుని ముగ్గులెన్నో పెట్టేస్తారు. చక్కటి చిత్రాలెన్నో చూపిస్తారు. మీరూ ఇలా అందంగా ముగ్గులు వేయగలరా? మరి ఇంకెందుకాలస్యం

తెల్లటి కాగితంపై చుక్కలు స్పష్టంగా కనిపించేలా ముగ్గులు పెట్టి మాకు పంపించండి. వచ్చిన వాటిల్లో ఉత్తమమైన రంగవల్లికల్ని 'వసుంధర' పేజీలో ప్రచురిస్తాం. మరికొన్నింటిని ఈ-పేపర్, ఈనాడు.నెట్, వసుంధర.నెట్‌ల్లో అప్‌లోడ్ చేస్తాం.

గమనిక: ముగ్గుల్లో చుక్కలు స్పష్టంగా కనిపించాలి. చుక్కల వివరాలు, మీ పేరు, ఫొటో, ఫోన్ నంబర్‌నూ జతచేయడం మరిచిపోవద్దు.

మెయిల్: vasundhara@eenadu.in
వాట్సప్ నం: 9154091911
మా చిరునామా: వసుంధర, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిల్మ్‌సిటీ, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా - 501 512

బుగ్గ మీద మచ్చ పెరుగుతోంది!

నా వయసు 35 ఏళ్లు. గత కొన్నేళ్లుగా కుడి బుగ్గమీద మచ్చలా వస్తోంది. డాక్టర్‌ని సంప్రదిస్తే మెలాస్మా అన్నారు. ఆయింట్‌మెంట్ కూడా ఇచ్చారు. అది వాడినా ఫలితం లేదు. పైగా ఈ మచ్చ రోజు రోజుకీ పెరుగుతోంది. అదెలా తగ్గుతుందో సలహా ఇవ్వగలరు? - డి.శ్రుతి

డియర్ వసుంధర


- సూరపనేని పద్మావతి, డెర్మటాలజిస్ట్

మెలాస్మాని తెలుగులో మంగు మచ్చలని పిలుస్తారు. సాధారణంగా శరీరంలో హార్మోన్ల హెచ్చుతగ్గుల వల్ల ఇది వస్తుంది. జన్యుపరంగా అంటే మీ ఇంట్లో మీ అమ్మ, మేనత్త... ఇలా ఎవరికి ఉన్నా మీకూ రావొచ్చు. కొంతమందికి గర్భధారణప్పుడు వస్తుంది. ఇంకొంతమందికి పీసీఓఎస్, ఇన్‌ఫెర్టిలిటీ వంటి సమస్యలకు మందులు వాడుతున్నప్పుడు మొదలవ్వొచ్చు. ప్రీ మెనోపాజ్, మెనోపాజ్ దశల్లో సమస్య ఎక్కువ అవుతుంది. అంతేకాదు, ఎండలో తిరిగితే పెరుగుతుంది. అందుకే, మెలాస్మా ఉన్నవారు... సన్‌స్క్రీన్ వాడాలి. ఇంటిలోపల ఉన్నా, బయట ఉన్నా తప్పకుండా రాసుకోవాలి. మంగు మచ్చల్లో రకాలున్నాయి. చర్మం పైపొరల్లో ఉంటే ఎపిడెర్మల్ మెలాస్మా, లోపలి పొరల్లో ఉన్నప్పుడు డెర్మల్ మెలాస్మా అనీ, రెండింట్లోనూ ఉన్నప్పుడు మిక్స్‌డ్ మెలాస్మా అనీ పిలుస్తారు. ఈ సమస్య నివారణకు పైపైన రాసే క్రీములన్నీ ఎపిడెర్మల్ మెలాస్మా వరకూ తగ్గించగలవు. లోపలి పొరల వరకూ ఉంటే క్రీములతో తగ్గకపోవచ్చు. మీ సమస్య రెండోది కావడం వల్ల అది తగ్గడం లేదు. మంగు మచ్చలు ఉన్నవాళ్లు పగటి పూట సన్‌స్క్రీన్ రాయడంతో పాటు రాత్రుళ్లు కోజిక్‌యాసిడ్, ఆర్‌బ్యూటిన్, ఎజిలిక్ యాసిడ్... వంటివి ఉన్న క్రీములు రాసుకోవాలి. సమస్య తీవ్రంగా ఉంటే హైడ్రోక్వినాన్ బేస్డ్ స్కిన్ లైటనింగ్ క్రీములు వాడితే కొంతవరకూ తగ్గొచ్చు. ఇది హార్మోన్ల వల్ల వచ్చే సమస్య కావడంతో మెలాస్మా మళ్లీ మళ్లీ రావొచ్చు. అందుకే, తగ్గిన తర్వాత కూడా సన్‌స్క్రీన్, స్కిన్ లైటనింగ్ క్రీములు రాయడం మానొద్దు. డెర్మల్ మెలాస్మా ఉండి క్రీములతో తగ్గకపోతే కెమికల్ పీల్స్, క్యూస్విచ్, పీకో, ఫ్రాక్షనల్ వంటి లేజర్ చికిత్సలను ప్రయత్నించవచ్చు. అలానే ఎంఎన్ఆర్ఎఫ్, రీజనరేటివ్ ట్రీట్‌మెంట్లనూ మీ చర్మ తత్వం, పిగ్మెంట్ తీరుని బట్టి ఎంచుకోవచ్చు.

బంగారం - వెండి




13న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,36,020	1,23,150	1,93,030
విజయవాడ	1,32,405	1,22,750	1,93,000
ప్రొద్దుటూరు	1,31,700	1,21,160	1,87,000
రాజమహేంద్రవరం	1,33,910	1,22,750	2,10,000
విశాఖపట్నం	1,33,920	1,22,700	1,98,000
తమిళనాడు	-----	1,23,700	2,10,000

ఎక్కడివక్కడ వాళ్లే సర్దేస్తారు..!

కిడ్స్ కార్నర్

చిన్న పిల్లలు ఉన్న ఏ ఇల్లు చూసినా... ఆటవస్తువులతోనే నిండి ఉంటాయి. ఏ గదిలో చూసినా వాళ్ల బొమ్మలే. చిందరవందరగా ఎక్కడ పడితే అక్కడ వదిలేసి వేరే కొత్త బొమ్మ తెచ్చి ఆడుకుంటూ ఉంటారు. ఎంత సర్దినా ఇదే తంతు. కాబట్టి సర్దడాన్ని పిల్లలకు ఓ ఆటగా నేర్పించాలి. అందుకు సహాయపడతాయీ ఉపకరణాలు.



ఆటలానే ఉంటుంది...

'బొమ్మలన్నీ తీసి బ్యాగులో వెయ్యి, ఓ చోట కూర్చొని ఆడుకో, పడేయకు మళ్లీ కావాలన్నప్పుడు దొరకవు'... ఇలా ఎన్ని చెప్పినా, వింటారా? మనకు కంఠశోష తప్ప వాళ్ల పని వాళ్లదే. అందుకే వాళ్లకి ఈ 'ట్రాలీ టాయ్ కంటైనర్'ని కొని ఇవ్వండి. దాంతో ఆడటానికైనా బొమ్మల్ని సర్దడం నేర్చుకుంటారు. రెండుమూడు సార్లు మనం చేసి చూపిస్తే చాలు. తర్వాత నుంచి వాళ్లే దాన్ని లాగుతూ ఆటయ్యాక బొమ్మల్ని సర్ది ఓ పక్కన పెడతారు. వీటిలో చెక్కతో చేసేవే ఎక్కువగా అందుబాటులో ఉన్నాయి. అంటే పర్యావరణహితం కూడా.





ఒకదానితో రెండు ప్రయోజనాలు...

వస్తువు ఒకటే... కానీ రెండు ప్రయోజనాలు ఇస్తుంది అంటే మనకన్నా సంతోషపడేవారు ఇంకెవరైనా ఉంటారా? ఆ జాబితాలోకే వస్తుందీ 'ట్రాన్స్‌పరెంట్ స్టోరింగ్ పాట్'. బొమ్మలు నిల్వ చేసే స్టోరేజ్ బాక్స్‌లానూ వాడుకోవచ్చు. మూత పెట్టేస్తే పిల్లలు కూర్చోనేందుకు వీలుగానూ ఉంటుంది. అధిక నాణ్యత కలిగిన డ్యూరబుల్ ప్లాస్టిక్‌తో దీన్ని తయారుచేస్తున్నారు. దాంతో విరిగిపోతుందన్న సమస్యా ఉండదు.



పైకే కనిపిస్తాయి...

పిల్లల వస్తువులూ, బొమ్మలూ సర్దడానికి పారదర్శకంగా ఉండే బాక్సులూ, బ్యాగుల్నే ఎంపిక చేసుకుంటాం కదా. ఎందుకంటే బొమ్మలు పైకి కనిపిస్తుంటాయి. వాళ్లకు ఏం కావాలంటే అవి తీసుకుని ఆడుకుంటారని. కానీ పెద్ద పెద్ద బాక్సులూ, బ్యాగులూ అయితే మీద పడేసుకుంటారేమో అన్న భయంతో వాళ్లని దగ్గరికి రానివ్వం. అలా కాకుండా, ఈ 'ట్రాన్స్‌పరెంట్ ట్రాలీ బ్యాగులు' ఉపయోగించి చూడండి. సులువుగా కదులుతాయి, బరువూ తక్కువే. ప్రమాదాలు జరుగుతాయన్న భయమూ ఉండదు.



ఛాంపియన్స్


హైదరాబాద్‌లో మెస్సీ

అక్కడ ఆగమాగం
ఇక్కడ అమోఘం

మెస్సీ మెస్సీ మెస్సీ.. కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా ఫుట్‌బాల్ ప్రేమికులందరికీ ఇదే జపం! ఈ ఆట గురించి పెద్దగా తెలియని వాళ్లు సైతం అతడి రాక కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూసిన పరిస్థితి! కానీ దేశంలో ఫుట్‌బాల్‌ను అమితంగా ప్రేమించే నగరమైన కోల్‌కతాలో ఈ సాకర్ మాంత్రికుడి ఈవెంట్ అస్తవ్యస్తంగా మారి, తీవ్ర గందరగోళం నెలకొన్న సమయాన.. మెస్సీకిది విఫల పర్యటన కాబోతోందా? తర్వాతి కార్యక్రమాలు షెడ్యూల్ ప్రకారం కొనసాగుతాయా? అని ఎన్నో అనుమానాలు! కానీ ఉదయం కోల్‌కతా నేర్పిన పాఠంతో రాత్రి మెస్సీ ఈవెంట్‌ను పకడ్బందీగా నిర్వహించి సాకర్ ప్రియులను అమితానందంలో ముంచెత్తింది మన హైదరాబాద్!

- కోల్‌కతాలో మెస్సీ పర్యటన గందరగోళం

హైదరాబాద్‌లో సూపర్ సక్సెస్

ఈనాడు - హైదరాబాద్

మెస్సీ మాయాజాలానికి ఉప్పల్ స్టేడియంలోని 40 వేల మంది అభిమానులు ఉప్పొంగిపోయారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో అర్జెంటీనా దిగ్గజం ఆడిన సరదా ఆట కావాల్సినంత కిక్కిచ్చింది. ఆట మాత్రమే కాక మెస్సీ ప్రతి అడుగూ స్టేడియాన్ని హోరెత్తించింది. కోల్‌కతా అనుభవంతో మెస్సీని ఎక్కువమంది చుట్టుముట్టకుండా స్వేచ్ఛగా వదిలేయడంతో అభిమానులు అతణ్ని తనివితీరా చూసుకున్నారు. మెస్సీ ప్రతి చర్యనూ ఆస్వాదించారు. హైదరాబాద్ ఈవెంట్ ఏ గందరగోళం లేకుండా, ప్రశాంతంగా, ఉత్సాహభరితంగా సాగడంతో మెస్సీ సైతం ఎంతో హుషారుగా కనిపించాడు. తనపై ఇంత ప్రేమ చూపిస్తున్న భారత అభిమానులకు కృతజ్ఞతలు చెప్పాడు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా పాల్గొన్న కార్యక్రమంలో అర్జెంటీనాకే చెందిన రోడ్రిగో డి పాల్, ఉరుగ్వే స్టార్ ఆటగాడు లూయిస్ సువారెజ్ సైతం సందడి చేశారు.

అభిమానుల్లో జోష్.. చిన్నారులు ఖుష్

దేశంలో ఫుట్‌బాల్‌కు అత్యంత ఆదరణ ఉన్న నగరం కోల్‌కతా. మూడు రోజుల భారత పర్యటనను అక్కడి నుంచే మొదలు పెట్టాలని నిర్ణయించుకుంది మెస్సీ బృందం. దీంతో ఆరంభమే అదిరిపోతుందని అంతా అనుకున్నారు. కానీ అనూహ్యంగా సాల్ట్ లేక్ స్టేడియంలో మెస్సీ ఈవెంట్ గందరగోళంగా మారింది. వేల రూపాయలు ఖర్చు పెట్టి టికెట్లు కొన్న అభిమానులకు సరిగా మెస్సీ దర్శనం కూడా జరగలేదు. రాజకీయ నాయకులు, అధికారులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున మెస్సీని చుట్టుముట్టడంతో ఆ కార్యక్రమంలో ఏదీ ప్రణాళిక ప్రకారం సాగలేదు. కానీ ఉదయం ఆ గందరగోళం తర్వాత రాత్రి హైదరాబాద్‌లో మాత్రం మెస్సీ ఈవెంట్ ఎంతో ఆహ్లాదభరితంగా, స్ఫూర్తిదాయకంగా సాగింది. ఎంతో ఖర్చు పెట్టి ఈ ఈవెంట్‌కు వచ్చిన అభిమానులకు పూర్తి సంతృప్తినిచ్చేలా మెస్సీ మైదానంలో గంట పాటు సందడి చేశాడు. మరోవైపు చిన్నారుల్లో ఎంతో స్ఫూర్తి నింపేలా ఈ ఈవెంట్లో కొన్ని ముఖ్య కార్యక్రమాలు నిర్వహించారు.

ఎగ్జిబిషన్ మ్యాచ్, పెనాల్టీ షూటౌట్‌లో సందడి చేయడంతో పాటు మెస్సీ, రోడ్రిగో, సువారెజ్ చిన్నారులకు ఫుట్‌బాల్ చిట్కాలు నేర్పించారు. స్టేడియంలో మూడు చోట్ల ఏర్పాటు చేసిన క్లినిక్‌లలో పిల్లలతో కలిసి డ్రిబ్లింగ్.. పాస్‌లు ఆడారు. చిన్నారులకు ఫుట్‌బాల్ ఎలా ఆడాలో ప్రత్యక్షంగా శిక్షణ ఇచ్చారు. ఫుట్‌బాల్‌ను నియంత్రించడం, పాస్ ఇవ్వడం వంటి ప్రాథమిక నైపుణ్యాలను పిల్లలకు చూపించారు.


మెస్సీ బృందం, సీఎం రేవంత్ రెడ్డితో ఫుట్‌బాల్ క్రీడాకారులు

మెస్సీతో 'లక్ష్య' అమూల్య ఆట

అర్జెంటీనా దిగ్గజ ఫుట్‌బాల్ ఆటగాడు లియోనల్ మెస్సీని చూడాలని వేల మంది అభిమానులు తపించారు. కానీ కొంతమంది చిన్నారులకు అతడితో ఆడే అవకాశం కూడా దక్కింది. వారిలో 'ఈనాడు' లక్ష్య క్రీడాకారిణి అమూల్య నందిని కూడా ఉంది. శనివారం ఉప్పల్ స్టేడియంలో మెస్సీ జట్టుతో జరిగిన స్నేహపూర్వక మ్యాచ్‌లో సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని సింగరేణి ఆర్ఆర్ జట్టుకు నందిని ప్రాతినిధ్యం వహించింది.

ఓవైపు సీఎం రేవంత్‌రెడ్డి, మరోవైపు మెస్సీ.. ఆ ఇద్దరి మధ్యలో పిల్లలు.. బంతిని ఒక్కొక్కరు మరోవైపు కిక్ కొడుతూ స్టేడియంలోని అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపారు. చిన్నారులతో కలిసి మైదానంలో నిమిషాలు పాటు ఫుట్‌బాల్ ఆడిన మెస్సీ.. వారికి సూచనలు ఇస్తూ ప్రోత్సహించారు. ఫుట్‌బాల్ దిగ్గజం ఇచ్చిన సూచనలతో పిల్లల ఉత్సాహం రెట్టింపైంది. సుమారు 20 నిమిషాల పాటు రేవంత్, మెస్సీ, రోడ్రిగో, సువారెజ్‌లు పిల్లలతో సరదాగా గడిపారు. వాళ్లతో ఫొటోలు తీసుకున్నారు. స్టేడియమంతా తిరుగుతూ అభివాదం చేశారు. స్టాండ్స్‌లోకి ఫుట్‌బాల్‌లు తరలిస్తూ అభిమానుల్లో జోష్ నింపారు.


కోల్‌కతాలో మెస్సీ విగ్రహం వద్ద అభిమానులు

కోల్‌కతాలో మెరవని మెస్సీ

కోల్‌కతా

మెస్సీ వస్తుండడంతో కొన్ని రోజుల ముందు నుంచే కోల్‌కతాలో ఎంతో హడావుడి. అభిమానులు ఊగిపోయారు. అతణ్ని చూడడం కోసం భారీ ధరలకు టికెట్లు కొన్నారు. కానీ సాల్ట్‌లేక్ స్టేడియంలో అతడు గడిపిన సమయం ఎంతో తెలుసా? కేవలం 22 నిమిషాలు. ఆ కొద్ది సమయంలో కూడా సెలెబ్రిటీలు, భద్రత సిబ్బంది అతడి చుట్టూ ఉండడంతో స్టేడియంలోని 50 వేల మందికి పైగా అభిమానుల్లో చాలా మందికి అతణ్ని చూసే అవకాశమే లేకపోయింది. మెస్సీ త్వరగా వెళ్లిపోయాడని అర్థం కావడంతో తీవ్ర ఆగ్రహానికి గురైన అభిమానులు మైదానంలో విధ్వంసానికి పాల్పడ్డారు. నిర్వహణ లోపంతో ఒక్కసారిగా అంతా గందరగోళంగా మారింది. క్రమంగా అది శాంతిభద్రతల సమస్యగా మారింది.

అంతా గందరగోళం..: మరో ఇద్దరు ఫుట్‌బాల్ స్టార్లు లూయిస్ సువారెజ్, రోడ్రిగో డి పాల్‌తో కలిసి మెస్సీ.. ఉదయం 11.30కు సాల్ట్‌లేక్ స్టేడియంలోకి వచ్చాడు. టచ్‌లైన్ సమీపంలో వాహనం దిగి మైదానంలో అడుగుపెట్టాడు. ఆ వెంటనే అక్కడున్న వీఐపీలు, నిర్వాహకులు, సెలెబ్రిటీలు, భద్రత సిబ్బంది అతణ్ని చుట్టుముట్టారు. దీంతో గ్యాలరీల్లోని ప్రేక్షకులకు మెస్సీని చూడడం కష్టమైంది. భారీ తెరలపై కూడా మెస్సీ కనపడడంలేదని అభిమానులు ఫిర్యాదు చేయడం మొదలెట్టారు. ముందు అనుకున్న షెడ్యూలు ప్రకారం మెస్సీ స్టేడియం మొత్తం తిరగడని కొద్ది సేపట్లోనే అర్థం కావడంతో ప్రేక్షకుల్లో అసహనం పెరిగింది. మెస్సీ ల్యాప్ పూర్తి చేయకుండానే వెనుదిరిగాడు. ఫుట్‌బాల్ స్టార్ వెళ్లిపోయాడని తెలియడంతో ప్రేక్షకుల్లో ఆగ్రహం పెల్లుబికింది. సీసాలు, ప్లాస్టిక్ కుర్చీలను మైదానంలోకి విసిరారు. స్పాన్సర్ బ్యానర్లు, హోర్డింగ్‌లను చించివేశారు. ఫైబర్ గ్లాస్ సీట్లను బద్దలు కొట్టారు. కొంత మంది ప్రేక్షకులు బారికేడ్లను దాటి మైదానంలోకి దూసుకెళ్లారు. నిరసనకు దిగిన ప్రేక్షకులు రాష్ట్ర క్రీడల మంత్రి అరూప్ బిశ్వాస్, ఈవెంట్ నిర్వాహకుడు శతద్రు దత్తాను అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. మెస్సీ నిష్క్రమించాక నిర్వాహకుడు శతద్రు, అతడి టీమ్ మైదానంలో కనపడకపోవడంతో పరిస్థితి మరింత దిగజారిందని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. మైదానంలోకి దూసుకొస్తున్న ప్రేక్షకులను నియంత్రించడానికి పోలీసులు ఇబ్బంది పడ్డారు. స్టేడియంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌ను మోహరించారు. నిరసనకారులను చెదరగొట్టడానికి పోలీసులకు లాఠీలకు పని చెప్పక తప్పలేదు. ప్రేక్షకుల విధ్వంసం గంటన్నరపాటు సాగింది. ఈ ఈవెంట్ కోసం ప్రేక్షకులు రూ.4,500 నుంచి రూ.10 వేల వరకు చెల్లించి టికెట్లు కొన్నారు.


మెస్సీతో షారుక్

ముందే ఎందుకు వెళ్లిపోయాడు?

మైదానంలో రాగానే చుట్టూ రాజకీయ నాయకులు, వీఐపీలు, పోలీసు అధికారులు తన చుట్టూ వలయంలా ఏర్పడడంతో మెస్సీ అయోమయానికి గురైనట్లు కనిపించాడు. మైదానంలో తిరగడానికి ప్రయత్నిస్తూ.. అసౌకర్యంతోనే మాజీ ఆటగాళ్లకు ఆటోగ్రాఫ్‌లు ఇచ్చాడు. పరిస్థితి గందరగోళంగా మారుతోందని గ్రహించిన ప్రమోటర్ శతద్రు.. "దయచేసి అతణ్ని ఒంటరిగా వదిలేయండి. మైదానాన్ని ఖాళీ చేయండి" అని మైకులో గద్గద స్వరంతో పదే పదే వేడుకున్నాడు. అయినా ఫలితం లేకపోయింది. అక్కడున్న సెలెబ్రిటీలు ఎవరూ అతడి విజ్ఞప్తిని పట్టించుకోలేదు. మెస్సీ చుట్టూ గుమిగూడడాన్ని కొనసాగించారు. గంగూలీ వస్తున్నాడన్న వార్తతో వాతావరణం మరింత వేడెక్కింది. మైదానంలో మెస్సీని కలవడం కోసం బయట నిరీక్షించిన షారుక్.. అక్కడి పరిస్థితిని చూసి తన ప్రయత్నాన్ని విరమించుకున్నాడు. ఆ తర్వాత మెస్సీని కలిశాడు. అంతా అయోమయంగా మారడంతో మెస్సీని 22 నిమిషాల్లోనే భద్రత మధ్య మైదానం నుంచి తీసుకెళ్లారు. నిజానికి షెడ్యూలు ప్రకారం అతడు.. స్టేడియంలో గంటసేపు ఉండాలి. మెస్సీని వెళ్లిపోవద్దని.. ఇంకొంత సమయం స్టేడియంలో ఉండాలని నిర్వాహకుడు శతద్రు దత్తా, భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ విజ్ఞప్తి చేశారని సమాచారం. కానీ పరిస్థితి అదుపు తప్పుతుందని భావించిన మెస్సీ భద్రత విభాగం అతడిని అక్కడ కొనసాగేందుకు నిరాకరించింది.


అభిమానుల ఆగ్రహం


పోలీసుల లాఠీఛార్జి


శతద్రు దత్తా

నిర్వాహకుడి అరెస్ట్

సాల్ట్‌లేక్ స్టేడియంలో మెస్సీ ఫుట్‌బాల్ ఈవెంట్ నిర్వాహకుడు శతద్రు దత్తాను పోలీసులు కోల్‌కతా విమానాశ్రయంలో అరెస్ట్ చేశారు. ఈవెంట్‌ను సరిగా నిర్వహించకుండా గందరగోళానికి కారణమయ్యాడన్నది అతడిపై ఆరోపణ. ప్రేక్షకులకు టికెట్ డబ్బులను వెనక్కిస్తామని నిర్వాహకులు లిఖితపూర్వక హామీ ఇచ్చినట్లు బెంగాల్ డీజీపీ రాజీవ్ కుమార్ చెప్పారు. మెస్సీ ఈవెంట్ నిర్వహణలో లోపంపై బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన విచారణకు ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రకటించారు. మెస్సీకి, క్రీడాభిమానులకు ఆమె క్షమాపణలు చెప్పారు.

స్క్వాష్ ప్రపంచకప్ ఫైనల్లో భారత్


అనాహత్

చెన్నై: భారత్ తొలిసారి స్క్వాష్ ప్రపంచకప్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. శనివారం జరిగిన సెమీఫైనల్లో భారత్ 3-0తో రెండు సార్లు ఛాంపియన్ ఈజిప్టును ఓడించింది. మొదట సెంథిల్ కుమార్ 7-1, 7-3, 7-6తో ఎల్‌కబానిపై గెలిచి భారత్‌ను ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. ఆ తర్వాత అనాహత్ 6-7, 7-5, 7-3, 3-7, 7-3తో నూర్‌ను ఓడించి ఆధిక్యాన్ని 2-0కు పెంచింది. అభయ్ సింగ్ 7-5, 6-7, 7-5, 7-6తో అడమ్ హవాల్‌పై నెగ్గడంతో సెమీస్‌లో విజయం భారత్ సొంతమైంది. భారత్ ఫైనల్లో హాంకాంగ్ చైనాతో తలపడుతుంది.

టెస్టులు, వన్డేల్లో కెప్టెన్.. టీ20ల్లో వైస్ కెప్టెన్ అయిన శుభ్‌మన్ గిల్ పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్నాడు. టీ20ల్లో అతడి స్థానమే ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు టీ20 సారథి సూర్యకుమార్ ఓ పెద్ద ఇన్నింగ్స్ ఎప్పుడు ఆడాడో తనకైనా గుర్తుందో లేదో! ప్రపంచకప్ సమీపిస్తుండగా సారథి ఇలాంటి ఫామ్‌లో ఉండడం ఆందోళన కలిగిస్తోంది. దక్షిణాఫ్రికాతో మూడో టీ20లో వీళ్లిద్దరూ జోరందుకోవడం, జట్టు విజయం సాధించడం ఎంతో కీలకం.

నాయకులకు పరీక్ష

ఒత్తిడిలో సూర్య, గిల్

రాత్రి 7 నుంచి

దక్షిణాఫ్రికాతో మూడో టీ20 నేడు


గిల్

ధర్మశాల

దక్షిణాఫ్రికాతో అయిదు టీ20ల సిరీస్‌ను ఘనవిజయంతో ఆరంభించి, రెండో మ్యాచ్‌లో చతికిలపడ్డ టీమ్ ఇండియా.. కీలకమైన మూడో టీ20కి సిద్ధమైంది. ఆదివారం ధర్మశాలలో ఈ మ్యాచ్ జరగనుంది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌ల ఫామే భారత్‌కు అతి పెద్ద సమస్యగా మారింది. ముఖ్యంగా గిల్ ఈ సిరీస్‌లో అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోతే జట్టులో చోటు గల్లంతవడం ఖాయం. బ్యాటింగ్ ఆర్డర్లో ప్రయోగాలతో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న జట్టు యాజమాన్యం.. ఈ మ్యాచ్‌లో ఎవరిని ఏ స్థానంలో ఆడిస్తుందన్నది ఆసక్తికరం. బారాబతిలో ఘోర పరాభవం తర్వాత, చండీగఢ్‌లో బలంగా పుంజుకున్న సఫారీ జట్టు.. ధర్మశాలలో మరో విజయం సాధించాలనే పట్టుదలతో ఉంది.

జోరు కొనసాగించాలని..: తొలి టీ20లో కేవలం 74 పరుగులకే కుప్పకూలిన దక్షిణాఫ్రికా.. రెండో మ్యాచ్‌లో 213 పరుగులు చేయడం అనూహ్యం. దీంతో ఇక ఆ జట్టును భారత్ తేలిగ్గా తీసుకునే అవకాశం లేదు. డికాక్ జోరందుకుంటే ఎలా ఉంటుందో చివరి వన్డేలో, రెండో టీ20లో భారత్‌కు బాగానే అనుభవమైంది. రెండో టీ20లో మార్‌క్రమ్, డొనోవన్ ఫెరీరా కూడా మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడారు. వీరికి తోడు హెండ్రిక్స్, బ్రెవిస్, మిల్లర్‌లతో దక్షిణాఫ్రికా బ్యాటింగ్ బలంగా ఉంది. చండీగఢ్‌లో సఫారీ బౌలర్లు కూడా అదరగొట్టారు. పేసర్లు బార్ట్‌మన్, ఎంగిడి, యాన్సెన్ కలిపి 8 వికెట్లు తీశారు. మరోసారి పేస్‌పైనే ఆ జట్టు ఆశలు పెట్టుకుంది. ధర్మశాలలో పరిస్థితులు కూడా పేస్‌కు సహకరిస్తాయి కాబట్టి భారత బ్యాటర్లు జాగ్రత్త పడాల్సిందే.


ఎవరెక్కడ?

గత మ్యాచ్‌లో బౌలింగ్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్‌ను మూడో స్థానంలో ఆడించిన జట్టు యాజమాన్యం.. విధ్వంసక బ్యాటర్ అయిన శివమ్ దూబెను ఎనిమిదో స్థానంలో దించింది. అక్షర్ 21 బంతుల్లో 21 పరుగులే చేసి ఔటయ్యాడు. దూబె 18వ ఓవర్ చివరి బంతికి క్రీజులోకొచ్చాడు. అప్పటికే భారత్ ఓటమి ఖరారైంది. 214 పరుగుల భారీ ఛేదనలో ఇదేం వ్యూహమో అర్థం కాక అభిమానులు తలలు పట్టుకున్నారు. తీవ్ర విమర్శల నేపథ్యంలో ఈ మ్యాచ్‌లో అయినా బ్యాటింగ్ ఆర్డర్‌ను సరి చేస్తారేమో చూడాలి. టాప్ ఆర్డర్లో గిల్, సూర్య పేలవ ప్రదర్శన చేస్తుండడం జట్టుకు చేటు చేస్తోంది. తొలి టీ20లో 4 పరుగులే చేసిన గిల్.. రెండో మ్యాచ్‌లో డకౌటయ్యాడు. యశస్వి, సంజు శాంసన్‌లను పక్కన పెట్టి శుభ్‌మన్‌ను ఆడిస్తుండడంలో ఆంతర్యమేంటో అర్థం కావడం లేదు. ఆదివారం కూడా గిల్ రాణించకపోతే వేటు తప్పదు. సూర్య కూడా పేలవ ఫామ్ నుంచి బయట పడాల్సి ఉంది. సిరీస్ తొలి రెండు మ్యాచ్‌ల్లో అతను 12, 5 పరుగులే చేశాడు. సిరీస్‌లో ఇంకా తన దైన శైలిలో చెలరేగని అభిషేక్.. ధర్మశాలలో అయినా బ్యాటు ఝుళిపిస్తాడేమో చూడాలి. తిలక్ వర్మ రెండో టీ20లో మేటి ఇన్నింగ్స్ ఆడాడు. హార్దిక్ కూడా లయలో ఉన్నాడు. తొలి టీ20లో సమష్టిగా సత్తా చాటిన బౌలర్లు.. రెండో మ్యాచ్‌లో తేలిపోయారు. అర్ష్‌దీప్, బుమ్రా వికెట్ పడగొట్టకపోగా భారీగా పరుగులిచ్చేశారు. స్పిన్నర్లు వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ మాత్రం రాణించారు. ఒక పేసర్‌ను తగ్గించుకుని, ధర్మశాలలో మంచి రికార్డున్న కుల్‌దీప్ యాదవ్‌ను తుది జట్టులో ఆడించడం మంచిదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అదరగొట్టిన 'లక్ష్య' అథ్లెట్లు

యూత్ ఆసియా పారా క్రీడలు


అకీరా



నరేశ్



అక్షయ

వరంగల్ క్రీడలు, న్యూస్‌టుడే: దుబాయ్‌లో జరుగుతున్న యూత్ ఆసియా పారా క్రీడల్లో ఈనాడు 'లక్ష్య' అథ్లెట్లు సత్తా చాటారు. టీ38, 200 మీటర్ల విభాగంలో వరంగల్ జిల్లా జంగాపల్లి తండాకు చెందిన బానోతు అకీరా నందన్ స్వర్ణంతో మెరిశాడు. 23.50 సెకన్లలో లక్ష్యాన్ని చేరి అతడు అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. స్విమ్మింగ్‌లో శ్రీనికేశ్ అదగొట్టాడు. 100 మీటర్ల ఫ్రీస్టైల్, 100 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్, 50 మీటర్ల ఫ్రీస్టైల్‌లో అతడు కాంస్యాలు గెలుచుకున్నాడు. టేబుల్ టెన్నిస్‌లో విజయ దీపిక కంచు నెగ్గింది. టీ44, 400 మీటర్ల పరుగులో అవిలిగొండ నరేశ్ (ఆంధ్రప్రదేశ్) రజతం సాధించాడు. 60.27 సెకన్ల టైమింగ్‌తో అతడు రెండో స్థానంలో నిలిచాడు. ఎఫ్-12, షాట్‌పుట్‌లో బొర్రా అక్షయ (ఆంధ్రప్రదేశ్) కాంస్యం సొంతం చేసుకుంది. ఆమె గుండును 7.23 మీటర్ల దూరం విసిరి మూడో స్థానంలో నిలిచింది.

లిండ్సే.. 41 ఏళ్ల వయసులో


లిండ్సే

సెయింట్ మార్టిజ్ (స్విట్జర్లాండ్): అమెరికా స్కై రేసర్ లిండ్సే వోన్ మరోసారి సత్తా చాటింది. 41 ఏళ్ల వయసులో ప్రపంచకప్‌లో అదరగొట్టి రెండో స్థానంలో నిలిచింది. 0.24 సెకన్ల అంతరంతో ఆమె విజేతగా నిలిచే అవకాశాన్ని కోల్పోయింది. ఎమ్మా ఐచెర్ (జర్మనీ) టైటిల్ సాధించగా.. సోఫియా (ఇటలీ) మూడో స్థానాన్ని దక్కించుకుంది. అంతకుముందు డౌన్‌హిల్‌లో విజేతగా నిలిచిన లిండ్సే.. ఈ ఘనత సాధించిన అత్యంత పెద్ద వయస్కురాలిగా నిలిచింది.

సా-చికి క్లిష్టమైన డ్రా

దిల్లీ: ప్రపంచ టూర్ ఫైనల్స్ టోర్నీలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జంట క్లిష్టమైన గ్రూప్‌లో పడింది. ఈనెల 17న చైనాలోని హాంగ్జౌలో ఆరంభమయ్యే ఈ టోర్నీలో వీళ్లున్న గ్రూప్-బిలోనే.. ఒలింపిక్ పతకాలు గెలిచిన ఆరోన్ చియా-సో వుయ్ యిక్, లియాంగ్ వీయ్-వాంగ్ చాంగ్ జోడీలు కూడా ఉన్నాయి. గాయాల నుంచి కోలుకుని ఇటీవలే పునరాగమనం చేసిన సాత్విక్, చిరాగ్‌లకు ప్రపంచ టూర్ ఫైనల్స్ టోర్నీ సవాల్ విసరనుంది. ఈ ఏడాది మలేసియా ఓపెన్, ఇండియా ఓపెన్, సింగపూర్ ఓపెన్, చైనా ఓపెన్, డెన్మార్క్ ఓపెన్‌లలో భారత జంట సెమీస్ వరకు వెళ్లింది.

తితిదే దివ్య వృక్షాల ప్రాజెక్టు

• ఆలయ ధ్వజస్తంభాల కోసం చెట్ల పెంపునకు ప్రణాళికలు

తిరుమల, న్యూస్‌టుడే: ఆధ్యాత్మికతతో పాటు పర్యావరణ పరిరక్షణలో భాగంగా తితిదే దివ్య వృక్షాల ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. దేవాలయాల్లో ఏర్పాటు చేసే ధ్వజస్తంభాల నిర్మాణానికి అవసరమైన దివ్య వృక్షాలను సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో తితిదే స్వయంగా పెంచి, పరిరక్షించి వినియోగించనుంది. ఈ మేరకు తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సీఎం చంద్రబాబు దిశానిర్దేశం మేరకు తిరుమల అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా 60కి పైగా ఆలయాలను నిర్వహిస్తున్న తితిదే.. భవిష్యత్తులో వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాలను నిర్మించే బాధ్యతను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టును ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. దివ్య వృక్షాలను స్వయంగా పెంచే తొలి దేవస్థానంగా తితిదే చరిత్ర సృష్టించనుందని వెల్లడించారు.

తలపై ఇరుముడి.. గిరిపై భక్తజడి!


దీక్ష విరమణ చేస్తున్న భవానీలు

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గమ్మ ఆలయం, పరిసరాలలో భవానీ భక్తుల సందడి నెలకొంది. ఇప్పటి వరకు 2 లక్షలకుపైగా భవానీ భక్తులు దుర్గమ్మను దర్శించుకొని ఇరుముడులు సమర్పించారు. గిరి ప్రదక్షిణ మార్గంలో స్థానిక ప్రజలు స్వచ్ఛందంగా భక్తులకు పండ్లు, అల్పాహారం, టీ, కాఫీలు, భోజనాలు అందిస్తున్నారు. మొదటి రోజు రూ.34,12,985, రెండో రోజు రూ.72,16,431 ఆదాయం సమకూరింది. సోమవారం వరకు ఆలయంలో భవానీల రద్దీ కొనసాగనుంది. ఆలయ ఈవో వీకే శీనానాయక్, ఆలయ ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ ఏర్పాట్లు పరిశీలిస్తున్నారు.

రూ.165 కోట్లతో జ్యుడీషియల్ అకాడమీ భవనం

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీకి రాజధాని అమరావతిలో రూ.165 కోట్ల అంచనా వ్యయంతో అత్యాధునిక జీ+5 భవనాన్ని నిర్మించనున్నారు. ప్రస్తుతం విజయవాడ- గుంటూరు మధ్య కాజ వద్ద అద్దె భవనంలో నడుస్తున్న జ్యుడీషియల్ అకాడమీకి సీఆర్‌డీఏ పిచ్చుకలపాలెం వద్ద 4.83 ఎకరాల స్థలాన్ని 60 ఏళ్ల లీజుకు కేటాయించింది. అక్కడ భవనాన్ని కూడా సీఆర్‌డీఏనే నిర్మించనుంది. ఈ ప్రాంతం హైకోర్టుకు సుమారు 3 కి.మీ. దూరంలో ఉంది. ఈ భవన నిర్మాణానికి సీఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో ఇటీవల ఆమోదం లభించింది.

★ జ్యుడీషియల్ అకాడమీ హైకోర్టు ఆధ్వర్యంలో పనిచేసే శిక్షణ సంస్థ. న్యాయమూర్తులు, న్యాయాధికారులు, కోర్టుల సిబ్బందికి నైపుణ్యాల పెంపు, కోర్టు మేనేజ్‌మెంట్, న్యాయ విజ్ఞానంలో ఇక్కడ శిక్షణ ఇస్తారు.

★ కొత్తగా సర్వీసులో చేరిన జడ్జిలతో పాటు, ఇప్పటికే సర్వీసులో ఉన్నవారికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఉంటుంది.

★ ఏపీ జ్యుడీషియల్ అకాడమీకి రాజధానిలో అత్యాధునిక క్యాంపస్‌ను ఏర్పాటు చేయబోతున్నారు. ఎకడమిక్ బ్లాక్, నివాస సదుపాయాలు, డిజిటల్ క్లాసరూమ్‌లు, ఆడిటోరియం, సమావేశ మందిరాలు, క్రీడలు, వినోద సదుపాయాలు, కెఫెటేరియా వంటివి ఉంటాయి. దానిలో భాగంగానే ఇప్పుడు భవన నిర్మాణం చేపడుతున్నారు.

తిరుమల శ్రీవారి సేవలో రజనీకాంత్


ఆలయం ఎదుట రజనీకాంత్, లత దంపతులు, కుమార్తెలు ఐశ్వర్య, సౌందర్య, మనవళ్లు తదితరులు

తిరుమల, న్యూస్‌టుడే: ప్రముఖ నటుడు రజనీకాంత్ శనివారం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయం వద్దకు భార్య లత, కుమార్తెలు ఐశ్వర్య, సౌందర్య, మనవళ్లతో చేరుకున్న ఆయనకు తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనం, అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకుముందు రజనీకాంత్ శ్రీవారి తులాభారంలో 73 కిలోల బెల్లం, చక్కెర, బియ్యంతో మొక్కులు చెల్లించారు. ఆయన కుటుంబసభ్యులూ తులాభారం మొక్కులు సమర్పించారు. రజనీకాంత్‌ను చూసిన అభిమానులు ఆయనతో సెల్ఫీ తీసుకునేందుకు పోటీ పడ్డారు.

16 నుంచి దేశవ్యాప్తంగా తిరుప్పావై ప్రవచనాలు

తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: పవిత్రమైన ధనుర్మాసాన్ని పురస్కరించుకుని తితిదే ఆధ్వర్యంలో డిసెంబరు 16 నుంచి జనవరి 14 వరకు దేశవ్యాప్తంగా 233 కేంద్రాల్లో తిరుప్పావై ప్రవచనాలు చేయనున్నారు. డిసెంబరు 15న తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో తిరుప్పావై ప్రవచనాల ప్రారంభ సమావేశం జరగనుంది. తితిదే ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి నిర్వహించే సుప్రభాతం స్థానంలో ఈ నెల 17 నుంచి తిరుప్పావై నివేదిస్తారు.

పొందూరు ఖాదీ.. ఇది తెలుగోడి బ్రాండ్!

- గాంధీజీ మెప్పు పొందిన నాణ్యత
- హుందాతనానికి తార్కాణం
- పురాతన పద్ధతులతో తయారీ.. ఉత్తరాంధ్ర ప్రత్యేకం


పొందూరు ఖాదీ వస్త్రం

ఎలాంటి రసాయనాలు వాడకుండా.. విత్తు నుంచి బట్టత యారీ వరకు పురాతన పద్ధతులతో, పర్యావరణ హిత ప్రక్రియను అనుసరించడం పూర్వం చూసి ఉంటాం. యంత్రాల రాకతో సంప్రదాయ తయారీకి స్వస్తి పలికారు. కానీ శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలంలోని 'పొందూరు ఖాదీ' భండార్‌లో నేటికీ పాత పద్ధతిలోనే వస్త్రాలు తయారు చేస్తున్నారు. వినూత్న తయారీ, నాణ్యతతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన పొందూరు ఖాదీ ఇప్పుడు మరో ఘనత సాధించింది. పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడి చొరవతో ఈ నెల 12న జీఐ(జియోగ్రాఫికల్ ఇండికేషన్) ట్యాగ్ పొందింది. అరుదైన, ప్రత్యేక ఉత్పత్తులకే ఈ గౌరవం లభిస్తుంది. పొందూరు ఖాదీ దుస్తుల తయారీలో ప్రధానంగా ఏడు దశలు ఉంటే ఒక్కో దశకు ఒక్కో ప్రత్యేకత ఉంది.


ఖాదీ తయారీకి వినియోగించే కొండ పత్తి


చిలపలు తయారు చేస్తున్న చేనేత కార్మికురాలు

కొండ పత్తి మాత్రమే..

పొందూరు ఖాదీ వస్త్రాలు తయారు చేసేందుకు కొండ పత్తిని మాత్రమే ఉపయోగిస్తారు. ఇది అన్ని ప్రాంతాల్లో పండదు. నల్లరేగడి నేలలో మన్యం, విజయనగరం, శ్రీకాకుళం వంటి కొన్ని ప్రదేశాల్లోనే పండుతుంది. సొసైటీ వాళ్లే రైతులకు విత్తనాలు ఇచ్చి పంట కొనుగోలు చేస్తారు. ఈ కొండ పత్తితో పొందూరు ఖాదీ వస్త్రాన్ని మాత్రమే చేయగలరు తప్ప మరెవరికీ ఈ పత్తి ఉపయోగపడదు.

ఏడు దశల్లో తయారీ..

1.చేప దవడతో శుభ్రం చేయడం: ధవళేశ్వరం వద్ద గోదావరి నదిలో దొరికే వాలుగ చేప దవడతో మొదటి దశలో పత్తిని శుభ్రం చేస్తారు. చేప దవడ భాగాన్ని నాలుగు భాగాలుగా చేసి పత్తిని చేప పళ్లతో శుభ్రపరుస్తారు.

2.నిడచడం: చెక్కతో చేసిన నిడుపు రాట్నం ద్వారా పత్తిని, గింజని వేరుచేస్తారు.

3.చిగిలించి పింజ చేయడం, పొట్లు తీయడం: గింజ నుంచి పత్తిని వేరు చేశాక, అందులో ఉండిపోయిన చెత్తనూ తొలగిస్తారు.


4.పత్తిని మెత్తగా చేయడం: రేగి కర్రకు సన్నటి తాడు కట్టి పత్తిని కొడతారు. దీంతో అది విడిపోయి మెత్తగా తయారవుతుంది.

5.పత్తిని ఏకి దానిని చుడతారు: మెత్తగా చేసిన పత్తిని చుట్టుపుల్లతో చుడతారు.

6.సన్న నూలు వడకడం: అరటి దవ్వలో పత్తిని రాట్నం ద్వారా తిప్పుతారు.

7.హేంకరుపై నూలు పోయడం: హేంకరు చుట్టుకొలత ఒక రౌండుకు మీటరు ఉంటుంది. ఇలా వెయ్యిసార్లు తిప్పితే ఒక చిలప తయారవుతుంది. అనంతరం తయారైన చిలపలను చేనేతలకు పంపిస్తారు.

• మూడు కేజీల చిలపలతో నేతన్న బట్ట తయారు చేస్తారు. దీంతో 18 చొక్కాలు తయారవుతాయి. ఖాదీతో కర్చీఫ్‌లు, తువ్వాళ్లు, చీరలు, పంచెలు తయారవుతాయి.


పత్తి శుభ్రం చేసేందుకు వినియోగించే వాలుగ చేప దవడ


వాలుగ చేప దవడ పళ్లతో పత్తిని శుభ్రం చేస్తున్నారిలా...


ఖాదీ వస్త్రం తయారు చేస్తున్న చేనేత కార్మికుడు

మూడు రకాలుగా ఖాదీ

మొదటిది ప్రాంతీయ ఖాదీ: దీని ధర మీటరు రూ.1200 నుంచి రూ.2,600 వరకు ఉంది.

మజిలిన్ ఖాదీ: మీటరు రూ.500 నుంచి రూ.800 ఉంటుంది.

అంబర్ ఖాదీ: మీటరు రూ.400 నుంచి రూ.600 ఉంటుంది.

• రసాయనాల రహిత ఈ ఖాదీ వస్త్రాలు ఎండాకాలం చల్లగా, చలికాలం వెచ్చగా ఉంటాయి. వీటిని ధరిస్తే హుందాగా కనిపిస్తారని ప్రతీతి.

ఘన చరిత్ర

పొందూరు ఖాదీకి ప్రత్యేకమైన స్థానం ఉంది. 1921లో ఈ వస్త్రాలు బాపూజీ దృష్టికి వచ్చాయి. నాణ్యతను చూసి ఆయన ఆశ్చర్యపోయారు. దీనిపై గాంధీజీ 'యంగ్ ఇండియా' పత్రికలో ఓ కథనాన్ని రాశారు. పొందూరు ఖాదీ 1949లో సంఘటిత రంగంలోకి వచ్చింది. 1955 అక్టోబరు 13వ తేదీన ఖాదీ సంస్థ భవనానికి శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం పొందూరు ఖాదీలో 600 మంది స్పిన్నర్లు (ఒడికేవారు), 100 మంది వీవర్స్(నేతవారు) ఉన్నారు.

- ఈనాడు డిజిటల్, శ్రీకాకుళం



హైకోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో పాల్గొన్న జస్టిస్ కుంచం మహేశ్వరరావు, జస్టిస్ రవినాథ్ తిల్హరి, జస్టిస్ వై.లక్ష్మణరావు తదితరులు

లోక్ అదాలత్‌కు భారీ స్పందన

రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల కేసుల పరిష్కారం

ఈనాడు, అమరావతి: జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన లోక్ అదాలత్‌లకు భారీ స్పందన లభించింది. శనివారం ఒక్కరోజే 2,00,746 కేసులు పరిష్కారం అయ్యాయి. రూ.52.56 కోట్ల పరిహారం చెల్లింపునకు అవార్డులు జారీచేశారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకుర్, ఏపీ న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షులు జస్టిస్ సీహెచ్.మానవేంద్రనాథ్‌రాయ్, హైకోర్టు న్యాయసేవల కమిటీ ఛైర్మన్ జస్టిస్ రవినాథ్ తిల్హరి మార్గదర్శకాల్లో రాష్ట్రంలోని దిగువ న్యాయస్థానాల్లో శనివారం 431 లోక్ అదాలత్ బెంచ్‌లు నిర్వహించారు. రాజీకి అవకాశమున్న 2,00,596 కేసులను ఇరువర్గాల మధ్య సామరస్యపూర్వకంగా పరిష్కరించారు.

★ హైకోర్టు ప్రాంగణంలో ఏపీ హైకోర్టు న్యాయసేవల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్ అదాలత్ బెంచ్‌లకు జస్టిస్ కుంచం మహేశ్వరరావు, డాక్టర్ జస్టిస్ వై.లక్ష్మణరావు అధ్యక్షత వహించారు. మరో 150 కేసులను ఇక్కడ పరిష్కరించారు. రూ.2.81 కోట్ల పరిహారం అందజేసేందుకు అవార్డులు జారీచేశారు. లోక్ అదాలత్ విజయవంతం కావడానికి సహకరించినవారికి న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బీఎస్‌వీ హిమబిందు, హైకోర్టు న్యాయసేవల కమిటీ కార్యదర్శి జి.మాలతి కృతజ్ఞతలు తెలిపారు.

16న మంగళగిరి ఏపీఎస్పీ బెటాలియన్‌కు సీఎం రాక

పోలీసు నియామక పత్రాలు అందజేయనున్న చంద్రబాబు


హోం మంత్రి అనితకు ఏర్పాట్ల గురించి వివరిస్తున్న కమాండెంట్ నగేష్‌బాబు

తాడేపల్లి, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఏపీఎస్పీ ఆరో బెటాలియన్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 16న రానున్నారు. పోలీసు ఉద్యోగాలకు ఎంపికైన 6,000 మందికి ఆయన నియామక పత్రాలు అందజేయనున్నారు. ఎంపికైన వారితో పాటు వారి కుటుంబ సభ్యులతో కలిసి సుమారు 18 వేల మంది ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. హోం మంత్రి అనిత.. శనివారం పోలీసు ఉన్నతాధికారులతో కలిసి పరేడ్ గ్రౌండ్‌లో చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. 72 అడుగుల విస్తీర్ణం కలిగిన సభా వేదిక నిర్మిస్తుండగా, ఆ ఏర్పాట్లను గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉదయం ఎస్పీ వకుల్‌జిందాల్‌తో కలిసి పరిశీలించారు. డీజీపీ ఆఫీసు నుంచి బెటాలియన్ కమాండెంట్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో హెలిప్యాడ్ ఏర్పాటు చేస్తున్నారు.


గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను సత్కరించి గద అందిస్తున్న పర్యాయ పుత్తిగె మఠాధిపతి సుగుణేంద్ర తీర్థ

శాంతి సాధనలో భారత్ పాత్ర కీలకం

ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్

ఉడుపి, న్యూస్‌టుడే: ప్రస్తుత ప్రపంచం సంఘర్షణ, విభజన, అనిశ్చితి సమస్యలను ఎదుర్కొంటోందని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి సందర్భంలో శాంతి సాధనకు భారతదేశం పోషించే పాత్ర కీలకమని తెలిపారు. మన దేశం నిరంతరం శాంతి సందేశాన్ని వినిపిస్తూనే వస్తోందని గుర్తు చేశారు. శాంతి అంటే కేవలం ఘర్షణలకు, యుద్ధానికి వెళ్లకుండా ఉండడమే కాదని, ఇతరులను పరస్పరం గౌరవించడం, బాధ్యతలు తీసుకుని సహకారాన్ని అందించడం కూడా భాగమేనని వివరించారు. కర్ణాటకలోని ఉడుపిలో పర్యాయ పుత్తిగె మఠం, శ్రీకృష్ణ మఠం సంయుక్తంగా నిర్వహిస్తున్న విశ్వశాంతి సమావేశాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. దైవం అనేది భక్తి భావనతో పాటు పర్యావరణ పరిరక్షణగా విశ్లేషించారు. సూర్యుడు, వర్షం, మట్టి, నదులను పర్యావరణ వ్యవస్థగా గుర్తించి గౌరవించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వేదాలు భారత్‌కు మూలస్తంభాలు మాత్రమే కాదని, అవి పూర్తి ప్రపంచానికే అమూల్యమైన సంపద అని గవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. పర్యాయ పుత్తిగె మఠాధిపతి సుగుణేంద్ర తీర్థ, చిన్న స్వామి సుశీంద్ర తీర్థ, అమెరికాకు చెందిన వరల్డ్ రెలిజియన్ ఫర్ పీస్ సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ విలియం ఎఫ్ విండ్లె తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోంది

• సీజీపీలో సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: సరిహద్దుల్లో సైనిక కార్యకలాపాల తీవ్రత తగ్గినా..'ఆపరేషన్ సిందూర్' కొనసాగుతూనే ఉంటుందని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ అన్నారు. విధులు నిర్వర్తించబోయే యువ అధికారులు రానున్న కాలంలో అనునిత్యం అప్రమత్తతతో ఉండాలని సూచించారు. భారత వైమానిక దళం ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీకి చెందిన 244 మంది ఫ్లైట్ క్యాడెట్ల శిక్షణ విజయవంతంగా ముగిసిన సందర్భంగా హైదరాబాద్ దుండిగల్‌లోని భారత వాయుసేన (ఐఏఎఫ్) అకాడమీలో శనివారం 216 కోర్సు కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్ (సీజీపీ) నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జనరల్ అనిల్ చౌహాన్ ఫ్లయింగ్ ఆఫీసర్ల కవాతును సమీక్షించి, వింగ్స్, స్ట్రయిప్స్ ప్రదానం చేశారు.

29 మంది మహిళా అధికారులు..

శిక్షణ పూర్తి చేసుకున్న క్యాడెట్ల కవాతు సాంతం ఆకట్టుకుంది. 244 మందిలో 29 మంది మహిళా అధికారులున్నారు. కోర్సులో అన్ని విభాగాల్లో ముందంజలో నిలిచిన ఫ్లైయింగ్ ఆఫీసర్ అగర్వాల్‌కి 'ప్రెసిడెంట్ ప్లాక్'తోపాటు 'నవనగర్ స్వార్డ్ ఆఫ్ హానర్' ప్రదానం చేశారు. నావిగేషన్, గ్రౌండ్ డ్యూటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సాక్షం దోబ్రియల్, నితేశ్‌కుమార్‌లకు 'ప్రెసిడెంట్ ప్లాక్'ని బహూకరించారు. గ్రూప్ కెప్టెన్ హర్‌ప్రీత్‌సింగ్ మల్హోత్రా యువ అధికారులతో ప్రమాణం చేయించారు. కార్యక్రమం మొదట్లో ఆకాశ్ గంగా స్కై డైవింగ్ టీమ్ త్రివర్ణ, ఐఏఎఫ్ పతాకాలతో ప్రదర్శన ఇచ్చింది. ఎయిర్ వారియర్స్ రైఫిల్ డ్రిల్, చేతక్ హెలికాప్టర్లు, పిలాటస్ పీసీ-7, సారంగ్ హెలికాప్టర్ టీమ్, సూర్యకిరణ్ ఏరోబాటిక్ టీమ్ విన్యాసాలు ఒళ్లు గగుర్పొడిచేలా సాగాయి.



దుండిగల్ ఎయిర్ ఫోర్స్ అకాడమీలో కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పాసింగ్ అవుట్ పరేడ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న జనరల్ అనిల్ చౌహాన్ ★ సూర్య కిరణ్ ఏరోబాటిక్ టీమ్ విన్యాసాలు

కాగ్నిజెంట్ భూకేటాయింపు ఒప్పందంలో స్వల్ప సవరణలు

• ఉత్తర్వు జారీచేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ ఇండియా లిమిటెడ్‌కు విశాఖపట్నం జిల్లా మధురవాడలో 22.19 ఎకరాలు కేటాయిస్తూ చేసుకున్న ఒప్పందంలో స్వల్ప సవరణలు చేస్తూ శనివారం ఉత్తర్వు జారీచేసింది. ఒప్పందం ప్రకారం కాగ్నిజెంట్ సంస్థ లక్ష్యాలను గడువులోపు చేరుకోకపోతే, ఏకపక్షంగా ఒప్పందం రద్దుచేయకూడదని, అందుకు పరిస్థితులు, కారణాలేంటో తెలుసుకొని నిర్ణయం తీసుకోవాలంటూ ఆ సంస్థ చేసిన వినతికి సమ్మతించింది. ఏదైనా అంశంలో ఏకాభిప్రాయం కుదరకపోతే ఆర్బిట్రేషన్‌కు వెళ్లేందుకు అనుమతివ్వాలన్న విజ్ఞప్తిని ఆమోదిస్తూ ఉత్తర్వు జారీచేసింది.

మరిన్ని వివరాలు https://epaper.eenadu.net లో

21న రాష్ట్రవ్యాప్తంగా 'పల్స్ పోలియో'

54 లక్షల మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసేలా ఏర్పాట్లు

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 21న పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేసేలా ఏర్పాట్లు చేస్తోంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లపై వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్.. రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశంలో సమీక్షించారు. డీఎంహెచ్‌వోలు, ఇమ్యునైజేషన్, ఇతర వైద్యాధికారుల ఆధ్వర్యంలో జిల్లా, మండల, పట్టణ, గ్రామీణ స్థాయుల్లోనూ సమావేశాలు నిర్వహించి క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు.

★ రాష్ట్రంలో ఐదేళ్లలోపు చిన్నారులు 54,07,663 మంది ఉన్నారు. వీరికోసం 61,26,120 డోసులు సిద్ధం చేసి జిల్లాలకు పంపారు.

★ 38,267 బూత్‌లలో పల్స్ పోలియో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తారు.

★ బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాలు, వాణిజ్య సముదాయాలు, పర్యాటక ప్రదేశాల్లోని పిల్లలకు పోలియో చుక్కలు వేసేలా 1,140 ట్రాన్సిట్ బూత్‌లు ఏర్పాటుచేస్తారు.

★ 21న పోలియో చుక్కలు వేయించుకోని పిల్లలకు 22, 23 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి వేసేలా 76,534 బృందాలను సిద్ధం చేశారు.

★ క్షేత్రస్థాయిలో సేవలకు 1,854 సంచార బృందాలు ఏర్పాటు చేస్తారు. వీరు 21 నుంచి 23 వరకు మురికివాడలు, శివారు ప్రాంతాలు, నిర్మాణ ప్రాంగణాలు, ఇటుక బట్టీలు ఇతరత్రా పని ప్రదేశాల్లో పర్యటించి అర్హులైన పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారు.

పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే వారిని ప్రోత్సహిస్తాం: మంత్రి కొండపల్లి శ్రీనివాస్



విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, యువతకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ప్రోత్సాహం అందిస్తామని ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ (ఏపీ ఛాంబర్స్) ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహిస్తున్న బిజినెస్ ఎక్స్‌పో-2025 రెండో రోజు కార్యక్రమానికి శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన 160 స్టాళ్లను తిలకించి, కార్యకలాపాల గురించి తెలుసుకున్నారు. మోరిస్ గ్యారేజెస్‌కు చెందిన రెండు అత్యాధునిక ఎలక్ట్రిక్ కార్లను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఎంఎస్ఎంఈపై నిర్వహించిన సదస్సులో మాట్లాడుతూ 2027 నాటికి 12 లక్షల ఎంఎస్ఎంఈ యూనిట్లకు చేరుకోవాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని చెప్పారు. ఎంఎస్ఎంఈ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలతో రాబోయే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు సృష్టించాలనేది ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. ఏపీ ఛాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి రావూరి సుబ్బారావు, ఉపాధ్యక్షుడు బి.రాజశేఖర్, కోశాధికారి సుంకర అక్కయ్య నాయుడు, కేవీఎస్ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో ఒబెరాయ్ గ్రూపునకు ప్రత్యామ్నాయ స్థలం కేటాయింపు

ఈనాడు, అమరావతి: తిరుపతిలో ఒబెరాయ్ గ్రూపు ఆధ్వర్యంలో ముంతాజ్ హోటల్ నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యామ్నాయ స్థలం కేటాయించింది. తిరుపతి గ్రామీణ ప్రాంతంలో 20 ఎకరాలను ఒబెరాయ్‌కు చెందిన ముంతాజ్ పేరుతో కాకుండా అదే గ్రూపునకు చెందిన 'స్వర' హోటళ్లకు కేటాయించింది. ఈ గ్రూపునకు మొదట తిరుపతి గ్రామీణ మండలం పేరూరులో 20 ఎకరాలు కేటాయించారు. దీనిపై అప్పట్లో వివాదం నెలకొనడంతో ప్రభుత్వం ఈ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది.

ఈనాడు బిజినెస్ వారాంతం

హైదరాబాద్‌లో డబ్ల్యూజీఎస్2డీ కార్యాలయం



నిఖిల్ చౌహాన్, క్రిస్టోఫర్ పోర్సెనా

ఈనాడు, హైదరాబాద్: అమెరికాకు చెందిన మేనేజ్‌మెంట్ సేవల సంస్థ డబ్ల్యూజీఎస్2డీ ఆసియాలో తన తొలి కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించింది. కేవలం సలహాలు, సూచనలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో ఫలితాలను సాధించే లక్ష్యంతో తాము పనిచేస్తామని సంస్థ గ్లోబల్ సీఈఓ స్టీవ్ అలెస్సీ తెలిపారు. సంస్థలకు సైబర్ సెక్యూరిటీ, టెక్నాలజీ వినియోగం, ఖర్చుల నియంత్రణ, విక్రయాలు తదితర విభాగాల్లో సేవలు అందిస్తామన్నారు. సంస్థల అవసరాలకు తగ్గట్లుగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, పారదర్శకతతో సేవలు అందిస్తామని చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ క్రిస్టోఫర్ పోర్సెనా పేర్కొన్నారు. సంస్థ ఇండియా సీఈఓ నిఖిల్ చౌహాన్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని సాంకేతిక నైపుణ్యం, మౌలిక వసతులు సంస్థ అంతర్జాతీయ వృద్ధికి ఎంతో దోహదం చేస్తాయని పేర్కొన్నారు. ఇక్కడి నుంచే ఆసియా, అమెరికా మార్కెట్లకు సేవలు అందిస్తామని వెల్లడించారు. భవిష్యత్తులో కృత్రిమ మేధ (ఏఐ) సేవలను విస్తరించేందుకు ఇక్కడ 'గ్లోబల్ ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్'ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

హైదరాబాద్ వైపు జీసీసీల చూపు

- పెద్ద సంఖ్యలో ఏర్పాటయ్యే అవకాశం
- స్థిరాస్తి వ్యాపారానికి వెన్నుదన్ను
- పెరగనున్న ఉద్యోగుల సంఖ్య



ఈనాడు, హైదరాబాద్: వివిధ దేశాలకు చెందిన బహుళ జాతి కంపెనీలు మనదేశంలో ఇటీవలి కాలంలో అధికంగా జీసీసీలను ఏర్పాటు చేస్తున్నాయి. వీటిలో ఎక్కువ భాగాన్ని హైదరాబాద్ ఆకర్షిస్తోంది. బీఎఫ్ఎస్ఐ (బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్), ఫార్మా రంగాలకు చెందిన జీసీసీలు ఎక్కువగా ఏర్పాటవుతున్నాయి. హైదరాబాద్‌లో ఐటీతో పాటు ఫార్మా, బయోటెక్నాలజీ రంగాలు అధికంగా ఉండటం, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఇప్పటికే అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు ఉండటంతో ఈ రంగాలకు చెందిన కంపెనీలు కొత్తగా నెలకొల్పే జీసీసీలకు సహజంగానే హైదరాబాద్‌ను ఎంచుకుంటున్నాయి. దీనివల్ల స్థానికంగా స్థిరాస్తి రంగానికి ఆకర్షణ ఏర్పడుతోంది. ముఖ్యంగా వాణిజ్య స్థలానికి గిరాకీ కొనసాగనుంది.

2,200కు చేరొచ్చు..

✦ ప్రస్తుతం దేశంలో 1800 జీసీసీలుండగా, ఇందులో 19 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.
✦ 2030 నాటికి జీసీసీల సంఖ్య 2200కు, ఉద్యోగుల సంఖ్య 28 లక్షలకు చేరే అవకాశం ఉంది.
✦ ఐటీ, బీఎఫ్ఎస్ఐ, ఇంజినీరింగ్-మ్యానుఫ్యాక్చరింగ్, ఫార్మా, రిటైల్, కన్జ్యూమర్ సర్వీసెస్ విభాగాల్లో కొత్త క్లస్టర్లు ఏర్పాటవుతాయని, అదే జీసీసీల విస్తరణకు వీలుకల్పిస్తుందని అంచనా.

త్వరలో మూడు కొత్త జీసీసీలు

హైదరాబాద్‌లో త్వరలో మూడు అగ్రశ్రేణి బహుళ జాతి సంస్థల జీసీసీలు ఏర్పాటు కానున్నాయి. కాస్ట్‌కో, వెస్టర్న్ యూనియన్, స్టోల్ట్-నీల్సన్ కంపెనీలు ఇక్కడ తమ జీసీసీ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నాయి. కాస్ట్‌కో యూఎస్‌కు చెందిన రిటైల్ రంగంలోని దిగ్గజ సంస్థ. స్టోల్ట్-నీల్సన్ యూకేలో సరకు రవాణా సేవల విభాగంలో కార్యకలాపాలు సాగిస్తోంది. వెస్టర్న్ యూనియన్ యూఎస్‌లోని ఆర్థిక సేవల విభాగానికి చెందిన కంపెనీ. ఈ సంస్థకు హైదరాబాద్‌లో జీసీసీని హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ బీఓటీ (బిల్డ్- ఆపరేట్- ట్రాన్స్‌ఫర్) విధానంలో ఏర్పాటు చేస్తోంది. ఇందులో 400 మందికి ఉద్యోగాలు లభిస్తాయని తెలిసింది.

2020-24 మధ్యకాలంలో మనదేశంలో వాణిజ్య స్థలం అద్దె వివరాలు

- అద్దెకు తీసుకున్న మొత్తం స్థలం : 262 మిలియన్ చదరపు అడుగులు
- జీసీసీలు వినియోగిస్తున్న స్థలం : 112 మిలియన్ చదరపు అడుగులు
- మొత్తం స్థలంలో జీసీసీల వాటా : 43%

మూడు నగరాలు కీలకం

హైదరాబాద్ నగరంలో వివిధ సంస్థలు తమ జీసీసీ (గ్లోబల్ కేపబులిటీ సెంటర్)ల కోసం 2020-24 మధ్యకాలంలో 1.86 కోట్ల చదరపు అడుగుల భవన నిర్మాణ స్థలాన్ని తీసుకున్నట్లు కన్సల్టింగ్ సేవల సంస్థ అయిన సావిల్స్ ఇండియా వెల్లడించింది. దేశవ్యాప్తంగా జీసీసీలు వినియోగిస్తున్న భవన నిర్మాణ స్థలంలో ఇది 17% కావడం గమనార్హం. ఈ విషయంలో బెంగళూరు తర్వాత స్థానంలో హైదరాబాద్ నిలిచినట్లు అవుతోంది. మనదేశంలో జీసీసీలు బెంగళూరు, హైదరాబాద్, పుణె నగరాల్లో అధికంగా ఏర్పాటవుతున్న విషయం విదితమే. దేశవ్యాప్తంగా జీసీసీలు అద్దెకు తీసుకుంటున్న భవన నిర్మాణ స్థలంలో ఈ మూడు నగరాల వాటా 86 శాతంగా ఉంది.

2030 నాటికి...

2025-30 మధ్యకాలంలో అదనంగా 3 కోట్ల చదరపు అడుగుల నిర్మాణ స్థలాన్ని భారత్‌లో జీసీసీలు అద్దెకు తీసుకునే అవకాశం ఉందని సావిల్స్ ఇండియా విశ్లేషించింది. ఆటోమోటివ్, లైఫ్‌సైన్సెస్, సెమీకండక్టర్ జీసీసీలు అధికంగా ఏర్పాటు కావొచ్చని పేర్కొంది. మిడ్-మార్కెట్ జీసీసీ విభాగానికి చెందిన కంపెనీల్లో 100 మి.డాలర్ల (సుమారు రూ.900 కోట్లు) నుంచి 1 బి.డాలర్ల (దాదాపు రూ.9000 కోట్లు) వార్షిక ఆదాయాలు ఉన్న కంపెనీలను ఆకర్షించే అవకాశాలు అధికంగా ఉన్నట్లు వెల్లడించింది. భారత్‌లో అధికంగా నిపుణుల లభ్యత, తక్కువ నిర్వహణ వ్యయాలు, సానుకూల ప్రభుత్వ విధానాలు, పరిశోధన-అభివృద్ధి కార్యకలాపాలకు పెద్దపీట.. వంటి అంశాలు జీసీసీలను పెద్ద సంఖ్యలో ఆకర్షిస్తున్నాయని పేర్కొంది. అంతేగాక దేశంలో పర్యావరణ అనుకూల సదుపాయాలు, హైబ్రిడ్ పని విధానాలు, వ్యూహాత్మక నగరాలు జీసీసీల విస్తరణను ప్రభావితం చేస్తాయని సావిల్స్ ఇండియా ఎండీ అర్వింద్ నందన్ వివరించారు.

నకిలీ రిఫండులపై ఐటీ విభాగం దృష్టి



దిల్లీ: పన్ను ఎగవేతదారులపై ఆదాయపు పన్ను(ఐటీ) విభాగం దేశవ్యాప్తంగా కఠిన చర్యలు చేపట్టింది. ముఖ్యంగా నకిలీ రాజకీయ పార్టీలకు, స్వచ్ఛంద సంస్థలకు విరాళాల పేరుతో తప్పుడు వివరాలు సమర్పించి, రిఫండులు కోరిన వారిపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. పన్ను చెల్లింపుదారులు తప్పుడు మినహాయింపులను క్లెయిం చేశారని, రిఫండుల కోసం తప్పుడు వివరాలను నమోదు చేశారని ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ పన్ను చెల్లింపులను తగ్గించుకునేందుకు బోగస్ రిఫండులను క్లెయిం చేసేందుకు మధ్యవర్తుల సహాయంతో దేశవ్యాప్త ఏజెంట్ నెట్‌వర్కులు పనిచేసినట్లు దర్యాప్తులో తేలినట్లు పేర్కొంది. నమోదై గుర్తింపు పొందని రాజకీయ పార్టీ (ఆర్‌యూపీపీ)లకు, కొన్ని స్వచ్ఛంద సంస్థలకు చేసిన విరాళాల పేరుతో పెద్ద మొత్తంలో తప్పుడు క్లెయిములు చేశారని వెల్లడించింది. వీటిని ఎక్కువగా సెక్షన్ 80జీజీసీ, సెక్షన్ 80జీ కింద క్లెయిం చేసుకున్నారు. ఐటీ విభాగం నిర్వహించిన తనిఖీల్లో సేకరించిన ఆధారాల ప్రకారం అనేక ఆర్‌యూపీపీలు వాస్తవంగా రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనకుండానే, లెక్కలోకి రాని డబ్బును మార్చేందుకు తప్పుడు రసీదులు జారీ చేస్తున్నాయని తేలింది. ఈ పార్టీలు విరాళాల మొత్తంలో 4.5 శాతం నుంచి 5 శాతం వరకు కమీషన్ తీసుకుని, మిగిలిన మొత్తాన్ని తిరిగి దాతలకు ఆర్‌టీజీఎస్ లేదా నెఫ్ట్ ద్వారా ఇచ్చేస్తున్నాయి. ఇవన్నీ కలిసి దీన్ని ఒక వ్యవస్థీకృత ఆర్థిక మోసంగా మార్చాయని ఐటీ విభాగం పేర్కొంది.

కోడి గుడ్డు

14న ఫారం కోడి గుడ్డు అమ్మకం ధరలు (నెక్) (100 గుడ్లకు రూపాయలలో)

హైదరాబాద్	661
వరంగల్	663
విజయవాడ	695
తూ/ప గోదావరి	670
విశాఖపట్నం	670
చిత్తూరు	683

ఖాతా కావాలంటే బ్యాంకుకు రావాల్సిందే



- ఆన్‌లైన్ సేవలకు తాత్కాలిక విరామం
- మోసపూరిత లావాదేవీలను నివారించేందుకే

ఈనాడు, హైదరాబాద్: పొదుపు ఖాతాను అందించడం దగ్గర్నుంచి, అన్ని రకాల బ్యాంకింగ్ సేవలను డిజిటల్‌లోకి మార్చేందుకు ఇటీవలి కాలం వరకు బ్యాంకులు పోటీ పడ్డాయి. వీలైనంత వరకు బ్యాంకు శాఖకు రావాల్సిన అవసరం లేకుండానే అన్ని సేవలను అందిస్తున్నామనే హామీని ఇచ్చాయి. కానీ, మారిన పరిస్థితుల్లో బ్యాంకులు తమ వ్యూహాన్ని మార్చుకుంటున్నాయి.

ఆర్‌బీఐ జరిమానాల నేపథ్యంలో..

పెరుగుతున్న మ్యూల్ ఖాతాలను, గుర్తింపు (ఐడెంటిటీ) చోరీలను అరికట్టేందుకు పలు బ్యాంకులు మళ్లీ భౌతిక, ఖాతాదారుల ప్రత్యక్ష ధ్రువీకరణ విధానాలను అమలు చేస్తున్నాయి. ఖాతా ప్రారంభించే ప్రక్రియను వేగంగా, ఒకే క్లిక్‌తో డిజిటల్ పద్ధతిలో మార్చేందుకు కొన్నేళ్లుగా ప్రయత్నించిన బ్యాంకులు.. మ్యూల్ ఖాతాలతో జరుగుతున్న మోసాల నేపథ్యంలో ఈ విధానాన్ని పునరాలోచిస్తున్నాయి. ఆన్‌లైన్‌లో ఖాతాలు ప్రారంభించేందుకు బలమైన కేవైసీ (మీ ఖాతాదారు గురించి తెలుసుకోండి) నిబంధనలు పాటించకపోవడంతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఇటీవలి కాలంలో పలు బ్యాంకులకు జరిమానా విధించింది. దీంతో బ్యాంకులు ఈ కీలక మార్పులు చేపట్టాయి. పలు ప్రభుత్వ బ్యాంకులు సహా ప్రైవేటు బ్యాంకులు పూర్తిగా డిజిటల్ ఖాతాలను ప్రారంభించడాన్ని తాత్కాలికంగా నిలిపివేశాయి. కొత్తగా ఖాతా ప్రారంభించాలనుకునే వారు ఇప్పుడు తమ ధ్రువీకరణ పత్రాలు తీసుకొని, శాఖకు వెళ్లాల్సిందే. లేదా ఇంటి వద్దకు వచ్చే బ్యాంకు అధికారులకు ఆ పత్రాలను చూపించాలి.

మరింత సురక్షితంగా..

పలు బ్యాంకులు ఆన్‌లైన్‌లో ఖాతాలను ప్రారంభించే వీలును నిలిపి వేయగా, కొన్ని బ్యాంకులు వేతన ఖాతాలాంటివి అందిస్తున్నాయి. పెద్ద ప్రైవేటు బ్యాంకులు డిజిటల్ ఆన్‌బోర్డింగ్‌ను కొనసాగిస్తున్నప్పటికీ, వాటి డిజిటల్ వ్యవస్థలను మరింత సురక్షితం చేస్తున్నాయి. వినియోగదారులకు సరైన ఉత్పత్తులను ఎంచుకునేందుకు సహాయం చేసేందుకు అవసరమైన ఆన్‌సైట్ డిజిటల్ మోడల్‌కు మారుతున్నామని ఒక ప్రైవేటు బ్యాంకు ప్రకటించింది.

రూ.36,000 కోట్ల వరకూ..

బ్యాంకులు ఖాతాదారుల ధ్రువీకరణను కఠినతరం చేస్తున్నప్పటికీ ఆర్‌బీఐ వెల్లడించిన నివేదిక ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు మోసాల కేసుల సంఖ్య పరంగా తగ్గినప్పటికీ, వాటి విలువ మాత్రం భారీ స్థాయిలో పెరిగింది. గత ఆర్థిక సంవత్సరంలో నమోదైన మోసాల సంఖ్య 23,953. అంతకు క్రితం ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 34 శాతం తక్కువే. కానీ, మోసాల విలువ దాదాపు మూడు రెట్లు పెరిగి రూ.36,014 కోట్లకు చేరుకుంది. రూ.లక్ష అంతకంటే ఎక్కువ విలువైన మోసాలనే ఈ నివేదికలో పరిగణనలోకి తీసుకున్నారు. చిన్న మొత్తాల్లో నష్టపోయిన వారు ఎంతో మంది ఉండొచ్చు. క్రెడిట్ కార్డు మోసాల విలువ రూ.520 కోట్లు ఉండగా, రుణాల రూపంలో జరిగిన మోసాల విలువ రూ.33,148 కోట్లకు పైగా ఉంది. ప్రైవేటు బ్యాంకుల్లో డిజిటల్ చెల్లింపుల్లో, ప్రభుత్వ బ్యాంకుల్లో రుణాల విషయంలో పెద్ద మోసాలు జరిగినట్లు ఆర్‌బీఐ నివేదిక పేర్కొంది. ఈ నేపథ్యంలోనే బ్యాంకులు తమ డిజిటల్ ఆన్‌బోర్డింగ్ ప్రక్రియను మరింత కఠినంగా చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి.

వచ్చే ఏడాది పబ్లిక్ ఇష్యూకు మస్క్ 'స్పేస్ ఎక్స్'!

కంపెనీ విలువ రూ.72 లక్షల కోట్లు

టెస్లా అధినేత మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ వచ్చే ఏడాది పబ్లిక్ ఇష్యూకు వచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అలాగే అంతర్గత వాటాదార్ల నుంచి మొత్తంగా 2.56 బిలియన్ డాలర్ల (సుమారు రూ.23,000 కోట్లు) విలువైన షేర్ల కొనుగోలు ప్రక్రియను కూడా ప్రారంభించింది. ఒక్కో షేరుకు 421 డాలర్ల (రూ.38,000)ను చెల్లించేందుకు ఆఫర్ ఇచ్చింది. దీనికి సంబంధించిన ప్రతిపాదనను స్పేస్‌ఎక్స్ బోర్డు ఆమోదం తెలిపిందని వాటాదార్లకు రాసిన లేఖలో కంపెనీ సీఎఫ్‌ఓ బ్రెట్ జాన్సన్ వెల్లడించినట్లు ఓ ఆంగ్ల వార్తా సంస్థ తన కథనంలో తెలిపింది. కంపెనీ విలువను 800 బిలియన్ డాలర్లు (సుమారు రూ.72 లక్షల కోట్లు)గా పరిగణించి ఈ లావాదేవీ నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. మరోవైపు స్పేస్‌ఎక్స్ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) వచ్చే జూన్‌లోపే ఉండొచ్చని సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ ఆ కథనం వెల్లడించింది. ప్రతిపాదిత ఐపీఓ ద్వారా 25 బిలియన్ డాలర్లను (సుమారు రూ.2.25 లక్షల కోట్లు) సమీకరించాలని కంపెనీ ఆలోచిస్తున్నట్లు తెలిపింది. ఇదే జరిగితే ప్రపంచంలోనే అత్యధిక నిధులు సమీకరించిన పబ్లిక్ ఇష్యూల సరసన స్పేస్‌ఎక్స్ నిలుస్తుంది.

ఆ పైలట్ల నియామకాలు వద్దు

ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌కు ప్రస్తుత పైలట్ల లేఖ



ఇండిగో నుంచి ఎయిర్‌బస్ ఏ320 విమానాల పైలట్లను నియమించుకోవాలన్న ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ప్రయత్నాలను ఆ సంస్థలోని ప్రస్తుత పైలట్లు వ్యతిరేకిస్తున్నట్లు ఓ ఆంగ్ల వెబ్‌సైట్ కథనం ప్రకారం తెలుస్తోంది. ఇప్పటికే ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లో అవసరానికి మించి పైలట్లు ఉన్నారని, కొత్తగా మరింత మందిని నియమించుకుంటే సంస్థ సామర్థ్య వినియోగం బాగా తగ్గుతుందని కొందరు పైలట్లు హెచ్చరించినట్లు ఆ కథనం వెల్లడించింది. అలాగే ప్రస్తుత పైలట్ల ఆదాయాల పైనా ఈ పరిణామం ప్రతికూల ప్రభావం చూపుతుందని వారు ఆందోళన వెలిబుచ్చినట్లు తెలిపింది. టాటా గ్రూపునకు చెందిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ఇటీవలే అనుభవజ్ఞులైన ఏ320 విమానాల పైలట్ల నియామకాల కోసం ఓ ప్రకటనను ఇచ్చింది. ఇండిగో కార్యకలాపాల అంతరాయ సమస్యతో సతమతవుతున్న వేళ.. ఆ సంస్థ నుంచి అనుభవజ్ఞులైన పైలట్లను ఆకర్షించే ప్రయత్నంలో భాగంగానే ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ఈ ప్రకటన ఇచ్చి ఉండొచ్చనే అభిప్రాయాన్ని పరిశ్రమ విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ నియామకాల ప్రణాళికపై ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లోనే అంతర్గతంగా వ్యతిరేకత వ్యక్తమైనట్లు ఆ వార్తా కథనం తెలిపింది. నియామక ప్రణాళికను ఉపసంహరించుకోవాలని పలువురు పైలట్లు కంపెనీ యాజమాన్యానికి లేఖ రాసినట్లు వెల్లడించింది.

గోవా, కేరళ.. ఇవే ఇష్టం



- శీతాకాలంలో ప్రయాణికుల ప్రాధాన్యం వీటికే
- ఈ సీజనులో పర్యటించనున్న 55% భారతీయ ట్రావెలర్లు
- వీరిలో సగం మంది జెన్ జీ, మిలేనియల్స్
- ఎయిర్‌బీఎన్‌బీ నివేదిక

ముంబయి: గోవా బీచ్‌ల నుంచి కేరళ బ్యాక్‌వాటర్స్ వరకు; మనాలీ, ముస్సోరీ వంటి పర్వత ప్రాంతాల నుంచి ఉదయ్‌పుర్, జయపుర వంటి వారసత్వ కట్టడాల వరకు.. ఇలా దేశంలోని కొత్త ప్రదేశాలను చుట్టిరావడానికి చలికాలమే సరైనదని భారతీయులు భావిస్తున్నారు. ప్రతీ ఏటా దాదాపు 55 శాతం మంది భారతీయ ప్రయాణికులు శీతాకాల పర్యటనలను ఖరారు చేసుకున్నారని ఎయిర్‌బీఎన్‌బీ నివేదిక చెబుతోంది. ఈ సీజనులో గోవా, కేరళ.. ఈ రెండు అగ్రగామి ప్రాధాన్యతలుగా వీరికి ఉన్నాయి. సెలవులు వచ్చాయనే కాదు, జీవితంలో రిలాక్స్ అవడానికే ఈ ప్రయాణాలకు వీరు ఇష్టపడుతున్నారని ఆ నివేదిక అంటోంది. అక్టోబరులో 2,155 మంది భారతీయులతో నిర్వహించిన సర్వే ద్వారా రూపొందించిన ఈ నివేదికలోని ముఖ్యాంశాలు..

✦ ఈ సీజనులో గోవా, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలపై దేశీయ ప్రయాణికులు ఆసక్తి చూపుతున్నారు. బీచ్‌లు, బ్యాక్‌వాటర్స్, వారసత్వ కట్టడాలు, చలి వాతావరణం వంటివి వారిని ఆకర్షిస్తున్నాయి.
✦ భారతీయ ప్రయాణికుల్లో సగానికి పైగా(55%) ఈ సీజనులోనే పర్యటనలు పెట్టుకుంటున్నారు. సానుకూల, చల్లటి వాతావరణం, ప్రకృతి సోయగాలు ఇందుకు దోహదం చేస్తున్నాయి.
✦ లక్షద్వీప్, గువాహటితో పాటు పంజాబ్‌లో చిన్న నగరాలు, తక్కువ మందికి తెలిసిన తీర ప్రాంతాలు, కేరళలో బ్యాక్‌వాటర్‌లకు సందర్శకులు మొగ్గుచూపుతున్నారు.
✦ యువ ప్రయాణికులు సైతం వారణాసి, బృందావన్ వంటి ఆధ్యాత్మిక గమ్యస్థానాలకు వెళుతుండడం విశేషం.
✦ శీతాకాల ప్రయాణికుల్లో సగం మంది జెన్ జీ, మిలేనియల్స్ నుంచే ఉంటున్నారు.
✦ సేదతీరడానికే వెళుతున్నామని 30% మంది; సంప్రదాయ, సీజనల్ అనుభవాన్ని పొందడానికి పర్యటిస్తున్నామని 20%; సెలవులను సెలబ్రేట్ చేసుకోవడానికి వెళుతున్నామని 30% మంది పేర్కొన్నారు.
✦ బాగా దగ్గరి వ్యక్తులు అంటే తమ జీవిత భాగస్వామితో వెళతామని 50% మంది, స్నేహితులతో చుట్టి వస్తామని మూడోవంతు మంది అన్నారు.
✦ కుటుంబంలోని అన్ని తరాలతో కలిసి వెళతామని చెప్పేవారూ 30% ఉండడం విశేషం.

షిప్‌రాకెట్ రూ.2,342 కోట్ల ఐపీఓ

సెబీ వద్ద ముసాయిదా పత్రాలు దాఖలు



దిల్లీ: టెమాసెక్ పెట్టుబడులున్న ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్ షిప్‌రాకెట్ రూ.2,342 కోట్ల నిధులను ఐపీఓ ద్వారా సమీకరించాలని భావిస్తోంది. ఇందుకు సంబంధించిన ముసాయిదా పత్రాలను మార్కెట్ల నియంత్రణాధికార సంస్థ సెబీ వద్ద దాఖలు చేసింది. తాజా ఈక్విటీ షేర్ల ద్వారా రూ.1,100 కోట్లు సమీకరించనుంది. అలాగే ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)లో రూ.1,242.3 కోట్ల విలువైన షేర్లను వాటాదార్లు విక్రయించనున్నారు. లైట్‌రాక్, ట్రైబ్ క్యాపిటల్, బెర్టెల్స్‌మాన్, అరవింద్ లిమిటెడ్, గౌతమ్ కపూర్, సాహిల్ గోయల్, విశేష్ ఖురానా తదితరులు తమ వాటాల్లో కొంత భాగాన్ని ఓఎఫ్ఎస్‌లో తగ్గించుకోనున్నారు. ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులను మార్కెటింగ్, టెక్నాలజీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం వినియోగిస్తామని కంపెనీ తెలిపింది. అలాగే కొంత మొత్తాన్ని రుణాలు, వడ్డీని ముందస్తుగా చెల్లించడానికి వాడతామని పేర్కొంది. ప్రీ-ఐపీఓ కేటాయింపు ద్వారా రూ.220 కోట్ల వరకు సమీకరించాలని కంపెనీ భావిస్తోంది. ఒకవేళ ఈ నిధులు సమకూరితే దీనికి తగ్గట్లుగా తాజా షేర్ల జారీని సర్దుబాటు చేసుకునే అవకాశం ఉంది.

✦ శివగంగా డ్రిల్లర్స్ కూడా రూ.400 కోట్ల నిధుల సమీకరణ కోసం సెబీ వద్ద ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. ఈ ఇష్యూ మొత్తం తాజా షేర్ల జారీ ద్వారా ఉండనుంది. ఐపీఓ నిధులను కొత్త ప్లాంట్, మెషినరీ కొనుగోలు, రుణాల చెల్లింపు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగిస్తామని కంపెనీ వెల్లడించింది.

భారత్‌పై టారిఫ్ 20 శాతానికి తగ్గుతుంది!

- త్వరలో అమెరికాతో ఒప్పందం
- వృద్ధిరేటు 2025-26లో 7.5%, 2026-27లో 7.1%
- నొమురా అంచనాలు



భారత్, అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందం త్వరలోనే కుదురుతుందని అంతర్జాతీయ ఆర్థిక సేవల కంపెనీ నొమురా అంచనా వేస్తోంది. ఫలితంగా ఇతర దక్షిణాసియా దేశాల మాదిరే భారతీయ వస్తువులపై అమెరికా టారిఫ్ ప్రస్తుత 50% నుంచి 20 శాతానికి తగ్గొచ్చని నొమురా తాజా నివేదికలో పేర్కొంది. వాణిజ్య సుంకాల భారం తగ్గితే, భారత జీడీపీ వృద్ధి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7.5%, 2026-27లో 7.1 శాతంగా నమోదు కావొచ్చని పేర్కొంది. 2025-26 అక్టోబరు-డిసెంబరులో చూస్తే జీఎస్‌టీ రేట్ల తగ్గింపు ప్రయోజనాలు, ట్రంప్ 50% ట్రంప్ టారిఫ్‌ల మధ్య మన ఆర్థిక వ్యవస్థ చిక్కుకుంది. అయితే పరిస్థితుల్లో మార్పు వచ్చి పూర్తి ఏడాదికి వాస్తవ జీడీపీ 7.5 శాతానికి చేరొచ్చని అంచనా వేస్తోంది.

ద్రవ్యోల్బణం 4% దిగువనే

'2026లో ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ లక్షిత 4% కంటే దిగువన 3.6 శాతానికి పరిమితం కావొచ్చు. వరుసగా రెండో ఏడాదీ ఇలా ఉండటం విశేషమే. వచ్చే ఏప్రిల్‌లో రెపో రేటును ఆర్‌బీఐ మరో 0.25% తగ్గించి, 5 శాతానికి పరిమితం చేయొచ్చని' నొమురా అంచనా వేస్తోంది. 2025-26లో దేశ వృద్ధి రేటు అంచనాను 6.8% నుంచి 7.3 శాతానికి ఆర్‌బీఐ పెంచగా, నొమురా అంతకన్నా అధికంగా 7.5% లభించొచ్చని పేర్కొంది.

ఇవీ సానుకూలతలు, సవాళ్లు

భారత వృద్ధి రాణించేందుకు ప్రైవేటు మూలధన వ్యయాలు పుంజుకోవడం, తగ్గనున్న అమెరికా టారిఫ్‌లు, అంతర్జాతీయ వృద్ధి కారణమవుతాయని నొమురా తెలిపింది. 'అంతర్జాతీయ స్మార్ట్‌ఫోన్ ఎగుమతుల్లో భారత వాటా పెరుగుతోంది. బొమ్మలు, ఫర్నిచర్, పాదరక్షల్లో ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకాలను ప్రభుత్వం తీసుకురావొచ్చు. సులభతర వాణిజ్యానికి మరింతగా నిబంధనలను సడలించే అవకాశం ఉంద'నీ వివరించింది.

✦ పెరుగుతున్న చమురు - ఆహార ధరలు, కుటుంబాల అప్పుల వంటివి సవాళ్లుగా ఉన్నాయి. వచ్చే ఏడాది జీడీపీ, ద్రవ్యోల్బణం, పారిశ్రామికోత్పత్తి గణనకు కొత్త సిరీస్ తీసుకువస్తుండడమూ అంచనాలను దెబ్బతీయొచ్చని నొమురా అంటోంది. ప్రభుత్వ ద్రవ్య స్థిరీకరణ విషయంలో లక్ష్యాలు చేరొచ్చని నొమురా భావిస్తోంది. 2025-26లో జీడీపీలో ద్రవ్య లోటును 4.4 శాతానికి పరిమితం చేయాలన్న లక్ష్యాన్ని కేంద్రం చేరగలదని చెబుతోంది.

ప్రతి 5 షాపింగ్ మాల్స్‌లో ఒకటి ఖాళీగానే

32 నగరాల్లోని 365 కేంద్రాల్లో ఇదే పరిస్థితి: నైట్ ఫ్రాంక్



దిల్లీ: దేశవ్యాప్తంగా షాపింగ్ మాల్స్‌లో ఖాళీలు పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం 32 నగరాల్లోని 365 షాపింగ్ మాల్స్‌ను చూస్తే.. 74 ఘోస్ట్ షాపింగ్ కేంద్రాలు ఉన్నట్లు స్థిరాస్తి కన్సల్టెంట్ నైట్ ఫ్రాంక్ నివేదికలో పేర్కొంది. మూడేళ్లకు పైగా కార్యకలాపాలు సాగిస్తూ, ఒక షాపింగ్ మాల్‌లో 40 శాతానికి పైగా ఖాళీ ఉంటే దాన్ని ఘోస్ట్ మాల్స్‌గా పరిగణిస్తారు. 'థింక్ ఇండియా థింక్ రిటెయిల్-వాల్యూ క్యాప్చర్: అన్‌లాకింగ్ పొటెన్షియల్' పేరిట ఈ నివేదికను నైట్ ఫ్రాంక్ వెలువరించింది. అధిక ఖాళీలు, బలహీనమైన అద్దెలు, నిర్వహణ, మౌలిక సదుపాయాలు పాతబడిపోవడం, ప్రాధాన్యత కోల్పోవడం వంటి కారణాలతో దేశంలోని షాపింగ్ మాల్స్‌లో అయిదింట ఒకటి ఘోస్ట్ మాల్‌గా మిగిలిపోతోందని నివేదిక వెల్లడించింది. మొత్తం 365 షాపింగ్ మాల్స్‌ను సర్వే చేయగా, 74 ఘోస్ట్ మాల్స్‌గా ఉన్నాయి. వీటిలో 15.5 మిలియన్ చదరపు అడుగుల స్థలం ఖాళీగా ఉంది. ఇందులో 4.8 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న 15 మాల్స్‌ను పూర్తిగా మార్చివేసి, ఏటా రూ.357 కోట్ల అద్దెను పొందొచ్చని పేర్కొంది.

✦ 'భారత రిటెయిల్ రంగం కీలకమైన వృద్ధి దశలోకి అడుగుపెడుతోంది. బలమైన వినియోగం, అధిక నాణ్యత కలిగిన వ్యవస్థీకృత రిటెయిల్ కేంద్రాలకు ఆదరణ ఇందుకు కారణం' అని నైట్ ఫ్రాంక్ ఇండియా ఛైర్మన్, ఎండీ శిశిర్ బైజల్ పేర్కొన్నారు. గ్రేడ్ 'ఎ' మాల్స్‌లో ఖాళీలు 5.7 శాతం మాత్రమేనని, పలు ద్వితీయ శ్రేణి నగరాల్లో వినియోగదారు ధోరణులు మారుతున్నాయని, భవిష్యత్ విస్తరణకు ఈ రంగం సిద్ధంగా ఉందని వివరించారు.

సంస్థలు సైబర్ భద్రతను బలోపేతం చేసుకోవాలి

మేనేజ్‌ఇంజిన్ టెక్నాలజీ డైరెక్టర్ రోమానస్ ప్రభు



ఈనాడు, హైదరాబాద్: సంస్థలు కృత్రిమ మేధ (ఏఐ)ని అందిపుచ్చుకోవడం, మోడళ్లను విస్తరించడమే కాదు.. దానికి బలమైన డిజిటల్ రక్షణను కల్పించాల్సిన అవసరం ఉందని జోహో గ్రూపు ఆధ్వర్యంలోని మేనేజ్‌ఇంజిన్ టెక్నాలజీ డైరెక్టర్ రోమానస్ ప్రభు తెలిపారు. డీప్ ఫేక్ ఆధారిత సోషల్ ఇంజినీరింగ్‌తో కేంద్రీకృత దాడులు పెరుగుతున్న నేపథ్యంలో సంస్థలు భద్రత పరంగా నిరంతర ముప్పును ఎదుర్కొనే అవకాశం ఉందని తెలిపారు. కాబట్టి, కట్టుదిట్టమైన సైబర్ భద్రతను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దాడులకు పాల్పడేవారూ, దాని నుంచి రక్షించే వారూ ఇద్దరూ ఏఐనే వాడుతున్నారన్నారు. గ్లోబల్ కేపబులిటీ కేంద్రాల(జీసీసీ)కు హైదరాబాద్ కీలక స్థానంగా మారుతోంది. ఈ నేపథ్యంలో కార్పొరేట్ సంస్థల నుంచి ఎంఎస్ఎంఈల వరకూ పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా సైబర్ సెక్యూరిటీని అందిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్, తిరుపతిలో ఉన్న తమ కేంద్రాల్లో 1250 మంది నిపుణులు పనిచేస్తున్నారని, ఎప్పటికప్పుడు నియామకాలు చేపడుతున్నట్లు వివరించారు.

రూ.100 లక్షల కోట్ల పైకి కార్పొరేట్ బాండ్ల మార్కెట్

2030కి చేరొచ్చు: నీతి ఆయోగ్ నివేదిక

దిల్లీ: 2030 నాటికి భారత కార్పొరేట్ బాండ్ మార్కెట్ రూ.100-120 లక్షల కోట్లకు చేరే సత్తా ఉందని నీతి ఆయోగ్ నివేదిక తెలిపింది. ఇందుకు బలమైన సంస్కరణలు, సంస్థాగత సామర్థ్యాలను ఏర్పాటు చేయాలని సూచించింది. గత దశాబ్ద కాలంలో భారత కార్పొరేట్ బాండ్ మార్కెట్ గణనీయంగా వృద్ధి చెందింది. 2014-15లో రూ.17.5 లక్షల కోట్ల నుంచి 2024-25లో రూ.53.6 లక్షల కోట్లకు చేరింది. వార్షిక వృద్ధి రేటు దాదాపు 12 శాతంగా నమోదైంది. 'డీపెనింగ్ ది కార్పొరేట్ బాండ్ మార్కెట్ ఇన్ ఇండియా' పేరిట నీతి ఆయోగ్ ఈ నివేదికను వెలువరించింది.

✦ గత దశాబ్ద కాలంలో డెట్ మార్కెట్ మౌలిక సదుపాయాలు, నియంత్రణపరమైన నియమావళిని విస్తరించడంలో భారత్ గణనీయమైన పురోగతి సాధించింది. కానీ అంతర్జాతీయ దేశాలతో పోలిస్తే ఇంకా పూర్తి సామర్థ్యానికి భారత్ ఇంకా చేరుకోలేదు అని నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రమణ్యం తెలిపారు. ప్రస్తుతం జీడీపీలో బాండ్ మార్కెట్ వాటా 15-16 శాతంగా ఉందని, దక్షిణ కొరియా, మలేసియా, చైనా దేశాల కంటే ఇది తక్కువేనని అన్నారు.


మెస్సి అభిమానులతో కిక్కిరిసిన ఉప్పల్ స్టేడియం

మెస్సిమరైజింగ్ తెలంగాణ

అభిమానుల్లో జోష్

ఈనాడు, హైదరాబాద్ - శంషాబాద్, న్యూస్‌టుడే: 'ద గోట్ టూర్'లో భాగంగా ఫుట్‌బాల్ దిగ్గజ ఆటగాడు లియోనెల్ మెస్సి హైదరాబాద్ పర్యటన అభిమానుల్లో జోష్ నింపింది. శనివారం సాయంత్రం ఉప్పల్ స్టేడియంలో వేల సంఖ్యలో అభిమానులు మెస్సి ఆటను చూసి పులకించిపోయారు. శనివారం ఉదయం కోల్‌కతాలోని సాల్ట్ లేక్ స్టేడియం నుంచి మెస్సి తొందరగా వెళ్లిపోవడం... అక్కడి అభిమానులను తీవ్ర ఆగ్రహానికి గురిచేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో హైదరాబాద్‌లో ఆయన పర్యటన ఎలా సాగుతుందన్నది ఆసక్తికరంగా మారింది. అయితే, ఉప్పల్ స్టేడియంలో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ మ్యాచ్‌కు చిన్నాపెద్దా తేడా లేకుండా అభిమానులు భారీగా తరలివచ్చారు. మెస్సి... మెస్సి... అంటూ పిల్లలు, యువత కేరింతలతో మైదానాన్ని ఉర్రూతలూగించారు. ఇరు ఫుట్‌బాల్ జట్లతో మెస్సి కాసేపు సరదాగా మ్యాచ్ ఆడటమే కాకుండా మైదానం మొత్తం కలియదిరిగారు. అభిమానులకు అభివాదం చేస్తూ... మధ్య మధ్యలో బంతుల్ని కిక్ చేసి అభిమానుల మధ్యకు పంపారు. స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి గోల్స్ చేయడంతో ప్రేక్షకులు పెద్దపెట్టున నినాదాలు చేశారు. చిన్నారుల నుంచి యువత వరకు ఫుట్‌బాల్ జెర్సీలు ధరించి స్టేడియంలో సందడి చేశారు. మెస్సి కటౌట్లు, ఫ్లెక్సీల ముందు సెల్ఫీలకు బారులు తీరారు. మెస్సిని చూడడానికి స్టేడియంకు తరలివచ్చిన యువతలో ఎక్కువ మంది యువతులు ఉండటం విశేషం. అంతకుముందు సాయంత్రం కోల్‌కతా నుంచి ప్రత్యేక విమానంలో శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న మెస్సికి అధికారులు ఘనస్వాగతం పలికారు. జీ లాంజ్ ప్రధాన ద్వారం వద్ద అభిమానులు మెస్సి ఫొటోలు, ప్లకార్డులు పట్టుకొని ఆయన రాక కోసం వేచిచూశారు. భారీ కాన్వాయ్‌లో వెళ్తున్న మెస్సి కనిపించగానే 'మెస్సి... మెస్సి...' అంటూ పెద్దపెట్టున కేకలు వేశారు.

■ శనివారం మధ్యాహ్నం నుంచే ఉప్పల్ పరిసర ప్రాంతాలు మెస్సి నినాదాలతో మార్మోగాయి. భారీ కటౌట్లు, బ్యానర్లు, జెర్సీలతో యువత స్వాగతం పలికారు. సాయంత్రం 4 గంటలకు ఉప్పల్ స్టేడియం ముందు యువ క్రీడాకారులు ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. 'ద గోట్ మెస్సి' అంటూ నినదించారు.



ట్రోఫీ అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో రోడ్రిగో డిపాల్, మెస్సి, రాహుల్‌గాంధీ, తదితరులు

కిక్ ఇచ్చావు మెస్సి

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌లో ఫుట్‌బాల్ కిక్ అదిరింది. మెస్సి పర్యటన యావత్ దేశాన్ని ఆనందంలో ముంచెత్తింది. శనివారం రాత్రి ఉప్పల్ స్టేడియంలో దాదాపు గంటపాటు ఉన్న మెస్సిని చూసి అభిమానులు కేరింతలు కొట్టారు. ముఖ్యమంత్రి సైతం ఆనందంతో మెస్సి.. మెస్సి.. అంటూ సందడి చేశారు. రాత్రి 7.55 గంటలకు ప్రారంభమైన మెస్సి మేనియా 8.52 గంటల వరకూ కొనసాగింది. రాత్రి 7.42 గంటలకు సీఎం రేవంత్, రాహుల్ గాంధీ స్టేడియానికి వచ్చారు. ఆ తర్వాత సింగరేణి ఆర్ఆర్-9 జట్టుతో అపర్ణ మెస్సి ఆల్ స్టార్స్ ఎగ్జిబిషన్ మ్యాచ్ ప్రారంభమైంది. సింగరేణి జట్టు ఎరుపు, తెలుపు రంగు దుస్తులు ధరించగా... మెస్సి స్టార్స్ బృందం అర్జెంటీనా జెర్సీ (నీలి, తెలుపు) రంగు దుస్తులను వేసుకుంది. కాసేపటికే సింగరేణి ఆటగాడు గోల్ కొట్టడంతో స్టేడియం హోరెత్తింది. ఆ కాసేపటికే 7.55 గంటలకు స్టేడియంలోకి మెస్సి ప్రవేశించడంతో అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. డ్రెస్సింగ్ రూమ్‌లో మెస్సి, రోడ్రిగో, సువారెజ్ నిలబడి మ్యాచ్‌ను వీక్షిస్తుండగా.. 8 గంటలకు మరో గోల్ సాధించిన సింగరేణి ఆర్ఆర్ జట్టు చివరికి 4-0తో అపర్ణ మెస్సి బృందంపై విజయం సాధించింది. 8.07 గంటలకు రేవంత్‌రెడ్డి ఎరుపు, తెలుపు రంగు జెర్సీ వేసుకుని మైదానంలో అడుగుపెట్టగా... అభిమానులు కేరింతలతో స్వాగతం పలికారు. మైదానంలోకి వస్తూనే వార్మప్ చేసిన రేవంత్.. ప్రొఫెషనల్ ఫుట్‌బాల్ ఆటగాడిని తలపించారు. మైదానంలో అడుగుపెట్టిన మూడు నిమిషాలకే రేవంత్ గోల్ రాబట్టడంతో స్టేడియంలో ఉత్సాహం అంబరాన్నంటింది. మైదానంలో రేవంత్ ఆడుతోంటే.. వేదికపై నుంచి రాహుల్ గాంధీతో పాటు ప్రియాంకా గాంధీ పిల్లలు, మెస్సి, రోడ్రిగో, సువారెజ్ వీక్షించారు. 8.11 గంటలకు మెస్సి మైదానంలో అడుగుపెట్టాడు. అప్పటివరకు ఎల్ఈడీ స్క్రీన్ మీదే కనిపించిన ఆయన... ఒక్కసారిగా కళ్ల ముందుకు రావడంతో ప్రేక్షకులు ఉత్సాహంతో ఊగిపోయారు. ప్రతి ఒక్కరూ మునివేళ్లపై నిల్చొని దిగ్గజ ఫుట్‌బాలర్‌ను తనివితీరా చూసుకున్నారు. ఆ తర్వాత అసలు ఆట మొదలైంది. రెండు జట్ల ఆటగాళ్లతో కరచాలనం చేసిన మెస్సి.. రేవంత్‌తో కలిసి ఆట మొదలుపెట్టాడు. రేవంత్‌కు నేరుగా పాస్‌లు అందిస్తూ సందడి చేశాడు. రెండుసార్లు గోల్ పోస్ట్‌లోకి బంతిని తరలించాడు. రేవంత్, మెస్సి, రోడ్రిగో, సువారెజ్ కొద్దిసేపు పాస్‌లు ఇచ్చుకుంటూ సరదాగా గడిపారు. మెస్సి, రోడ్రిగో ఫుట్‌బాల్‌లను గ్యాలరీల్లోకి పంపిస్తూ ప్రేక్షకుల్లో ఉత్సాహం నింపారు. అనంతరం నిర్వహించిన పెనాల్టీ షూటౌట్‌లో రెండు జట్లు రెండేసి గోల్స్ చేశాయి. సీఎం రేవంత్‌రెడ్డి సైతం పెనాల్టీ షూటౌట్‌లో పాల్గొన్నారు. బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపడంతో ఆయనను మెస్సి సహా ఫుట్‌బాల్ ఆటగాళ్లంతా అభినందించారు. ఎగ్జిబిషన్ మ్యాచ్ అనంతరం చిన్నారులకు మెస్సి, రోడ్రిగో, సువారెజ్ ఆటలో చిట్కాలు చెప్పారు.


మ్యాచ్‌ను తిలకిస్తున్న అభిమాని


చిందేస్తున్న రాహుల్ సిప్లిగంజ్, యాంకర్లు

ప్రత్యేక ఆకర్షణగా రాహుల్, మంగ్లీ పాటలు

సాయంత్రం 5 గంటలకు ప్రారంభమైన కార్యక్రమంలో సింగర్లు రాహుల్ సిప్లిగంజ్, మంగ్లీ సందడి చేశారు. హుషారైన పాటలు పాడుతూ అభిమానుల్లో జోష్ నింపారు. లేజర్ షో, బాణసంచా వెలుగులు ఆకట్టుకున్నాయి. స్టేడియంలో నార్త్ సైట్ స్టాండ్ దగ్గర రాహుల్ గాంధీ, మెస్సి, రేవంత్ చిత్రాలతో ఏర్పాటు చేసిన భారీ కటౌట్ అందర్నీ ఆకట్టుకుంది.



అభిమానులకు అభివాదం చేస్తున్న మెస్సి. చిత్రంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి


హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో బాణసంచా వెలుగులు

కోల్‌కతా ఘటనతో పోలీసులు అప్రమత్తం


కోల్‌కతా సాల్ట్‌లేక్ స్టేడియంలో ప్రేక్షకుల విధ్వంసం

ఈనాడు, హైదరాబాద్: మెస్సి పర్యటనలో భద్రత పర్యవేక్షణను తెలంగాణ పోలీస్ శాఖ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. శనివారం ఉదయం కోల్‌కతాలో ఆయన పర్యటనలో ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో ఇక్కడ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆయన శంషాబాద్ విమానాశ్రయంలోకి అడుగుపెట్టడం మొదలు.. రహదారి మార్గంలో ఫలక్‌నుమా ప్యాలెస్‌కు వెళ్లడం.. అక్కడి నుంచి ఉప్పల్ స్టేడియానికి వెళ్లి.. బస చేసేందుకు తిరిగి ప్యాలెస్‌కు వెళ్లేవరకు రహదారి పొడవునా పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రీన్‌ఛానెల్ ద్వారా ప్రయాణం సాఫీగా సాగేలా చర్యలు తీసుకున్నారు. కోల్‌కతా ఉదంతం అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో డీజీపీ శివధర్‌రెడ్డి భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. అత్యవసరంగా ఒక పోలీస్ బృందాన్ని కోల్‌కతాకు పంపించారు. అక్కడ ఉద్రిక్తతలకు దారితీసిన పరిస్థితుల్ని గుర్తించడంతోపాటు ఆ లోపాల్ని అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి నివేదిక తెప్పించుకున్నారు. అవసరమైన చర్యలు చేపట్టారు.

కోల్‌కతాలో అభిమానుల విధ్వంసం: శనివారం హైదరాబాద్ కన్నా ముందు మెస్సి కోల్‌కతాలో పర్యటించాడు. సాల్ట్ లేక్ స్టేడియంలో జరిగిన ఈవెంట్లో పాల్గొన్నాడు. కానీ, నిర్వహణ లోపంతో అభిమానులకు తీవ్ర నిరాశ తప్పలేదు. మెస్సిని సరిగా చూడలేకపోయిన ప్రేక్షకులు.. మైదానంలో విధ్వంసానికి పాల్పడ్డారు.

ఆతిథ్యం బాగుంది



హైదరాబాద్ ఆతిథ్యం బాగుంది. మీరు చూపించిన ప్రేమానురాగాలకు ధన్యవాదాలు. ప్రపంచకప్ క్రీడల్లో మా వెంట అండగా నిలిచి మద్దతు తెలిపారు. భవిష్యత్తులోనూ మీ అభిమానం, మద్దతు కొనసాగాలి

– రోడ్రిగో డీపాల్

తాత.. మనవడు

శనివారం ఉప్పల్ స్టేడియంలో మెస్సి బృందానికి ఏమాత్రం తగ్గకుండా సందడి చేశారు సీఎం రేవంత్, ఆయన మనవడు రియాన్ష్. తాత కంటే ముందే తెలుపు, ఎరుపు జెర్సీతో మైదానంలో అడుగుపెట్టిన రియాన్ష్... రేవంత్, మెస్సిలతో కలిసి ఫుట్‌బాల్ ఆడాడు. మనవడిని సీఎం దగ్గరకు తీసుకుని ఫుట్‌బాల్‌ను ఎలా కిక్ కొట్టాలో చూపించారు. రియాన్ష్‌తో మెస్సి కొద్దిసేపు ఆడాడు. అతనితో ఫొటో దిగాడు. ఈ దృశ్యం స్టేడియంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



మాజీ ఎంపీ కుసుమ కృష్ణమూర్తి కన్నుమూత


కుసుమ కృష్ణమూర్తి

అయినవిల్లి, అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ కుసుమ కృష్ణమూర్తి (85) కన్నుమూశారు. శనివారం దిల్లీలో గుండెపోటుతో ఆసుపత్రిలో మరణించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం విలస గ్రామంలో 1940 సెప్టెంబర్ 11న ఆయన జన్మించారు. అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో విద్యాభ్యాసం అనంతరం ఆంధ్ర, నాగ్‌పుర్ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత చదువులు చదివారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరి 1977-80, 1980-84, 1989-91లలో అమలాపురం నుంచి లోక్‌సభ సభ్యునిగా గెలుపొందారు. 1980-82 మధ్య కేంద్రప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ కమిటీ కన్వీనర్‌గా సేవలు అందించారు. 'దళిత వేదం' పేరుతో పుస్తకం రచించారు. 1990లో పెట్రోలియం, రసాయనాల మంత్రిత్వశాఖలో స్థాయీసంఘ సభ్యుడిగానూ, 1983-85 మధ్య ఏఐసీసీ సంయుక్త కార్యదర్శిగా పనిచేశారు. కొన్నేళ్లుగా రాజకీయాలకు దూరంగా ఉన్నారు. కృష్ణమూర్తికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. భార్య మూడేళ్ల క్రితం మరణించారు. ప్రస్తుతం దిల్లీలో కుమారుని వద్ద ఉంటున్నారు. ఈయన మృతిపట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం అమలాపురంలో అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబసభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

వాజ్‌పేయీ పథకాలతోనే గ్రామాలు, పట్టణాల అభివృద్ధి


వాజ్‌పేయీ విగ్రహావిష్కరణలో పాల్గొన్న మంత్రులు సత్యకుమార్ యాదవ్, బీసీ జనార్దన్, ఎన్‌ఎండీ ఫరూక్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: దివంగత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ చేపట్టిన గ్రామసడక్ యోజన తదితర పథకాలతోనే దేశంలోని గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందాయని న్యాయ శాఖ, మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ అన్నారు. అటల్ బిహారీ వాజ్‌పేయీ శతజయంతిని పురస్కరించుకొని నంద్యాలలో ఏర్పాటుచేసిన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో మంత్రులు ఎన్‌ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి, సత్యకుమార్ యాదవ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన బహిరంగసభలో మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలకు దీటుగా దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన నాయకుడు వాజ్‌పేయీ అన్నారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. వాజ్‌పేయీ దేశాభివృద్ధికి మూడుసార్లు ప్రధానిగా కీలక సేవలు అందించారన్నారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ.. దేశగౌరవాన్ని ప్రపంచ వేదికపై నిలిపిన నాయకుడు వాజ్‌పేయీ అని కొనియాడారు. ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు, భాజపా జిల్లా అధ్యక్షుడు డా.అభిరుచి మధు, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, భాజపా రాష్ట్ర ప్రధానకార్యదర్శి రమేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.

దేశంలో అభివృద్ధికి బీజం వేసిన వాజ్‌పేయీ: కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ


కడపలో వాజ్‌పేయీ విగ్రహావిష్కరణలో పాల్గొన్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, చిత్రంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తదితరులు

ఈనాడు, కడప, న్యూస్‌టుడే-చిన్నచౌకు: దేశంలో అభివృద్ధికి బీజం వేసిన నేత మాజీ ప్రధాని వాజ్‌పేయీ అని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ కొనియాడారు. కడప ఎర్రముక్కపల్లి సర్కిల్లో వాజ్‌పేయీ కాంస్యవిగ్రహాన్ని శనివారం రాష్ట్ర మంత్రులు సత్యకుమార్ యాదవ్, సవిత, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. సభలో ఆయన మాట్లాడుతూ.. 'వాజ్‌పేయీ భాజపా నేత అయినా అన్నిపార్టీల, వర్గాల అభిమానం చూరగొన్నారు. దేశంలో ఇప్పుడు అమలవుతున్న అనేక పథకాలకు ఆయనే బీజం వేశారు. వాజ్‌పేయీ స్ఫూర్తితో నేడు ప్రధాని మోదీ ఆ సంస్కరణలు అమలు చేస్తూ దేశాన్ని అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నారు' అన్నారు. వాజ్‌పేయీ దేశ గౌరవ ప్రతిష్ఠలు పెరగడానికి కృషి చేశారని రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ కొనియాడారు. 'వాజ్‌పేయీ విగ్రహాన్ని చూస్తే ఒక ప్రేరణ కలుగుతుంది. సామాన్య ప్రజలు దండం పెట్టుకుని వెళ్తున్న తీరు ఆశ్చర్యంగా ఉంది' అని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ చెప్పారు. రాష్ట్ర మంత్రి సవిత, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, తెదేపా నేత బీటెక్ రవి ప్రసంగించారు.

తరగతిలో పాఠం వింటూ కుప్పకూలిన విద్యార్థిని

గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యుల వెల్లడి


తరగతి గదిలోని సీసీ కెమెరాలో రికార్డయిన విద్యార్థిని పడిపోయిన చిత్రం


నల్లమిల్లి సిరి

రామచంద్రపురం, రాయవరం, న్యూస్‌టుడే: తరగతి గదిలో పాఠం వింటూ ఓ విద్యార్థిని స్పృహ కోల్పోయి పడిపోయింది. ఆమెను ఆసుపత్రికి తరలించగా అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు తెలిపారు. ఈ విషాద ఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయవరం మండలం పసలపూడి గ్రామానికి చెందిన నల్లమిల్లి సిరి (15) రత్నంపేటలోని వివేకానంద హైస్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. శనివారం ఉదయం తరగతి గదిలో పాఠం వింటున్న ఆమె అకస్మాత్తుగా స్పృహతప్పి బెంచీపై నుంచి పడిపోయింది. పాఠశాల యాజమాన్య ప్రతినిధులు తల్లిదండ్రులకు సమాచారం అందించి, ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా తీవ్రమైన గుండెపోటుతో ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు.

నెల క్రితం ఇలాగే.. : బాలిక నెల క్రితం ఇలాగే తరగతి గదిలోనే స్పృహ కోల్పోయి పడిపోవడంతో తల్లిదండ్రులకు సమాచారం అందించగా, వారొచ్చి ఆసుపత్రికి తరలించారు. అప్పట్లో ప్రథమ చికిత్స అనంతరం కోలుకుందని, అప్పటి నుంచి ఆరోగ్యంగానే ఉందని తండ్రి వెంకటరెడ్డి చెప్పారు. ఆమె స్పృహ కోల్పోయినట్లు పాఠశాల నుంచి ఫోన్ రావడం ఇది రెండోసారని, ఇలా జరుగుతుందని ఊహించలేదని కన్నీటిపర్యంతమయ్యారు. వెంకటరెడ్డి, సుజాత దంపతులకు కుమార్తె సిరితో పాటు కుమారుడు శ్రీనివాస్ ఉన్నారు. వీరిద్దరూ అదే పాఠశాలలో పది, ఎనిమిది చదువుతున్నారు.

ఓర్వలేనితనం నుంచే వదంతులు



ఇతరుల ఎదుగుదలను చూసి ఓర్వలేనివారు వారి ప్రతిష్ఠను దెబ్బతీసేలా వదంతులు సృష్టిస్తారు. పనీపాటా లేని వారు వాటిని విస్తృతంగా ప్రచారం చేస్తారు. మూర్ఖులు వాటిని నిజమని నమ్ముతారు. మీరు ఆ మూడో కోవలో ఉండకండి.

– విన్ కెల్లీ, బిజినెస్ గ్రోత్ మెంటార్

బాలికకు డ్రగ్స్ అలవాటు చేసి.. అసభ్యకర వీడియోలు

- బాధితురాలు ఇంటర్ విద్యార్థిని
- విషయం తెలిసి ఆత్మహత్యకు యత్నించిన తల్లి

గుంటూరు నేరవార్తలు, నగరంపాలెం, న్యూస్‌టుడే: ఇంటర్ చదువుతున్న బాలిక (17)కు డ్రగ్స్ అలవాటు చేసి.. ఆమెపై అసభ్యకర చర్యలకు పాల్పడుతూ వీడియోలు, ఫొటోలు తీసిన వైనం కలకలం రేపుతోంది. విషయం తెలిసి ఆమె తల్లి ఆత్మహత్యకు యత్నించడంతో పోలీసులు రంగంలోకి దిగారు. గుంటూరుకు చెందిన ఓ బాలిక స్థానిక కళాశాలలో ఇంటర్ చదువుతోంది. అదే కళాశాలలో చదువుతున్న ఆమె సీనియర్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. ఆమెను ప్రేమిస్తున్నానంటూ నమ్మించిన అతను డ్రగ్స్‌కు అలవాటు చేశాడు. తన గదికి రప్పించి మత్తుపదార్థాలు ఇచ్చి అసభ్యకరంగా ప్రవర్తించేవాడు. ఆ దృశ్యాలను తన స్నేహితుడి ద్వారా వీడియోలు, ఫొటోలు తీయించేవాడు. రెండురోజుల క్రితం ఆమె ఫోన్ పరిశీలించగా. . అందులో ఆ యువకుడితో సన్నిహితంగా ఉన్న ఫొటోలు కనిపించాయి. దీంతో తల్లి తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ప్రశ్నించిన తల్లిదండ్రులపైనే బాలిక దాడి చేయడంతో తల్లి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించారు. చికిత్స నిమిత్తం ఆమెను జీజీహెచ్‌లో చేర్చారు. విషయం తెలుసుకున్న ఈగల్ విభాగ ఐజీ ఆకే రవికృష్ణ, గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ జీజీహెచ్‌లో ఆమెను పరామర్శించారు. ఈ కేసును సమగ్రంగా దర్యాప్తు చేసి తగిన చర్యలు తీసుకుంటామని ఐజీ ఆకే రవికృష్ణ చెప్పారు.

అతను.. ఓ రాజకీయపార్టీ విద్యార్థి సంఘ నాయకుడు

ఎస్పీ ఆదేశాలతో తూర్పు డీఎస్పీ అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో లాలాపేట సీఐ శివప్రసాద్ ప్రత్యేక దర్యాప్తు ప్రారంభించారు. విశ్వసనీయ సమాచారం మేరకు బాలికకు డ్రగ్స్ అలవాటు చేసిన యువకుడు ఓ రాజకీయపార్టీ విద్యార్థిసంఘ నాయకుడిగా పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. బాలిక అతడిని ప్రేమిస్తున్నట్లు తెలుసుకున్న తల్లిదండ్రులు వేరే యువకుడితో వివాహం చేయడానికి నిర్ణయించారని, అది ఇష్టం లేక ఆమె కుటుంబసభ్యులతో గొడవ పడుతోంది. ఈ క్రమంలో ఫోన్‌లో ఉన్న వీడియోలు, ఫొటోలు చూసి తల్లి నిద్రమాత్రలు మింగారని పోలీసులు తెలుసుకున్నారు.


చికిత్స పొందుతున్న బాలిక తల్లిని పరామర్శిస్తున్న ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ, ఎస్పీ వకుల్ జిందాల్

దాచండి... స్మార్ట్‌గా!

స్థిరాస్తి పత్రాలైనా, బంగారమైనా, నగదైనా... కూడబెట్టుకున్న కష్టార్జితాన్ని అంతే భద్రంగా దాచిపెట్టాలి. బ్యాంకు లాకర్‌లలో పెడితే ప్రతిసారీ అక్కడకు వెళ్లి తెచ్చుకోవడం ఇబ్బందే! మరి మన ఇంట్లోనే జాగ్రత్తగా కాపాడుకోవాలంటే... ఇప్పుడున్న మార్గం స్మార్ట్ లాకర్స్. కాస్త ఖరీదు ఎక్కువైనా ఇవి మంచి ఎంపిక అంటున్నారు నిపుణులు.



ఏం భద్రపరచుకోవచ్చు?: నగదు, ఆభరణాలు, ఆస్తి దస్తావేజులు, హార్డ్ డిస్క్, ఇతర విలువైన డేటా, ఫైల్స్.

ఎంత విలువ? రూ.3వేల నుంచి రూ.2.50 లక్షలు.. ఆ పైన బరువు, పరిమాణం, లోపలి అరలు, తలుపు, గోడల మందం చూసి తీసుకోవాలి. సొంతంగా బిగించే ప్రయత్నం చేయొద్దు. కంపెనీ ధ్రువీకరించిన నిపుణుడి ద్వారానే అమర్చుకోవాలి.

తాళం వేసే విధానాలెన్నో

తాళం చెవితో...	బయో మెట్రిక్	డిజిటల్ కీప్యాడ్ (నంబర్స్)	డిజిటల్+కార్డు స్వైప్	డిజిటల్ + తాళం చెవి	- డిజిటల్+ తాళం చెవి + వేలిముద్ర

- కుటుంబ సభ్యుల వేలిముద్రలు నమోదు చేసి.. వారూ తాళం తీయొచ్చు.

బ్యాటరీ ఛార్జింగ్ అయిపోతే.. యూఎస్‌బీ ఆధారంగా బయటి నుంచే ఛార్జింగ్ చేసుకోవచ్చు	యాప్, వైఫై ద్వారా లాక్, అన్‌లాక్ చేసే లాకర్లు కూడా రూ.15 వేల నుంచి అందుబాటులో ఉన్నాయి.	వీటి ద్వారా రియల్ టైమ్ అలర్ట్, ఏదైనా కదలికల్ని పసిగట్టి సందేశం పంపడం తదితర సౌకర్యాలుంటాయి యాప్ ఆధారంగా ట్రాక్ చేసుకోవచ్చు.

అగ్నికీలల్లో కరిగిపోకుండా

- అగ్ని ప్రమాదాల సమయంలో మీ విలువైన వస్తువుల్ని రక్షించుకోవడంలో స్మార్ట్ లాకర్స్ దోహదపడతాయి. సాధారణ లాకర్లతో పోలిస్తే ఇవి చాలా సురక్షితం. తలుపు, గోడలు రెండు నుంచి మూడు అంగుళాల మందం ఉంటాయి.
- లాకర్‌లో (170 డిగ్రీల ఉష్ణోగ్రతలో) ఉండే పత్రాలకు ఎలాంటి నష్టం జరగదు. నార్డిక్ ఫైర్ ప్రొటెక్షన్ సెల్ (ఎన్‌టీ ఫైర్ 017 ప్రమాణాల మేరకు) స్వీడన్‌లో ల్యాబ్ టెస్ట్ చేస్తారు. అత్యంత మెరుగైన టెస్ట్‌లలో ఇదొకటిగా పరిగణిస్తారు. మీరు కొనుగోలు చేసే లాకర్, వాటి ప్రమాణాలకు అనుగుణంగా అగ్ని ప్రమాదాల నుంచి 60, 90, 120 నిమిషాల పాటు రక్షణ కల్పిస్తాయి.

- ఈనాడు, అమరావతి



శుకజీవన సౌందర్యం

ఆహారం కోసం అన్వేషించిన ఓ రామచిలుకకు వరికంకి దొరికింది. ఆ గింజలను ఓ పట్టుపడదామని విద్యుత్తు తీగపై భోజనానికి సిద్ధమయింది. అంతలోనే దాని జత చిలుక చెంతకు చేరింది. కాసిన్ని గింజలు నాకూ పంచవా' అన్నట్టు దీనంగా చూసింది. ఇంకేముంది.. మొదటి చిలుక మనసు కరిగింది. తర్వాత రెండూ కలిసి కంకిలోని ధాన్యం పైపొరను ముక్కుతో ఒలుచుకొని గింజలను ఒకదానికొకటి తినిపించుకున్నాయి. ఏలూరు ఆశ్రమ్ ఆస్పత్రి కూడలిలోని జాతీయ రహదారి పక్కన కనిపించిన చిత్రాలివి.

- వై.శ్రీనివాసరావు, ఈనాడు, ఏలూరు



యువర్ గ్రీన్ విజయం

కెనడాలో రూ.50 లక్షల వార్షిక ప్యాకేజీతో ఇంజినీరుగా పనిచేస్తున్న హరియాణాలోని కర్నాల్ వాసి నితిన్ లలిత్ స్వదేశానికి తిరిగి వచ్చి ఓ గ్రీన్ స్టార్టప్‌కు శ్రీకారం చుట్టారు. విదేశాల్లో తాను చూసిన పర్యావరణ పరిరక్షణ సంస్కృతి స్ఫూర్తిగా ఎనిమిదేళ్ల కిందట ఆయన ఇక్కడ ప్రారంభించిన 'ఆల్ఫా ప్లాంటర్' నేడు రూ.1.5 కోట్ల వార్షిక టర్నోవరుతో విజయవంతంగా నడుస్తోంది. రూ.25 లక్షలతో ఇంజినీరింగు నైపుణ్యం ఉపయోగించి ప్లాస్టిక్ తదితర వ్యర్థాలతో పూలకుండీలు తయారు చేసే యంత్రాన్ని స్వయంగా రూపొందించారు. వారం రోజులపాటు మొక్కలు తేమను నిలుపుకోవడం ద్వారా సుమారు 80 శాతం నీరు ఆదా అయ్యేలా డిజైను చేశారు. తేలికగా కూడా ఉన్న ఈ కుండీలు వినియోగదారులను బాగా ఆకట్టుకుంటున్నాయి. హరియాణా ఉద్యానశాఖ ఈ ప్రాజెక్టును అభినందించి రూ.24 లక్షల గ్రాంటునూ మంజూరు చేసింది.

- ఈటీవీ భారత్



అదిగదిగో పూల వనం.. మల్లెలు కాదంటే నమ్మలేం..

కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామ శివారులో జాతీయ రహదారి పక్కన కనువిందు చేస్తున్న పూలవనమిది. దూరం నుంచి చూస్తే మల్లె పూల తోట విరబూసినట్టుగా కనిపిస్తోంది. వాస్తవంగా అది కొత్తిమీర తోట. ప్రస్తుతం పూతకొచ్చి ఇలా శ్వేతవర్ణంలో కనిపిస్తోంది.

- ఈనాడు, కర్నూలు



కాలులేని విలుకాడు.. 'బంగారం' గెలిచాడు

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లా జగదల్‌పుర్‌లో జరిగిన డివిజను స్థాయి క్రీడాపోటీల్లో జిల్లా రిజర్వు గార్డు జవాను కిషన్ కుమార్ హప్కా (27) విలువిద్యలో బంగారం పతకం గెలిచారు. అందులో విశేషం ఏముంది అనుకుంటున్నారా! గతేడాది జులై నెలలో విధి నిర్వహణలో భాగంగా అడవుల్లో గాలింపు చర్యల్లో పాల్గొన్న కిషన్.. మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ఓ కాలు కోల్పోయారు. అయినా స్థైర్యం కోల్పోకుండా విలువిద్యపై దృష్టి సారించి కఠోరమైన సాధన కొనసాగించారు. శనివారంతో ముగిసిన బస్తర్ ఒలింపిక్స్‌లో స్వర్ణపతక విజేతగా నిలిచారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నిర్వహించిన ఈ క్రీడా పోటీల్లో 761 మంది మాజీ మావోయిస్టులు పాల్గొన్నారు.

- ఈటీవీ భారత్

రెల్లు పూల తరంగం



ఏపీలోని పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలంలో సారిక పంచాయతీ కొత్తూరు సమీపంలోని జలపాతానికి సమీపంలో ఈ సుందర దృశ్యం వీక్షకులను కట్టిపడేస్తోంది. చుట్టూ పచ్చటి కొండలు మధ్యలో చిన్న వాగులోని రెల్లు గడ్డి(తుంగ) శ్వేతవర్ణ పూలు పూచి నదీ ప్రవాహాన్ని తలపిస్తూ..మనోహరంగా కనిపిస్తోంది.

- న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం



రూ.108 @ రూ.11,461

చిత్రంలో కనిపిస్తున్న రూ.108 నాణెం నిజమైనదే. శ్రీఉత్తరాది పీఠానికి చెందిన శ్రీసత్య ప్రమోద తీర్థ స్వామీజీ 108వ జయంతిని పురస్కరించుకొని 40 గ్రాముల వెండితో తయారు చేసిన ఈ నాణేన్ని ఆగస్టులో కేంద్రం విడుదల చేసింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన నాణేల సేకర్త పుత్సా కృష్ణ కామేశ్వర్ హైదరాబాద్ టంకశాల నుంచి రూ.11,461 చెల్లించి దాన్ని కొనుగోలు చేశారు.

- న్యూస్‌టుడే, కోనసీమ

నిలువెత్తు సౌర కంచె.. గ్రామాలకు రక్షణగా నిలిచె



చిత్తూరు జిల్లాలో ఏనుగుల సంచారం అధికంగా ఉంటుంది. ఇక్కడ నిత్యం ఏనుగుల దాడుల్లో పంటలు దెబ్బతినడంతో పాటు, ప్రాణ నష్టం జరుగుతోంది. జిల్లాలోని పలమనేరు, కుప్పం, బంగారుపాళ్యం, యాదమరి అటవీ ప్రాంతాల్లో గజరాజులు విచ్చలవిడిగా తిరుగుతూ స్థానికులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. వీటి కట్టడికి ఆయా ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా, అడవి సమీపంలో ఉన్న గ్రామాల వద్ద అధికారులు భారీ కందకాలు తవ్వించారు. అలాగే ఏనుగులు వాటిని దాటి రాకుండా ఉండేందుకు సోలార్ విద్యుత్తు ఫెన్సింగ్ తీగలు వేలాడదీశారు. ఇందులో స్వల్ప మొత్తంలోనే విద్యుత్తు ప్రసారమవుతుందని, ఏనుగులకు ఎలాంటి ముప్పు వాటిల్లదని అధికారులు తెలిపారు.

- ఈనాడు, చిత్తూరు

అదృశ్యం.. అంతలోనే అపురూపం!



రాజధాని అమరావతిలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన బుద్ధుడి విగ్రహమిది. విగ్రహాన్ని ముందు, వెనుకగా సరళరేఖ మార్గంలో చూస్తే అక్కడేమీ కనిపించదు. కాస్త పక్కకు జరిగి చూస్తే అక్కడో చక్కటి బుద్ధుడి విగ్రహం కనువిందు చేస్తుంది. పల్చటి స్టెయిన్‌లెస్ స్టీల్ రేకులను పొందికగా అమర్చితే ఈ కళాఖండం ఏర్పడింది. కార్యాలయం ఎదురుగా స్వాగతం పలుకుతున్న ఈ ప్రతిమ సందర్శకులను ఆకట్టుకుంటోంది.

- ఈనాడు అమరావతి; న్యూస్‌టుడే తుళ్లూరు



చలిగాలుల్లో రక్షణగా.. పశువులకు రోజూ లడ్డూలు

ఉష్ణోగ్రతలు బాగా తగ్గిపోయి శీతల గాలులు పెరిగాయి. జనం వెచ్చదనం కోసం ఉన్ని దుస్తులు కప్పుకొని తిరుగుతున్నారు. మరి నోరులేని మూగజీవాల మాటేమిటి? మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో గల అతి పెద్దదైన ఆదర్శ్ గోశాల ఈ సమస్యకు పరిష్కారంగా నిత్యం వంద కిలోల లడ్డూలు తయారు చేయించి వీధుల్లో తిరుగాడే ఆవులకు పెడుతోంది. లడ్డూలతో చలిని అడ్డుకోవడం ఏమిటని అంటారా? ఈ లడ్డూల్లో వేడిని పెంచే బెల్లం, జొన్నలు, వాము, మెంతి గింజలు కలుపుతుండటంతో వాటిని తిన్న ఆవులు ఆరోగ్యంగా, రాత్రిళ్లు చలితో ఇబ్బందిపడకుండా ఉంటున్నాయి. గోశాలను సందర్శించే భక్తులతోపాటు పలు ఆలయాలు, సంఘాలు ఇందుకు సహకరిస్తున్నాయి. గోశాల నిర్వాహకుడైన రిషబ్ దేవ్ ఆనంద్ 'ఈటీవీ భారత్'తో మాట్లాడుతూ.. "ఆరు భక్త బృందాలు నిత్యం నగరంలో తిరుగాడుతూ ఈ లడ్డూలను వీధుల్లో తిరిగే ఆవులకు ప్రసాదంలా పెడుతున్నాయి. గ్వాలియర్ జూలో మరో వంద కిలోల లడ్డూలు తయారుచేసి పంపిణీ చేస్తున్నారు" అని తెలిపారు.



చౌకైన స్వదేశీ రాకెట్!

- పంజాబ్ విద్యార్థుల ఘనత

ఈటీవీ భారత్: పంజాబ్ ఇంజినీరింగ్ కళాశాల (పీఈసీ) విద్యార్థులు చౌకైన ఒక రాకెట్‌ను రూపొందించారు. 15 మంది విద్యార్థులు నాలుగు నెలల పాటు శ్రమించి దీన్ని సిద్ధం చేశారు. ఇది ఘన ఇంధనంతో పనిచేస్తుంది. అమెరికాలో జరిగే ప్రఖ్యాత అంతర్జాతీయ రాకెట్ ఇంజినీరింగ్ పోటీ 'స్పేస్‌పోర్ట్ అమెరికా కప్-2026'కు ఇది అర్హత సాధించింది. దీని ఆరంభ పరీక్షను న్యూ చండీగఢ్‌లో నిర్వహించారు. అందులో ఈ రాకెట్ 500 మీటర్ల ఎత్తుకు చేరుకుంది. దీనికి పారాచూట్‌నూ అమర్చారు. దాని సాయంతో రాకెట్ క్షేమంగా తిరిగి భూమికి చేరుకుంది. పోటీ కోసం ప్రత్యేకంగా మరో రాకెట్‌ను నిర్మిస్తున్నారు. అది 3 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకోగలదు. దీని



డిజైన్, పరీక్షలు, సిమ్యులేషన్లలో అధునాతన పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారు. దీని తయారీకి కార్బన్ ఫైబర్‌ను వాడారు. ఈ నెల 15న దీనికి సంబంధించిన ప్రాథమిక డిజైన్ నివేదికను స్పేస్‌పోర్ట్ అమెరికా కప్-2026కు సమర్పిస్తారు. భవిష్యత్తులో మరింత ఎత్తుకు చేరగల రాకెట్లనూ అభివృద్ధి చేసేందుకు తాము ప్రణాళికలు రచిస్తున్నట్లు పీఈసీ విద్యార్థులు తెలిపారు.

వైద్యవిద్య సీట్లలో తీవ్ర అసమానతలు

- తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుల్లో పది లక్షలమందికి 150
- పుదుచ్చేరిలో 2వేలు... బిహార్‌లో 21లోపే
- పార్లమెంటుకు స్థాయీసంఘం నివేదిక

ఈనాడు, దిల్లీ: దేశంలో ఎంబీబీఎస్ సీట్ల విషయంలో రాష్ట్రాల మధ్య తీవ్ర అసమానతలున్నట్లు పార్లమెంటరీ స్థాయీసంఘం పేర్కొంది. కొన్ని రాష్ట్రాల్లో ఎక్కువగా, మరికొన్ని రాష్ట్రాల్లో జాతీయ సగటుకంటే తక్కువగా సీట్లు ఉన్నట్లు విచారం వ్యక్తంచేసింది. దేశంలో సగటున ప్రతి 10 లక్షల జనాభాకు 75 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుల్లో 150 దాకా, పుదుచ్చేరిలో 2వేలు చొప్పున సీట్లున్నాయి. బిహార్‌లో 10 లక్షల జనాభాకు అత్యల్పంగా 21 సీట్లే ఉన్నాయి. ఈ అంతరాన్ని తగ్గించడానికి జాతీయ వైద్య కమిషన్ చొరవ చూపాలని, పదిలక్షల మంది జనాభాకు 100 కంటే తక్కువ సీట్లుండే రాష్ట్రాల్లో కొత్త కాలేజీల ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని స్థాయీ సంఘం సూచించింది. తాజా నివేదికలో ఇతర సిఫార్సులు..



- కొత్త వైద్యకళాశాలకు ఏటా 50/100/150 ఎంబీబీఎస్ సీట్లకు మాత్రమే అనుమతిస్తున్నారు. కాలేజీ కొత్తదా, పాతదా అనేదాంతో సంబంధం లేకుండా మౌలికవసతులు, బోధనా సిబ్బందిని పరిగణనలోకి తీసుకుని దశలవారీగా గరిష్ఠంగా 250 సీట్ల వరకు పెంచుకొనేందుకు అవకాశమివ్వాలి. వైద్య సౌకర్యాలు పెద్దగాలేని జిల్లాల్లో కొత్త కాలేజీలు ప్రారంభించడానికి ప్రాధాన్యమివ్వాలి.

విదేశాలకు వెళ్లాల్సిన అవసరం రాకుండా చూడాలి

దేశంలో సీట్లు రాక చాలామంది విద్యార్థులు విదేశాలకు వెళ్తున్నారు. చదువయ్యాక ఇక్కడ లైసెన్సింగ్ పరీక్ష ఉత్తీర్ణులై శాశ్వత రిజిస్ట్రేషన్ పొందడానికి అష్టకష్టాలు పడుతున్నారు. వీరి రిజిస్ట్రేషన్, వృత్యంతర శిక్షణ విధానాలు క్రమబద్ధం చేయాలి. విదేశాలకు వెళ్లాల్సిన అవసరం రాకుండా దేశంలో మరో 40వేల ఎంబీబీఎస్ సీట్లు పెంచాలి.

- వైద్యవిద్యపై దేశంలో రూ.60 లక్షల నుంచి రూ.కోటి ఖర్చుచేయాల్సి వస్తోంది. పేదలను దృష్టిలో ఉంచుకుని ప్రైవేటు వైద్య కళాశాలల్లో 50% సీట్ల ఫీజులను ప్రభుత్వం నిర్ధారించాలి.
- వైద్య కళాశాలలు, ఆసుపత్రులను పీపీపీ విధానంలో నిర్వహించే అవకాశాలపై ఆలోచించాలి. బోధనా సిబ్బంది కొరతను పరిష్కరించాలి. ఒప్పంద నియామకాలను పక్కనపెట్టి మంచి వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించే విధానాన్ని అనుసరించాలి. బోధన వైపు వచ్చే వైద్యులకు చేయూతనివ్వాలి.

ఓటుచోరీకి వ్యతిరేకంగా నేడు కాంగ్రెస్ మెగా ర్యాలీ

దిల్లీ: ఓటుచోరీ అంశంపై కాంగ్రెస్ పార్టీ తన ప్రచారాన్ని మరింత ఉద్ధృతం చేసింది. ఓటు చోరీకి వ్యతిరేకంగా ఆదివారం దిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ర్యాలీ నిర్వహించేందుకు సిద్ధమైంది. ఓటుచోరీ అంశంలో కేంద్రాన్ని, ఈసీని దోషిగా నిలబెట్టేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ఈ ర్యాలీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ విపక్షనేత రాహుల్ గాంధీ ప్రసంగించనున్నారు. ఓటుచోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ 5.50 కోట్ల మంది సంతకాలను సేకరించిందని, ర్యాలీ అనంతరం వీటిని రాష్ట్రపతికి అందించనున్నామని పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ తెలిపారు.


సత్తా చాటిన దేశీయ బ్రెయిన్ స్టెంట్

పక్షవాత బాధితులకు వరం

దిల్లీ: పక్షవాత బాధితులకు చికిత్స విషయంలో దిల్లీలోని ఎయిమ్స్ ఒక కీలక మైలురాయిని సాధించింది. దేశంలోనే తొలిసారిగా ఒక అధునాతన బ్రెయిన్ స్టెంట్‌పై ప్రత్యేక క్లినికల్ పరీక్షలను విజయవంతంగా పూర్తిచేసింది. తీవ్ర స్థాయి పక్షవాతం బారినపడిన వారికి చికిత్స చేయడానికి ఇది ఉపయోగపడుతుందని వెల్లడైంది. భద్రత, సమర్థత విషయంలో దీనికి తిరుగులేదని అధికారులు తెలిపారు. ఈ డేటాను కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీవో) ఆమోదించి, దేశంలో దీని వినియోగానికి పచ్చజెండా ఊపింది. ఈ సాధనానికి సూపర్‌నోవా స్టెంట్ అని పేరు పెట్టారు. గ్రావిటీ మెడికల్ టెక్నాలజీ సంస్థ ఈ సాధనాన్ని అభివృద్ధి చేసింది. దీనిపై గ్రాస్‌రూట్ పేరిట ప్రయోగాలు నిర్వహించారు. దేశవ్యాప్తంగా 8 కేంద్రాల్లో వీటిని చేపట్టారు. దీనికి దిల్లీ ఎయిమ్స్ జాతీయ సమన్వయ కేంద్రంగా వ్యవహరించింది.



ఇలాంటి అబ్బాయిలకు గుణపాఠం నేర్పించాల్సిందే: సుప్రీంకోర్టు



దిల్లీ: ముంబయిలో గతేడాది చోటుచేసుకున్న హిట్-అండ్-రన్ కేసులో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తనకు బెయిల్ ఇవ్వాల్సిందిగా కోరుతూ.. నిందితుడు మిహిర్ షా వేసిన పిటిషన్‌పై దర్యాప్తునకు నిరాకరించింది. ఇలాంటి అబ్బాయిలకు తగిన గుణపాఠం నేర్పించాల్సిందేనని శుక్రవారం వ్యాఖ్యానించింది. బైక్‌పై వస్తోన్న వారిని అతివేగంగా తన కారుతో ఢీకొట్టడమే కాకుండా నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఏజీ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. చేసిన నేరానికి గానూ అతడు కొన్నాళ్లు జైల్లోనే ఉండాలని ఆదేశించి, బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది. గతేడాది ముంబయిలోని వర్లీ ప్రాంతంలో శివసేన నేత రాజేశ్ షా కుమారుడు మిహిర్ షా మద్యం మత్తులో బీఎండబ్ల్యూ కారును వేగంగా నడుపుతూ ముందు వెళ్తున్న స్కూటీని ఢీకొట్టాడు. దీంతో స్కూటీపై ఉన్న దంపతులు ఎగిరిపడ్డారు. వేగంగా వెళ్తున్న కారు మహిళపై నుంచి దూసుకెళ్లడంతో కావేరి నఖ్వా(45) అక్కడికక్కడే మరణించగా.. ఆమె భర్త గాయపడ్డారు. తర్వాత మిహిర్ కొద్ది దూరంలో తన కారును వదిలేసి ఆటోలో పరారయ్యాడు. అనంతరం పోలీసులు అతడిని అరెస్టు చేశారు. ఈ కేసులో బెయిల్ ఇవ్వాలని మిహిర్ ముంబయి హైకోర్టులో పిటిషన్ వేయగా న్యాయస్థానం నిరాకరించింది. దీంతో అతడు సుప్రీంను ఆశ్రయించాడు.

కేరళ స్థానిక ఎన్నికల్లో అధికార ఎల్‌డీఎఫ్‌కు షాక్

- యూడీఎఫ్‌కు భారీ విజయం
- తిరువనంతపురంలో ఎన్డీయే గెలుపు

తిరువనంతపురం: కేరళ స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం నేతృత్వంలోని అధికార లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్)కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) స్పష్టమైన ఆధిక్యం సాధించింది. 45 ఏళ్లుగా వామపక్షాల చేతిలో ఉన్న తిరువనంతపురం నగరపాలక సంస్థలో భాజపా నేతృత్వంలోని ఎన్డీఏ జయకేతనం ఎగురవేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. అలాగే గడచిన 25 సంవత్సరాలుగా వామపక్షాలు పరిపాలిస్తున్న కొల్లం నగరపాలక సంస్థ యూడీఎఫ్ వశమైంది. ఈ ఎన్నికలో మొత్తం 87 పురపాలక సంఘాలకుగాను యూడీఎఫ్ 54 చేజిక్కించుకుంది. ఎల్‌డీఎఫ్ 28 మున్సిపాలిటీల్లో, ఎన్డీయే రెండు పురపాలక సంఘాల్లో విజయం సాధించాయి. రాష్ట్రంలోని ఆరు నగర పాలక సంస్థల్లో నాలుగు యూడీఎఫ్ పరంకాగా ఎన్డీయే, ఎల్‌డీఎఫ్‌లు చెరొకటి గెలుచుకున్నాయి. 504 గ్రామ పంచాయతీల్లో యూడీఎఫ్, 341 పంచాయతీల్లో ఎల్‌డీఎఫ్, 64 చోట్ల టీఏఈ, 26 పంచాయతీల్లో ఎన్డీఏ పైచేయి సాధించాయి. 14 జిల్లా పంచాయతీల్లో ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్‌లకు ఏడేసి చొప్పున స్థానాలు లభించాయి. అలాగే బ్లాకు స్థాయిలో యూడీఎఫ్‌కు 79 స్థానాలు, ఎల్‌డీఎఫ్‌కు 63 లభించాయి.



కొచ్చిన్‌లో యూడీఎఫ్ కార్యకర్తల సంబరాలు

- భాజపా నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి తిరువనంతపురం నగరపాలక సంస్థలో భారీ ఆధిక్యత సాధించడం విశేషం. మొత్తం 101 డివిజన్లలో ఎన్డీయే 50, ఎల్‌డీఎఫ్ 29, యూడీఎఫ్ 19 డివిజన్లలో గెలుపొందాయి. తిరువనంతపురంలో ఎన్డీఏ విజయంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు.



చెట్ల ఎదుగుదలను లైవ్‌లో చూడగలమా?

స్టాక్ మార్కెట్లో షేర్లు కొన్న తర్వాత చాలామంది చేసే పని ఏంటంటే, వాటి ధరలు ఎంత పెరిగాయా అని రోజూ చూడటం, పెరుగుదల ఏమాత్రం కనిపించడం లేదని చింతించడం. అడవిలో వెబ్ కెమెరా పెట్టి, చెట్ల ఎదుగుదలను ప్రత్యక్షంగా చూడాలని కోరుకోవడం లాంటిదే ఇది. స్టాక్ మార్కెట్లో దీర్ఘకాలిక ప్రణాళికతోనే ప్రతిఫలం దక్కుతుంది.

- బ్రియాన్ ఫెరోల్డి, ఇన్వెస్టింగ్ కోచ్

బిర్సా ముండా పోస్టర్ల ప్రదర్శన.. పుణెలో గిన్నిస్ రికార్డు

పుణె: మహారాష్ట్రలోని పుణెలో ఫెర్గూసన్ కళాశాలలో జరుగుతున్న పుస్తక ప్రదర్శనలో అతిపెద్ద పోస్టర్ల ప్రదర్శనతో ప్రపంచ రికార్డు నమోదైనట్లు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ న్యాయ నిర్ణేత స్వప్నిల్ డాంగ్రికర్ శనివారం ప్రకటించారు. గిరిజన పదాలతో కూడిన 1,678 పోస్టర్లను ఈ ఎగ్జిబిషనులో ప్రదర్శించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో అమెరికాలో ప్రదర్శించిన 1,365 పోస్టర్ల రికార్డును పుణె ప్రదర్శన అధిగమించినట్లు నిర్వాహకులు తెలిపారు. గిరిజన నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా జీవితం, చేసిన సేవలను ఈ ప్రత్యేక ప్రదర్శన ద్వారా వివరించామని.. సాధించిన రికార్డు ఆయన స్మృతికి నివాళి అని పేర్కొన్నారు. నేషనల్ బుక్ ట్రస్టు (ఎన్‌బీటీ) ఏర్పాటుచేసిన ఈ ప్రదర్శన డిసెంబరు 21 వరకు కొనసాగనుంది.



EENADU Vol: 52, Issue: 124 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

ఈనాడు సినిమా

మోహన్ భగవత్ ప్రశంస మాపై బాధ్యతని పెంచింది

– దర్శకుడు బోయపాటి శ్రీను


బోయపాటి శ్రీను, మోహన్ భగవత్

“దేశం, ధర్మం, దైవం తదితర మనవైన మూల విలువల్ని నేటి తరానికి తెలియజెప్పాలనే సంకల్పంతోనే ‘అఖండ 2: తాండవం’ చిత్రం రూపొందించాం. మా ప్రయత్నానికి ఆర్.ఎస్.ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఆశీర్వాదం లభించడం మా బృందానికి దక్కిన గౌరవం. ఇది మాపై మరింత బాధ్యతని పెంచింది” అన్నారు ప్రముఖ దర్శకుడు బోయపాటి శ్రీను. ఆయన దర్శకత్వంలో బాలకృష్ణ కథానాయకుడిగా తెరకెక్కిన ‘అఖండ 2’ ఇటీవలే పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకొచ్చింది. హైందవ ధర్మం నేపథ్యంలో సాగే ఈ చిత్రం విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. శనివారం దర్శకుడు బోయపాటి శ్రీను దిల్లీలో మోహన్ భగవత్‌ని కలిశారు. ఈ సందర్భంగా మోహన్ భగవత్ ‘అఖండ 2’ ప్రయత్నాన్ని ప్రశంసిస్తూ, సమాజానికి సానుకూల దిశని చూపించే, విలువలతో కూడిన ఇలాంటి చిత్రాలు మరింతగా రావాల్సిన అవసరం ఉందన్నారని చిత్రబృందం చెప్పింది. బోయపాటి శ్రీను మాట్లాడుతూ “మోహన్ భగవత్ జీ మాటలు నాలో స్ఫూర్తిని నింపాయి. మా ప్రయత్నాన్ని ఆయన మెచ్చుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. భారతీయ సంప్రదాయాలు, ఆధ్యాత్మిక భావనలు, దేశభక్తి మేళవింపుగా సమకాలీన కథతో రూపొందించిన ‘అఖండ2’ సినిమా భావోద్వేగాల్ని పంచడంతోపాటు, ప్రేక్షకుల్లో ఆలోచనల్ని రేకెత్తిస్తోంది” అన్నారు. ‘అఖండ 2’ చిత్రాన్ని 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించారు.

పవన్ అభిమానులకు విందు ‘ఉస్తాద్ భగత్‌సింగ్’


నవీన్ ఎర్నేని, దేవిశ్రీ ప్రసాద్, హరీశ్‌శంకర్, భాస్కరభట్ల

పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా నటించిన ‘ఉస్తాద్ భగత్‌సింగ్’ చిత్రం అభిమానుల అంచనాలకు మించి ఉండబోతుందని డైరెక్టర్ హరీష్‌శంకర్ అన్నారు. కాకినాడలోని ఆదిత్య విశ్వవిద్యాలయంలో శనివారం రాత్రి చిత్రంలోని ‘దేఖ్‌లేంగే సాలా..’ అనే పాటని ఆవిష్కరించారు. భాస్కరభట్ల సాహిత్యం అందించిన ఈ పాటకి దేవిశ్రీప్రసాద్ స్వరాలు అందించగా, విశాల్ దద్లానీ, హరిప్రియ ఆలపించారు. ఈ వేడుకలో హరీశ్ మాట్లాడుతూ “ఈ సినిమా కోసం పవన్ కల్యాణ్ ప్రాణం పెట్టి పనిచేశారు. దేవిశ్రీ ప్రసాద్ అద్భుతమైన స్వరాల్ని అందించార”న్నారు. “ఉస్తాద్..’ లాంటి ఓ కమర్షియల్ సినిమాలో సందేశం నిండిన ‘దేఖ్‌లేంగే సాలా..’ పాటకి స్వరాలు ఇచ్చే అవకాశం రావడం ఆనందంగా ఉంది. పవన్ అభిమానులకు విందులా ఉంటుంది ఈ సినిమా” అని చెప్పారు ఈ చిత్ర సంగీద దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్. సెప్టెంబరు 2న పోస్టర్ విడుదల చేశామని, పాటను ఇక్కడ విడుదల చేయడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. నవీన్ ఎర్నేని, వై.రవి శంకర్ సంయుక్తంగా మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నిర్మిస్తున్నారన్నారు. ఈ చిత్రంలో శ్రీలీల, సాక్షి వైద్య, అశుతోష్ రాణా, ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. – న్యూస్‌టుడే, గండేపల్లి

శంకరవరప్రసాద్‌గారు... 12న వస్తారు!


చిరంజీవి

సంక్రాంతి సినిమాలు ఒక్కొక్కటిగా విడుదల తేదీల్ని ఖరారు చేసుకొంటున్నాయి. చిరంజీవి కథానాయకుడిగా... అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘మన శంకరవరప్రసాద్ గారు’ జనవరి 12న వస్తున్నట్టు చిత్రబృందం శనివారం ప్రకటించింది. పండగకు రెండు రోజుల ముందుగానే విడుదలవుతున్న ఈ చిత్రానికి పండుగ సెలవులన్నీ కలిసొస్తాయని చిత్రబృందం చెబుతోంది. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థలపై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్న ఈ సినిమా ఇప్పటికే చిత్రీకరణని పూర్తి చేసుకుంది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాల్ని జరుపుకొంటోంది. చిరంజీవి సరసన నయనతార కథానాయికగా నటించారు. వెంకటేశ్ కీలక పాత్రని పోషించారు. ఇప్పటికే రెండు పాటల్ని విడుదల చేశారు. కలయికతోనే అంచనాల్ని పెంచిన ఈ చిత్రం అందుకు దీటుగా రూపొందుతోందని, తప్పకుండా ప్రేక్షకుల్ని అలరిస్తుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఛాయాగ్రహణం: సమీర్‌రెడ్డి, ప్రొడక్షన్ డిజైన్: ఏఎస్ ప్రకాశ్, కూర్పు: తమ్మిరాజు.

వెంకీ సందడి 20 నిమిషాలు

“నాకు చాలా ఇష్టమైన హీరో వెంకటేశ్. ఆయన పుట్టినరోజున ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించడం ఆనందంగా ఉంది” అన్నారు దర్శకుడు అనిల్ రావిపూడి. శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన ఈ సినిమా గురించి పలు ఆసక్తికరమైన విషయాలు పంచుకున్నారు. వెంకటేశ్ ఈ సినిమాలో చిరంజీవితో కలిసి 20 నిమిషాలసేపు సందడి చేస్తారని చెప్పారు. “ఒక తరం ప్రేక్షకుల్ని ఊపేసిన, కొన్ని దశాబ్దాలుగా అలరిస్తున్న మూలస్తంభాల్లాంటి కథానాయకులు చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేశ్, నాగార్జున. వీళ్లలో ఏ ఇద్దరు కలిసి కనిపించినా చూడాలనే కల ప్రతి ఒక్కరిలోనూ ఉంటుంది. చిరంజీవి, వెంకటేశ్‌ని కలిసి చూపించే అవకాశం నాకు ఈ సినిమాతో లభించింది. వాళ్లు కలిసి పంచే వినోదాన్ని చూపించేందుకు ఆత్రుతగా ఎదురు చూస్తున్నా” అన్నారు అనిల్ రావిపూడి. వెంకటేశ్ పుట్టినరోజును పురస్కరించుకుని చిరంజీవి సామాజిక మాధ్యమాల వేదికగా శుభాకాంక్షలు చెప్పారు. శనివారం ఈ సినిమాలోని వెంకటేశ్ లుక్‌నీ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సుస్మిత కొణిదెల, సాహు గారపాటి పాల్గొన్నారు.

కన్నా.. మీ నాన్నకు ప్రాణమే నువ్వు రా!


మోహన్‌లాల్, సమర్జిత్

“పది నెలలు నిను మోయలేగానీ.. బతుకంతా నిను భుజాలపై మోయగలను.. నువ్వే నేనంటూ బతికే ఓ పిచ్చి తండ్రిని” అంటూ ఓ నాన్న తన కుమారుడి కోసం భావోద్వేగానికి గురవుతున్నారు. మరి అంతే కదా..! నవమాసాలు మోయలేడేమో కానీ.. పిల్లలు వేసే ప్రతి అడుగు కింద నాన్న చేయి ఉంటుంది. అలాంటి తండ్రి మనసు ఎందుకు భారంగా మారిందో తెలుసుకోవాలంటే ‘వృషభ’ సినిమా చూడాల్సిందే. మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రమిది. నందకిశోర్ తెరకెక్కించారు. ఈ నెల 25న రాబోతుంది. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమంలో భాగంగా ‘అప్పా..’ అనే మొదటి గీతాన్ని విడుదల చేసింది చిత్రబృందం. ‘కన్నా ఒకసారి వినరా నా మాట.. మీ నాన్నకు ప్రాణమే నువ్వు రా..’ అంటూ తండ్రిగా మోహన్‌లాల్, ఆయన కొడుకుగా సమర్జిత్ లంకేశ్ మధ్య హృదయానికి హత్తుకునేలా సాగుతోందీ పాట. ఈ గీతాన్ని సామ్ సీఎస్ స్వరపరిచారు.

రోషన్‌కు ఓ మంచి సినిమా ఇచ్చాం!


సందీప్‌రాజ్, విశ్వప్రసాద్, రోషన్, సాక్షి

“ఈ సినిమానే నా జీవితం అనుకున్నా. కొన్ని రోజులుగా విశ్రమించకుండా దీనిపైనే దృష్టిపెట్టి పని చేశా. విడుదల తర్వాత ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన ఎంతో తృప్తినిచ్చింది. నా రెండో సినిమానే ఇలాంటి ఓ మంచి కథతో తెరకెక్కడం నా అదృష్టం” అన్నారు రోషన్ కనకాల. ఆయన కథానాయకుడిగా... సందీప్‌రాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం ‘మోగ్లీ 2025’. సాక్షి కథానాయిక. టి.జి.విశ్వప్రసాద్, కృతిప్రసాద్ నిర్మించారు. శనివారం ప్రేక్షకుల ముందుకొచ్చిందీ చిత్రం. ఈ సందర్భంగా చిత్రబృందం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసింది. నిర్మాత టి.జి.విశ్వప్రసాద్ మాట్లాడుతూ “ఎంతో పరిధి ఉన్న సినిమా ఇది. రోషన్‌కి ఓ మంచి సినిమాని ఇచ్చాం అనుకుంటున్నాం” అన్నారు. రోషన్ కనకాల మాట్లాడుతూ “మా సినిమా టికెట్టు ధర రూ.99 మాత్రమే. సరదాగా కుటుంబంతో కలిసి వెళ్లారంటే కచ్చితంగా మా సినిమా వినోదం పంచుతుంద”న్నారు. ఈ కార్యక్రమంలో కథానాయిక సాక్షి మదోల్కర్, వైవా హర్షతోపాటు ఇతర చిత్రబృందం పాల్గొంది.

‘దండోరా’ వేసినట్టే భావోద్వేగాలు


నందు, శివాజీ, మురళీకాంత్, రవీంద్ర

“ప్రేక్షకులకు సందేశాలు... సలహాలు ఇచ్చే పరిస్థితుల్లో నేటి సినిమా లేదు. భావోద్వేగాలతో కూడిన పక్కా వాణిజ్య ప్రధానమైన కథతోనే మా ‘దండోరా’ తెరకెక్కింద”న్నారు ప్రముఖ నటుడు శివాజీ. ఆయనతోపాటు, నవదీప్, నందు, రవికృష్ణ కీలక పాత్రల్లో నటించిన చిత్రమిది. మురళీకాంత్ దర్శకుడు. రవీంద్ర బెనర్జీ ముప్పానేని నిర్మిస్తున్నారు. ఈ నెల 25న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఇందులోని దండోరా... పాటని శనివారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ‘నిను మోసినా నను మోసినా... అమ్మ పేరు ఒకటే నన్నా...’ అంటూ సాగే ఈ పాటని కాసర్ల శ్యామ్ రచించారు. మార్క్ కె.రాబిన్ స్వరకర్త. ఆయనే ఆంథోనీ దాసన్‌తో కలిసి ఆలపించారు. పాట విడుదల అనంతరం శివాజీ మాట్లాడుతూ “తెలంగాణ మూలాల నుంచి వచ్చిన కథ ఇది. హాస్యం, డ్రామా, కథలో కనిపించే దూకుడు... ఇలా ప్రతీ భావోద్వేగం దండోరా వేసినట్టే ఉంటుంది. ప్రతి పాత్రకీ ప్రాధాన్యం ఉంటుంది. మంచి కథలు చేయాలనుకుని నేను విన్న 70, 80 కథల్లో నాకు నచ్చిన అతి కొన్నింటిలో ఇదొకటి. దేశం మొత్తం ఈ కథ గురించి మాట్లాడుతుందేమో” అన్నారు. టికెట్ ధరలు అందుబాటులో ఉండాల్సిందేనన్న ఆయన, మల్టీప్లెక్స్‌ల్లో తినుబండారాల ధరల విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. ‘వేళ్లూనుకుపోయిన కులవ్యవస్థపై చాలా లోతైన విషయాల్ని ఇందులో స్పృశించినా... ప్రతి సన్నివేశం కమర్షియల్ కోణంలో సాగుతూ ప్రేక్షకుడికి వినోదం పంచుతుంద’న్నారు నందు. 23నే ఓవర్సీస్‌లో ప్రీమియర్ షోల్ని వేస్తున్నట్టు చెప్పారు నిర్మాత రవీంద్ర బెనర్జీ. ఈ కార్యక్రమంలో కథానాయిక మణిక, మైత్రీ శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకో పది చిత్రాలు చేస్తే రిటైర్ అయిపోవచ్చు!

తెలంగాణ జానపదంతో పాటు... పాశ్చాత్య సంగీతాన్ని మిళితం చేసి ఓ కొత్త శైలిని సృష్టించే అవకాశాన్ని ‘ఛాంపియన్’ సినిమా కల్పించిందని చెప్పారు సంగీత దర్శకుడు మిక్కీ జె.మేయర్. క్లాస్ సినిమాలతోనే ఆయన తొలి అడుగులు పడినా, కొంతకాలంగా మాస్ కథలపైనా తనదైన ప్రభావం చూపిస్తున్నారు ఈ స్వరకర్త. ఇటీవల ఆయన మరో పీరియాడిక్ చిత్రమైన ‘ఛాంపియన్’ సినిమాకి స్వరాలు సమకూర్చారు. రోషన్ కథానాయకుడిగా, ప్రదీప్ దర్శకత్వంలో రూపొందిన చిత్రమిది. ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్‌తో కలిసి స్వప్న సినిమాస్ సంస్థ నిర్మిస్తోంది. జీ స్టూడియోస్ సమర్పిస్తోంది. ఈ చిత్రం ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా మిక్కీ జె.మేయర్ శనివారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.


మిక్కీ జె. మేయర్.

“పీరియాడిక్ సినిమాలంటే నాకు చాలా ఇష్టం. ఒక కాలాన్ని మరో కాలం నుంచి చూడటం అనేది ఎప్పుడూ ఆసక్తికరమైన విషయమే. ‘మహానటి’ నాకు అలాంటి అనుభూతినే ఇచ్చింది. అదే తరహాలో నిజాం కాలంలోకి వెళ్లి ఆ భావోద్వేగాల్ని ఆస్వాదిస్తూ చేసిన సినిమానే ‘ఛాంపియన్’. నిజాం కాలంలోని గ్రామాలు, ప్రజలు, వాళ్ల భావోద్వేగాల్ని కొత్తగా చూపించే సినిమా ఇది. అందుకు తగ్గట్టుగా సంగీతం చేయడం ఓ గొప్ప అనుభవం. ఇందులో భావోద్వేగాలు ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతాయి”.

● “క్రీడా నేపథ్యం ఉన్నప్పటికీ ఈ కథ చాలా విభిన్నంగా ఉంటుంది. ఇందులో కథానాయకుడిది సికింద్రాబాద్. ఆ పాత్ర మాట్లాడే యాస చాలా ప్రత్యేకంగా ఉంటుంది. నేనూ సికింద్రాబాద్‌లోనే పెరిగా. ఆ సంస్కృతిపై నాకున్న అవగాహన ఈ సినిమాకి బాగా పనికొచ్చింది. గిర గిరా..., సల్లం గుండాలి... పాటలకు ఇప్పటికే మంచి స్పందన వచ్చింది. వీటితోపాటు ఇంకా రెండు పాటలు ఇందులో ఉన్నాయి. మెలోడీ, బీట్ మిశ్రమంగా సాగే గిర గిరా... పాట ఓ కొత్త ఫ్లేవర్‌ని రుచి చూపించింది. ఈ సినిమాతో మరోసారి స్వప్న సినిమాస్‌తో కలిసి ప్రయాణం చేసే అవకాశం రావడం ఎంతో తృప్తినిచ్చింది”.

● “నేను నిరూపించుకునేందుకని ప్రత్యేకంగా ఏ సినిమా చేయను. నా దగ్గరకు ఏ ప్రాజెక్ట్ వస్తే, ఆ జానర్‌కి తగ్గట్టుగా సంగీతం చేయాలనుకుంటా. నేను పరిశ్రమకు వచ్చి 20ఏళ్లు అవుతుంది. ఈ ప్రయాణంలో ఎన్నో అద్భుతమైన ఆల్బమ్స్ చేశా. దాదాపు యాభై సినిమాలు చేశా. ఎస్పీ బాలు, సిరివెన్నెల, వేటూరి తదితర ప్రముఖులతో కలిసి పనిచేశా. ఇంకో పది సినిమాలు చేస్తే ఇక రిటైర్ అయిపోవచ్చు (నవ్వుతూ). చేసిన ఒక పాట శ్రోతలకు ఎలా కనెక్ట్ అవుతుందనేది మన చేతుల్లో లేని విషయం. ఆ విషయంలో నాపైన ఎలాంటి ఒత్తిడి ఉండదు. రీల్స్ కోసమని ప్రత్యేకంగా మ్యూజిక్ చేయడం అంటూ ఉండదు. పాట ప్రేక్షకులకు నచ్చితే, అందులో ఏ భాగాన్ని రీల్స్‌గా చేయాలో వాళ్లకే బాగా తెలుస్తుంది”.

రాహేలు వాయిదా


హనీ రోజ్

“చీకట్లో నేను చూసిన ఆ ఎరుపెక్కిన కళ్లు.. కల అయితే కాదు. అది కలే అయినా ఆ కళ్లను నేను మర్చిపోను” అంటూ ఇటీవలే ‘రాహేలు’ ప్రపంచాన్ని పరిచయం చేసింది హనీ రోజ్. సోషల్ మీడియా వేదికగా ప్రేక్షకుల్ని పలకరిస్తూ.. కుర్రకారుని ఆకట్టుకునే ఆమె ప్రధాన పాత్రలో నటించిన చిత్రమిది. ఆనందిని బాలా దర్శకత్వం వహించారు. ఇప్పటికే తెరపైకి రావాల్సిన ఈ సినిమా కొన్ని కారణాలతో వాయిదా వేసినట్లు తెలుపుతూ.. ఇన్‌స్టా వేదికగా మరో కొత్త పోస్టర్‌ను పంచుకుంటూ ఓ పోస్ట్ పెట్టింది చిత్రబృందం. “ప్రస్తుత సమయం, విడుదల పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని.. మా ప్రేక్షకులకు మంచి అనుభూతిని ఇవ్వడానికి ‘రాహేలు’ను అతి త్వరలో థియేటర్లలోకి తీసుకొస్తాం” అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. రివేంజ్ డ్రామాగా తీర్చిదిద్దిన ఈ మలయాళ చిత్రంలో చందు సలీంకుమార్, రాధికా రాధాకృష్ణన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

చిక్కుల్లో పాపిరెడ్డి గ్యాంగ్


ఫరియా, నరేశ్ అగస్త్య

పాతిపెట్టిన శవాన్ని తీసుకొచ్చేందుకు శ్రీశైలం అడవుల్లోకి వెళ్లిన ఓ గ్యాంగ్‌కి ఎలాంటి చిక్కులు ఎదురయ్యాయి? ఇంతకీ ఆ శవం ఎవరిది? దాంతో ఈ గ్యాంగ్‌కి పనేమిటి? తదితర విషయాలు తెలియాలంటే ‘గుర్రం పాపిరెడ్డి’ చిత్రం చూడాల్సిందే. నరేశ్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటించిన చిత్రమిది. మురళీమనోహర్ దర్శకత్వం వహించారు. వేణు సద్ది, అమర్ బురా, జయకాంత్ (బాబీ) నిర్మాతలు. ఈ చిత్రం ఈ నెల 19న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా శనివారం ట్రైలర్‌ని విడుదల చేశారు. “తెలివిలేని ఓ గ్యాంగ్ నేపథ్యంలో సాగే కథ ఇది. అనుకోకుండా చిక్కుల్లో పడినప్పుడు గ్యాంగ్‌లోని గుర్రం పాపిరెడ్డి ఏం చేశాడు? అనేది ఆసక్తికరం”అని చెప్పాయి చిత్రవర్గాలు.

ప్రేమలో పడతారా..?


మృణాల్ ఠాకూర్

ఎంచుకున్న పాత్రలతోనే గుర్తుండిపోయే అందాల తారలలో మృణాల్ ఠాకూర్ ముందు వరుసలో ఉంటుంది. త్వరలో ఆమె.. బాలీవుడ్ కథానాయకుడు సిద్ధాంత్ చతుర్వేదితో కలిసి తన ప్రేమకథను ప్రేక్షకులకు పరిచయం చేయడానికి ముస్తాబవుతోంది. వీరిద్దరూ జంటగా నటిస్తున్న చిత్రం ‘దో దీవానే సెహర్ మే’. ప్రముఖ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ నిర్మిస్తున్నారు. రవి ఉద్యావార్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ‘శశాంక్, రోష్నితో కలిసి మీరు కూడా ప్రేమలో పడతారా’ అనే వ్యాఖ్యలతో ఈ సినిమా నుంచి కొత్త పోస్టర్లను సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది మృణాల్. మ్యూజికల్ లవ్‌స్టోరీగా దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు, ఇందులో మృణాల్, సిద్ధాంత్‌ల జోడీ తెరపై ఆకర్షణీయంగా కనిపిస్తుందని చిత్ర వర్గాలు తెలిపాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరి 26న థియేటర్లలోకి రాబోతుందీ చిత్రం.

ఓ భార్య కథ


నరేన్ తేజ్, సుహాన

నరేన్ తేజ్, సుహాన జంటగా.. శ్రీనివాస్ (బుజ్జి) దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం ‘వైఫ్’. సినిటారియ మీడియా వర్క్స్‌తో కలిసి అధిరా టాకీస్ సంస్థ నిర్మిస్తోంది. ఈ సినిమా టైటిల్, ఫస్ట్‌లుక్ ఆవిష్కరణ కార్యక్రమం శనివారం హైదరాబాద్‌లో జరిగింది. దర్శకులు చంద్రమహేశ్, సముద్ర, నిర్మాత రామసత్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చిత్ర దర్శకుడు మాట్లాడుతూ “నేర నేపథ్యంలో సాగే సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రమిది. మా కథలో భార్య ఎవరు? ఆమె ఏం చేసిందన్నది తెరపైనే చూడాల”న్నారు.

వీళ్లు చాలా మంచోళ్లు


అంచల్, పాయల్, రోషిణి, యష్ణ

అంచల్‌గౌడ, పాయల్ చెంగప్ప, రోషిణి, యష్ణ ప్రధాన పాత్రధారులుగా.. ఫణి ప్రదీప్ ధూళిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం ‘బ్యాడ్‌గాళ్స్’. కానీ చాలా మంచోళ్లు... అనేది ఉపశీర్షిక. శశిధర్ నల్ల, ఇమ్మడి సోమ నర్సయ్య, రామిశెట్టి, రావుల రమేశ్ నిర్మాతలు. ఈ నెల 25న చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. దర్శకుడు మాట్లాడుతూ ‘జాతిరత్నాలు’, ‘మ్యాడ్’ తరహా కథలు అమ్మాయిలు ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కితే ఎలా ఉంటుందో అలా ఉంటుంది మా చిత్రం” అన్నారు.

మీరు అనుకున్నది కాదు


సాయికృష్ణ, సిరి

తల్లాడ సాయికృష్ణ కథానాయకుడిగా నటిస్తూ, దర్శకత్వం వహించిన చిత్రం ‘మ్యాజిక్ మూవ్‌మెంట్స్’ (మీరు అనుకున్నది కాదు). ఏకదంతాయ సిరి కథానాయిక. తల్లాడ శ్రీనివాస్ నిర్మాత. ప్రముఖ దర్శకుడు కె.దశరథ్ సమర్పకుడు. ఈ సినిమా పేరు ఆవిష్కరణ వేడుక ఇటీవల హైదరాబాద్‌లో జరిగింది. చిత్ర సమర్పకుడు దశరథ్ మాట్లాడుతూ “సాయి చెప్పిన ఈ కథ నాకు చాలా నచ్చింది. మంచి సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రం అవుతుంది” అన్నారు.

చల్లటి వేళ.. వేడివేడి స్నాక్స్!

మనలో చాలామందికి చిరుతిళ్లు బాగా నచ్చుతాయి. అందునా చలికాలంలో సాయంత్రం వేళ వేడివేడిగా ఏదైనా తినాలనిపిస్తుంది. అలాంటప్పుడు రొటీన్‌గా మిర్చి బజ్జీ, పకోడీల్లాంటివి తెచ్చుకుని తినే బదులు ఇంట్లోనే ఎంచక్కా బోల్డన్ని వెరైటీలు చేసుకోవచ్చు. మీ కోసం కొన్ని నోరూరించే స్నాక్స్.. ఇంకెందుకాలస్యం.. చకచకా చేసేయండి!


ఆలూ టిక్కీ



కావలసినవి: బంగాళదుంపలు- 3, ఉప్పు - రుచికి తగినంత, బ్రెడ్ పౌడర్ - 3 స్పూన్లు, అల్లం పచ్చిమిర్చి పేస్ట్ - 1 స్పూన్, కారం - ముప్పావు స్పూన్, ధనియాలు, జీలకర్ర పొడులు - ముప్పావు స్పూన్ చొప్పున, గరంమసాలా - అర స్పూన్, నూనె- వేయించడానికి సరిపడా, కొత్తిమీర తరుగు - పావు కప్పు

తయారీ: బంగాళదుంపలను ఉడికించి మెత్తగా మెదిపాలి. అందులో కారం, ఉప్పు, ధనియాలు, జీలకర్ర పొడులు, గరంమసాలా, కొత్తిమీర తరుగు, బ్రెడ్ పౌడర్, ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంతో చిన్న చిన్న టిక్కీలు చేసుకోవాలి. అన్నీ అయ్యాక.. కాగుతున్న నూనెలో బంగారు రంగులోకి మారే వరకూ వేయించాలి. వేడి ఆలూ టిక్కీలను పల్లీ లేదా కొబ్బరి చట్నీతో సర్వ్ చేయండి. టొమాటో కెచప్ కూడా బాగుంటుంది. ఎంత సులువు కదా! రుచి మాత్రం అమోఘం.

మసాలా పూరీ ఛాట్



కావలసినవి: మసాలా గ్రేవీ కోసం

పచ్చి బఠాణీలు - ఒక కప్పు, ఉల్లిపాయ, టొమాటో - ఒక్కోటి, ఉప్పు - రుచికి తగినంత, ధనియాల పొడి, అల్లం వెల్లుల్లి పేస్ట్ - స్పూన్ చొప్పున, గరంమసాలా, జీలకర్ర, పసుపు - అర స్పూన్ చొప్పున, కారం - ముప్పావు స్పూన్, నూనె - మూడు స్పూన్లు

టాపింగ్ కోసం

పూరీలు - 12, ఉల్లి స్లైసులు - పావు కప్పు, టొమాటో ముక్కలు - గుప్పెడు, కొత్తిమీర - 3 టేబుల్ స్పూన్లు, నిమ్మరసం- స్పూన్, సన్న కారప్పూస - రెండు టేబుల్ స్పూన్లు, అల్లం చట్నీ, గ్రీన్ చట్నీ- టేబుల్ స్పూన్ చొప్పున

తయారీ: బఠాణీలను కుక్కర్‌లో 3 విజిల్స్ వచ్చేవరకూ ఉడికించాలి. ప్యాన్‌లో నూనె వేడయ్యాక జీలకర్ర వేయాలి. అది వేగాక.. ఉల్లి తరుగును లేత గోధుమరంగులోకి మారే వరకూ వేయించాలి. అందులో అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి పచ్చి వాసన పోయే వరకూ వేయించి.. టొమాటో ముక్కలు జోడించాలి. మెత్తగా ఉడికాక.. తగినన్ని నీళ్లు, కారం, పసుపు, ధనియాల పొడి, ఉప్పు, ఉడికిన బఠాణీలు జతచేసి ఆరేడు నిమిషాల పాటు ఉడికించాలి. చివరగా గరంమసాలా వేసి బాగా కలపాలి. గ్రేవీ పల్చగా కాకుండా చిక్కగా ఉండాలి. ఇప్పుడిక పూరీల మీద వేడి వేడి మసాలా గ్రేవీ వేయండి. తర్వాత ఉల్లి స్లైసులు, టొమాటో ముక్కలు, కొత్తిమీర చేర్చండి. వాటి మీద సన్న కారప్పూస, నిమ్మరసం చల్లి.. అల్లం చట్నీ, గ్రీన్ చట్నీలతో అలంకరించండి. చల్లటి సాయంత్రం వేళ మసాలా ఛాట్ రుచిని ఆనందించండి.

వడ పావ్



కావలసినవి: బంగాళదుంపలు - 3, ఉప్పు - రుచికి తగినంత, అల్లం వెల్లుల్లి పేస్ట్ - స్పూన్, పచ్చిమిరపకాయలు - 2, కరివేపాకు - రెండు రెబ్బలు, పసుపు - పావు స్పూన్, నిమ్మరసం - స్పూన్, శనగపిండి - కప్పు, బియ్యప్పిండి - 2 స్పూన్లు, కారం - అర స్పూన్, బన్నులు (పావ్) - 4, కారం - రెండు స్పూన్లు, నెయ్యి - టేబుల్ స్పూన్, నూనె - వేయించడానికి సరిపడా, ఉల్లి స్లైసులు - గుప్పెడు, గ్రీన్ చట్నీ - రెండు స్పూన్లు

తయారీ: బంగాళదుంపలను ఉడికించి మెత్తగా మెదిపి పక్కన ఉంచాలి. ప్యాన్‌లో కొద్దిగా నూనె వేడి చేసి.. కరివేపాకు, పచ్చిమిర్చి, అల్లం వెల్లుల్లి పేస్ట్‌లను వేయించాలి. అందులో పసుపు, ఉప్పు, బంగాళదుంపల ముద్ద వేసి కలియబెట్టి సెగ తీసేయాలి. ఈ మిశ్రమం చల్లబడిన తర్వాత చిన్న చిన్న బంతుల్లా చేసి పక్కనుంచాలి. ఒక పాత్రలో శనగపిండి, బియ్యప్పిండి, కారం, పసుపు, ఉప్పు వేసి కొద్దికొద్దిగా నీళ్లు పోస్తూ పకోడి పిండిలా గట్టిగా కలపాలి. బంగాళదుంప బంతులను పిండిలో ముంచి తీసి.. కాగుతున్న నూనెలో బంగారు రంగు వచ్చే వరకూ వేయించాలి. వాటిని టిష్యూ పేపర్ మీదికి తీస్తే.. అదనపు నూనెను పీల్చేసుకుంటాయి. బన్నులను మధ్యలో కట్ చేసి పెనం మీద నెయ్యితో కాల్చుకోవాలి. బన్ను మీద కాస్త కారం చల్లి.. ఒక వడని ఉంచి.. నెమ్మదిగా నొక్కి, ఉల్లి స్లైసులు, చట్నీ వేసి.. మరో బన్నుతో కప్పేయాలి.

గోబీ మంచూరియా



కావలసినవి: క్యాలీఫ్లవర్ (గోబీ)- 1, మైదా - అర కప్పు, మొక్కజొన్న పిండి - అర కప్పు, ఉప్పు - రుచికి తగినంత, కారం - స్పూన్, అల్లం వెల్లుల్లి పేస్ట్ - స్పూన్, నూనె - వేయించడానికి సరిపడా

గ్రేవీ కోసం: నూనె - 2 టేబుల్‌స్పూన్లు, వెల్లుల్లి - ఆరేడు రెబ్బలు, ఉల్లిపాయలు, క్యాప్సికం - 2 చొప్పున, సోయా సాస్, టొమాటో సాస్ - టేబుల్‌స్పూన్ చొప్పున, చిల్లీ సాస్ - టీస్పూన్, వెనిగర్ - స్పూన్, ఉప్పు - రుచికి తగినంత, మిరియాల పొడి - అర స్పూన్, ఉల్లి కాడల తరుగు - గార్నిష్ చేసేందుకు

తయారీ: క్యాలీఫ్లవర్‌ని చిన్న పువ్వులుగా కోసి.. వేడి నీళ్లలో వేయాలి. 5 నిమిషాల తర్వాత ఆ నీళ్లు వంపేసి పక్కనుంచాలి. వెల్లుల్లి రెబ్బలను సన్నగా తరగాలి. ఒక పాత్రలో మైదా, మొక్కజొన్న పిండి, కారం, ఉప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి తగినన్ని నీళ్లతో పిండి కలపాలి. అందులో గోబీ పువ్వులను చేర్చి కలియబెట్టాలి. వాటిని కాగుతున్న నూనెలో వేసి.. చక్కగా వేయించాలి.

మసాలా తయారీ: ప్యాన్‌లో 2 టేబుల్‌స్పూన్ల నూనె వేడి చేసి వెల్లుల్లి రెబ్బలను మంచి వాసన వచ్చే వరకూ వేయించాలి. అందులో ఉల్లి తరుగు, క్యాప్సికం ముక్కలు జోడించాలి. అవి వేగాక.. సోయా సాస్, టొమాటో సాస్, చిల్లీ సాస్, కొన్ని నీళ్లు, ఉప్పు, మిరియాల పొడి, వేయించిన క్యాలీఫ్లవర్ వేసి.. కలియబెట్టాలి. దించేశాక స్ప్రింగ్ ఆనియన్‌తో గార్నిష్ చేయాలి.

పనీర్ సమోసా



కావలసినవి: మైదా - ఒకటిన్నర కప్పులు, నూనె - 2 టేబుల్ స్పూన్లు, ఉప్పు - రుచికి తగినంత

ఫిల్లింగ్ కోసం: పనీర్ - 200 గ్రాములు, ఉప్పు - తగినంత, ఉల్లిపాయ- 1, పచ్చిమిర్చి - 2, అల్లం వెల్లుల్లి పేస్ట్, కారం - స్పూన్ చొప్పున, ధనియాలు, జీలకర్ర పొడులు, గరంమసాలా - అర స్పూన్ చొప్పున, కొత్తిమీర తరుగు - పావు కప్పు, నిమ్మరసం - ముప్పావు స్పూన్, నూనె - వేయించడానికి సరిపడా

తయారీ: ఉల్లి, పచ్చిమిర్చి, పనీర్‌లను చిన్న ముక్కలుగా కట్ చేయాలి. వెడల్పాటి పాత్రలో మైదా, ఉప్పు, ఒక టేబుల్ స్పూన్ నూనె వేసి.. కొద్దికొద్దిగా నీళ్లు పోస్తూ కలపాలి. పిండి గట్టిగా లేదా జారుగా ఉండకూడదు. దాని మీద తడి వస్త్రం కప్పి ఒక అరగంట నాననివ్వాలి. ఈలోగా ప్యాన్‌లో నూనె వేడి చేసి.. ఉల్లి తరుగు వేయాలి. అది బంగారు రంగులోకి మారాక.. అల్లం వెల్లుల్లి పేస్ట్, పచ్చిమిర్చి ముక్కలు జతచేసి పచ్చి వాసన పోయే వరకూ వేయించాలి. అందులో కారం, ఉప్పు, ధనియాలు, జీలకర్ర పొడులు, గరంమసాలా, పనీర్ జోడించి రెండు మూడు నిమిషాలు వేయించాలి. చివర్లో కొత్తిమీర, నిమ్మరసం కూడా వేసి సెగ తీసేయాలి. ఇప్పుడిక నానిన పిండిని చిన్న భాగాలుగా విడగొట్టి.. వాటిని చపాతీలుగా ఒత్తుకోవాలి. ఒక్కో చపాతీని సగానికి కట్ చేయాలి. ఒక్కో అర్ధ భాగాన్ని కోన్‌లా చుట్టి.. అంచులను రెండు చుక్కల నీళ్లతో తడపాలి. సిద్ధమైన పనీర్ ఫిల్లింగ్‌ని కోన్‌లో నింపి.. అంచులను కలిపేసి కాగుతున్న నూనెలో లేత గోధుమ రంగులోకి మారే వరకూ వేయించాలి. అంతే.. గరం గరం పనీర్ సమోసా రెడీ! వీటిని, టొమాటో సాస్ లేదా పుదీనా చట్నీతో తింటే మహా రుచిగా ఉంటాయి.

ఫలాఫల్



కావలసినవి: కాబూలీ శనగలు - కప్పు, ఉల్లిపాయ - ఒకటి, ఉప్పు - రుచికి తగినంత, వెల్లుల్లి రెబ్బలు - 3, కొత్తిమీర - అర కప్పు, పుదీనా - గుప్పెడు, ధనియాలు, జీలకర్ర పొడులు - స్పూన్ చొప్పున, మిరియాలు - అర స్పూన్, పచ్చిమిర్చి - 2, బేకింగ్ సోడా - చిటికెడు, నూనె - వేయించడానికి సరిపడా

తయారీ: ఉల్లి మొదలైన వాటిని సన్నగా తరగాలి. శనగలను ముందు రోజు రాత్రి నానబెట్టి మర్నాడు ఉదయం ఆ నీళ్లు తీసేయాలి. ఉడికించాల్సిన అవసరం లేదు. శనగల్లో ఉల్లి, వెల్లుల్లి, పుదీనా, మిరియాలు వేసి గ్రైండ్ చేయాలి. మరీ మెత్తగా కాకుండా కొంచెం బరకగా ఉండాలి. అందులో కొత్తిమీర, ధనియాలు, జీలకర్ర పొడులు, ఉప్పు, బేకింగ్ సోడా జోడించి కొంతసేపు పక్కనుంచాలి. అరగంట తర్వాత చేతులతో మెదుపుతూ కట్లెట్లలా చేయాలి. అన్నీ అయ్యాక.. కాగుతున్న నూనెలో బంగారు రంగు వచ్చే వరకూ వేయించాలి. వీటికి హమ్మస్ లేదా తాహినీ సాస్ బెస్ట్ కాంబినేషన్. అవి లేకుంటే.. కెచప్‌తో కూడా టేస్టీగా ఉంటాయి

పొలంలో చికెన్.. చపాతీ!

బ్యాచిలర్స్ కిచెన్



ఒకరోజు ఆఫీసు నుంచి వచ్చాక.. 'ఈ పూట వంటావార్పు కార్యక్రమానికి విరామం ఇచ్చి బయట తిందాం' అన్నాడు రవి. అది అందరికీ నచ్చేసింది. పొలాంని ఓపెన్ కిచెన్‌కి వెళ్లాం. అక్కడ చికెన్, చపాతీ తిన్న ప్రదేశంతో... 'ఇలా ఆరుబయట వంటచేసి వడ్డించుకుని తింటే బాగుంటుంది' అనిపించింది మా బ్యాచిలర్ కుర్రాళ్లకి. పొలంలో ఆ సరదా తీర్చుకోవాలని.. మర్నాడు మా ఊరెళ్లాం. రాత్రయ్యేసరికి అవసరమైన సరంజామాతో పొలం చేరాం. నేనే వంట మాస్టర్. రాత్రికి పొయ్యి రెడీ చేసి, చికెన్‌ను మ్యారినేట్ చేస్తున్నాం. ఒకరు ఉల్లిపాయలు తరుగుతుంటే, ఇంకొకరు పొయ్యి వెలిగించే ప్రయత్నం.. కట్టెలు ఎంతకూ వెలగకపోయేసరికి అటూఇటూ తిరిగి ఎండుపుల్లలు తెచ్చాం. నానా హైరానా పడితే పొయ్యి వెలిగింది. ఇక పాకశాస్త్ర ప్రావీణ్య ప్రదర్శన సిద్ధమైపోయా. రెండునిమిషాలకే మంట ఆగిపోయి, పొయ్యి ఊదుడు కార్యక్రమం మొదలైంది. పొయ్యి కంటే కళ్లు మండుతున్నాయి. ఈలోగా ఓ మేధావి చపాతీల కోసం పిండి కలుపుతున్నాడు. ఇంకో విజ్ఞాని పిండి తెల్లగా కలుస్తుందని చాలా నీళ్లు పోయడంతో అది కాస్తా దోశపిండిలా తయారైంది. చపాతీ ఆశలు గల్లంతయ్యాయి. చికెన్ ఉడుకుతోంది కానీ, వాసన ఇంట్లో వండుతున్నట్టు లేదు. మసాలాతో కవర్ చేయొచ్చులెమ్మనుకున్నా. ఎలా ఉంది చెప్పమంటే.. ఒకరు ఉప్పు తక్కువని, ఇంకొకరు కారం వెయ్యమని సలహాలిచ్చారు. రెండూ జోడించా. మొత్తానికి చికెన్ కూర సిద్ధమైంది. అదిరిపోయే ఘుమఘుమలు లేవుపోయె.. పొగ వాసన గుప్పుమంది. అందరూ నావంక గుర్రుగా చూస్తే.. ప్యాక్టరీగొట్టంలా పొయ్యిలోంచి పొగలొస్తే నేనేం చేస్తానన్నాను చిరాగ్గా. సర్దుకుని తినబోతే.. 'పేపర్ ప్లేట్లు' కనిపించలేదు. మాలో ఒక మహానుభావుడు వాటిని ఇంటి దగ్గరే జాగ్రత్తగా ఉంచేశాడు. అడుగడుగునా ఆటంకాలే. అయినా వెనక్కి తగ్గకుండా.. సరకులు తెచ్చిన కవరును చించి.. ముక్కలు చేసి వడ్డించుకున్నాం. తీరా నోట్లో పెడితే.. భయంకరమైన కారం! అట్టాఇట్టా కాదు.. గుబ గుయ్యిమంది. అమ్మ గనుక ఇలా వండితే శాల్ రూల్ అంటూ లేచెళ్లిపోయేవాళ్లే. కానీ చేసింది నేను కాబట్టి చచ్చేసట్టు తిన్నా. ముగ్గురూ మాంచి ఆకలిమీద ఉండటాన.. కారానికి తట్టుకోలేక కేకలు పెడుతూనే ఎలాగోలా తిన్నారు. ఇంకెప్పుడూ ఇలాంటి ప్రయోగం చెయ్యకూడదని గాఢంగా తీర్మానించుకున్నాం.

– సూరపు సూర్యనారాయణ, గొల్లలవలస, శ్రీకాకుళం

పాకకవంట

మాంసాహారం తినని వాళ్లకి సోయాని మించింది లేదు. దీంతో నగ్గెట్స్ చేశారంటే రుచికి రుచి, బలానికి బలం. పిల్లలు ఇంకా కావాలని అడిగి మరీ తింటారు.

సోయా నగ్గెట్స్ అదరహో!



నగ్గెట్స్ కోసం.. సోయా చంక్స్ - కప్పు, పెరుగు - అర కప్పు, అల్లం - అంగుళం ముక్క, ఉప్పు - రుచికి తగినంత, బంగాళదుంపలు - 2, పచ్చిమిర్చి - 3, కొత్తిమీర తరుగు - పావు కప్పు, ధనియాలు, జీలకర్ర పొడులు, కశ్మీరీ కారం, ఛాట్ మసాలా - అర స్పూన్ చొప్పున, బియ్యప్పిండి - 2 టేబుల్‌స్పూన్లు, మొక్కజొన్న పిండి - టేబుల్‌స్పూన్, చీజ్ క్యూబ్స్ - 100 గ్రాములు, నూనె - వేయించడానికి సరిపడా, కార్న్ ఫ్లేక్స్ - గుప్పెడు తీసుకోవాలి. ఎలా చేయాలంటే... ఒక పాత్రలో తగినన్ని నీళ్లు, బియ్యప్పిండి, మొక్కజొన్న పిండి వేసి.. కాస్త జారుగా ఉండేలా కలిపి ఉంచాలి. బంగాళదుంపలను ఉడికించి పొట్టుతీసి మెత్తగా మెదపాలి. సోయా చంక్స్‌ను వేడినీళ్లలో నానబెట్టాలి. పావుగంట తర్వాత స్ట్రెయినర్‌లో వేసి స్పూన్‌తో నొక్కి అదనపు నీళ్లను తీసేయాలి. వాటికి అల్లం, పచ్చిమిర్చి చేర్చి గ్రైండ్ చేయాలి. అందులో బంగాళదుంపల ముద్ద, ఉప్పు, ధనియాలు, జీలకర్ర పొడులు, ఛాట్ మసాలా, కారం, కొత్తిమీర తరుగు జోడించి బాగా కలపాలి. ఈ మిశ్రమంతో చిన్న రొట్టెలా చేసి.. మధ్యలో చీజ్ క్యూబ్ ఉంచి.. అంచులు కప్పేయాలి. అన్నీ అయ్యాక... మొదట బియ్యప్పిండిలో ముంచితీసి, కార్న్ ఫ్లేక్స్‌లో దొర్లించి.. కాగుతున్న నూనెలో వేయించాలి. లేత గోధుమ రంగులోకి మారాక.. టిష్యూ పేపర్ మీదికి తీస్తే అదనపు నూనెను పీల్చేసుకుంటాయి.



– బొబ్బా సుజాత, హైదరాబాద్

సింధీ మటన్ కర్రీ ఇలా!



చెఫ్ స్పెషల్

ఆసక్తి, అభిరుచి ఉండాలే గానీ మాంసం కూరను ఎన్నో రకాలుగా చేయొచ్చు. అరబ్ సంప్రదాయం ప్రకారం చేసే సింధీ మటన్ కర్రీ అద్భుతమైన రుచీ వాసనలతో ఆకట్టుకుంటుంది. ఇది సెయాల్ తీవన్‌గానూ ప్రసిద్ధం.

కావలసినవి: మటన్ చాప్స్ - ముప్పావు కిలో, ఉల్లి తరుగు - 2 కప్పులు, టొమాటో ముక్కలు - అర కప్పు, పచ్చిమిర్చి - 3, ఉప్పు - రుచికి తగినంత, కారం, ధనియాల పొడి, అల్లం వెల్లుల్లి పేస్టు - 2 స్పూన్ల చొప్పున, పసుపు, జీలకర్ర, మిరియాల పొడి - స్పూన్ చొప్పున, దాల్చినచెక్క - అంగుళం ముక్క, నల్ల, ఆకుపచ్చ యాలకులు, బిర్యానీ ఆకులు, స్టార్ మొగ్గలు, ఎండుమిర్చి - 2 చొప్పున, లవంగాలు - 4, నూనె - 2 టేబుల్ స్పూన్లు, కొత్తిమీర తరుగు - గుప్పెడు, పెరుగు - పావు కప్పు

తయారీ: ప్యాన్‌లో నూనె వేడయ్యాక.. జీలకర్ర, దాల్చినచెక్క, బిర్యానీ ఆకులు, స్టార్ మొగ్గలు, యాలకులు, లవంగాలు, ఎండుమిర్చిలను వేయించాలి. మంచి వాసన వస్తుండగా ఉల్లి తరుగు, పచ్చిమిర్చి ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్టు జోడించి రెండు నిమిషాలు వేయించి.. మటన్ చాప్స్, టొమాటో ముక్కలు వేయాలి. అవి కాస్త వేగాక.. పసుపు, మిరియాలు, ధనియాల పొడులు, కారం, కొన్ని నీళ్లు, పెరుగు చేర్చి మూతపెట్టి ఉడికించాలి. చివర్లో కొత్తిమీర వేసి దించేయాలి.

పిల్లలకు బాగా నచ్చేవాటిల్లో లాలీపాప్ ఒకటి. డాల్గోనా క్యాండీ కొంచెం లాలీపాప్‌లానే ఉంటుంది. దీన్ని ఇంట్లోనే చేసుకోవచ్చు.

డాల్గోనా క్యాండీ చేద్దామా!



డాల్గోనా క్యాండీ కోసం... పంచదార - కప్పు, పంచదార పొడి - అర స్పూన్, బేకింగ్ పౌడర్ - స్పూన్, షుగర్ కోటెడ్ కలర్‌ఫుల్ సోంపు - 2 స్పూన్లు తీసుకోవాలి. ఎలా చేయాలంటే... ప్యాన్‌లో పంచదార, బేకింగ్ పౌడర్ వేసి కలియతిప్పుతూ వేడిచేయాలి. క్యారమెల్ తయారయ్యాక స్టవ్వు కట్టేయాలి. సిలికాన్ పేపర్ మీద సగం కలర్‌ఫుల్ సోంపు వేసి.. క్యారమెల్‌ను పరిచినట్లు సమంగా సర్దాలి. దాని మీద మిగిలిన సోంపు చల్లాలి. కుకీస్ కటర్ సాయంతో ముక్కలుగా కట్ చేసి.. వాటికి ఐస్‌క్రీమ్ స్టిక్స్‌ను గుచ్చి.. పంచదార పొడి చల్లాలి. అంతే.. డాల్గోనా క్యాండీ తయారైపోతుంది. ఇది పిల్లలకే కాదు.. పెద్దలకూ నచ్చుతుంది.

క్యాబేజీ కళాఖండాలు

చిత్రంగా..



తెలుపు, ఆకుపచ్చ కలగలసిన క్యాబేజీ ముచ్చటగొలిపేలా ఉంటుంది. దీంతో కూర తర్వాత చేయొచ్చులే.. అంతకంటే ముందు అందంగా అలంకరిద్దాం అనుకున్నారు. తమ నైపుణ్యమంతా జోడించి రకరకాల ఆకృతులిచ్చారు. చూపులకు గేలమేసి లాగేస్తున్నాయి కదూ ఈ కళాఖండాలు!





స్ట్రాబెర్రీ సిరప్ ఇంట్లోనే

పిల్లలకు పండ్ల కంటే వాటితో జ్యూస్ చేసిస్తే ఇష్టం. ఈ సీజన్‌లో దొరికే స్ట్రాబెర్రీలతో కాన్‌సన్ట్రేట్ ఇలా చేయండి...

కావలసినవి: స్ట్రాబెర్రీలు - కప్పున్నర, పంచదార పొడి - కప్పు, నిమ్మరసం - టేబుల్ స్పూన్, ఉప్పు - చిటికెడు

తయారీ: స్ట్రాబెర్రీలను మెత్తగా గ్రైండ్ చేయాలి. అందులో కప్పు నీళ్లు, ఉప్పు, పంచదార పొడి, నిమ్మరసం, వేసి ఉడికించాలి. మధ్యస్థమైన సెగ మీద నాలుగైదు నిమిషాలు ఉంచి తర్వాత పూర్తిగా సిమ్ చేయాలి. మధ్యమధ్యలో కలియ తిప్పుతూ పది నిమిషాలయ్యాక దించేయాలి. చల్లారాక.. పడకట్టి తడి లేని సీసాలో పోసి ఫ్రిజ్‌లో ఉంచాలి. తాగదలచినప్పుడు ముప్పావు గ్లాసు నీళ్లలో రెండు స్పూన్ల స్ట్రాబెర్రీ కాన్‌సన్ట్రేట్ కలిపితే సరిపోతుంది. ఇంట్లో తయారైన ఈ పానీయం రుచే కాదు ఆరోగ్యం కూడా. ఇలా చేసి ఉంచితే... ఎప్పుడంటే అప్పుడు స్ట్రాబెర్రీ జ్యూస్ తాగేయొచ్చు.



ఆహారం ఆరోగ్యం

ఈ కాలంలో పిల్లలు రక్తహీనత, తలనొప్పి, కళ్లు మండటం, జుట్టు రాలడం, చర్మం పొడిబారడం.. ఇలా అనేక సమస్యల బారిన పడుతున్నారు. వీటన్నిటికీ ఒకే ఒక్క పరిష్కారం యాపిల్, బీట్‌రూట్, ఆమ్లా, క్యారెట్ పానీయం.

ఈ పానీయం.. సర్వరోగ నివారిణి!

ఈ జ్యూస్ కోసం యాపిల్, బీట్‌రూట్ ఒక్కొకటి, అల్లం - చిన్న ముక్క, నిమ్మరసం - అర స్పూన్, పటికబెల్లం పొడి - 3 స్పూన్లు, మిరియాల పొడి - పావు స్పూన్, క్యారెట్లు, ఉసిరికాయలు - 2 చొప్పున తీసుకోవాలి. యాపిల్ చెక్కు, విత్తనాలు తీసేయాలి. బీట్‌రూట్, క్యారెట్లను పీల్ చేయాలి. ఉసిరికాయల్లో విత్తనాలు తీసేయాలి. వీటికి అల్లం చేర్చి గ్రైండ్ చేయాలి. అందులో 3 గ్లాసుల నీళ్లు, పటికబెల్లం, మిరియాల పొడి, నిమ్మరసం జోడిస్తే జ్యూస్ తయారైపోతుంది. ఇది ముగ్గురు తాగొచ్చు.

● యాపిల్, బీట్‌రూట్, ఆమ్లా, క్యారెట్ పానీయంలో విటమిన్లు, ప్రొటీన్లు ఉండటాన బలాన్ని చేకూరుస్తుంది. ● కళ్లకు మేలు చేస్తుంది. ● రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ● హిమోగ్లోబిన్ శాతం పెరుగుతుంది. ● కుదుళ్లు గట్టిపడి కురులు ఒత్తుగా, నల్లగా ఉంటాయి.● జీర్ణప్రక్రియ సాఫీగా ఉంటుంది. వేళకు ఆకలి వేస్తుంది. ● చర్మం పొడిబారదు, ముడతలు పడదు. ముఖానికి కాంతి వస్తుంది. ● రక్తంలో చక్కెర స్థాయి క్రమబద్ధంగా ఉంటుంది. ● ఒంట్లో చేరిన మలినాలను బయటకు పంపడంలో తోడ్పడుతుంది. ● కాలేయం పనితీరు మెరుగుపడుతుంది. మెదడు చురుగ్గా పనిచేస్తుంది. ● ఈ పానీయం రోజూ తాగడం అలవాటు చేసుకుంటే ఆరోగ్యంగా, ఆనందంగా ఉండొచ్చన్నది నిపుణుల సూచన.





పార్లమెంటుపై ఉగ్రవాదులు జరిపిన దాడిలో అమరులకు శనివారం నివాళులర్పిస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ✦నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ

పార్లమెంటుపై ఉగ్రదాడిలో అమరవీరులకు నివాళులు

- సాహసవీరుల త్యాగాలను కొనియాడిన రాష్ట్రపతి, ప్రధాని

దిల్లీ: భారత పార్లమెంటుపై ఉగ్రమూక కుట్రను తిప్పికొట్టే క్రమంలో ప్రాణాలు అర్పించిన అమరవీరులకు యావత్తు దేశం ఘన నివాళులర్పించింది. 2001 డిసెంబరు 13న దాడికి పాల్పడిన ఐదుగురు ముష్కరులను భద్రతా బలగాలు మట్టుపెట్టాయి. ఆ క్రమంలో పది మంది భారతీయులు మరణించారు. వారిలో ఆరుగురు దిల్లీ పోలీసులు, ఇద్దరు పార్లమెంటు భద్రతా విభాగ అధికారులు, ఒక జర్నలిస్టు, తోటమాలి ఉన్నారు. నాటి వారి త్యాగాలను ప్రతి ఏడాది అదే రోజు పాత పార్లమెంటు భవనంలో స్మరించుకుంటున్నారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో అమరవీరులకు ప్రధాని మోదీ, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, కేంద్ర మంత్రులు నివాళులర్పించారు. దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన వారిని జాతి ఎల్లవేళలా గుర్తుంచుకుంటుందని ప్రధాని మోదీ సామాజిక మాధ్యమంలో 'ఎక్స్'లో పేర్కొన్నారు. వారి త్యాగానికి భారత్ ఎప్పుడూ కృతజ్ఞతతో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రాలు అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విడిగా పంపిన సందేశంలో అమరవీరులకు నివాళులర్పించారు. 'ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా దాన్ని మట్టుపెట్టాలన్న నిబద్ధతను భారత దేశం ఈ సందర్భంగా పునరుద్ఘాటిస్తోంది' అని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

నిర్వాహకులదే తప్పు

- మెస్సి కార్యక్రమంలో విధ్వంసంపై తృణమూల్, భాజపా ధ్వజం
- బ్లాక్ డే అన్న సీపీఎం



కోల్‌కతా: ఫుట్‌బాల్ స్టార్ మెస్సి కార్యక్రమంలో విధ్వంసానికి నిర్వాహకులదే బాధ్యతని తృణమూల్ కాంగ్రెస్, భాజపా, కాంగ్రెస్ ధ్వజమెత్తాయి. పశ్చిమ బెంగాల్‌కిది బ్లాక్ డే అని సీపీఎం విమర్శించింది. కోల్‌కతాలోని సాల్ట్ లేక్ స్టేడియంలో మెస్సి వచ్చిన సందర్భంగా ఆయన సరిగా కనిపించకపోవడంతో అభిమానుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. వారు స్టేడియంలో భారీ విధ్వంసానికి పాల్పడ్డారు.

నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని తృణమూల్ అధికార ప్రతినిధి కునాల్ ఘోష్ డిమాండు చేశారు. 'నిర్వాహకుల అత్యుత్సాహం, మెస్సితో సెల్ఫీల కోసం చుట్టూ ఉన్నవారు ఎగబడటం కారణంగా ఆయనను అభిమానులు సరిగా చూడలేకపోయారు. దీంతోనే విధ్వంసం చోటుచేసుకుంది. నిర్వాహకులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. సరైన ప్రణాళిక ఎందుకు లేదు. విధ్వంసం ఎందుకు జరిగింది. దీనివల్ల మెస్సి స్టేడియాన్ని వీడాల్సి వచ్చింది. ఆయనకు ముఖ్యమంత్రి మమత బెనర్జీ స్వాగతం పలకలేకపోయారు' అని ఆయన స్పష్టం చేశారు.

కొంత మంది మోసకారులు.. డబ్బు కోసం కక్కుర్తి పడటమే ఈ పరిస్థితికి కారణమని భాజపా రాష్ట్రశాఖ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు సామిక్ భట్టాచార్య విమర్శించారు. ఈ మొత్తం విధ్వంసానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని, తృణమూల్ నేతలు, నిర్వాహకులు స్వీయ ప్రచారం కోసం ఎగబడటంవల్లే దారుణం చోటుచేసుకుందని వ్యాఖ్యానించారు. టికెట్లు కొన్నవారు మెస్సిని చూడలేకపోయారని పేర్కొన్నారు. ఈ మొత్తం రాష్ట్ర ప్రభుత్వ డొల్లతనానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. విధ్వంసానికి తృణమూల్, రాష్ట్ర అధికార యంత్రాంగమే కారణమని కేంద్ర మంత్రి సుకాంత మజుందార్ అభిప్రాయపడ్డారు. క్రీడల మంత్రి అరూప్ బిశ్వాస్, అగ్నిమాపకశాఖ మంత్రి సుజిత్ బసు, నిర్వాహకులు ఈ కార్యక్రమాన్ని డబ్బులు సంపాదించేదిగా మార్చారని ప్రతిపక్ష నేత సువేందు అధికారి విమర్శించారు. టికెట్లు కొన్నవారికి 100 శాతం రిఫండ్ ఇవ్వాలని డిమాండు చేశారు.

✦ ఇదో దారుణ నిర్వహణా వైఫల్యమని, శాంతి భద్రతలను అపహాస్యం చేయడమేనని కాంగ్రెస్ రాష్ట్రశాఖ అధ్యక్షుడు శుభంకర్ సర్కార్ వ్యాఖ్యానించారు. మెస్సి వేదిక అమాయక అభిమానుల నుంచి వేల రూపాయలను వసూలు చేశారని విమర్శించారు. మెస్సిని తృణమూల్ నేతలు, వారి కుటుంబ సభ్యులు చుట్టుముట్టారని, అందువల్లే అభిమానులు చూడలేకపోయారని పేర్కొన్నారు.

✦ ఇదో నిర్వహణా వైఫల్యమని, ఇది పశ్చిమ బెంగాల్‌కు బ్లాక్ డే అని సీపీఎం నేత సుజన్ చక్రవర్తి వ్యాఖ్యానించారు. శాంతి భద్రతలను కాపాడటంలో తృణమూల్ ప్రభుత్వ వైఫల్యమైందని విమర్శించారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో డీగో మారడోనా వచ్చినప్పుడు కంటే ఇప్పుడు దీనిని డబ్బు సంపాదించే కార్యక్రమంగా మలుచుకున్నారని విమర్శించారు.

కొల్హాపురి చెప్పులు రూ.51,000



ఈటీవీ భారత్: మన దేశంలో ప్రసిద్ధి చెందిన కొల్హాపురి చెప్పులను ఇటలీకి చెందిన వినియోగదారుడు ఒకరు రూ.51,000 వెచ్చించి కొనుగోలు చేశారు. ఆయన ప్రత్యేకంగా ఆర్డరు ఇచ్చి తయారు చేయించుకుని ఇటలీకి తెప్పించుకున్నారు. వీటిని కగల్ తాలూకా బంగె గ్రామంలోని కళాకారుడు రాజేంద్ర గోవింద శిందే తయారు చేశారు. ఈ చెప్పులను తాను పూర్తిగా చేతితోనే తయారు చేశానని శిందే తెలిపారు. గత 25 ఏళ్లుగా ఆయన వీటిని తయారు చేస్తున్నారు. ఇటీవల ఇటలీ లగ్జరీ బ్రాండ్ ప్రాడా.. కొల్హాపురి చెప్పులను రూ.84,000కు అమ్ముతానని ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనిపై వివాదం రేగింది. ఈ నేపథ్యంలో ఇటలీ పౌరుడు వాటిని నేరుగా కొల్హాపుర్ నుంచి తెప్పించుకోవడం విశేషం.

చమురు ట్యాంకర్‌ను జప్తు చేసిన ఇరాన్

- అదుపులోకి తీసుకున్న 18 మంది సిబ్బందిలో భారతీయులు

ఈటీవీ భారత్: గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో భారీ పరిమాణంలో చమురును మోసుకెళ్తున్న ఒక నౌకను ఇరాన్ జప్తు చేసింది. అందులో భారతీయులతో పాటు శ్రీలంక, బంగ్లాదేశ్‌లకు చెందిన 18 మంది సిబ్బంది ఉన్నారు. శుక్రవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. 60 లక్షల లీటర్ల చమురును అక్రమంగా తరలిస్తున్నారని, నౌకలోని నావిగేషన్ వ్యవస్థలన్నింటినీ నిలిపివేశారని ఇరాన్ మీడియా వెల్లడించింది. చమురు ఎగుమతి దేశాల్లో ఒకటైన ఇరాన్‌లో చమురు ధరలు అతి తక్కువగా ఉంటాయి. ఇక్కడి నుంచి ఇతర దేశాలకు అక్రమంగా ఎగుమతి చేసి కొందరు భారీ లాభాలు ఆర్జిస్తుండటంతో ఈ కార్యకలాపాలను ఇరాన్ ఎప్పటికప్పుడు అడ్డుకుంటోంది.

అమెరికాలో భారత సంతతి మిలియనీర్ అరెస్టు

ఇంటర్నెట్‌డెస్క్: అమెరికాలోని కాలిఫోర్నియాలో వైన్ తయారీ కేంద్రానికి నిప్పంటించేందుకు ప్రయత్నించడంతో భారత సంతతికి చెందిన ఓ మిలియనీర్‌ను అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 8న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిందితుడు విక్రమ్ బెరి మానసిక ఆరోగ్యానికి సంబంధించిన 'బెటర్‌లైఫ్ వెల్‌నెస్' అనే ఆన్‌లైన్ కంపెనీ వ్యవస్థాపకుడు. విక్రమ్ సారాటోగాలో ఉన్న ఒక వైన్ తయారీ కేంద్రానికి నిప్పు పెట్టేందుకు ప్రయత్నించాడు. సిబ్బంది అడ్డుకునేందుకు ప్రయత్నించగా పారిపోతూ తన కారుతో మరో రెండు కార్లను ఢీకొట్టాడు. కారులో లాక్ చేసుకుని బయటకు వచ్చేందుకు విక్రమ్ నిరాకరించడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు పెప్పర్‌బాల్, స్ప్రేలను ఉపయోగించి అతడిని అదుపులోకి తీసుకొని ఆస్పత్రికి తరలించారు.

క్యాన్సర్‌పై పోరులో ఛార్లెస్ పైచేయి




లండన్: క్యాన్సర్‌పై పోరాటంలో తాను ముఖ్యమైన మైలురాయిని దాటాననీ, ఇక నుంచి వారంవారం చికిత్స మోతాదు తగ్గనున్నదని బ్రిటన్ రాజు ఛార్లెస్ (77) శుక్రవారం జాతినుద్దేశించి చేసిన వీడియో ప్రసంగంలో తెలిపారు. త్వరగా రోగ నిర్ధారణ చేసి, సకాలంలో చికిత్స ప్రారంభించి, వైద్యుల సూచనలను తు.చ తప్పకుండా పాటించడం వల్లనే కొత్త సంవత్సరంలో తన క్యాన్సర్ చికిత్సా కార్యక్రమం బాగా తగ్గనున్నదని వివరించారు. క్యాన్సర్‌ను ముందే గుర్తించడానికి స్క్రీనింగ్ పరీక్షలను ఉపయోగించుకోవాలని సూచించారు. జాతీయ ఆరోగ్య సేవ (ఎన్‌హెచ్‌ఎస్) అందుబాటులోకి తెచ్చిన ఆన్‌లైన్ సాధనం ద్వారా రొమ్ము, పెద్దపేగు, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లను ముందే గుర్తించవచ్చని తెలిపారు. క్యాన్సర్ గురించి 2024 ఫిబ్రవరిలో అధికారికంగా ఆయన వెల్లడించారు. అప్పటినుంచి బహిరంగ కార్యక్రమాల్లో పాల్గొనకపోయినా అంతరంగికంగా దేశాధినేత హోదాలో బాధ్యతలు నిర్వహిస్తూనే ఉన్నారు. ఏ అవయవానికి క్యాన్సర్ వచ్చిందో ఆయన బయటపెట్టలేదు. రాజు వీడియో సందేశం శక్తిమంతమైనదనీ, అది ఎన్నో ప్రాణాలను కాపాడుతుందని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ ప్రశంసించారు.

రూ.92 కోట్ల విలువైన నక్సల్ ఆస్తుల జప్తు

- వారి ఆర్థిక మూలాలు దెబ్బతీశామన్న కేంద్రం

దిల్లీ, రాయ్‌పుర్: వచ్చే ఏడాది నాటికి దేశాన్ని నక్సల్ రహితంగా మార్చాలన్న లక్ష్యంతో వివిధ దర్యాప్తు సంస్థలు సంయుక్తంగా జరిపిన దాడుల్లో రూ.92 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసినట్లు కేంద్రం ప్రకటించింది. ఈ చర్యల ద్వారా నక్సలైట్ల ఆర్థిక మూలాలను దెబ్బతీశామంది. వారి సమాచార నెట్‌వర్క్‌లపై కఠినమైన నియంత్రణ చర్యలు తీసుకోవడంతో 'అర్బన్ నక్సలైట్ల'పై మానసికంగా తీవ్ర ప్రభావం చూపగలిగామని ప్రకటనలో పేర్కొంది. దీని ప్రకారం...జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) రూ.40 కోట్లు, రాష్ట్ర అధికారులు రూ.40 కోట్లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) రూ.12 కోట్ల విలువైన ఆస్తులను జప్తుచేశాయి. 2014లో 126 జిల్లాలు నక్సల్ ప్రభావిత ప్రాంతాలుగా ఉండగా...2025 నాటికి కేవలం 11 జిల్లాలే మిగిలాయి. ఈ ఏడాది సుమారు 317 మంది నక్సలైట్లు అంతమయ్యారు. 862 మంది అరెస్టు కాగా మరో 1,973 మంది తుపాకులను వదిలి లొంగిపోయారు. 2014 వరకు కేవలం 66గా ఉన్న పటిష్ఠ పోలీస్‌స్టేషన్‌ల సంఖ్య పదేళ్లల్లో 586కు పెరిగాయి. అదేవిధంగా నక్సలైట్ల ప్రభావిత ప్రాంతాల్లో కేంద్రం అభివృద్ధి పనులు కూడా చేపట్టింది. రూ.20,815 కోట్ల విలువచేసే 17,589 కి.మీ రోడ్లు వేయించింది. వివిధ ప్రాంతాల్లో బ్యాంకులు, పోస్టాఫీసులు, మొబైల్ టవర్ల నిర్మాణం చేపట్టారు.

అది విషపూరితమైన పాము లాంటిది: షా



నక్సలిజం వల్ల అటు ఆయుధాలు చేతబూనినవారికి గానీ.. ఇటు భద్రతా సిబ్బందికి గానీ ఎలాంటి ప్రయోజనం లేదని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యానించారు. నక్సలిజం విషపూరితమైన పాము వంటిదని, దాన్ని అంతం చేసిన తర్వాతే అభివృద్ధిలో కొత్త అధ్యాయం మొదలవుతుందని స్పష్టంచేశారు. వచ్చే ఐదేళ్లలో ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌ను దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన గిరిజన ప్రాంతంగా తీర్చిదిద్దాలని కేంద్రం నిర్ణయించినట్లు తెలిపారు. జగదల్‌పుర్‌లోని ఇందిరా ప్రియదర్శి స్టేడియంలో నిర్వహించిన 'బస్తర్ ఒలింపిక్స్ 2025' ముగింపు కార్యక్రమంలో అమిత్ షా శనివారం పాల్గొని ప్రసంగించారు.

ఆర్జించే మాజీ అర్ధాంగికి భరణం ఎందుకు?

- అసత్యాలతో వేసే పిటిషన్లను బుట్టదాఖలు చేయాలి
- అలహాబాద్ హైకోర్టు స్పష్టీకరణ



ప్రయాగ్‌రాజ్: స్వీయ ఆదాయాన్ని దాచిపెట్టి, అసత్యాలతో మాజీ భర్త నుంచి భరణం కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించిన ఒక మహిళపై అలహాబాద్ హైకోర్టు అసహనం వ్యక్తంచేసింది. ఆమెకు భరణం చెల్లించాలంటూ దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును కొట్టేసింది. తన పోషణకు అవసరమైన సొమ్మును ఆమె ఆర్జిస్తున్నారని పేర్కొంది. ఈ మేరకు ఆమె మాజీ భర్త అంకిత్ సాహో దాఖలు చేసిన క్రిమినల్ రివిజన్ పిటిషన్‌కు అనుకూలంగా తీర్పు చెప్పింది.

"తాను పోస్టు గ్రాడ్యుయేట్‌నని, వెబ్ డిజైనింగ్‌లో ప్రావీణ్యం ఉందని ఆమె దిగువ కోర్టులో పేర్కొన్నారు. ఒక కంపెనీలో సీనియర్ సేల్స్ కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్నానని, నెలకు రూ.34వేలు ఆర్జిస్తున్నానని కూడా ఆమె చెప్పారు. తాను నెలకు రూ.36వేలు సంపాదిస్తున్నట్లు క్రాస్ ఎగ్జామినేషన్‌లో తెలిపారు. ఎలాంటి బాధ్యతలు లేని ఒక మహిళకు ఆ మొత్తం చాలా స్వల్పమని చెప్పలేం. మరోవైపు పిటిషనర్ (మాజీ భర్త)కు వృద్ధులైన తల్లిదండ్రుల బాగోగులను చూసుకోవడం సహా అనేక బాధ్యతలు ఉన్నాయి" అని హైకోర్టు ధర్మాసనం పేర్కొంది. స్వీయ పోషణ ఖర్చులను ఆమె భరించగలరని తెలిపింది. ఆమె తొలుత తన అఫిడవిట్‌లో పూర్తి వాస్తవాలను వెల్లడించలేదని మాజీ భర్త తరఫు న్యాయవాది పేర్కొన్నారు. "తాను నిరక్షరాస్యురాలినని, నిరుద్యోగినని ఆమె చెప్పుకొన్నారు. అయితే మాజీ భర్త దాఖలు చేసిన పత్రాన్ని ఆమెకు చూపి.. ప్రశ్నించినప్పుడు ఆమె తన ఆదాయాన్ని వెల్లడించారు. దీన్నిబట్టి ఆమె దిగువ కోర్టును నిజాయతీతో ఆశ్రయించలేదని స్పష్టమవుతోంది" అని వివరించారు. సత్యం పట్ల ఎలాంటి గౌరవంలేని, వాస్తవాలను విస్మరించే కక్షిదారుల కేసులను న్యాయస్థానాలు బుట్టదాఖలు చేయాల్సిన అవసరం ఉందని హైకోర్టు తన తీర్పులో పేర్కొంది.

పెత్తందారీ నేతృత్వ పోకడలకు కాలం చెల్లు

- సదస్సులో వక్తల విశ్లేషణ

దిల్లీ: అనిశ్చితి, అస్థిరతలు రాజ్యం చేస్తున్న ప్రస్తుత పరిణామశీల ప్రపంచంలో నాయకత్వం ఎలా ఉండాలన్న అంశంపై ఎల్ఎం థాపర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సంస్థ సదస్సు నిర్వహించింది. ఈ సంస్థకు చెందిన డేరాబస్సి క్యాంపస్‌లో జరిగిన సదస్సులో పలువురు విద్యావేత్తలు, ప్రసిద్ధి పొందిన పారిశ్రామిక వృత్తి నిపుణులు పాల్గొన్నారు. పరిణామశీలమైన ప్రస్తుత ప్రపంచంలో నిరంతరమైన, గతిశీలమైన మార్పులు చేపట్టడం ద్వారా వివిధ రంగాల నాయకత్వం ఎలాంటి మార్పులకు లోనవుతోందన్న అంశంపై ఈ సమావేశంలో విస్తృత చర్చ జరిగింది. సాధికారికత అందించే నేతృత్వ వైఖరులు, వ్యవస్థాగత పునరుద్ధరణ సామర్థ్యం, బాధ్యతాయుతమైన మానవ కేంద్రితమైన డిజిటల్ అభివృద్ధి అనే అంశాలపై జరిగిన చర్చల్లో పరిశ్రమ నిపుణులు మూడు బృందాలుగా ఏర్పడి తమ అభిప్రాయాలను సభికులతో పంచుకున్నారు. ఈ సంభాషణలు ప్రేక్షకులకు విజ్ఞానాన్ని పంచడంతోపాటు ప్రస్తుత వాతావరణంలో నేతృత్వం ఎలా ఉండాలన్న అంశంపై స్ఫూర్తిదాయక విషయాలు తెలియజేశాయి. ఈ కార్యక్రమంలో ఎల్ఎం థాపర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సంస్థ డైరెక్టర్ అండ్ డీన్, ప్రొఫెసర్ డి.పి.గోయల్ స్వాగతోపన్యాసం చేసి సదస్సును లాంఛనంగా ప్రారంభించారు. తొలి బృంద చర్చ నియంత్రణ నుంచి సాధికారికత దిశగా భవిష్యత్ నేతృత్వం అనే అంశంపై జరిగింది. ఇందులో పలు ప్రసిద్ధ సంస్థల మానవ వనరుల నాయకులు పాల్గొన్నారు. ఆధునిక నాయకత్వం పెత్తందారీ పోకడలను తోసిరాజని నమ్మకం, స్వతంత్రత, సాధికారికత అందించే దిశగా సాగుతున్న తీరును విశ్లేషించారు. అనిశ్చిత పరిస్థితుల్లో పునరుద్ధరణశీలమైన సంస్థల నిర్మాణం చేసేదెలా అన్న అంశంపై రెండో బృంద చర్చ జరిగింది. బాధ్యతాయుతమైన, మానవ కేంద్రితమైన డిజిటల్ పరిణామంపై మూడో బృంద చర్చ నిర్వహించారు. ఈ చర్చల్ని ప్రొఫెసర్ సందీప్ గోయల్, డాక్టర్ ఆస్థా థాపర్, సిద్ధక్‌ప్రీత్ సింగ్‌లు స్ఫూర్తిదాయక మార్గంలో నడిపించారు.

వెనెజువెలా నుంచి నార్వేకు మారువేషంలో మచాడో!



ఇంటర్నెట్ డెస్క్: వెనెజువెలా విపక్ష నేత మరియా కొరీనా మచాడో అజ్ఞాతం వీడి ఇటీవల బయట కనిపించి అందర్నీ ఆశ్చర్యపరిచారు. ప్రతిష్ఠాత్మక నోబెల్ అవార్డుల ప్రదాన కార్యక్రమానికి హాజరు కానప్పటికీ.. నార్వేలోని ఓ హోటల్ వద్ద ప్రత్యక్షమయ్యారు. దీంతో వెనెజువెలా నుంచి ఆమె ఎలా వచ్చారనే విషయం చర్చనీయాంశమైంది. ఆమెను తరలించేందుకు అమెరికాకు చెందిన మాజీ సైనిక నిపుణులు 'ఆపరేషన్ గోల్డెన్ డైనమైట్' పేరుతో ఓ రహస్య ఆపరేషన్ చేపట్టినట్లు వెల్లడైంది. గ్రే బుల్ రెస్క్యూ ఫౌండేషన్ సంస్థ చీఫ్ బ్రియాన్ స్టెర్న్ బృందం మచాడోకు విగ్గు తొడిగించి, వేషం మార్చి తరలించింది. చేపల పడవను ఉపయోగించి, కల్లోలంగా ఉన్న సముద్రంలో...అత్యంత భయానక వాతావరణంలో రెండు పడవలను మార్చి కరేబియన్ తీరానికి చేర్చినట్లు తెలిసింది. సురక్షిత ప్రాంతానికి చేరుకున్న అనంతరం ప్రత్యేక విమానంలో గమ్యానికి చేర్చారు. దీనికి మూడు రోజుల సమయం పట్టినట్లు సమాచారం. మచాడోను తీసుకెళ్లేందుకు గతంలోనూ ప్రయత్నాలు జరిగినట్లు తెలిసింది. చివరకు సముద్ర మార్గాన్ని ఎంచుకున్నారు. కారకస్ భద్రతా దళాల కంటపడకుండా ఉండేందుకు ఇదే ఉత్తమ మార్గంగా భావించామని స్టెర్న్ వెల్లడించారు.

నోబెల్ గ్రహీత నర్గెస్ మొహమ్మది అరెస్ట్

- విడుదల చేయాలని కమిటీ డిమాండ్

దుబాయ్: నోబెల్ శాంతి పురస్కార గ్రహీత నర్గెస్ మొహమ్మదిని ఇరాన్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ విషయాన్ని ఆమె మద్దతుదారులు ధ్రువీకరించారు. ఇటీవల అనుమానాస్పద స్థితిలో మరణించిన మానవ హక్కుల న్యాయవాది స్మారక చిహ్నం వద్ద ఆమెను అదుపులోకి తీసుకున్నట్లు ఆమె పేరుతో ఉన్న స్వచ్ఛంద సంస్థ తెలిపింది. ఇరాన్ నుంచి అధికార ప్రకటన వెలువడలేదు. మొహమ్మది అరెస్టు క్రూరమైనదంటూ నార్వే నోబెల్ కమిటీ తీవ్రంగా ఖండించింది. మొహమ్మది ఎక్కడున్నారో స్పష్టం చేయాలని కమిటీ ఛైర్మన్ జోర్గన్ వాట్నే ఫ్రైడ్నెస్ డిమాండు చేశారు.

పాక్‌కు సమాచారం చేరవేత.. వాయుసేన విశ్రాంత ఉద్యోగి అరెస్టు

తేజ్‌పుర్: పాకిస్థాన్ గూఢచార ఏజెంట్లతో సంబంధాలున్నాయనే ఆరోపణలపై అస్సాంలోని సోనిత్‌పుర్ జిల్లాలో విశ్రాంత వైమానిక దళ ఉద్యోగిని అరెస్టు చేసినట్లు పోలీసులు శనివారం తెలిపారు. సామాజిక మాధ్యమాల ద్వారా పాక్‌లో కొందరితో నిందితుడు సున్నితమైన పత్రాలు, సమాచారాన్ని పంచుకున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని అదనపు ఎస్పీ హరిచరణ్ భూమిజ్ తెలిపారు. నిందితుడి లాప్‌టాప్, సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొంత డేటాను తొలగించినప్పటికీ, ఆ పరికరాలను ఫోరెన్సిక్ పరీక్షకు పంపినట్లు తెలిపారు.

ఇన్‌టాంజిబుల్ కల్చరల్ హెరిటేజ్‌పై ముగిసిన యునెస్కో సమావేశం

దిల్లీ: వెలుగుల పండగ దీపావళికి ప్రపంచ ఇన్‌టాంజిబుల్ కల్చరల్ హెరిటేజ్ (ఐసీహెచ్) సంపదగా ప్రత్యేక గుర్తింపునిచ్చిన యునెస్కో సమావేశం శనివారం ముగిసింది. ఇక్కడి ఎర్రకోటలో వారం రోజులు జరిగిన ఈ సమావేశంలో వివిధ దేశాలకు చెందిన 67 వారసత్వ అంశాలకు కొత్తగా గుర్తింపునిచ్చారు. ఈ విషయంపై అంతర ప్రభుత్వ కమిటీ (ఐజీసీ) వచ్చే సంవత్సరం డిసెంబరులో చైనాలోని జియామెన్ నగరంలో సమావేశం అవుతుందని, యునెస్కో సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ముగింపు సమావేశం ఎర్రకోట సముదాయంలోని ప్లీనరీ హాల్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక పెవిలియన్‌లో నిర్వహించారు. మొగల్ కాలంనాటి కోటలో చారిత్రక పరిసరాల్లో ప్రపంచ వారసత్వ సంబంధ సమావేశం నిర్వహించడంపై యునెస్కోకు చెందిన ఫుమికో ఒహనాటా హర్షం వ్యక్తం చేశారు. ఐజీసీ తదుపరి సమావేశం చైనాలో జరుగుతుందని ఆమె అన్నారు. వారం రోజులు సాగిన ఈ సమావేశంలో దీపావళితోపాటు ఇరాన్‌కు చెందిన పర్షియన్ వాస్తు కళలో ఉపయోగించే అద్దాల కూర్పునకు, యూఏఈకి చెందిన సాంప్రదాయిక కళకు, స్విట్జర్లాండ్‌కు చెందిన యోడలింగ్ తదితరాలకు ప్రపంచ ఇన్‌టాంజిబుల్ కల్చరల్ హెరిటేజ్‌గా గుర్తింపు లభించింది.

పెను భూకంపం వస్తే.. ఆ రెండు నదుల విలీనం

- కాన్పుర్ ఐఐటీ శాస్త్రవేత్తల పరిశోధన

ఈటీవీ భారత్: హిమాలయ ప్రాంతానికి పెను భూకంపాల ముప్పు పొంచి ఉంది. భారత దేశ పరిధిలోని ఈ ప్రాంతంలో కొన్నేళ్లుగా అలాంటి భీతావహ ప్రకంపనలు రాలేదు. దీంతో ఆ విపత్తు ఎప్పుడైనా చోటుచేసుకోవచ్చన్న ఆందోళన శాస్త్రవేత్తల్లో ఉంది. ఈ నేపథ్యంలో అనేక దేహ్రాదూన్‌లోని వాడియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ జియాలజీ సహా పలు సంస్థలు దీనిపై పరిశోధనలు చేస్తున్నాయి. జావెద్ మాలిక్ నేతృత్వంలోని కాన్పుర్ ఐఐటీలోని భూవిజ్ఞాన శాస్త్ర విభాగానికి చెందిన శాస్త్రవేత్తలు ఉత్తరాఖండ్‌లో పెను భూకంపానికి ఉన్న ఆస్కారంపై దృష్టిసారించారు. ఒకవేళ భూమిలోని కలధుంగి ఫాల్ట్‌లైన్ వెంబడి ఇలాంటి విపత్తు సంభవిస్తే అక్కడి భౌగోళికాంశాలు మారిపోతాయని జావెద్ చెప్పారు. దీనివల్ల దబ్కా, కోసి నదుల విలీనం సంభవిస్తుందని ఆయన 'ఈటీవీ భారత్'కు వివరించారు. భారత్, టిబెట్ మధ్య ఉన్న భూఫలకాల సరిహద్దును హిమాలయన్ ఫ్రాంటల్ థ్రస్టుగా పిలుస్తారు. దీని నుంచి వచ్చిన ఒక చీలికను కలధుంగి ఫాల్ట్‌లైన్‌గా పేర్కొంటారు. భవిష్యత్‌లో దీని విస్తృతి పెరుగుతుందని జావెద్ వివరించారు. ఇండో-గ్యాంజెటిక్ మైదానంలోని నాగరికత.. నదులు ఎండిపోవడం, వేరేచోటుకు మళ్లడం వల్ల ప్రభావితమైనట్లు తెలిపారు. హిమాలయ భూఫలకాల కదలికల ప్రభావమే దీనికి కారణమని పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఆ ప్రాంతంలో పెద్ద భూకంపం వస్తే దబ్కా, కోసి నదులు ఒక్కటయ్యే అవకాశం ఉందని వివరించారు. ఇలాంటి పరిణామం వల్ల ప్రజలపై పడే ప్రభావం గురించి అర్థం చేసుకోవడానికి మరింత పరిశోధన అవసరమన్నారు.

ఏకీకృత న్యాయ విధానం అవశ్యం

- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్



జైసల్మేర్: దేశంలో ఏకీకృత న్యాయ విధానాన్ని రూపొందించాల్సిన ఆవశ్యకత ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. వివిధ కోర్టుల మధ్య సమన్వయానికి, విధానాల అన్వయానికి సాంకేతికత ఉపయోగపడుతుందని సూచించారు. శనివారం రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో జరిగిన పశ్చిమ మండల ప్రాంతీయ సదస్సులో ఆయన కీలకోపన్యాసం చేశారు. భౌతిక అడ్డంకులను ప్రస్తుత సాంకేతికత తొలగించి, ఐక్యతకు వీలు కల్పిస్తోందని చెప్పారు. ఒకప్పుడు పాలనాపరమైన సౌలభ్యం కోసమే అక్కరకు వచ్చిన సాంకేతికత.. ఇప్పుడు 'చట్టం ముందు అందరూ సమానమే' అన్న ఆదర్శాన్ని బలపరిచే రాజ్యాంగపరమైన ఉపకరణంగా ఎదిగిందని సీజేఐ పేర్కొన్నారు. ఆలస్యమవుతున్న కేసులను డిజిటల్ సాధనాల సాయంతో సమీక్షించవచ్చని, సున్నితమైన కేసులు త్వరితగతిన విచారణకు వచ్చేలా చేయవచ్చని చెప్పారు. చాలా సందర్భాల్లో న్యాయస్థానాల పరిభాష అర్థంకాక పిటిషనర్లు తమకు ఏ మేరకు న్యాయం దక్కిందో కూడా తెలుసుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐ ఆధారిత రీసెర్చ్ అసిస్టెంట్‌లు, ఈ-కోర్టులు, నేషనల్ జ్యుడీషియల్ డేటా గ్రిడ్ మొదలైన వాటిని అందుబాటులోకి తీసుకొస్తే న్యాయవ్యవస్థను ఏకీకృతం చేయొచ్చని నొక్కిచెప్పారు. సాంకేతికతను తీసుకువస్తున్నప్పుడు అది వ్యవస్థను సరళతరం చేయాలేకానీ.. గందరగోళపరచకూడదని సీజేఐ అభిప్రాయపడ్డారు.

పేర్లను మార్చడంలో మోదీ ప్రభుత్వం దిట్ట: కాంగ్రెస్

దిల్లీ: 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' పేరును 'పూజ్య బాపు గ్రామీణ్ రోజ్‌గార్ యోజన'గా మారుస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని కాంగ్రెస్ తప్పుబట్టింది. పథకాల పేర్లను మార్చడంలో మోదీ ప్రభుత్వం ఆరితేరిందని విమర్శించింది. ఉపాధి హామీ పథకం పేరు మార్చడం వల్ల ప్రజలకు ఒనగూరే ప్రయోజనమేమిటని పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ ప్రశ్నించారు. ఈ చర్యలతో డబ్బు ఖర్చు తప్ప మరేమీ ఉపయోగం లేదన్నారు. ఉపాధి హామీ పథకం పేరు మార్చితే.. సంబంధిత కార్యాలయాలు, వస్తువులపై ఇప్పటికే ముద్రించిన పేరు మార్చాల్సి వస్తుందని, దీనికి చాలాడబ్బు ఖర్చు చేయాల్సి వస్తుందని చెప్పారు. మహాత్మాగాంధీ పేరులో ఏ లోపముందని ఇలాంటి చర్యలు తీసుకున్నారంటూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ప్రశ్నించారు. "నిర్మల్ భారత్ అభియాన్‌ను స్వచ్ఛభారత్ అభియాన్‌గా మార్చేశారు. గ్రామీణ ఎల్పీజీ పంపిణీ కార్యక్రమాన్ని 'ఉజ్వల' పేరుతో తీసుకొచ్చారు. పేర్లు మార్చడంలో, రీ-బ్రాండింగ్‌లో వారు నిపుణులు. వారికి నెహ్రూ అంటేనే ద్వేషం అనుకున్నాం కానీ మహాత్మా గాంధీపై కూడా అయిష్టత ఉన్నట్లుంది" అని దుయ్యబట్టారు. మోదీ ఏ పేరు మార్చినా ఈ పథకాన్ని తీసుకువచ్చింది మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీ అన్న విషయం ప్రజలకు తెలుసని మరో ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అన్నారు.

అంబులెన్స్‌లో ఆక్సిజన్ సిలిండర్ ఖాళీ.. శిశువు మృతి

జైపుర్: రాజస్థాన్‌లోని ఓ ప్రైవేటు అంబులెన్స్‌లో ఆక్సిజన్ సిలిండర్ ఖాళీ అవ్వడంతో ఒక్క రోజు వయసు గల నవజాత శిశువు మృతి చెందింది. ఈ ఘటన శుక్రవారం బస్సి సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్న శిశువును భరత్‌పుర్ జిల్లాలోని బయనా ఆసుపత్రి నుంచి జైపుర్‌లోని ఎస్ఎంఎస్ ఆసుపత్రికి తీసుకువెళ్లాలని వైద్యులు సూచించారు. దాంతో శిశువు తండ్రి, మరో బంధువు కలిసి ఓ ప్రైవేటు అంబులెన్స్‌లో బాబును తరలిస్తున్నారు. బస్సిలో సమీపంలో ఆక్సిజన్ సిలిండర్ ఖాళీ అవుతుండటాన్ని తండ్రి గమనించాడు. అంబులెన్స్ డ్రైవర్ వారిని బస్సిలోని సమీప ఆసుపత్రికి తరలించారు. అప్పటికే శిశువు మరణించినట్లు వైద్యులు తెలిపారు.

సిరియాలో మెరుపుదాడి.. ఇద్దరు అమెరికా సైనికుల మృతి

డమాస్కస్: సెంట్రల్ సిరియాలో శనివారం 'ఇస్లామిక్ స్టేట్ గ్రూప్' నిర్వహించిన మెరుపుదాడిలో అమెరికా సైన్యానికి చెందిన ఇద్దరు, అమెరికా పౌరుడొకరు ప్రాణాలు కోల్పోయారు. సిరియా అధ్యక్షుడు బషర్ అస్సద్ సుమారు ఏడాది క్రితం పదవీచ్యుతుడయ్యారు. ఆ తర్వాత అమెరికా దళాలకు ప్రాణనష్టం వాటిల్లడం ఇదే ప్రథమం. సైనికుల కుటుంబ సభ్యుల గౌరవార్థం.. వారికి అధికారికంగా సమాచారం ఇచ్చిన 24 గంటలవరకు అమరుల పేర్లను గోప్యంగా ఉంచుతామని సెంట్రల్ కమాండ్ 'ఎక్స్'లో తెలిపింది. అయితే ఈ దాడికి ప్రతీకారం తీర్చుకుంటామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు



ముంబయిలోని మీరా రోడ్ ప్రాంతంలో అగ్నిప్రమాదం కారణంగా కాలి బూడిదైన ఫర్నీచర్ మార్కెట్

నక్కపల్లి క్లస్టర్‌కు అనుసంధాన రహదారి విస్తరణకు ఆమోదం

ఈనాడు, అమరావతి: జాతీయ రహదారి-16 నుంచి నక్కపల్లి క్లస్టర్‌కు రూ.36 కోట్లతో నిర్మిస్తున్న రెండు వరుసల సమాంతరానికి రూ.67.20 కోట్లతో నాలుగు వరుసలుగా విస్తరించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వు జారీచేసింది. నక్కపల్లి క్లస్టర్‌లో ఆర్సెలార్ మిత్తల్ నిప్పన్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కానున్న నేపథ్యంలో.. ఈ రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించేందుకు అనుమతించారు.

మధురవాడ ఐటీ హిల్‌లో బీటీ రోడ్ నిర్మాణానికి అనుమతి

విశాఖపట్నంలోని మధురవాడ ఐటీ హిల్-3లో బీటీ రోడ్, రిటైనింగ్ గోడ నిర్మాణం తదితరాలకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వు జారీచేసింది. ఈ రహదారి నిర్మాణానికి ఏపీఐఐసీ పిలిచిన టెండరులో నిర్ణయించిన దానికంటే తక్కువగా రూ.41.80 కోట్లతో కోట్‌చేసిన గుత్తేదారుకు పనులు అప్పగించేందుకు అనుమతించింది.

స్వాతంత్ర్య సమరయోధుడి స్థలాన్ని ఆక్రమించిన వైకాపా నాయకులు

తెదేపా కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: స్వాతంత్ర్య సమరయోధుడైన తన తాత యల్లయ్యరెడ్డికి ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని ఆయన మరణానంతరం స్థానిక వైకాపా నేతలు ఆక్రమించారని, తర్వాత విక్రయించేశారని నర్సా వెంకటరమణ వాపోయారు. న్యాయం చేయాలని కోరుతూ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో తరలివచ్చిన బాధితుల నుంచి కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఏపీఎస్‌డీసీ ఛైర్మన్ దీపక్‌రెడ్డి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. డ్వాక్రా గ్రూపుల డబ్బులు దుర్వినియోగం చేసిన రిసోర్స్ పర్సన్‌పై చర్యలు తీసుకోవాలని విజయనగరం జిల్లా నెల్లిమర్లకు చెందిన సీత కోరారు. భూమి విక్రయిస్తానని రూ.ఆరు లక్షలు తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన పుల్లయ్యనాయుడు ఫిర్యాదు చేశారు.

బ్యాలెట్ పత్రాలు దెబ్బతిన్నా, అందకపోయినా దరఖాస్తు చేసుకోండి

- ఏపీ ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి దినేష్‌కుమార్

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికల్లో భాగంగా అర్హులైన ఓటర్లందరికీ పోస్టు ద్వారా బ్యాలెట్ పత్రాలు పంపించామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి దినేష్‌కుమార్ తెలిపారు. పోస్టు ద్వారా పంపిన పత్రాలు చిరునామాకు చేరే క్రమంలో దెబ్బతిన్నా, కొన్ని పత్రాలు ఒక కవర్‌లో లేకపోయినా ఆయా ఓటర్లు డూప్లికేట్ పత్రాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా ఓటర్లు కౌన్సిల్‌లో నమోదైన రిజిస్ట్రేషన్ ఈ- మెయిల్ ఐడీ నుంచి ఈ నెల 16 లోపు రిటర్నింగ్ అధికారికి మెయిల్ (appcreturningofficer@gmail.com) ద్వారా డిక్లరేషన్ పంపాలని సూచించారు. దెబ్బతిని వినియోగించలేని పత్రాలు ఉంటే తప్పనిసరిగా వాటిని రిటర్నింగ్ అధికారికి పంపాలని స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారమే డూప్లికేట్ ఓటింగ్ పత్రాలు జారీ చేస్తామని చెప్పారు.

రక్షక దళాలకూ ఉందో విశ్వవిద్యాలయం

- గుజరాత్‌లోని ఆర్ఆర్‌యూలో అనేక ప్రత్యేకతలు
- 11 ప్రత్యేక పాఠశాలలతో విభిన్నం

(గుజరాత్ నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి)



రాష్ట్రీయ రక్షా విశ్వవిద్యాలయం

రక్షక దళాలకూ ఒక విశ్వవిద్యాలయం ఉందని మీకు తెలుసా? అక్కడ 11 ప్రత్యేక పాఠశాలలు భద్రతాదళాలను మరింత నైపుణ్యంతో తీర్చిదిద్దుతున్నాయి. పరిశోధనలను ప్రోత్సహించే ఇంక్యుబేషన్ సెంటర్లు మరో ప్రత్యేకత. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో రాష్ట్రీయ రక్షా విశ్వవిద్యాలయం (ఆర్ఆర్‌యూ) అనేక వైవిధ్యాలతో అలరారుతోంది. ఆర్ఆర్‌యూ జాతీయ ప్రాముఖ్యమున్న సంస్థ. కేంద్ర హోం శాఖ ఆధ్వర్యంలో జాతీయ భద్రత, పోలీసింగ్ రంగాల్లో మారుతున్న సవాళ్లను ఎదుర్కొనేలా విద్య-పరిశోధన-శిక్షణవ్యవస్థను అభివృద్ధిచేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న బలమైన నెట్‌వర్క్‌ను ఉపయోగించుకుంటోంది. దేశ అవసరాలు, అంచనాలు, ఆకాంక్షలకు ప్రతిస్పందించే సామర్థ్యాలను సాధించడానికి ఇది అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ప్రత్యేక విధానాలను అవలంబిస్తోంది.

11 విభాగాలలో కొన్నింటిని చూస్తే..

ఆధునిక సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్న కొత్త తరం నిపుణులను తయారుచేసేలా అంతర్గత భద్రత, స్మార్ట్ పోలీసింగ్ పాఠశాల (ఎస్ఐఎస్ఎస్‌పీ) ఏర్పాటైంది. అంతర్జాతీయ సహకారం, భద్రత, వ్యూహాత్మక భాషల పాఠశాల (ఎస్ఐసీఎస్ఎస్ఎల్) అంతర్జాతీయ భద్రత, దౌత్యం, వ్యూహాత్మక వ్యవహారాల్లో నాయకత్వాన్ని మరింత బలపడేలా కృషి చేస్తోంది. సమాచార సాంకేతిక, కృత్రిమ మేధస్సు, సైబర్ సెక్యూరిటీ పాఠశాల (ఎస్ఐటీఏఐసీఎస్) సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ ఫోరెన్సిక్స్, కృత్రిమ మేధస్సు లాంటి కీలక రంగాలలో ముందడుగు వేస్తోంది. అంతర్గత భద్రత, రక్షణ, వ్యూహాత్మక అధ్యయనాల పాఠశాల, దేశంలో జాతీయ భద్రతా విద్య, పరిశోధన, శిక్షణలో అగ్రగామిగా నిలుస్తోంది. భౌతిక విద్య, క్రీడల పాఠశాల, భారత్ ఒలింపిక్ పరిశోధన విద్యాకేంద్రం.... క్రీడా శాస్త్రం, కోచింగ్ రంగాలలో విద్య, శిక్షణ , పరిశోధనను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ డైరెక్టరేట్ పోలీస్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఇస్తోంది. ప్రవర్తన శాస్త్రాలే, ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్ స్కూల్, అప్లైడ్ సైన్సెస్, ఇంజినీరింగ్, టెక్నాలజీ స్కూల్... ఎన్‌సీసీ, పోలీస్ మార్షల్ మ్యూజిక్ బ్యాండ్ స్కూల్... ఇంటిగ్రేటెడ్ కోస్టల్, మారిటైమ్ సెక్యూరిటీ స్టడీస్ స్కూల్ ఇలా ప్రత్యేకతలతో కూడిన పాఠశాలలు నడుస్తున్నాయి.

ఇదీ ప్రత్యేకత..

ఆర్ఆర్‌యూ నిర్వహణలో 11 ప్రత్యేక పాఠశాలలు ప్రధాన భూమిక పోషిస్తున్నాయి. అన్ని విభాగాలలో విద్యార్థులు, ఇంక్యుబేషన్, పరిశోధనలను ప్రోత్సహించే ఆర్ఆర్‌యూ ఏఐసీ (అటల్ ఇంక్యుబేషన్ సెంటర్). . లాంటి విశేషాలున్నాయి. ఈ విభిన్న విద్యాపరిశోధన యూనిట్లు ఆధునిక భద్రతా సవాళ్లను ఎదుర్కోవడంలో ప్రధాన భూమిక పోషిస్తున్నాయి. ఈ విశ్వవిద్యాలయం భావసారూప్యత కలిగిన దేశాలతో కలిసి సీనియర్ భద్రత, పోలీసు అధికారులను అనుసంధానం చేస్తోంది. ఐరాస శాంతి పరిరక్షక దళాలు, ఐరాస పోలీస్, ఇంటర్‌పోల్, అంతర్జాతీయ మారిటైమ్ సంస్థ, అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ యూనియన్ తదితర అంతర్జాతీయ సంస్థలు సహా పలు ఏజెన్సీలతో కలిసి పనిచేస్తోంది.

పరకామణి చోరీ కేసు నిందితుడికి

అన్ని విధాలుగా సహకరించారు

- అప్పటి సీఎంఓ నుంచి పోలీసులపై ఒత్తిడి తెచ్చింది ఎవరు?
- తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య

ఈనాడు, అమరావతి: శ్రీవారి పరకామణిలో చోరీకి పాల్పడ్డ నిందితుడు రవికుమార్‌కు వైకాపా ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలూ అండగా నిలిచాయని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. పరకామణిలో చోరీ కేసు గురించి వార్తలు రాసిన మీడియా ప్రతినిధులపై కేసు పెట్టి..గన్‌తో పోలీసులు ఎందుకు బెదిరించారో అప్పటి ఎస్పీ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2023లో చోటు చేసుకున్న పరిణామాలు, పాత్రికేయులకు వచ్చిన బెదిరింపు ఫోన్ కాల్స్‌పై ఆయన పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. "పాత్రికేయుల్ని బెదిరించి వారి నుంచి పరకామణిలో చోరీ కేసుకు సంబంధించిన వివరాలు, వీడియోలు తీసుకోవాలని అప్పటి సీఐ చంద్రశేఖర్ చూశారు. నిందితుడికి అనుకూలంగా వ్యవహరించమని పోలీసులపై అప్పటి సీఎం కార్యాలయం నుంచి ఎవరు ఒత్తిడి తెచ్చారు? వైకాపా ప్రభుత్వంలో సీఎంఓలో కీలకంగా వ్యవహరించిన అధికారులు ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి పాత్ర ఇందులో ఏమైనా ఉందా?'' అని వర్ల రామయ్య నిలదీశారు.

పర్యాటక ఆస్తుల లీజుపై ముందడుగు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థకు చెందిన 22 హోటళ్లు, రిసార్టులు, ఇతర ఆస్తుల లీజుకు బిడ్‌ల మదింపు కోసం ప్రత్యేక కమిటీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీ ఈ కమిటీకి ఛైర్మన్‌గా, రాష్ట్ర పర్యాటక సంస్థ సీఈవో కో-ఛైర్మన్‌గా ఉంటారు. పర్యాటకాభివృద్ధి సంస్థ ఈడీని కన్వీనర్‌గా, మరో అయిదుగురిని సభ్యులుగా ప్రభుత్వం నియమించింది. పర్యాటకాభివృద్ధి సంస్థకు చెందిన ఆస్తుల నిర్వహణను లీజుపై ప్రైవేటు సంస్థలకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

హోటళ్లకు స్థలాలు.. ప్రోత్సాహకాలు: విశాఖలోని మధురవాడలో మెగ్లాన్ లీజర్స్, ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థకు ఐదెకరాల భూమితో పాటు ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు ఉత్తర్వులిచ్చింది. ఈ సంస్థ రూ.348.12 కోట్లతో ఫైవ్‌స్టార్ హోటల్‌ను నిర్మించనుంది. విశాఖలోని ఎండాడలో పీవీఆర్ హాస్పిటాలిటీస్ ఆధ్వర్యంలో ఫైవ్‌స్టార్ హోటల్ నిర్మాణానికి మూడెకరాలతో పాటు రాయితీలు ఇవ్వనుంది. బాపట్ల మండలం పాండురంగాపురం బీచ్‌లో యాగంటి ఎస్టేట్స్ ఫైవ్‌స్టార్ బీచ్ రిసార్ట్ ఏర్పాటుకు రాయితీలు ఇచ్చింది. తిరుపతిలో నాంది సంస్థకు 4 స్టార్ హోటల్ నిర్మాణం కోసం రాయితీలు ఇవ్వాలని వేర్వేరు జీవోల్లో ఆదేశాలిచ్చింది.

నీటి ప్రాజెక్టుల సమస్యలను పరిష్కరించండి

కేంద్రానికి తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేఖ

ఈనాడు, హైదరాబాద్: కృష్ణా, గోదావరి బేసిన్లలో ప్రాజెక్టుల అనుమతులకు సంబంధించి దీర్ఘకాలంగా ఉన్న పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. పలుసార్లు విజ్ఞప్తులు చేసినా, లేఖలు రాసినా ఈ సమస్యలు పరిష్కారం కావడం లేదని పేర్కొంది. ఈ మేరకు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ కార్యదర్శి వి.ఎల్.కాంతారావుకు లేఖ రాశారు. ఈ లేఖను నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్‌బొజ్జా, కాంతారావుకు అందజేసి వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించి ప్రాజెక్టుల పూర్తికి సహకరించాలని కోరారు.

ఒక్క రోజులో 1.46 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు ఓ రికార్డు

ఎమ్మెల్యే సాంబశివరావు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో ఒక్క రోజే 3.24 లక్షల మంది రైతుల నుంచి 1.46 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం, వారి ఖాతాల్లో నేరుగా రూ.4,609 కోట్లు జమ చేయడం ఓ రికార్డని తెదేపా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. దళారుల చేతుల్లో కర్షకులు మోసపోకుండా కూటమి ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో సమర్థంగా ధాన్యం కొనుగోళ్లు చేసిందని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రోత్సాహక మండలిలోని నిర్ణయాలపై

ఉత్తర్వుల జారీ

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 4న పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు సంబంధించి శనివారం వేర్వేరు ఉత్తర్వులు జారీచేసింది. అవి..

✦ విశాఖపట్నంలోని మధురవాడ హిల్ నం.4లో 30 ఎకరాల్లో యూడీఎల్ 1, 2, 3 ప్లాట్లను సత్వ డెవలపర్స్‌కు ఎకరా రూ.1.5 కోట్ల చొప్పున ఆగస్టులో ప్రభుత్వం కేటాయించింది. ఆ మొత్తాన్ని అక్టోబరు 5లోపు ఆ సంస్థ చెల్లించాలి. మరో 60 రోజులు గడువు పెంచాలంటూ సంస్థ చేసిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకొని పెంచారు.

✦ అనకాపల్లి జిల్లా రాంబిల్లి క్లస్టర్ ఫేజ్-2లో బ్లూజెట్ హెల్త్‌కేర్ లిమిటెడ్‌కు కేటాయించిన 102.48 ఎకరాల్లో.. వాణిజ్య ఉత్పత్తి తేదీ సర్టిఫికెట్ జారీ అయిన రెండేళ్లలోపు 78.32 ఎకరాల సేల్‌డీడ్ అమలుకు ప్రభుత్వం అనుమతించింది.

✦ బాపట్ల జిల్లా కొరిసపాడు మండలం పిచికలగుడిపాడ వద్ద ఎమర్జ్ గ్లాస్ ఇండస్ట్రీస్ ప్లాంట్ విస్తరణకు పారిశ్రామిక అభివృద్ధి పాలసీ కింద ప్రోత్సాహకాలను పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వు జారీచేసింది.

✦ నెల్లూరు జిల్లాలోని ఇఫ్కో సెజ్‌లో గాయత్రి రెన్యువబుల్ ఫ్యూయల్స్ ఇండస్ట్రీస్ ఏర్పాటుచేస్తున్న ఇథనాల్ ప్లాంట్‌కు, తిరుపతి జిల్లా రేణిగుంటలో మల్లాది డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్ లిమిటెడ్‌కు, ఏలూరు జిల్లాలోని రమణ్ సింగ్స్ గ్లోబల్ ఫుడ్‌పార్క్‌కి, కృష్ణాజిల్లాలో శ్రీవెంకటేశ్వర బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటు చేస్తున్న 600 టీపీడీ స్టార్చ్ తయారీ యూనిట్‌కు, బాపట్ల జిల్లా వలపర్లలో జెడ్‌ఈఐటీ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటుచేస్తున్న సోలార్ పీవీ మాడ్యూల్ తయారీ యూనిట్‌కు ఎర్లీ బర్డ్ ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది.

✦ అనకాపల్లి జిల్లా రాంబిల్లిలోని రెన్యూ ఫొటోవోల్టాయిక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు టైలర్‌మేడ్ ప్రోత్సాహకాలు చెల్లించేందుకు ప్రభుత్వం ఉత్తర్వు జారీచేసింది.

✦ అసోసియేషన్ ఆఫ్ లేడీ ఆంత్రప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా అనకాపల్లి జిల్లా కోడూరులోని 31.77 ఎకరాల్లో ప్రైవేట్ ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేసేందుకు ప్లగ్ అండ్ ప్లే ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పాలసీ కింద అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వు జారీచేసింది.

✦ కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం గుట్టపాడు క్లస్టర్‌లో విరూపాక్ష ఆర్గానిక్స్ లిమిటెడ్ ఫార్మస్యూటికల్ అండ్ ఆర్గానిక్ కెమికల్ ప్లాంట్ ఏర్పాటుకు 100.23 ఎకరాలు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వు జారీచేసింది.

✦ అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలోని రముక గ్లోబల్ ఎకోవర్క్స్ లిమిటెడ్‌కు కేటాయించిన 45 ఎకరాలకు ఎకరా రూ.35లక్షల ధరతో డబ్బులు చెల్లించేందుకు వచ్చేఏడాది జనవరి 24 వరకు గడువు పొడిగిస్తూ ఉత్తర్వు జారీచేసింది.

✦ నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం చాచర్లపాడులోని 2,776.23 ఎకరాల్లో ఇఫ్కో కిసాన్ సెజ్ లిమిటెడ్ సంస్థ ప్రైవేట్ లార్జ్ ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధికి అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వు జారీచేసింది. ఈ పార్క్ ప్రగతిని రెండేళ్లకోసారి ఇఫ్కో కిసాన్ సెజ్, ఏపీఐఐసీ సంయుక్తంగా సమీక్షిస్తాయి.

✦ కర్నూలులోని గొండిపర్ల పారిశ్రామిక ప్రాంతంలో టీజీవీ ఎస్ఆర్ఏఏసీ లిమిటెడ్ కాస్టిక్ సోడా, దాని సంబంధిత ఉత్పత్తులు, క్యాప్టివ్ సోలార్ పవర్ జనరేషన్ విస్తరణకు టైలర్‌మేడ్ ప్రోత్సాహకాలు చెల్లించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది.

✦ కృష్ణపట్నం ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్ ఏర్పాటుచేస్తున్న మల్టీ ప్రొడక్ట్ ఇండస్ట్రియల్ పార్క్ ప్రాజెక్టుకు సంబంధించి ఈవోటీ ఫీజు, రెస్టొరేషన్ ఫీజును రద్దుచేస్తూ ప్రభుత్వ ఉత్తర్వు జారీచేసింది.

✦ నెల్లూరు జిల్లా చిల్లకూరులో మాస్ ఫ్యాబ్రిక్ పార్క్ లిమిటెడ్ టెక్స్‌టైల్ నుంచి మల్టీ ప్రొడక్ట్ ఇండస్ట్రియల్ పార్క్‌గా మార్చేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వు జారీచేసింది.

సంక్రాంతికి అదనంగా 41 ప్రత్యేక రైళ్లు

నేటి ఉదయం 8 గంటల నుంచి ముందస్తు బుకింగ్

ఈనాడు, హైదరాబాద్: సంక్రాంతి పండక్కి తెలుగు రాష్ట్రాల మధ్య అదనంగా 41 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు శనివారం ప్రకటించింది. ఈ రైళ్లకు సంబంధించిన ముందస్తు రిజర్వేషన్లు నేటి (ఆదివారం) ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమవుతాయని ద.మ.రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ తెలిపారు. ఎక్కువ రైళ్లు సికింద్రాబాద్, వికారాబాద్, లింగంపల్లి రైల్వేస్టేషన్ల నుంచి కాకినాడకు, నర్సాపూర్‌కు, తిరుపతికి ఉన్నాయి.

భారత్‌పై 50% సుంకాల రద్దు కోరుతూ తీర్మానం

- ప్రవేశపెట్టిన ముగ్గురు చట్టసభ సభ్యులు

న్యూయార్క్, వాషింగ్టన్: భారత్‌పై ట్రంప్ ప్రభుత్వం విధించిన 50శాతం సుంకాలకు ముగింపు పలకాలని కోరుతూ అమెరికా కాంగ్రెస్‌లో ముగ్గురు సభ్యులు శుక్రవారం తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. బాధ్యతారహిత సుంకాల వ్యూహంవల్ల ఆ దేశంతో కీలక భాగస్వామ్యం బలహీనపడుతోందని వారు అభిప్రాయపడ్డారు. నార్త్ కరోలినాకు చెందిన డెబోరా రాస్, టెక్సాస్‌కు చెందిన మార్క్ వీసే, ఇల్లినోయీకి చెందిన రాజా కృష్ణమూర్తి ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. వీరికి చట్టసభల్లో అత్యంత ప్రభావం చూపగల నేతలుగా పేరుంది. అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం (ఐఈఈపీఏ) కింద జాతీయ అత్యవసర పరిస్థితి పేరుతో భారత్‌పై ట్రంప్ విధించిన సుంకాలను ఈ తీర్మానం రద్దు చేస్తుంది. ఆగస్టు 27 నుంచి ట్రంప్ విధించిన 25శాతం సెకండరీ సుంకాలనూ రద్దు చేస్తుంది.

'ఈ సుంకాలు.. భద్రత, ప్రయోజనాల విషయంలో అమెరికాకు మేలు చేయకపోగా.. సరఫరా వ్యవస్థను దెబ్బతీసి అమెరికా కార్మికులను హాని చేస్తాయి. వినియోగదారులపై ధరల భారాన్ని మోపుతాయి. ఈ సుంకాలను రద్దు చేస్తే అమెరికా, భారత్‌ల మధ్య ఆర్థిక, భద్రతా పరమైన అవసరాలు తీరతాయి' అని రాజా కృష్ణమూర్తి స్పష్టం చేశారు.

ఎప్‌స్టీన్ ఎస్టేట్ ఫొటోల విడుదల

- ట్రంప్, క్లింటన్, ఆండ్రూల చిత్రాలను బయటపెట్టిన డెమోక్రాట్లు



వాషింగ్టన్: సెక్స్ ట్రాఫికింగ్‌కు పాల్పడి జైలు శిక్ష అనుభవిస్తూ అనుమానాస్పద స్థితిలో మరణించిన జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు చెందిన ఎస్టేట్ ఫొటోలను శుక్రవారం హౌస్ డెమోక్రాట్లు బయటపెట్టారు. అందులో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్, బ్రిటన్ మాజీ యువరాజు ఆండ్రూ చిత్రాలున్నాయి. తొలుత 19 ఫొటోలను బయటపెట్టిన డెమోక్రాట్లు సాయంత్రానికి మరో 70 బయటపెట్టారు. ఎప్‌స్టీన్ ఎస్టేట్‌కు సంబంధించి మొత్తం 95,000 ఫొటోలు హౌస్ ఓవర్‌సైట్ కమిటీకి అందాయి. విడుదల చేసిన చిత్రాల్లో ఎప్‌స్టీన్ స్నానం చేస్తున్న చిత్రాలూ ఉన్నాయి.

■ ఆరుగురు మహిళలతో ట్రంప్ ఉన్న ఫొటో విడుదలైంది. అది బ్లాక్ అండ్ వైట్‌లో ఉంది. మహిళల ముఖాలు కనిపించకుండా బ్లాక్ చేశారు.

■ ఇంకా ఈ ఫొటోల్లో.. మితవాద రాజకీయ నేత స్టీవ్ బానన్, బిలియనీర్లు రిచర్డ్ బ్రాన్సన్, బిల్ గేట్స్, సినీ నిర్మాత, దర్శకుడు వుడీ అలెన్, ఆర్థికశాఖ మాజీ మంత్రి లారీ సమ్మర్స్, లా ప్రొఫెసర్ అలన్ డెర్షోవిజ్ ఉన్నారు.

■ ఎంపిక చేసిన ఫొటోలనే డెమోక్రాట్లు కావాలని బయటపెడుతున్నారని శ్వేతసౌధం అధికార ప్రతినిధి అబిగెయిల్ జాక్సన్ స్పష్టం చేశారు. తప్పుడు ప్రచారం చేయడానికి డెమోక్రటిక్ పార్టీ చేస్తున్న మాయోపాయం అని విమర్శించారు.

■ అయితే డెమోక్రాట్లు విడుదల చేసిన ఫొటోల్లో చాలావరకు ఇప్పటికే ప్రచారంలో ఉన్నాయని, ఎప్‌స్టీన్ ఫైళ్లను బయటపెట్టాలని ట్రంప్‌పై ఒత్తిడి తేవడానికే ఈ చర్యకు పాల్పడినట్లు భావిస్తున్నారు. వచ్చే వారంలోగా ట్రంప్ ఆ ఫైళ్లను బయటపెట్టాల్సి ఉంది.

■ ఈ ఫొటోలపై ట్రంప్‌ను మీడియా ప్రశ్నించగా.. అది పెద్ద విషయమేం కాదని వ్యాఖ్యానించారు.

జైపుర్‌లో ప్రత్యేక బ్యాంకు.. శ్రీరామ నామాలే డిపాజిట్లు



ఈటీవీ భారత్: బ్యాంకు అనగానే ఆర్థిక లావాదేవీలే గుర్తొస్తాయి. ఇంకా బ్లడ్ బ్యాంకు, ఐ బ్యాంకు, ఫుడ్ బ్యాంకు వంటివి చూశాం. రాజస్థాన్‌లోని జైపుర్‌లో అరుదైన మరో బ్యాంకు ఉంది. డబ్బుకు బదులుగా శ్రీరామ నామాలే డిపాజిట్లుగా స్వీకరించడం దీని ప్రత్యేకత. నగరంలోని గోవింద్ దేవ్‌జీ ఆలయ ప్రాంగణంలో 'శ్రీరామ్ నామ్ ధన్ సంగ్రహ్ బ్యాంక్' పేరిట ఇది కొనసాగుతోంది. బాలకృష్ణ పురోహిత్ అనే వ్యక్తి దీన్ని ఏర్పాటుచేసి, 1987 నుంచి నిర్వహిస్తున్నారు. శ్రీరామ నామాలు రాసిన పుస్తకాలను ఈ బ్యాంకులో డిపాజిట్ చేస్తారు. ఇప్పటివరకు 140 బిలియన్ల రామ నామాలు డిపాజిట్ అయ్యాయని నిర్వాహకులు తెలిపారు. ఇక్కడికి వచ్చిన వారి పేరిట బ్యాంక్ పాస్‌బుక్ మాదిరిగా ఒక 'మంత్ర' ఖాతా ఉంటుంది. అందులో ఖాతాదారు పేరు, ఇప్పటివరకు అతడి ఖాతాలో జరిగిన జమ వివరాలు పొందుపరుస్తారు. అద్దె భవనంలో కొనసాగుతున్న ఈ బ్యాంకు కోసం పుష్కర్‌లో శాశ్వత భవన నిర్మాణం చేపడుతున్నారు.

మూడేళ్ల నుంచే పిల్లల్ని బడికి పంపించాలి

రాజ్యసభ సభ్యురాలు సుధామూర్తి

ఇంటర్నెట్ డెస్క్: మూడేళ్ల వయసు నుంచే పిల్లలను బడికి పంపించాలని రాజ్యసభ సభ్యురాలు సుధామూర్తి అన్నారు. దానికి తగ్గట్టుగా రాజ్యాంగ సవరణ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాజ్యాంగం ప్రకారం ప్రస్తుతం 6-14 ఏళ్ల వయసు వారికి ప్రభుత్వం ఉచిత విద్య అందించాల్సి ఉంటుందని, మూడు నుంచి ఆరేళ్ల మధ్య వయసున్న పిల్లలకు కూడా ఈ హక్కు ఉండాలని ఆమె పార్లమెంటు వేదికగా కోరారు.



పిల్లల మెదడులో 85 శాతం ఎదుగుదల ఆరేళ్లకు ముందే జరుగుతుందని, అందుకే ఈ వయసు కీలకమని వివరించారు. చిన్నపిల్లలున్న తల్లిదండ్రులకు సుధామూర్తి మరికొన్ని సూచనలు చేశారు. 'ప్రీ ప్రైమరీ విద్యపై తల్లిదండ్రులు, ప్రభుత్వం దృష్టిపెట్టాలి. బ్రష్ చేసుకోవడం, స్వయంగా అల్పాహారం తినడం వంటివి చిన్న వయసులోనే నేర్పించాలి. పాఠశాలకు వెళ్లే అలవాటు త్వరగా ప్రారంభం కావాలి. ఇదంతా చదువు ఒత్తిడి పెంచడం కోసం కాదు. వారికంటూ ఒక దినచర్య ప్రారంభమవుతుంది. క్రమశిక్షణ అలవాటవుతుంది. చిన్నారి జీవితంలో ఈ ప్రారంభ రోజులే.. నేర్చుకోవడం, ఆలోచనా శక్తి, ఈ ప్రపంచంతో మమేకమవడం వంటి వాటిని తీర్చిదిద్దుతాయి. చిన్న వయసులో నేర్చుకున్న ఈ అలవాట్లు తర్వాత శాశ్వతంగా ఉండిపోతాయి. పిల్లలు మన భవిష్యత్తు. వారు ఉదయించే సూర్యుడివంటివారు. ఈ ప్రారంభ విద్య వారి జీవితానికి ఉపయోగపడుతుంది' అని ఆమె సూచనలు చేశారు.

ఈ వారంలోనే పార్లమెంటు ముందుకు

వికసిత భారత్ శిక్షా అధీక్షణ్ బిల్లు

దిల్లీ: దేశంలోని ఉన్నత విద్యా సంస్థలు అన్నింటినీ ఒకే నియంత్రణ సంస్థ పరిధిలోకి తీసుకొచ్చేందుకు ఉద్దేశించిన 'వికసిత భారత్ శిక్షా అధీక్షణ్ బిల్లు' ప్రస్తుత శీతాకాల సమావేశాల్లోనే పార్లమెంటు ముందుకు రానుందని అధికారులు తెలిపారు. సమావేశాలు ఈ నెల 19తో ముగియనున్నందున ఈ వారంలోనే బిల్లును కేంద్రం ప్రవేశపెట్టనుంది. బిల్లుకు శుక్రవారమే కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. తొలుత దీనిని 'భారత ఉన్నత విద్యా కమిషన్ బిల్లు'గా వ్యవహరించి నప్పటికీ ఆ పేరును మార్చారు. ఇప్పటివరకూ విడివిడిగా ఉన్న యూజీసీ, అఖిల భారత సాంకేతిక విద్యా మండలి, జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి స్థానంలో కొత్త నియంత్రణ సంస్థ ఏర్పడనుంది.

ట్రంప్ చెప్పినా.. ఆగలే!

- థాయ్‌లాండ్, కంబోడియాల మధ్య కొనసాగుతున్న కాల్పులు


కంబోడియాతో ఉద్రిక్తతల నేపథ్యంలో థాయ్‌లాండ్‌లోని కాంతరలక్ జిల్లాలో ఓ భవనంలో ఎగసిపడుతున్న మంటలు

వాషింగ్టన్: థాయ్‌లాండ్, కంబోడియా అధినేతలతో తాను మాట్లాడానని, కాల్పుల విరమణకు రెండు దేశాలు అంగీకరించాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం ప్రకటించినా.. ఆ దేశాల సరిహద్దుల్లో కాల్పుల మోత మాత్రం ఆగలేదు. శనివారం ఉదయం నుంచే ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడం ప్రారంభించారు. కంబోడియా తమ దళాలను పూర్తిగా ఉపసంహరించుకొని, మందుపాతరలను తొలగిస్తేనే కాల్పుల విరమణ సాధ్యమవుతుందని తాను ట్రంప్‌నకు స్పష్టం చేసినట్లు థాయ్ ప్రధాని అనుతిన్ తెలిపారు. "మా ప్రజలకు, మా భూభాగానికి ముప్పు లేదని భావించేవరకు సైనిక చర్యలను కొనసాగిస్తూనే ఉంటాం'' అని ఆయన పేర్కొన్నారు. థాయ్ ఫైటర్ జెట్లు తమ భూభాగంలోకి ప్రవేశించి ఓ హోటల్, ఓ వంతెనపై దాడి చేశాయని కంబోడియా రక్షణశాఖ ప్రకటించింది. కంబోడియా రాకెట్ దాడుల్లో తమ పౌరులు చాలా మంది గాయపడ్డారని థాయ్‌లాండ్ తెలిపింది. గత ఆరు రోజుల నుంచి సరిహద్దుల్లో ప్రారంభమైన కాల్పుల్లో ఇరు దేశాలకు చెందిన 21 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. 7 లక్షల మంది సురక్షిత ప్రాంతాలకు తరలాల్సి వచ్చింది. గత వారం ట్రంప్ మాట్లాడుతూ, ఒక్క ఫోన్‌కాల్‌తో థాయ్‌లాండ్, కంబోడియా మధ్య పోరును ఆపుతానని పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి ఇరు దేశాల ప్రధానులతో మాట్లాడారు. అక్టోబరులో తన ముందు సంతకం చేసిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని కొనసాగించడానికి ఇరు దేశాలు అంగీకరించాయని పేర్కొన్నారు. ట్రంప్ ఆ ప్రకటన చేసిన కొన్ని గంటలకే సరిహద్దులు ఉద్రిక్తంగా మారాయి.

గోవాలో రెండు నైట్ క్లబ్బుల మూసివేత

పణజీ: గోవాలో రెండు నైట్ క్లబ్బులను మూసివేశారు. ఈనెల 6న బిర్చ్ బై రోమియో లేన్ నైట్ క్లబ్‌లో అగ్ని ప్రమాదం సంభవించి 25 మంది ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో అధికారులు నైట్ క్లబ్‌లపై చర్యలకు ఉపక్రమించారు. ఉత్తర గోవాలోని వగటోర్ బీచ్‌లో ఉన్న సీఓ2 గోవా అనే క్లబ్బును శనివారం మూసివేయగా, రెండు రోజుల క్రితం వగటోర్ ప్రాంతంలోనే ఉన్న గోయా క్లబ్బుపై సైతం ఇదే చర్య తీసుకున్నారు.

జగన్ పెట్టిన బకాయిల్లో రూ.40 వేల కోట్లు తీర్చాం

తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో వివిధ వర్గాలకు బకాయి పడిన రూ.1.40 లక్షల కోట్ల మొత్తంలో కూటమి ప్రభుత్వం ఇప్పటికే రూ.40 వేల కోట్లు చెల్లించిందని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. కేంద్ర ప్రాయోజిత పథకాలకు రూ.10వేల కోట్ల మ్యాచింగ్ గ్రాంట్‌ను ఆ ప్రభుత్వం చెల్లించకపోవడంతో అవన్నీ నిలిచిపోయాయని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం ఆ నిధుల్ని చెల్లించి పథకాల్ని పునరుద్ధరించిందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఉక్రెయిన్‌పై రష్యా దాడులు

- అంధకారంలో పది లక్షలకు పైగా ఇళ్లు


రష్యా క్షిపణి దాడితో ఉక్రెయిన్‌లోని ఒడెసాలో ఓ భవనంలో చెలరేగిన మంటలు

మాస్కో: ఉక్రెయిన్‌ను రష్యా దాడులు అంధకారంలోకి నెడుతున్నాయి. విద్యుత్ గ్రిడ్లు, సబ్‌స్టేషన్లు, ఇంధన మౌలిక సదుపాయాలే లక్ష్యంగా మాస్కో శుక్రవారం భారీగా విరుచుకుపడింది. 450 డ్రోన్లు, 30 క్షిపణులు ప్రయోగించింది. దీంతో చాలా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దాదాపు 10 లక్షలకు పైగా ఇళ్లు అంధకారంలో మగ్గుతున్నాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. "గత రాత్రి జరిగిన దాడులతో వేల ఇళ్లకు విద్యుత్ నిలిచిపోయింది. ఒడెసా, ఖేర్సన్, మైకోలైవ్, సుమి, చెర్నిహైవ్ ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి'' అని పేర్కొన్నారు. దాడుల్లో ఇద్దరు పౌరులు కూడా మృతి చెందినట్లు తెలిపారు.

సవరణ పేరుతో ఉపాధి చట్టాన్ని నీరుగారుస్తున్నారు: సీపీఎం

ఈనాడు, అమరావతి: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని ఒక సాధారణ సంక్షేమ పథకంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అందరూ ప్రతిఘటించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. "ప్రస్తుత వ్యవసాయ సంక్షోభంలో కనీసం 200 పని దినాలు కల్పించాలి. రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలి. కేంద్ర కేబినెట్ ఆమోదించిన సవరణ బిల్లు పేరు మార్చడానికి మాత్రమే ఉద్దేశించింది కాదు. చట్టాన్ని పథకంగా మారుస్తున్నారు'' అని ఆరోపించారు.


శివరాజ్ పాటిల్‌కు కన్నీటి వీడ్కోలు

లాతూర్: లోక్‌సభ మాజీ స్పీకర్, కేంద్ర మాజీ మంత్రి, దిగ్గజ కాంగ్రెస్ నేత శివరాజ్ పాటిల్ అంత్యక్రియలు శనివారం మహారాష్ట్రలోని లాతూర్ జిల్లాలో ప్రభుత్వ లాంఛనాలతో జరిగాయి. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రక్షణ శాఖ సహాయమంత్రి సంజయ్ సేఠ్, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్, కర్ణాటక మంత్రి ఈశ్వర్ ఖండ్రే తదితరులు అంత్యక్రియలకు హాజరై కన్నీటి వీడ్కోలు పలికారు. లింగాయత్ సామాజిక వర్గానికి చెందిన శివరాజ్ పాటిల్ పార్థివ దేహాన్ని కూర్చొని ఉన్న స్థితిలో లాతూర్‌కు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న వరవంతి గ్రామంలో ఖననం చేశారు. మనిషి మరణించాక ఆత్మ తక్షణమే శివైక్యం చెందుతుందని, శరీరం నుంచి ఆత్మను విడుదల చేసేందుకు ఉద్దేశించిన ఇతర కర్మకాండలు అనవసరమని లింగాయతులు విశ్వసిస్తారు. లాతూర్ పురపాలక సంఘ సభ్యునిగా రాజకీయ జీవితం ప్రారంభించిన పాటిల్ దాదాపు 50 సంవత్సరాల పాటు సాగిన తన సుదీర్ఘ పయనంలో లోక్‌సభ స్పీకర్, గవర్నర్, కేంద్ర మంత్రి వంటి అనేక కీలక పదవులను అలంకరించి దేశానికి సేవలందించారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఆయన పార్థివ దేహంపై పుష్పమాల ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు.

కశ్మీర్‌లో దాదాపు 200 మంది ఉగ్రవాద సహాయకుల అరెస్ట్

శ్రీనగర్: జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదులతో సంబంధం ఉన్న దాదాపు 200 మంది అనుమానితులను పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. వీరు ఉగ్రవాదులకు రవాణా, డబ్బు, మౌలిక సదుపాయాల సంబంధ సహాయాలు అందించడంతో పాటు వారికి ఆశ్రయం కల్పిస్తున్నారని అధికారులు తెలిపారు. ఉగ్రవాద సహాయకుల వ్యవస్థకు వ్యతిరేకంగా భద్రతా బలగాలతో కలిసి పోలీసులు ఈ ఆపరేషన్‌ను చేపట్టారు.

రాజ్యాంగ పరిషత్ ఏర్పాటును తొలిసారిగా 1942లో క్రిప్స్ మిషన్ ప్రతిపాదించింది. దీని ఆవశ్యకత గురించి ఎం.ఎన్ రాయ్ మొదటిసారిగా పేర్కొన్నారు. కేబినెట్ మిషన్ సూచనల మేరకు 1946లో రాజ్యాంగ పరిషత్‌ను ఏర్పాటు చేశారు. ఈ పరిషత్ ఏర్పాటు చేసిన కమిటీల్లో అత్యంత ముఖ్యమైంది ముసాయిదా కమిటీ. దీన్ని 1947 ఆగస్టు 29న ఏర్పాటు చేశారు. నూతన రాజ్యాంగానికి ఒక ముసాయిదా (డ్రాఫ్ట్) రాసే ముఖ్యమైన పనిని ఈ కమిటీకి అప్పగించారు. అందుకే ఈ కమిటీని డ్రాఫ్టింగ్ కమిటీ అని కూడా అంటారు.




ఆశయాల సజీవ సాధనమే.. భారత రాజ్యాంగం

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ పాలిటీ

రాజ్యాంగ రచనా కమిటీ/ ముసాయిదా కమిటీ



భారతదేశ మౌలిక శాసనంగా పరిగణించే భారత రాజ్యాంగం ప్రపంచ రాజ్యాంగాలన్నింటిలో మహోన్నతమైంది. అత్యంత సుదీర్ఘమైన మన రాజ్యాంగంలో భారతదేశ మౌలిక రాజకీయ వ్యవస్థల నిర్మాణం, అధికారాలు, వాటి మధ్య ఉన్న సంబంధాలను విపులంగా విశ్లేషించారు. బ్రిటిష్ వలసవాద పాలనా చట్టాలతో ప్రభావితమైన రాజ్యాంగ నిర్మాతలు భారత ప్రజల బహుళ అవసరాలు తీర్చేలా భారత రాజ్యాంగాన్ని రూపొందించారని జవహర్‌లాల్ నెహ్రూ అభిప్రాయపడ్డారు. డా. బీఆర్ అంబేడ్కర్ అభిప్రాయం ప్రకారం భారతదేశం సాధారణ పరిస్థితుల్లో సమాఖ్యగా, అత్యవసర పరిస్థితుల్లో ఏకకేంద్ర ప్రభుత్వంలా పని చేస్తుంది.

✦ భారత రాజ్యాంగం ప్రజాస్వామిక స్వభావాన్ని కలిగి ఉంటుంది. దేశంలో అధికారానికి మూలం ప్రజలే కాబట్టి వారి అభిప్రాయాలకు అనుగుణంగా రాజ్యాంగాన్ని రూపొందించారు. భారత రాజ్యాంగం దేశ ప్రజల లక్ష్యాలు, ఆశయాల సాధన కోసం సజీవ సాధనంలా ఉపయోగపడుతుంది.

✦ రాజ్యాంగ సభ తన కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించడానికి పలు కమిటీలను నియమించింది. దీనిలో ప్రముఖమైంది డ్రాఫ్టింగ్ కమిటీ.

✦ మొత్తం ఏడుగురు సభ్యులతో ఈ కమిటీని ఏర్పాటు చేశారు.

- డా. బీఆర్ అంబేడ్కర్ (ఛైర్మన్)
- ఎన్.గోపాలస్వామి అయ్యంగార్
- అల్లాడి కృష్ణస్వామి అయ్యర్
- డా. కె.ఎం.మున్షీ
- సయ్యద్ మహ్మద్ సాదుల్లా
- బి.ఎల్.మిట్టల్ (అనారోగ్యంతో రాజీనామా చేయగా, ఈయన స్థానంలో ఎన్.మాధవరావును నియమించారు.)
- డి.పి.ఖైతాన్ (ఈయన మరణించడంతో టి.టి.కృష్ణమాచారిని నియమించారు.)
- ముసాయిదా కమిటీ సభ్యుల్లో న్యాయ విద్యను అభ్యసించని వారు టి.టి.కృష్ణమాచారి మాత్రమే.

✦ ఈ కమిటీ ఇతర కమిటీల ప్రతిపాదనలు పరిశీలించిన అనంతరం భారత రాజ్యాంగానికి మొదటి ముసాయిదాను తయారుచేసింది. దీన్ని 1948 ఫిబ్రవరిలో ప్రచురించారు. ఈ బిల్లుపై చర్చించడానికి, సవరణలు ప్రతిపాదించడానికి ప్రజలకు 8 నెలల సమయం ఇచ్చారు.

✦ ముసాయిదా కమిటీ ప్రజల వ్యాఖ్యానాలు, విమర్శలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని రెండో ముసాయిదాని తయారుచేసి, 1948 అక్టోబరులో ప్రచురించింది.

మొదటి పఠనం:

డా. బీఆర్ అంబేడ్కర్ 1948 నవంబరు 4న రాజ్యాంగం చివరి ముసాయిదాను రాజ్యాంగ నిర్మాణ సభలో ప్రవేశపెట్టారు. దీనిపై సభలో 5 రోజుల సాధారణ చర్చ జరిగింది.

రెండో పఠనం:

1948 నవంబరు 15న రెండో పఠనం మొదలైంది. ఇది 1949 అక్టోబరు 17 వరకు కొనసాగింది. ఈ దశలో 7653 సవరణలు ప్రతిపాదించగా, 2473 ప్రతిపాదనలను రాజ్యాంగ సభ పరిశీలించి, చర్చించి, పరిష్కరించింది.

మూడో పఠనం:

1949 నవంబరు 14న మూడో పఠనం మొదలైంది. 'The Constitution as settled by the Assembly be passed' అనే తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ముసాయిదా రాజ్యాంగ తీర్మానాన్ని 1949 నవంబరు 26న ఆమోదించారు. మొత్తం 299 మంది సభ్యుల్లో సభాధ్యక్షుడితో పాటు 284 మంది తమ అనుకూలతను తెలియజేస్తూ సంతకాలు చేశారు. మిగతా 15 మంది సభకు హాజరుకాలేదు.

❖ భారతదేశ ప్రజలు రాజ్యాంగ సభలో రాజ్యాంగాన్ని అంగీకరించి, శాసనం చేసి తమకు తాము సమర్పించుకున్న తేదీ ఇదేనని రాజ్యాంగ ప్రవేశికలో పేర్కొన్నారు.

❖ 1949 నవంబరు 26న ఆమోదం పొందిన రాజ్యాంగంలో 395 ప్రకరణలు, 8 షెడ్యూళ్లు, 22 భాగాలు ఉన్నాయి.

❖ రాజ్యాంగ దినోత్సవాన్ని మొదటిసారిగా 2015 నవంబరు 26న నిర్వహించారు.



నాటి న్యాయశాఖ మంత్రి డా. బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగ నిర్మాణ సభలో ముసాయిదాని ప్రదర్శించి, చర్చల్లో ప్రముఖపాత్ర వహించారు. అందుకే ఈయన భారత రాజ్యాంగ పితామహుడిగా, ఆధునిక మనువుగా పేరొందారు.

తక్షణమే అమల్లోకి వచ్చిన అంశాలు

1949 నవంబరు 26న రాజ్యాంగాన్ని ఆమోదించినప్పుడు కింది అంశాలు వెంటనే అమల్లోకి వచ్చాయి. అవి:

- పౌరసత్వం
- రాష్ట్రపతి ఎన్నిక
- స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక
- ప్రమాణ స్వీకారాలు
- ప్రొవిజినల్ పార్లమెంట్
- రాజ్యాంగంలోని మిగిలిన అంశాలు 1950 జనవరి 26 నుంచి అమల్లోకి వచ్చాయి. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన నాటి నుంచి భారత స్వాతంత్ర్య చట్టం-1947, భారత ప్రభుత్వ చట్టం-1935 రద్దయ్యాయి. అయితే ది అబాలిషన్ ఆఫ్ ప్రీవీ కౌన్సిల్ జ్యూరిస్‌డిక్షన్ యాక్ట్-1949 మాత్రం కొనసాగింది.

వివిధ దేశాల రాజ్యాంగాలు - గ్రహించిన అంశాలు

భారత ప్రభుత్వ చట్టం–1935: అత్యవసర అధికారాలు, కేంద్ర-రాష్ట్ర సంబంధాలు, గవర్నర్ విచక్షణాధికారాలు, పబ్లిక్ సర్వీస్ కమిషన్లు, పరిపాలన విషయాలు, సమాఖ్య వ్యవస్థ, రాష్ట్రపతి పాలనా ఆమోదం కోసం రిజర్వ్ అయిన బిల్లును గవర్నర్ ప్రెసిడెంట్ ఆమోదం కోసం పంపడం.

బ్రిటన్ రాజ్యాంగం: పార్లమెంటరీ విధానం, ఏక పౌరసత్వం, సమ న్యాయపాలన, ఎన్నికల యంత్రాంగం, కేబినెట్ ప్రభుత్వం, స్పీకర్, డిప్యూటీ స్పీకర్ వ్యవస్థ, ఏకీకృత న్యాయవ్యవస్థ, న్యాయ వ్యవస్థ నిర్మాణం, శాసన నిర్మాణ ప్రక్రియ, కంప్ట్రోలర్ & ఆడిటర్ జనరల్, అటార్నీ జనరల్, రిట్‌ల జారీ, రాష్ట్రపతి నామమాత్రపు అధికారిగా వ్యవహరించడం.

అమెరికా రాజ్యాంగం: రాజ్యాంగ ప్రవేశిక, లిఖిత రాజ్యాంగం, ప్రాథమిక హక్కులు, రాజ్యాంగ ఆధిక్యత, న్యాయ సమీక్ష, స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన న్యాయ వ్యవస్థ, రాష్ట్రపతి పేరుపై పరిపాలన నిర్వహించడం, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులను తొలగించే విధానం, ఉపరాష్ట్రపతి పదవి.

కెనడా రాజ్యాంగం: కేంద్ర ప్రభుత్వానికి అవశిష్టాధికారాలు ఇవ్వడం, గవర్నర్‌ని కేంద్ర ప్రభుత్వం నియమించడం, బలమైన కేంద్ర ప్రభుత్వం, సమాఖ్య వ్యవస్థ పనితీరు, సుప్రీంకోర్టు సలహా పరిధి.

ఫ్రాన్స్: స్వేచ్ఛ, సమానత్వం, గణతంత్ర విధానం, ప్రొటెం స్పీకర్ పదవి.

రష్యా: ప్రాథమిక విధులు, ప్రవేశికలో సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం, సామ్యవాద సూత్రాలు.

ఆస్ట్రేలియా: ఉమ్మడి జాబితా, ఉభయ సభల సంయుక్త సమావేశం, భాషలకు సంబంధించిన అంశాలు, స్వేచ్ఛా వాణిజ్య వ్యాపార చట్టాలు, అంతర్రాష్ట్ర వ్యాపార వాణిజ్య చట్టాలు.

దక్షిణాఫ్రికా: రాజ్యాంగ సవరణ పద్ధతులు, రాజ్యసభ సభ్యుల ఎన్నిక విధానం.

ఐర్లాండ్: ఆదేశిక సూత్రాలు, రాష్ట్రపతి ఎన్నిక పద్ధతి, రాష్ట్రపతి రాజ్యసభకు 12 మంది సభ్యులను నామినేట్ చేయడం.

జపాన్: చట్టంతో నిర్ధారించే పద్ధతి, జీవించే హక్కు.

జర్మనీ: అత్యవసర పరిస్థితి కాలంలో అనుసరించే పద్ధతులు, ప్రాథమిక హక్కులను సస్పెండ్ చేయడం.

నార్వే: ఎగువ, దిగువ సభ సభ్యులను ఎన్నుకునే విధానం.

ఫ్రెంచ్: ప్రవేశికలోని స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం.



రచయిత

డా. వి.కుమారస్వామి
విషయ నిపుణులు

Word of the Day 860

Upbraid

Telugu meaning: నిందించు, కోపగించు

English meaning: The word upbraid (అప్‌బ్రెయిడ్) is a verb that means to scold someone or criticize them severely for their faults or mistakes.

Synonyms: Scold, Rebuke; ***Antonyms:*** Praise, Compliment

Usage: **1.** The manager did not hesitate to upbraid the team for missing the deadline despite repeated reminders.

2. She upbraided her brother for his careless attitude, hoping he would take his responsibilities more seriously.

Current Affairs



Supriya Sahu has won the UN Environment Programme's 2025 Champions of the Earth award. She is one of the climate forerunner tackling some of the most urgent challenges. She is the Additional Chief Secretary of the Department of Environment, Climate Change and Forests of Tamil Nadu.

✦ According to UNEP, Sahu has been chosen for her inspiration and action.

Amazon announced a Memorandum of Understanding (MoU) with Vadodara-based Gati Shakti Vishwavidyalaya (GSV) to collaborate in the transportation and logistics sector. The MoU exchange event was held at Bharat Mandapam, New Delhi.

✦ The MOU shall enable knowledge sharing, joint development of academic curriculum, and joint research activities. One of the most important aspects of the MOU is to set up Amazon Chair Professorship at GSV and conduct research into the warehousing sector leveraging data driven decision making frameworks.

The Union Cabinet approved the proposed Free Trade Agreement between India and Oman on 12 December 2025, clearing the way for the Comprehensive Economic Partnership Agreement. The meeting was chaired by the Prime Minister.

✦ India and Oman share a long-standing strategic partnership built on trade links, energy cooperation and deep cultural ties. The Cabinet's decision follows the Oman Shura Council's approval of the proposed FTA a day earlier. Negotiations for the agreement began officially in November 2023.

The Cabinet Committee on Economic Affairs approved a new policy mechanism called the CoalSETU window on 12 December 2025, creating a fresh pathway for long-term coal linkages across diverse industrial users and for exports.

✦ The CoalSETU window will be added to the existing Non-Regulated Sector (NRS) Linkage Auction Policy of 2016.

For more Current Affairs: Scan QR code

జాతీయ ఇంధన పొదుపు దినోత్సవం

డిసెంబరు 14 చరిత్రలో ఈనాడు

దేశంలో ఇంధన వనరులను సమర్థవంతంగా, తగిన అవగాహనతో, సరైన రీతిలో ఉపయోగించాలనే లక్ష్యంతో ఏటా డిసెంబరు 14న 'జాతీయ ఇంధన పొదుపు దినోత్సవం'గా (National Energy Conservation Day) నిర్వహిస్తారు. పెరుగుతున్న ఇంధన డిమాండ్ల గురించి వ్యక్తులు, సంస్థలు, పరిశ్రమలకు అవగాహన కల్పించడంతోపాటు శక్తి వనరులను వృథాగా వినియోగించకుండా వాటిని ఆదా చేయాల్సిన ఆవశ్యకతను చాటిచెప్పడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

ఇంధన పొదుపు ప్రాముఖ్యత

దేశంలో లభ్యమయ్యే శక్తివనరులపై ఆధారపడే ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుంది. అయితే మన దేశంలో వీటి ఉత్పత్తి కంటే వినియోగం ఎక్కువ. అధిక జనాభా, పట్టణీకరణ, మితిమీరిన వాహనాల వినియోగం మొదలైన కారణాల వల్ల ఇంధన అవసరాలు నానాటికీ పెరిగిపోతున్నాయి.

■ మనం ఉత్పత్తి చేసే శక్తిలో ఎక్కువ భాగం శిలాజ ఇంధనమైన బొగ్గును మండించడం ద్వారానే వస్తోంది. తద్వారా కార్బన్ డైఆక్సైడ్ లాంటి హానికర వాయువులు వాతావరణంలోకి విడుదలవుతున్నాయి. ఈ చర్య పర్యావరణంపైనా ప్రతికూల ప్రభావాన్ని చూపుతోంది.

14TH DECEMBER NATIONAL ENERGY CONSERVATION DAY!

చారిత్రక నేపథ్యం


దేశంలో సమర్థవంతమైన ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించడంతోపాటు శక్తివనరుల పరిరక్షణ గురించి ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో విద్యుత్ మంత్రిత్వ శాఖ (ఎంఓపీ) 1991లో మొదటిసారి డిసెంబరు 14న 'జాతీయ ఇంధన పొదుపు దినోత్సవం'గా నిర్వహించింది.

దేశంలో ఇంధన పొదుపు గణాంకాలు, గతంలో అడిగిన ప్రశ్నలు తదితర పూర్తి సమాచారం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - ఇండియన్ ఎకానమీ

బ్యాంకింగ్ వ్యవస్థ - వాణిజ్య బ్యాంకులు

ఖాతాదార్ల నుంచి డిపాజిట్లు సేకరించే ఆర్థిక (విత్త) సంస్థలుగా వాణిజ్య బ్యాంకులను పేర్కొంటారు. ఇవి ఈ మొత్తాన్ని ఇతరులకు లేదా సంస్థలకు వడ్డీకి రుణాలుగా ఇస్తాయి. అప్పులు ఇవ్వడం ద్వారా ఇవి డబ్బు సంపాదిస్తాయి. వీటిలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులు ఉంటాయి. విత్త మార్కెట్‌లో వాణిజ్య బ్యాంకులు ముఖ్య భాగం.



దేశంలోని పొదుపును సమీకరించి, పెట్టుబడిగా తరలించడానికి విత్త మార్కెట్లు దోహదం చేస్తాయి. వీటిలో రెండు రకాలు ఉన్నాయి. అవి:

1. ద్రవ్య మార్కెట్ 2. మూలధన మార్కెట్

షెడ్యూల్ వాణిజ్య బ్యాంకులు

ఆర్‌బీఐ చట్టం - 1934 ప్రకారం, రెండో షెడ్యూల్‌లో నమోదైన బ్యాంకులను షెడ్యూల్డ్ బ్యాంకులు అంటారు.

షెడ్యూల్డ్ కాని బ్యాంకులు

ఇవి ఆర్‌బీఐ చట్టం 1934 ప్రకారం, రెండో షెడ్యూల్‌లో నమోదు కాని బ్యాంకులు. ఇవి చాలా చిన్న బ్యాంకులు, వాటి పెట్టుబడి రూ.5 లక్షలలోపు ఉంటుంది. ఉదా: జమ్మూ-కశ్మీర్ బ్యాంకు

భారతదేశంలో వాణిజ్య బ్యాంకుల చరిత్ర, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, దేశంలో బ్యాంకుల జాతీయాకరణ, ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనం - ప్రయోజనాలు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నోటిఫికేషన్స్

టెక్నీషియన్ పోస్టులు

పుణెలోని సీఎస్ఐఆర్ నేషనల్ కెమికల్ ల్యాబొరేటరీ (ఎన్‌సీఎల్) ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 34. అర్హులైన అభ్యర్థులు 2025, జనవరి 12లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ఇంటర్న్‌షిప్ పోస్టులు

దిల్లీలోని డిజిటల్ ఇండియా కార్పొరేషన్ డేటా ఇంజినీరింగ్ అండ్ అనలిటిక్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 50. అర్హులైన అభ్యర్థులు 2025, డిసెంబరు 24లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ఎన్‌హెచ్‌ఎం ఈస్ట్ గోదావరిలో పోస్టులు

నేషనల్ హెల్త్ మిషన్ ఈస్ట్ గోదావరి (ఎన్‌హెచ్‌ఎం) ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, ఆడియో మెట్రీషియన్ తదితర ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 35. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసేందుకు చివరి తేదీ 2025 డిసెంబరు 20.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలకు నేడే (డిసెంబరు 14) చివరి తేదీ

- ఎయిర్ ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్ (ఏఎఫ్ క్యాట్) 01/2026. డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.
- ఇంటెలిజెన్స్ బ్యూరోలో 362 ఉద్యోగాలు. పదో తరగతి ఉత్తీర్ణులు అర్హులు.
- కేబినెట్ సెక్రటేరియట్‌లో 250 డిప్యూటీ ఫీల్డ్ ఆఫీసర్ ఉద్యోగాలు. ఇంజినీరింగ్/ టెక్నాలజీలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Railway Exams

Reasoning

Word Formation

Directions (Qs. 1 - 20): *From the given alternatives select the word which can be formed using the letters of the given*

1. Creativity
A) activity B) ironical
C) trivial D) area

2. Matriculation
A) acute B) party
C) mutation D) matrix

3. Procrastination
A) rocked B) national
C) crashed D) transpiration

4. Infuriating
A) ruined B) fate
C) faint D) guage

5. Friendship
A) insider B) fiction
C) enter D) shirk

6. Confidence
A) dental B) fierce
C) confide D) conquer

7. Atmosphere
A) react B) peace
C) mostly D) operate

8. Influencer
A) refile B) racer
C) eager D) certain

9. Motivational
A) occasion B) vitamin
C) variation D) limited

10. Celebratory
A) rational B) elevate
C) brain D) betrayer

11. Forgiveness
A) fairness B) river
C) sovereign D) orange

12. Quarrelsome
A) squeal B) query
C) rattle D) somehow

13. Brainstorming
D) starting B) migration
C) rhyme D) germs

14. Protection
A) practice B) rat
C) certain D) cotton

15. Leadership
A) pearls B) lean
C) Cashier D) pierce

16. Adventurous
A) entry B) roasted
C) pious D) defer

17. Convocation
A) anoint B) vocational
C) aviation D) count

18. Remuneration
A) minus B) remaining
C) numerate D) rational

19. Hyperbolic
A) erode B) yoke
C) pelvic D) police

20. Chrysanthemum
A) merchant B) creation
C) sainf D) minimum

Directions (Qs. 21 - 33): *From the given alternatives select the word which cannot be formed using the letters of the given*

21. miscellaneous
A) balloon B) nice
C) use D) lesson

22. irrevocable
A) river B) rational
C) cable D) vile

23. ambience
A) nice B) cane
C) beam D) meaner

24. Philosophically
A) ship B) hills
C) looping D) call

25. employement
A) payment B) temple
C) poetly D) employ

26. Physiotherapy
A) atmosphere B) hysteria
C) earthy D) history

27. Generosity
A) energy B) strategy
C) resting D) tiger

28. Metamorphosis
A) phantom B) atoms
C) morphism D) promise

29. Gynaecologist
A) cytology B) coasting
C) agonist D) legation

30. Analytically
A) canal B) cylindrical
C) allylic D) analytic

31. Hypersensitivity
A) sentry B) verity
C) priest D) transitive

32. necessary
A) caress B) essayer
C) carnage D) scenery

33. Delightful
A) laughter
B) light C) flight
D) tiled

Scan the QR code for Key

These model questions were prepared by subject experts